

'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+20 వెల: ₹5.00

సంపుటి: 10 సంచిక: 333

శుక్రవారం 23-2-2018

సైన్యం అంటేనే పురుషులు... కానీ అదొకప్పటి మాట. 1992 నుంచి ఈ పరిస్థితి మారింది. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ విభాగాల్లో ఉన్నత స్థాయి కేడర్‌లో మహిళలు విశేష సేవలందిస్తు న్నారు. భారత త్రివిధ దళాల్లో సేవలు అందించిన, అందిస్తున్న ధీర వనితల గురించి www.sakshi.comలో చదవండి.

నేను శక్తి సాక్షి

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

కేంద్ర సహకారం లేదు

ఏపీకి అరకొరగా విదిలిస్తున్నారు: సీఎం చంద్రబాబు

- హామీలు నెరవేర్చి ఉంటే అభివృద్ధిలో ముందుకెళ్లేవాళ్లం
- ఇతర రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇచ్చినప్పుడు ఏపీకీ ఇవ్వాల్సిందే
- అనంతపురం జిల్లా పెనుకొండలో కియా మోటార్స్ ఫ్రేమ్‌వర్క్ ఇన్‌స్టలేషన్ పనులకు ప్రారంభోత్సవం



కియా ప్లాంట్ చిత్రపటంతో సీఎం చంద్రబాబు, కియా ప్రెసిడెంట్ హాన్‌వూపార్క్

సాక్షి ప్రతినిధి, అనంతపురం

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందించటం లేదని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అరకొరగా ఇచ్చి చేయి దులుపుకొనే పరిస్థితికి వచ్చారని విమర్శించారు. విభజన చట్టంలోని హామీలు నెరవేర్చి ఉంటే రాష్ట్రం అభివృద్ధి చెంది ఉండేదన్నారు. చట్టంలోని హామీలతో పాటు రాజ్యసభలో ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చాల్సిందేనన్నారు. గురువారం ఆయన అనంతపురం జిల్లా పెనుకొండ వద్ద 'కియా మోటార్స్' ఫ్రేమ్‌వర్క్ ఇన్‌స్టలేషన్ విభాగం ప్రారంభోత్సవ కార్యక్రమంలో, అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

ఇతర రాష్ట్రాలకు ఇచ్చినప్పుడు మాకెందుకు ఇవ్వరు?

రాష్ట్రానికి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని చాలా ఓపిగ్గా 29 సార్లు ఢిల్లీకి వెళ్లాలని సీఎం చంద్రబాబు చెప్పారు. ఈరోజు రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి అంతా కష్టపడి

మిగతా 2వ పేజీలో ▶

న్యాయవాదుల అరెస్టు

రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో సీఎంను కలిసేందుకు యత్నం

2 లో

- చంద్రబాబు కోసం..

హోదా ఒత్తిడిలో 'ఎల్లో' ఎత్తుగడ

వింత వాదనలు.. వికృత విన్యాసాలు



- రెండు కంపెనీల మధ్య వివాదంలో కేంద్రానికి నోటీసు
- అందులోకి ప్రతిపక్షనేత పేరు లాగే ప్రయత్నం
- జగన్ వల్లనే ప్రధానికి నోటీసు అంటూ విష ప్రచారం
- జగన్‌పై 'రాజకీయకక్షసాధింపు కేసు'ల్లో కొనసాగుతున్న విచారణ
- ఈడీ అటాచ్ చేసిన ఇందూటెక్ భూ కేటాయింపు రద్దు
- ప్రాజెక్టు పనులు నిలిచిపోవడంతో కోర్టుకెక్కిన మారిషస్ కంపెనీ
- ఆ వివాదాన్ని జగన్‌కు ముడిపెడుతూ కథనాలు..
- బాబు భూ కేటాయింపులు రద్దయితే ఇలా నోటీసులు రావా?
- నాలుగేళ్లుగా రాష్ట్రంలో విశృంఖలంగా అవినీతి
- సాక్ష్యాలతో దొరుకుతున్నా పట్టించుకోని పచ్చమీడియా..

సాక్షి, అమరావతి

ప్రత్యేక హోదా కోసం ప్రతిపక్షనేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న రాజీలేని పోరాటానికి పెరుగుతున్న ప్రజా మద్దతును చూసి ఓర్వలేని ఎల్లో మీడియా మరో దిగజారుడు ప్రచారానికి పూనుకుంది. హోదా సాధన కోసం పోరాటం దిశగా జనం అడుగులు వేస్తుండడంతో.. ముఖ్యమంత్రి కూడా హోదాకు అనుకూలంగా మాట్లాడక తప్పని స్థితి. ఈ దశలో ప్రజల దృష్టిని మళ్లించడానికి ఎల్లో మీడియా తెగ తాపత్రయపడుతోంది.. ఓ పాత కేసును బైటకు తీసి.. ఏ మాత్రం సంబంధం లేని విషయాలను జగన్‌కు అంటగట్టే ప్రయత్నం చేసింది. బట్టకాల్చి ముఖాన వేసేందుకు విఫలయత్నం చేసింది. జగన్ కేసులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి నోటీసులు వచ్చాయంటూ దీనికి జగన్ అవినీతే కారణమంటూ ఎల్లో మీడియా విషంచిమ్మే ప్రయత్నం చేస్తోంది. ఇదే కాదు ప్రజాసంకల్ప యాత్ర ప్రారంభం కాగానే ప్యార డైజ్ పేపర్ల పేరుతోనూ అనుకూల మీడియాలో జగన్‌పై దుష్ప్రచారం చేసేందుకు ఇలాగే ప్రయత్నించారు. విదేశాలలో తన పేరుపై ఒక్క రూపాయి ఆస్తి ఉన్నట్లు 15 రోజుల్లో నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని, నిరూపించలేకపోతే సీఎం పదవికి రాజీనామా చేస్తారా అని జగన్ సవాల్ చేస్తే తోకముడిచి కూర్చున్నారు. నంద్యాల ఎన్నికల సమయంలోనూ పోలింగ్‌కు ఒకరోజు ముందు ఓటర్లను ప్రభావితం చేసేలా కట్టుకథలు ప్రచారం చేశారు. జగన్ బీజేపీతో జతకట్టబోతున్నారంటూ ఆంగ్ల చానల్‌లో ఒక వార్త ప్రసారం చేయించి దానినందుకుని ఎల్లోమీడియా చెలరేగిపోయింది. ఒకపక్క బీజేపీతో కేంద్రంలో, రాష్ట్రంలో అధికారాన్ని పంచుకుంటూ... ముస్లిం ఓట్లు పడవన్న భయంతో బీజేపీ నాయకులను గానీ, బీజేపీ జెండాలు గానీ నంద్యాలలో కనబడనీయకుండా చేసిన చంద్రబాబు అదేసమయంలో జగన్‌పై కట్టుకథలను ప్రచారం చేయించారు. తాము

మిగతా 6వ పేజీలో ▶

చంద్రబాబే చెప్పారు.. చెరి సగం పంచుకోవాలని..

- ఇద్దరు ఐఏఎస్‌ల సమక్షంలో ముఖ్యమంత్రి పంచాయితీ!
- సంచలనం రేపుతున్న మంత్రి ఆది వీడియో
- నియోజకవర్గంలో మనకు వచ్చే ప్రతి రూపాయిలో మాజీ మంత్రి రామసుబ్బారెడ్డికి అర్ధ రూపాయి వాటా ఇవ్వాలంటూ వ్యాఖ్యలు
- మనకు సగం వస్తాది.. ఆయనకు సగం వస్తాది



3 లో

"రామసుబ్బారెడ్డి గారికి కూడా ప్రతి రూపాయిలో అర్ధ రూపాయి భాగం ఉంది ఈడ. అర్ధ రూపాయి భాగం ఇవ్వాలని ముఖ్యమంత్రి గారు స్వయంగా ఇద్దరు ఐఏఎస్ ఆఫీసర్లను మాతోపాటు కూర్చోబెట్టి పంచాయితీ చేశారు. ఆయన అడిగిన దాంట్లో మనకు సగం వస్తాది. మనం అడిగిన దాంట్లో ఆయనకు సగం వస్తాది. వాళ్లు నన్ను ఏమి విమర్శించినా నేను అయితే పట్టించుకోను" – మంత్రి ఆది

ఒప్పందాలతోనే సరి.. పరిశ్రమలేవీ?



విశాఖలో మూడోసారి భాగస్వామ్య సదస్సు

- ఈ నెల 24 నుంచి 26 వరకూ నిర్వహణ
- గత సదస్సుల్లో భారీగా ఎంవోయూలు
- పరిశ్రమలు వచ్చింది అంతంత మాత్రమే
- భారీ పెట్టుబడులు, ఉపాధి అంటూ ప్రచారం


సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం

భాగస్వామ్య సదస్సు ద్వారా మరోసారి అంకెల గారడీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ నెల 24 నుంచి 26 వరకూ విశాఖలో జరిగే సదస్సుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. విశాఖ కేంద్రంగా 2016, 17 సంవత్సరాల్లో నిర్వహించిన సదస్సుల్లోనూ ఇదే తరహా ప్రచారం చేసిన ప్రభుత్వం చివరకు పెట్టుబడులు రాబట్టడంలో మాత్రం విఫలమైంది. ఆ రెండు సదస్సుల్లో ప్రభుత్వ లెక్కల ప్రకారం రూ. 15.3 లక్షల కోట్ల విలువైన 994 అవగాహన ఒప్పందాలు జరిగాయి. వీటిలో రూ. 32,735 కోట్లు పెట్టుబడులతో పరిశ్రమలు వచ్చాయని అధికారులే అంటున్నారు. వాస్తవానికి ఇందులో కార్యరూపం దాల్చిన పరిశ్రమలు పావు వంతు కూడా ఉండవు. 2016లో జరిగిన

మిగతా 16వ పేజీలో ▶

ఆ అధికారులు టీడీపీ కార్యకర్తలే

ఎంపీ వి.విజయసాయిరెడ్డి పునరుద్ఘాటన



- రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు
- పార్టీ కార్యకర్తల్లా పనిచేస్తూ సర్వీస్ రూల్స్, క్రమశిక్షణ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు
- విపక్ష ఎమ్మెల్యేల కొనుగోళ్లు, లంచం సొమ్ములు సిద్ధం చేయటంలో వీరి పాత్ర ఉంది
- ఈ విషయాన్ని ఫిరాయింపు మంత్రి ఆదినారాయణరెడ్డి స్వయంగా చెప్పారు
- ఉన్నతాధికారులు ఏబీ వెంకటేశ్వరరావు సతీష్‌చంద్ర, సాయిప్రసాద్, రాజమౌళిలపై నా ఆరోపణలకు కట్టుబడి ఉన్నా
- సీబీఐతో విచారణ జరిపి వారిని ప్రాసిక్యూట్ చేయాలి
- మరికొందరి వ్యవహారాన్ని త్వరలో వెల్లడిస్తా

2 లో

అవినీతిలో భారత్ @ 81

- ముందు కంటే రెండు ర్యాంకులు దిగువకు..
- ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ నివేదికలో వెల్లడి

5 లో

'రొటొమ్యాక్' కొఠారి అరెస్టు

- సీబీఐ అదుపులో విక్రమ్, అతని కుమారుడు
- హైదరాబాద్‌లో రూ. 1200 కోట్ల గీతాంజలి గ్రూపు ఆస్తుల అటాచ్

ఇదండీ సంగతి



... పాఠం అప్పచెప్పకపోయావో పుర్రె లేచిపోద్ది!



ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గంలోని గుదేవారిపాలెం వద్ద ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌కు తమ సమస్యలు వివరిస్తున్న జాలర్ల కుటుంబీకులు

మా కష్టాన్ని టీడీపీ నేతలు దోచుకున్నారన్నా..

ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ఎదుట వాపోయిన జాలర్లు

- మేము పెంచిన చేపలను దౌర్జన్యంగా పట్టుకుపోయారు
- అధికారం అండ చూసుకుని కడుపు కొట్టారని ఆవేదన
- ఒక్క చెరువులోనే రూ.కోటిన్నర విలువైన చేపలు మాయం
- సంక్షేమ కార్యక్రమాలేవీ అందడం లేదని గొర్రెల కాపరుల ఆందోళన
- ఆదుకుంటామని ధైర్యం చెప్పిన జననేత

6 లో

సాగునీరివ్వకపోతే పురుగుమందు ఇవ్వండి!

- పంటలు దక్కించుకోలేకపోతే మేం జీవించలేం
- మేము చచ్చాక మా భార్య, పిల్లలనైనా ఆదుకోండి
- ఆర్డీవో వద్ద దివిసీమ రైతుల ఆవేదన



ఆర్డీవోతో సాగునీరన్నా ఇవ్వండి.. పురుగుమందుల డబ్బాలన్నా ఇవ్వండంటున్న రైతు ప్రసాదరావు

- వివరాలు 16లో

‘అర్చకుల ట్రస్ట్’ చైర్మన్ పదవి నుంచి ఐవైఆర్ తొలగింపు

సాక్షి, అమరావతి: అర్చకుల, ఉద్యోగుల సంక్షేమ ఫండ్ ట్రస్ట్ చైర్మన్ పదవి నుంచి రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావును తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల రాజధాని అమరావతి నిర్మాణంలో స్విస్ ఛాలెంజ్ విధానాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిల్ దాఖలు చేసిన నేపథ్యంలో ఆయన్ను పదవి నుంచి తప్పించడం గమనార్హం. గతంలోనూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలు, ప్రభుత్వ అవినీతిని ఎత్తిచూపిస్తున్నారన్న కక్షతో ఐవైఆర్‌ను బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పదవి నుంచి కూడా తొలగించిన విషయం విదితమే.

అవసరమైతే తాత్కాలిక ఉద్యోగులను నియమించాలి

ట్రాన్స్‌కో సీఎండీ విజయానంద్

సాక్షి, అమరావతి: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఆందోళనలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, అవసరమైన చోట తాత్కాలిక ఉద్యోగులను నియమించాలని అధికారులను ట్రాన్స్‌కో సీఎండీ విజయానంద్ ఆదేశించారు. అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. విజయవాడలోని విద్యుత్ సౌధాలో గురువారం ఆయన ట్రాన్స్‌కో జేఎండీ దినేష్ పరుచూరితో కలసి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉద్యోగుల సమ్మె ప్రభావంపై జిల్లా ఎస్ఈ, సీఈలతో సమీక్షించారు. విద్యుత్ శాఖలో పనిచేసే సిబ్బందిని 24 గంటలపాటు విధుల్లో ఉండేలా చూడాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని కోరారు. ఎక్కడైనా సరఫరాకు అంతరాయం కలిగితే ఎస్ఈలే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమ్మె కారణంగా అవసరమైన చోట్ల తాత్కాలిక ఉద్యోగులను నియమించుకోవాలని సూచించారు.

ఆ అధికారులు టీడీపీ కార్యకర్తలే

ఎంపీ వి. విజయసాయిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యాలయంలో పనిచేస్తున్న కొందరు ఐఏఎస్ అధికారులు, ఇంటెలిజెన్స్ అదనపు డీజీ రాజ్యాంగ నియమాలకు విరుద్ధంగా అధికార పార్టీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి ఆరోపించారు. ఐఏఎస్ అధికారులు సతీష్‌చంద్ర, రాజమౌళి, సాయిప్రసాద్, నిఘా విభాగం అధికారి ఏబీ వెంకటేశ్వరరావుల పేర్లను ప్రస్తావిస్తూ వారిపై గతంలో తాను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని, అందుకు తగిన ఆధారాలు తన వద్ద ఉన్నాయని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఎంపీ వి.విజయసాయిరెడ్డి గురువారం మీడియాతో ఇష్టాగోష్ఠి నిర్వహించారు. ఉన్నతాధికారులపై విమర్శలు సరికాదని ఐఏఎస్‌ల సంఘం పేర్కొనడంతో విజయసాయిరెడ్డి ప్రతిస్పందించారు. అధికారులు కోరితే ఆధారాలను బయటపెట్టడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు.

మంత్రి ఆదినారాయణరెడ్డే ఈ నిజాన్ని అంగీకరించారు

రాజ్యాంగ లక్ష్యాలను చేరుకునేలా కృషి చేయడం ప్రతి అధికారి ప్రాథమిక బాధ్యతని ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి గుర్తు చేశారు. ప్రభుత్వ అధికారులు పార్లమెంటరీ సాంప్రదాయాల ప్రకారం రాజకీయాలకు అతీతంగా నిష్పక్షపాతంగా ఉండాలన్నారు. సర్వీస్ రూల్స్, క్రమశిక్షణ నిబంధనలు కూడా ఇవే చెబుతున్నాయని తెలిపారు. అయితే సతీష్ చంద్ర, ఏబీ వెంకటేశ్వరరావుతో పాటు మరో ఇద్దరు ఐఏఎస్‌లు రాజమౌళి, సాయిప్రసాద్‌లు పక్షపాత ధోరణితో టీడీపీకి అనుకూలంగా పని చేస్తున్నారని తెలిపారు. ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం, వారికిచ్చే లంచం సొమ్ము సిద్ధం చేయడంలో ఈ అధికారుల ప్రమేయం ఉందన్నారు. ఈ అధికారులు టీడీపీ నేతలతో కలిసి తమ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టారని చెప్పారు. ఇది తాను చేస్తున్న ఆరోపణే కాదని, తమ పార్టీ నుంచి ఫిరాయించి మంత్రి పదవి దక్కించుకున్న ఆదినారాయణరెడ్డే స్వయంగా ఒప్పుకున్న నిజమని తెలిపారు.

ఆరోపణలు వెనక్కు తీసుకునే ప్రసక్తే లేదు

జమ్మలమడుగు నియోజకవర్గంలో నిధులను టీడీపీ నేత రామసుబ్బారెడ్డితో కలిసి చెరి సగం పంచుకోవాల్సిందిగా ఇద్దరు ఐఏఎస్‌ల సమక్షంలోనే ముఖ్యమంత్రి పంచాయితీ చేశారని మంత్రి ఆదినారాయణరెడ్డి వీడియోలో చెప్పటాన్ని విజయసాయిరెడ్డి ప్రస్తావించారు. రామసుబ్బారెడ్డి, ఆదినారాయణరెడ్డి మధ్య చంద్రబాబు ఒప్పందం కుదిర్చిన సమయంలో అక్కడ ఉన్న ఐఏఎస్‌ల్లో సతీష్ చంద్ర కూడా ఉన్నారని వెల్లడించారు. తాను చేసిన ఆరోపణలను వెనక్కు తీసుకునే ప్రసక్తే లేదన్నారు. వారిపై సీబీఐతో విచారణ జరిపి ప్రాసిక్యూట్ చేసి నిజానిజాలు తేల్చాలని డిమాండ్ చేశారు. త్వరలో మరికొందరు అధికారుల వ్యవహారాన్ని కూడా బయట పెడతానని ఎంపీ విజయసాయిరెడ్డి ప్రకటించారు.

ఆ మూడు భవనాలు వద్దు

- సిటీ సివిల్ కోర్టులోనే తాత్కాలిక హైకోర్టు
- ఫుల్‌కోర్ట్ సమావేశంలో న్యాయమూర్తుల నిర్ణయం
- రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు ఆమోదం

సాక్షి, హైదరాబాద్: అమరావతిలో తాత్కాలిక హైకోర్టు ఏర్పాటు కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ భవనం, కృష్ణా జిల్లా జూపూడిలోని నిమ్రా కళాశాల భవనం, వెటర్నరీ వర్సిటీ భవనాల పట్ల హైకోర్టు న్యాయమూర్తులందరితో కూడిన ఫుల్ కోర్టు విముఖత చూపింది. ఇదే సమయంలో నేలపాడు వద్ద జస్టిస్ సిటీలో నిర్మించే సిటీ సివిల్ కోర్టు భవనంలో తాత్కాలిక హైకోర్టు ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ ప్రతిపాదనను ఆమోదించింది. జస్టిస్ సిటీలో సిటీ సివిల్ కోర్టు భవన నిర్మాణం పూర్తయిన వెంటనే హైకోర్టును అక్కడికి తరలించేందుకు న్యాయమూర్తులందరూ అంగీకరించారు. ఇక్కడ హైకోర్టుకు మొత్తం 19 కోర్టులను ఏర్పాటు చేయనున్నారు.

ఫుల్‌కోర్ట్ సమావేశం నిర్వహించిన ఏసీజే

తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్ సూచనల మేరకు జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్, జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, జస్టిస్ తాళ్లూరి సునీల్ చౌదరి, జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తిలతో కూడిన కమిటీ ఈ నెల 11, 12 తేదీల్లో గుంటూరు, కృష్ణా జిల్లాల్లో పర్యటించి తాత్కాలిక హైకోర్టు కోసం ప్రభుత్వం ప్రతిపాదించిన మూడు భవనాలను పరిశీలించింది. ఈ నేపథ్యంలో కమిటీ రూపొందించిన నివేదికపై చర్చించేందుకు ఏసీజే జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలో గురువారం ఫుల్‌కోర్ట్ సమావేశం నిర్వహించారు.

ఎప్పుడు పూర్తయితే అప్పుడు తరలింపు

కమిటీ పర్యటన వివరాలను జస్టిస్ రామసుబ్రమణియన్ మిగతా న్యాయమూర్తులకు స్వయంగా వివరించారు. చిన్నపాటి ప్రజెంటేషన్ ఇచ్చారు. తాము చూసిన భవనాలు హైకోర్టు ఏర్పాటుకు అంత సౌకర్యంగా లేవని తెలిపారు. దీంతో ప్రభుత్వం ప్రతిపాదించిన సిటీ సివిల్ కోర్టు భవనంలో తాత్కాలిక హైకోర్టు ఏర్పాటు చర్చకు వచ్చింది. దీనికి ఫుల్‌కోర్ట్ ఆమోదముద్ర వేసింది. సిటీ సివిల్ కోర్టు భవన నిర్మాణం ఎప్పుడు పూర్తయితే అప్పుడు హైకోర్టును తరలించాలని ఫుల్‌కోర్ట్ సమావేశంలో నిర్ణయించారు. 8 నెలల వ్యవధిలో సిటీ సివిల్ కోర్టు భవనంలో తాత్కాలిక హైకోర్టును ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించటం తెలిసిందే. ప్రభుత్వం చెప్పినట్టుగా సకాలంలో నిర్మాణాన్ని పూర్తి చేస్తే డిసెంబర్‌లోపు అమరావతికి హైకోర్టు తరలి వెళ్లే అవకాశం ఉంది. ఈలోగా ఉద్యోగుల విభజన, రికార్డుల డిజిటలైజేషన్ కమిటీలు పని పూర్తి చేయనున్నాయి. ఫుల్‌కోర్ట్ నిర్ణయాన్ని త్వరలో రాష్ట్ర ప్రభుత్వానికి వెల్లడించనున్నారు.

మార్చి 28నే బడ్జెట్ సమావేశాలు ముగింపు

- 5న గవర్నర్ ప్రసంగంతో ప్రారంభం
- 8న బడ్జెట్ ప్రవేశపెట్టనున్న మంత్రి యనమల

సాక్షి, అమరావతి: మార్చి 28వ తేదీతో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మార్చి 29న గవర్నర్ విదేశాలకు వెళ్తున్న నేపథ్యంలో 28నే అప్రాప్రియేషన్ బిల్లును ఆమోదించాలని నిర్ణయించింది. అదే రోజు అప్రాప్రియేషన్ బిల్లును గవర్నర్ ఆమోదానికి పంపిస్తారు. దీంతో ఏప్రిల్ 1 నుంచి కొత్త బడ్జెట్ నుంచి నిధుల వ్యయానికి మార్గం సుగమం అవుతుంది. మార్చి 5న ఉదయం 9.30 గంటలకు ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. అనంతరం సభ మరుసటి రోజుకు వాయిదా పడుతుంది. ఈ మేరకు సమాచార శాఖ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. 6, 7 తేదీల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సాగుతుంది. అనంతరం ఆ చర్చకు ముఖ్యమంత్రి సమాధానమిస్తారు. మార్చి 8న ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు 2018–19 ఆర్థిక సంవత్సరానికి వార్షిక బడ్జెట్‌ను సభలో ప్రవేశపెడతారు. అనంతరం అదే రోజు వ్యవసాయ బడ్జెట్‌ను ఆ శాఖ మంత్రి సభలో చదువుతారు. తరువాత సభ 12వతేదీకి వాయిదా పడుతుంది. 12 నుంచి 15వ తేదీ వరకు సాధారణ బడ్జెట్‌పై సభలో చర్చ జరుగుతుంది. అనంతరం చర్చకు ఆర్థిక మంత్రి సమాధానమిస్తారు. ఆ తరువాత డిమాండ్స్‌పై 27వరకు చర్చ జరుగుతుంది. అదే రోజు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సప్లిమెంటరీ బడ్జెట్‌ను ఆమోదిస్తారు. 28న 2018–19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అప్రాప్రియేషన్ బిల్లుపై చర్చించి ఆమోదం తెలుపుతారు.

కేంద్ర సహకారం లేదు

▶ మొదటి పేజీ తరువాయి

సాధించుకున్నదేనన్నారు. ‘14 ఆర్థికసంఘం వద్దంది కాబట్టే ప్రత్యేక హోదా ఇవ్వలేమని, ప్రత్యేకసాయం చేస్తామని అన్నారు. అదీ ఇవ్వలేదు. ప్రత్యేక హోదా ఇతర రాష్ట్రాలకు ఇచ్చినప్పుడు మాకు ఎందుకు ఇవ్వరు? విభజనతో నష్టపోయాం. కేంద్రానికి బాధ్యత ఉంది. హామీలు నెరవేర్చాల్సిందే. మా హక్కులు కాపాడాలి’ అని చంద్రబాబు పేర్కొన్నారు.

అనుబంధ పరిశ్రమలకు సమీపంలో భూములు

‘కియా’ మోటార్స్ నాణ్యమైన కార్ల ఉత్పత్తి కంపెనీ అని చంద్రబాబు చెప్పారు. బెంగళూరు, హైదరాబాద్, కృష్ణపట్నానికి దగ్గరగా ఏర్పాటవుతున్న ఈ ప్లాంట్ భారత్‌లోనే అతిపెద్దది అవుతుందన్నారు. అనంతపురం జిల్లాను కొరియా ప్రజలు తమ రెండో నగరంగా భావించాలన్నారు. ఏపీసీఈటీ సర్వేలో ఉద్యోగాల కల్పనలో 10 రాష్ట్రాలు ముందుంటే అందులో ఏపీ మొదటి స్థానంలో ఉందన్నారు. కియా కార్ల కంపెనీకి చుట్టుపక్కల టైర్లు, ఇతర అనుబంధ పరిశ్రమలకు భూ కేటాయింపులు చేస్తామన్నారు. కియా మోటర్స్ ఏర్పాటుకు తోడ్పాటు అందించిన పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి ఆరోఖ్యరాజ్‌ను ముఖ్యమంత్రి అభినందించారు. కార్యక్రమంలో కియా మేనేజర్ కోహ్యాషిమ్, మంత్రులు అమర్‌నాథరెడ్డి, పరిటాల సునీత, కాలవ శ్రీనివాసులు, దేవినేని ఉమామహేశ్వరరావు, జవహర్, చీఫ్‌విప్ పయ్యావుల కేశవ్, కలెక్టర్ వీరపాండియన్ తదితరులు పాల్గొన్నారు.

అద్భుతమైన మార్పు తెస్తాం: కియా ప్రెసిడెంట్, సీఈఓ హాన్–వూపార్క్

భారత్‌లో 15వ ప్లాంట్‌ను ఏర్పాటుచేస్తున్నాం. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో కార్ల ఉత్పత్తిని ప్రారంభిస్తాం. ఏటా 3 లక్షల కార్లను ఉత్పత్తి చేస్తాం. కియా భారత్‌లో అద్భుతమైన మార్పు తెస్తుంది. ప్రపంచశ్రేణి ఉత్పత్తులను అందిస్తాం. త్వరలో 3 వేల మంది ఉద్యోగులను నియమిస్తాం. 80 శాతం ఉద్యోగాలు స్థానికులకు కల్పిస్తాం.

సీఎం పర్యటన సందర్భంగా న్యాయవాదుల అరెస్టు



నాగలక్ష్మిదేవిని హౌస్ అరెస్టు చేసిన దృశ్యం



నాగలక్ష్మిదేవి నివాసం వద్ద పోలీసుల మోహరింపు

కర్నూలు (లీగల్), సాక్షి, అమరావతి: రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో సీఎం చంద్రబాబును కలిసేందుకు బయల్దేరిన పలువురు న్యాయవాదులను బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పోలీసులు అరెస్టు చేశారు. సీఎం అనంతపురం జిల్లాలో పర్యటిస్తుండటంతో గురువారం మధ్యాహ్నం వరకు వారిని తమ అదుపులోనే ఉంచుకున్నారు. కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు వి.నాగలక్ష్మిదేవి, సీనియర్ న్యాయవాదులు వై.జయరాజు, పి.నిర్మల, డి.వెంకటస్వామి, ఎ.శ్రీనివాసులు తదితరులు హైకోర్టు సాధన సమితి (జేఏసీ) నిర్ణయం మేరకు సీఎంకు వినతిపత్రం ఇచ్చేందుకు పెనుకొండకు బయలుదేరారు. వీరిని కర్నూలు, వెల్దుర్తి ప్రాంతాల్లో పోలీసులు అరెస్టు చేశారు. శాంతి యుతంగా పోరాటం చేస్తున్న న్యాయవాదులపట్ల ప్రభుత్వ వైఖరిని సీని యర్ న్యాయవాదులు సి.నాగేంద్రనాథ్, ఎ.రామసుబ్బారెడ్డి, నాగలక్ష్మిదేవి ఖండించారు. అలాగే, న్యాయవాదులను అరెస్టు చేయడాన్ని సీపీఎం, సీపీఐలు తీవ్రంగా ఖండించాయి. ఈ మేరకు పార్టీల రాష్ట్ర కార్యదర్శులు పి.మధు, కె.రామకృష్ణలు గురువారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు.

పెట్రోల్‌లో ఇథనాల్ ‘నీటి’ చిచ్చు

నీరు కలుపుతున్నారంటూ బంకుల వద్ద వినియోగదారుల గగ్గోలు

సాక్షి, అమరావతి: పెట్రోలు బంకుల యజమానులకు, వాహనాదారులకు మధ్య ఇథనాల్ ‘నీటి’ చిచ్చు రాజుకుంటోంది. పెట్రోల్ కొట్టించుకుని కొద్ది దూరం వెళ్లగానే వాహనాలు ఆగిపోతుండటంతో కల్తీ జరిగిందంటూ బంకు యజమనాలతో గొడవపడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం జనవరి నుంచి 10 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్‌ను సరఫరా చేస్తున్నప్పటి నుంచి ఈ సమస్య మొదలయింది. ఇథనాలకు ఒక చుక్క నీరు కలిసినా అది మొత్తం నీరుగా మారుతుందని బంకుల యజమానుల వాదన. పెట్రోల్ ట్యాంక్ మూతకు ఆవిరి పట్టినా లేక వాషింగ్ తర్వాత పెట్రోల్ కొట్టించుకున్నప్పుడు నీటి చుక్క పెట్రోల్ ట్యాంక్‌లోకి చేరినా ఇలా జరుగుతుందని చెబుతున్నారు. అయితే తామే నీళ్లు కలిపామంటూ తమపై దాడులు చేస్తున్నారని ఏపీ పెట్రోలియం ట్రేడర్స్ ఫెడరేషన్ నాయకులు వాపోయారు. గురువారం విజయవాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇథనాల్ కలిసిన పెట్రోల్‌లో నీరు కలిపితే ఏ విధంగా కిందకు చేరుతుందో ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ అధ్యక్షుడు రవి గోపాలకృష్ణ మాట్లాడుతూ ఇథనాల్‌ను సరిగా బ్లెండింగ్ చేయకపోవడం వల్ల ఈ సమస్య వస్తోందన్నారు. నేరుగా పెట్రోల్‌లో ఇథనాల్‌ను కలిపి బంకులకు సరఫరా చేస్తున్నారని, దీనివల్ల తాము కూడా నష్టపోతున్నామంటున్నారు. ఆయిల్ ట్యాంకర్ల మూతలకు ఆవిరి పట్టినా, అలాగే బంకుల వద్ద నిల్వ చేసే ట్యాంకుల్లో నీటి చెమ్మ వచ్చినా మొత్తం ఇథనాలు నీరుగా మారిపోయి అడుగుకు చేరి పెద్దఎత్తున నష్టం వస్తోందంటున్నారు. ఈ సమస్యపై ఇప్పటికే ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు లేఖ రాశామని, అలాగే ప్రజల్లో దీనిపై అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలంటూ పౌరసరఫరాలశాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావుకు వినతిపత్రం ఇచ్చామన్నారు. 2014 నుంచి ఇథనాల్ కలిసిన బ్లెండెడ్ పెట్రోల్‌ను సరఫరా చేస్తున్నారని, కానీ అప్పట్లో ఇటువంటి సమస్య ఉత్పన్నం కాలేదన్నారు. ఈ నెలరోజుల్లో 10 కేసులు నమోదయ్యాయన్నారు.

చంద్రబాబే చెప్పారు.. చెరి సగం పంచుకోవాలని..

- అవినీతి వాటాల పంపిణీకి సీఎం పచ్చజెండా
- సంచలనం రేపుతున్న మంత్రి ఆది వీడియో
- ఇద్దరు ఐఏఎస్‌ల సమక్షంలో చంద్రబాబు పంచాయతీ!
- తమ పార్టీ నేతలకు సహకరించాల్సిందేనంటూ ఆదేశాలు!
- టీడీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్న కొందరు ఐఏఎస్‌లు
- రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ ఇదే రీతి పంపకాలు
- అవినీతి సొమ్ముతో ప్రతిపక్ష ఎమ్మెల్యేల కొనుగోళ్లు
- తానెలా అమ్ముడుపోయిందీ వివరించిన మణిగాంధీ
- దళారీ వ్యవస్థను నలుమూలలా విస్తరించిన టీడీపీ సర్కారు



సాక్షి, ప్రత్యేక ప్రతినిధి

ఇందుగలడు అందులేడని సందేహము వలదు... అన్నట్లుగా రాష్ట్రంలో నాలుగేళ్ల తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో అవినీతి వైరస్‌లా ఊరూరా విస్తరించింది. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పాలనా పగ్గాలు చేపట్టిన నాటి నుంచే అవినీతిని కేంద్రీకృతం చేసి అక్రమాలకు ద్వారాలు బార్లా తెరిచారు. తాను రారాజు అయినట్లు, మంత్రులు, పార్టీ నేతలు సామంతులైనట్లు... భారీగా కొల్లగొడుతూ పార్టీ మంత్రులు, ముఖ్య నాయకులు, శ్రేణులను కూడా పంచుకుతినండంటూ అనుమతులు ఇచ్చేశారు. ముఖ్యమంత్రి తన ముఖ్య కోటరీతో పాటు అత్యంత నమ్మకమైన ఉన్నతాధికారుల సహకారంతో భారీ డీల్స్ ద్వారా మూడున్నరేళ్లలో దాదాపు రూ.నాలుగు లక్షల కోట్లకు పైగా ఆర్జించారనే తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. ఇవన్నీ నిజమేనని మంత్రి ఆదినారాయణరెడ్డి మాటలతో స్పష్టమైంది. వైఎస్సార్‌సీపీ తరపున జమ్మలమడుగు నుంచి పోటీచేసి గెలుపొంది, పార్టీ ఫిరాయించి టీడీపీ కండువా కప్పుకుని, రాష్ట్ర మార్కెటింగ్, సహకార శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడిన మాటలు ప్రభుత్వ అవినీతి విశ్వరూపాన్ని బట్టబయలు చేస్తున్నాయి. ''రామసుబ్బారెడ్డి గారికి కూడా ప్రతి రూపాయిలో అర్ధ రూపాయి భాగం ఉంది ఈడ. అర్ధ రూపాయి భాగం ఇవ్వమని ముఖ్యమంత్రి గారు స్వయంగా ఇద్దరు ఐఏఎస్ ఆఫీసర్లను మాతోపాటు కూర్చోబెట్టి పంచాయతీ చేశారు. ఆయన అడిగిన దాంట్లో మనకు సగం వస్తాది. మనం అడిగిన దాంట్లో ఆయనకు సగం వస్తాది. వాళ్లు నన్ను ఏమి విమర్శించినా నేను అయితే పట్టించుకోను''అంటూ ఆయన మాట్లాడిన వీడియో ఇప్పుడు సంచలనం రేపుతోంది. గండికోట పునరావాస కాలనీల టెండర్లు దక్కించుకోవడంలోనూ వీళ్లిద్దరూ ఏకమయ్యారు. అయితే అదే పార్టీకి చెందిన రాజసభ్యుడు సీఎం రమేష్ టెండర్లు తెరవకుండా అడ్డుకున్నారని ఆగ్రహించిన మంత్రి, రామసుబ్బారెడ్డి వర్గీయులు సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ సంస్థ స్థానిక కార్యాలయంపై దాడి చేయడం గమనార్హం. ఒకే పార్టీకి చెందిన నేతలు కాంట్రాక్టులకోసం బరితెగించడం, వారి మధ్య పంపకాలు జరిపేందుకు సాక్షాత్తూ ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవడాన్ని బట్టి ప్రభుత్వంలో అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

అవినీతి సొమ్ముతో కొనుగోళ్లు

ప్రాజెక్టు పనుల అంచనాలను ఆకాశానికంటేలా పెంచి, తద్వారా అందుకున్న వాటాల సొమ్ముతోనే చంద్రబాబు ఎమ్మెల్యేల కొనుగోళ్లకు పాల్పడ్డారని విమర్శలున్నాయి. ఇలా అడ్డగోలుగా సంపాదించిన అవినీతి సొమ్ముతో చంద్రబాబు 23మంది వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఫిరాయించిన ఎమ్మెల్యేలకు ఒక్కొక్కరికి ఏకంగా రూ.30 కోట్ల వరకు నజరానాగా ముట్టచెప్పడంతోపాటు భారీగా కాంట్రాక్టులు అప్పజెప్పారని తెలుస్తోంది. దీనిపై సొంతపార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు వ్యతిరేకించడంతో... అందరికీ న్యాయం చేస్తానంటూ చంద్రబాబు నేరుగా పంచాయతీలు చేసినట్లు మంత్రి మాటలతో వెల్లడవుతోంది. అందులో ఐఏఎస్ అధికారులను కూడా భాగస్వాములను చేయడం బరితెగింపునకు పరాకాష్టగా నిలుస్తోంది. ఇదే విషయాన్ని ఇటీవల వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రస్తావించడం గమనార్హం. రాష్ట్రంలో జరుగుతున్న ఎమ్మెల్యేల కొనుగోళ్లు, అవినీతి అక్రమాల్లో కొందరు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు నేరుగా పాల్గొన్నట్లు తన వద్ద ఆధారాలున్నాయంటూ ఆయన ధ్వజమెత్తారు. తాజాగా మంత్రి ఆది చేసిన వ్యాఖ్యలు సైతం కొందరు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌ల పనితీరును అద్దం పడుతున్నాయి. సాక్షాత్తూ ముఖ్యమంత్రి విజయవాడలో నిర్వహించిన తొలి కలెక్టర్ల సమావేశంలోనే తమ పార్టీ కార్యకర్తలు, నేతలకు సహకరించాల్సిందేని విస్పష్టంగా చెప్పారు. అంతేకాదు తన భారీ అవినీతి ప్రణాళికలకు అంగీకరించని సీనియర్ ఐఏఎస్ అధికారులను ఢిల్లీ బాట పట్టించారు. అవినీతికి సహకరిస్తున్న అధికారులపై ఈగ కూడా వాలనీయడంలేదు. ఆ తర్వాత దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అప్పటి ముసునూరు తహశీల్దారు డ్రోణవల్లి వనజాక్షిపై తన అనుచరులతో కలిసి దాడిచేసినప్పటికీ చర్యలు లేకపోవడంతో టీడీపీ నాయకులు, శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా విచ్చలవిడిగా రెచ్చిపోతున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీలు సైతం ఎక్కడికక్కడ ఇసుక, మట్టి, గ్రావెల్... అన్నింటినీ దోచుకుంటున్నారు. దోచుకున్న సొమ్మును ఫిఫ్టీ.. ఫిఫ్టీ వాటాలు పంచుకోండంటూ ప్రజాప్రతినిధులకు సూచనలిచ్చిన ముఖ్యమంత్రి భారతదేశ చరిత్రలో ఉండరని విశ్లేషకులు దుయ్యబడుతున్నారు. తాము అన్ని విషయాలపై నోరు విప్పితే చంద్రబాబుకు ఇబ్బందులు తప్పవని మిత్రపక్షం బీజేపీ నాయకులు అంటున్నారంటే ఆయన అవినీతి, అక్రమాలు వ్యవహారాలు ఏ రీతిలో ఉండి ఉంటాయో అంచనా వేసుకోవచ్చు. వైఎస్సార్‌సీపీకి చెందిన 23 మంది శాసనసభ్యులను చంద్రబాబునాయుడు ఏ విధంగా కొనుగోలు చేశారన్న వివరాలు తమ వద్ద పూర్తిగా ఉన్నాయని బీజేపీ శాసనసభా పక్ష నాయకుడు విష్ణుకుమార్‌రాజు ఆ పార్టీ మీటింగ్‌లో అందరి ముందు వెల్లడించడం గమనార్హం. అంతే కాదు మొన్నటికి మొన్న కర్నూలు జిల్లా కోడుమూరు స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొంది టీడీపీకి తాను ఎలా అమ్ముడుపోయింది మణిగాంధీ బాహాటంగా, సవివరంగా వివరించడం గమనార్హం.

ఇసుక అక్రమ తవ్వకాలపై ఎన్జీటీలో విచారణ



సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో ఇసుక అక్రమ తవ్వకాలను సవాల్ చేస్తూ 'రేలా' అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్లపై జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) గురువారం విచారణ జరిపింది. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల ఆధ్వర్యంలో జరుపుతున్న ఇసుక తవ్వకాలకు సంబంధించిన పూర్తి వివరాలను తమ ముందుంచాలని గత విచారణ సందర్భంగా ధర్మాసనం ఆదేశించింది. అయితే దీనికి సంబంధించి రెండు ప్రభుత్వాలు ఇచ్చిన వివరాలు అసంపూర్తిగా ఉన్నాయని జస్టిస్ ఎస్ రఘువేంద్రతో కూడిన ధర్మాసనం పేర్కొంది. మరోవైపు గోదావరి జిల్లాల్లో డ్రెడ్జింగ్ కార్యకలాపాలను నిషేధించాలని దాఖలైన మరో కేసును కూడా ఇదే కేసుకు కలిపి విచారిస్తామని స్పష్టం చేసింది. ఇసుక తవ్వకాలు జరుపుతున్న సంస్థలు, ఇసుక వినియోగానికి సంబంధించి పూర్తి వివరాలను ఇవ్వాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను మార్చి 14కు వాయిదా వేసింది.

రైల్వే ఉద్యోగులు, అధికారులపై తేనెటీగల దాడి

ప్రకాశం, కర్నూలు జిల్లాల సరిహద్దులో ఘటన

గిద్దలూరు: రైల్వే ఉద్యోగులు, అధికారులపై తేనెటీగలు దాడి చేయడంతో పలువురికి గాయాలైన సంఘటన గురువారం నల్లమల అటవీ ప్రాంతంలో జరిగింది. గుంటూరు– గుంతకల్లు మధ్య రైల్వే రోడ్డు విద్యుదీకరణ పనుల్లో భాగంగా గుంటూరు డివిజన్ రైల్వే మేనేజర్ డీజీ భూమా ఆధ్వర్యంలో అధికారులు, కార్మికులు ప్రకాశం, కర్నూలు జిల్లాల సరిహద్దులోని నల్లమల అటవీ ప్రాంతంలో దొరబావి సిమెంటు బ్రిడ్జి వద్ద పనులు చేస్తున్నారు. ఆ సమయంలో రైల్వే ట్రాక్‌కు వేసిన కంకర రాళ్లు సిమెంటు బ్రిడ్జికి అంటుకుని ఉన్న తేనె తుట్టెలపై పడ్డాయి. దీంతో తేనెటీగలు అక్కడ పనిచేస్తున్న వారందరిపై దాడి చేశాయి. కొందరు అక్కడే ఉన్న ప్రత్యేక రైలులోకి ఎక్కి తప్పించుకోగా, కింద ఉన్న దాదాపు 40 మందిపై తేనెటీగలు దాడి చేశాయి. డీఆర్ఎం డీజీ భూమాపై కూడా తేనెటీగలు దాడి చేసినట్లు సమాచారం. రైల్వే డిప్యూటీ సీఈవో మురళీమోహన్, టెక్నీషియన్ రాకేష్‌లు తీవ్రంగా గాయపడ్డారు. అందరినీ ప్రత్యేక రైలులో గిద్దలూరు రైల్వే స్టేషన్‌కు తరలించారు. గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.

విద్యారంగ సమస్యలపై 26న కమిషనరేట్ ముట్టడి

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యారంగ సమస్యలపై ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 26న ఇబ్రహీంపట్నంలోని విద్యాశాఖ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించనున్నారు. ఈ మేరకు కమిటీ రాష్ట్ర నేతలు రమేష్ పట్నాయక్, హృదయరాజు, కె.వెంకటేశ్వరరావు, కృష్ణయ్యలు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగు భాషను రక్షించాలని, స్వయం పోషిత స్వతంత్ర పాఠశాలల బిల్లును రద్దుచేయాలనే డిమాండ్లతో ఈ ముట్టడిని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎవర్ని పెళ్లాడాలో మేం నిర్ణయించలేం

'లవ్‌జీహాద్' కేసులో సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: కేరళ యువతి హదియా అలియాస్ అఖిల అశోకన్‌కు సంబంధించిన 'లవ్‌జీహాద్' కేసును విచారిస్తున్న సుప్రీంకోర్టు గురువారం కీలకవ్యాఖ్యలు చేసింది. జీవిత భాగస్వామి ఎంపికలో తప్పొప్పుల్ని తాము చెప్పలేమని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. 'హదియా సరైన వ్యక్తిని పెళ్లి చేసుకుందా? ఆమె తీసుకున్న నిర్ణయం సరైనదేనా? అనే విషయాలను మేం నిర్ణయించలేం. ఆమె సరైన వ్యక్తిని వివాహమాడలేదంటూ ఆ పెళ్లిని రద్దు చేయలేము. ఇష్టపూర్వకంగానే ఈ వివాహం చేసుకున్నట్లు ఆమె ఇంతకుముందు కోర్టుకు వచ్చి చెప్పారు' అని సీజేఐ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఏఎం ఖన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌ల ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా హదియా తండ్రి తరపు న్యాయవాది స్పందిస్తూ.. ఈ వివాహాన్ని రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 కింద కేరళ హైకోర్టు రద్దుచేసిందని కోర్టుకు విన్నవించారు. కాగా పెళ్లి, దర్యాప్తు అన్నవి వేర్వేరు అంశాలనీ, హదియా వివాహంపై దర్యాప్తు జరపాల్సిన అవసరం ఎంతమాత్రం లేదని సుప్రీం కోర్టు తేల్చిచెప్పింది. అనంతరం తదుపరి విచారణను మార్చి 8కి వాయిదా వేసింది. ఇస్లాం స్వీకరించి ముస్లిం వ్యక్తిని వివాహమాడిన అఖిల పెళ్లి చెల్లదంటూ గతేడాది కేరళ హైకోర్టు తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. దీంతో ఆమె భర్త షఫీన్ జహాన్ సుప్రీంను ఆశ్రయించారు.

నకిలీ పురుగుమందైతే రైతుకు నష్టపరిహారం

నూతన పెస్టిసైడ్స్ మేనేజ్‌మెంట్ ముసాయిదా బిల్లులో కేంద్రం స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: మానవజాతికి, పశుపక్ష్యాదులకు, జీవ వైవిధ్యానికి హాని కలిగించే పురుగు మందులపై కేంద్ర ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. వాటి తయారీ కంపెనీలపై కఠిన చర్యలకు రంగం సిద్ధం చేసింది. కల్తీ పురుగు మందులతో పంటలు ధ్వంసం అవుతున్నాయి, పలుచోట్ల రైతులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇష్టారాజ్యంగా పురుగుమందుల తయారీ, లైసెన్సుల జారీ వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని కేంద్రం గుర్తించింది. ఈ నేపథ్యంలో 'పెస్టిసైడ్స్ మేనేజ్‌మెంట్ బిల్లు ముసాయిదా'ను కేంద్రం సిద్ధం చేసింది. దీనిపై సలహాలు, సూచనలు ఇవ్వాలని రాష్ట్రాలకు, డీలర్లకు కేంద్ర వ్యవసాయశాఖ గురువారం విజ్ఞప్తి చేసింది. 'పురుగు మందులు వాడినప్పుడు అవి అనుకున్నస్థాయిలో పనిచేయకపోయినా, మానవజాతికి, పశుపక్ష్యాదుల ఆరోగ్యానికి హాని కలిగించినా, జీవవైవిధ్యాన్ని, పర్యావరణాన్ని దెబ్బతీసినా తయారీదారుడు లేదా డిస్ట్రిబ్యూటర్ సంబంధిత రైతుకు నష్టపరిహారం చెల్లించాలి''అని ముసాయిదా బిల్లు స్పష్టంచేసింది. కొత్త బిల్లులో నష్టపరిహారం అంశానికి చోటు కల్పించడాన్ని వ్యవసాయ నిపుణులు స్వాగతిస్తున్నారు.

నిషేధిత పురుగుమందులు అమ్మితే ఐదేళ్ల జైలు

కల్తీ పురుగుమందులు అమ్మినా, తయారుచేసినా తీవ్రంగా పరిగణిస్తారు. అలాగే ఎటువంటి లైసెన్సు లేకుండా విక్రయించినా, అనుమతి లేకుండా ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్నా కఠిన చర్యలుంటాయి. పై వాటితోపాటు నిషేధిత పురుగుమందులు అమ్మితే కనీసం రూ.10 లక్షలకు తగ్గకుండా రూ.50 లక్షల వరకు భారీ జరిమానా విధిస్తారు. అంతేకాదు ఐదేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. పరిస్థితి తీవ్రంగా ఉంటే భారీ జరిమానా, జైలు శిక్ష రెండూ అమలుచేస్తారు. దాంతోపాటు తయారీదారుల, డీలర్ల లైసెన్సు రద్దు చేస్తారు. ఇక చట్టంలో పేర్కొన్న నిబంధనలకు విరుద్ధంగా పురుగుమందులు అమ్మితే రూ.1–5 లక్షల జరిమానా, ఆరునెలల జైలు శిక్ష విధిస్తారు. తప్పుడు సమాచారంతో పురుగుమందులు అమ్మినా, నాసిరకం పురుగుమందులు అమ్మినట్లు నిర్ధారణ జరిగినా రూ. 1–5 లక్షల జరిమానా, రెండేళ్ల జైలు శిక్ష విధిస్తారు. అవసరమైతే రెండింటినీ అమలుచేస్తారు. గతంలో జరిమానాలు కేవలం వేలల్లోనే ఉండేవి. జైలు శిక్షలు కేవలం నెలలకే పరిమితమయ్యేవి. ఇక కొత్త చట్టంలో లైసెన్సుల జారీని కఠినతరం చేశారు. సంబంధిత పురుగుమందు ఎలా పనిచేస్తుందన్నది ల్యాబ్‌లో పరీక్షిస్తారు. కేంద్రం ఏర్పాటుచేసే బోర్డులో ఇద్దరు రైతు ప్రతినిధులు ఉంటారు. అందులో ఒకరు మహిళ ఉండాలన్న నిబంధన చేర్చారు.

విద్యుత్ పొదుపేది?

- రాష్ట్రానికి కేంద్ర ఇంధనశాఖ షాక్
- నష్టాలు ఎందుకు పెరుగుతున్నాయి?
- ఇది ఉదయ్ నిబంధనల ఉల్లంఘనే
- ఇలా అయితే సహకారం ఎలా ఇవ్వగలం?

సాక్షి, అమరావతి: విద్యుత్ ప్రసార, పంపిణీ నష్టాలను (టీ అండ్ డీ లాసెస్) గణనీయంగా తగ్గించామని చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ఇంధనశాఖ షాక్ ఇచ్చింది. నష్టాలను తగ్గించడంలో రాష్ట్ర విద్యుత్ సంస్థలు విఫలమయ్యాయని పేర్కొంది. దీనిపై సమగ్ర అధ్యయనం జరిపి, నివేదిక ఇవ్వాలని కోరింది. ఈ విధంగా ప్రసార, పంపిణీ నష్టాల పెరుగుదల ఉదయ్ నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేసింది. విద్యుత్ పొదుపులో ఆశించిన ఫలితాలు చూపని పక్షంలో సహాయం అందించలేమని స్పష్టం చేసింది. దేశవ్యాప్త ఏకీకృత విద్యుత్ టారిఫ్ నిర్ధారణ ప్రతిపాదనపైనా ఏపీ విద్యుత్ శాఖ స్పందించాలని కోరింది. కేంద్ర ప్రభుత్వం 2014లో ఉజ్వల డిస్కమ్ అస్యూరెన్స్ యోజన (ఉదయ్) పథకాన్ని తీసుకొచ్చింది. విద్యుత్ పంపిణీ సంస్థలను రుణ విముక్తి చేయడం ఈ పథకం ప్రధానోద్దేశ్యం. డిస్కమ్‌ల అప్పులను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుని, బాండ్లుగా సేకరిస్తుంది. దీనివల్ల పంపిణీ సంస్థలకు ఉన్న అప్పుల భారం విద్యుత్ వినియోగదారులపై పడదు. ఉదయ్ పథకంలో చేరిన రాష్ట్ర విద్యుత్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు కూడా ఇస్తుంది. కేంద్ర విద్యుత్ వాటా పెంచడం, గ్యాస్‌ను ఎక్కువగా ఇవ్వడం, బొగ్గు కేటాయింపులు పెంచడంతో పాటు పలు పథకాలకు ఆర్థికసాయం చేస్తుంది. అయితే, ఈ పథకంలో చేరిన రాష్ట్రాలు ఉదయ్ నిబంధనలు కచ్చితంగా పాటించాలి. ఇందులో ప్రసార, పంపిణీ నష్టాలను క్రమంగా తగ్గించాలి. పదేళ్ళలో సున్నా స్థాయికి తీసుకురావాల్సి ఉంటుంది. దీనికోసం విద్యుత్ ఉపకరణాల మార్పు, ఎల్ఈడీ బల్బుల పంపిణీ, పొదుపు చేయగల వ్యవసాయ పంపుసెట్లను కేంద్ర ప్రభుత్వ సంస్థలు అందిస్తున్నాయి. ఈ ప్రయోజనాలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం 2014లో ఉదయ్ పథకంలో చేరుతున్నట్టు ప్రకటించి, ప్రధాన ప్రచారాస్త్రంగా చేసుకుంది.



రూ. 3152 కోట్ల నష్టాలు!

విద్యుత్ ప్లాంట్లలో ఉత్పత్తి అయ్యే విద్యుత్ వినియోగదారుడికి విద్యుత్‌ను వివిధ మార్గాల్లో చేరుతుంది. హైటెన్షన్, లోటెన్షన్ వైర్ల ద్వారా, పలు రకాల సామర్థ్యం గల సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా విద్యుత్ పంపిణీ అవుతుంది. ఈ క్రమంలో ట్రాన్స్‌కో పరిధిలోప్రసార నష్టాలు, డిస్కమ్‌ల పరిధిలో పంపిణీ నష్టాలు సర్వసాధారణం. దీన్ని నివారించేందుకు కొన్నేళ్ళుగా విద్యుత్ వ్యవస్థలను బలోపేతం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం దీనిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. విద్యుత్ చౌర్యం నిరోధించడం, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్ల నాణ్యత పెంచే పథకాలు అమలు చేస్తోంది. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అడ్డగోలుగా ప్రైవేటు విద్యుత్‌ను కొనుగోలు చేయడం, క్షేత్రస్థాయిలో సిబ్బంది అవినీతికి పాల్పడటంతో విద్యుత్ సరఫరా, రాబడి మధ్య తేడా ఉంటోంది. రాష్ట్రంలో విద్యుత్ ప్రసార, పంపిణీ నష్టాలు గణనీయంగా పెరిగాయి. ఈపీడీసీఎల్ పరిధిలో 2017–18 సంవత్సరంలో 6.95 శాతం నష్టాల నుంచి 18–19లో సమర్పించిన వార్షిక ఆదాయ అవసర నివేదిక (ఏఆర్ఆర్) ప్రకారం 10.13 శాతానికి పెరిగాయి. దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) పరిధిలో 8.80 శాతం (2017–18లో) నుంచి 12.01 శాతం (2018–19)కు పెరిగాయి. 2018–19 ఏఆర్ఆర్‌ల ప్రకారం ఈపీడీసీఎల్ పరిధిలో 21,977 మిలియన్ యూనిట్ల విద్యుత్ పంపిణీ జరిగితే, రాబడి మాత్రం 19,751 మిలియన్ యూనిట్లకే వచ్చింది. అంటే.. ఈ డిస్కమ్ పరిధిలో 2,226 మిలియన్ యూనిట్ల ప్రసార, పంపిణీ నష్టాలు చోటుచేసుకున్నాయి. అదే విధంగా ఎస్పీడీసీఎల్ పరిధిలో 39,566 మిలియన్ యూనిట్ల విద్యుత్ పంపిణీ చేస్తే... మీటర్ సేల్స్ ద్వారా వచ్చింది 34,786 మిలియన్ యూనిట్లే. ఇంకా 4,780 మిలియన్ యూనిట్ల మేర నష్టాలు వచ్చాయి. రెండు డిస్కమ్‌ల పరిధిలో 7006 మిలియన్ యూనిట్ల నష్టాలు వచ్చాయి. యూనిట్ ఉత్పత్తి వ్యయం రూ. 4.50. ఈ లెక్కన రూ. 3,152 కోట్ల నష్టాలు వచ్చినట్టు గుర్తించారు. దీనివల్ల రాష్ట్రానికి రావాల్సిన కేంద్ర విద్యుత్‌తో పాటు, బొగ్గు, విద్యుత్ రంగ సంస్థల బలోపేతానికి వచ్చే నిధులు ఆగిపోయే అవకాశం ఉంది. నష్టాలపై అధ్యయనం చేసి, కారణాలు వివరించాలని కేంద్ర ఇంధనశాఖ రాష్ట్రానికి లేఖ రాసినట్టు తెలిసింది.

కృష్ణా జలాలపై బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌లో విచారణ

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపకాలకు సంబంధించి బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌లో గురువారం తిరిగి విచారణ ప్రారంభమైంది. ఈ సందర్భంగా వ్యవసాయ రంగంపై ఏపీ దాఖలు చేసిన అఫిడవిట్‌పై తెలంగాణ క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. ఏపీ తరపున వచ్చిన వ్యవసాయ రంగ నిపుణులు పీవీ సత్యనారాయణకు తెలంగాణ తరపున సీనియర్ న్యాయవాది రవీందర్‌రావు పలు ప్రశ్నలు వేశారు. విచారణ శుక్రవారం కూడా కొనసాగనుంది.

సమన్వయంతో వడగాడ్పుల నష్టాల నివారణ

ముగిసిన రెండు రోజుల సదస్సు

సాక్షి, అమరావతి /తాడేపల్లి రూరల్(మంగళగిరి): అన్ని శాఖలు, సంస్థలు ప్రణాళికతో పనిచేయడం ద్వారా వడగాడ్పు మరణాలను, నష్టాలను నివారించవచ్చని నిపుణులు స్పష్టం చేశారు. 'వడగాడ్పులపై సన్నద్ధత – ఉపశమన చర్యలు' అనే అంశంపై విజయవాడలో జరిగిన రెండు రోజుల జాతీయ సదస్సులో పలువురు మాట్లాడారు. ఉత్తమ విధానాల ద్వారా నష్టాన్ని పూర్తిగా నివారించవచ్చని జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్ఎండీఏ) సంయుక్త కార్యదర్శి తిర్పుగజ్ పేర్కొన్నారు. వాతావరణంలో మార్పులవల్ల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, పచ్చదనం పెంపు ద్వారా దీన్ని తగ్గించవచ్చని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ డైరెక్టర్ ఎంవీ శేషగిరి బాబు తెలిపారు. ఐఎండి లాంటి వాతావరణ పరిశీలన కేంద్రాలు మరిన్ని ఉంటే ముందస్తు హెచ్చరికలు జారీ చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. వడగాడ్పులపై ప్రజలను చైతన్యపరచడానికి ప్రభుత్వ కార్యక్రమాల కంటే స్వచ్ఛంద సంస్థల కార్యక్రమాలు ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటాయని తెలంగాణ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, విపత్తు నిర్వహణ కమిషనర్ డాక్టర్ ఆర్‌కే చంద్రవదన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంకా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ ప్రొఫెసర్ దిలీప్ మవులంకర్, నాగ్‌పూర్ మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ ఎన్.ఎం. రతి, ఎన్‌డీఎం సభ్యులు ఆర్‌కే జైన్, కమల్ కిషోర్, హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ వైకే రెడ్డితోపాటు వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

7న సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు ధ్రువపత్రాల పరిశీలన

సాక్షి, అమరావతి: ఏపీ వైద్యవిధాన పరిషత్ పరిధిలోని సివిల్ అసిస్టెంటు సర్జన్ (స్పెషలిస్టు) పోస్టులకు సంబంధించి అభ్యర్థులకు మార్చి 7న ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ గురువారం తెలిపింది. అభ్యర్థుల జాబితాను www.psc.ap.gov.in వెబ్‌సైట్లో పొందుపరిచినట్లు కమిషన్ కార్యదర్శి వైవీఎస్‌టీ సాయి పేర్కొన్నారు.

5 నుంచి సహాయ సంక్షేమాధికారుల ఇంటర్వ్యూలు

బీసీ, ఎస్సీ, గిరిజన సంక్షేమ విభాగాల్లో సహాయ సంక్షేమాధికారుల పోస్టుల మెయిన్స్ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు మార్చి 5, 6, 7 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. వివరాలకు www.psc.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

పంచాయతీలకు విద్యుత్ సరఫరా ఆపడానికి వీల్లేదు

పంచాయతీరాజ్ కమిషనర్ రామాంజనేయులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): విద్యుత్ బకాయిలున్నా యంటూ పంచాయతీలకు విద్యుత్ సరఫరా ఆపడానికి వీల్లేదని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ బి.రామాంజినేయులు స్పష్టం చేశారు. రాజమహేంద్రవరంలో గురువారం యూనియన్ నేషనల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు కింద ప్రభుత్వ పథకాలపై సమీక్ష నిర్వహించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఏజెన్సీలో ఉపాధి హామీ కూలీలకు ఆయా డ్వాక్రా మహిళా సంఘాలతో అవగాహన చేసుకుని స్త్రీనిధి ద్వారా ముం దుస్తు చెల్లింపులు జరిపేందుకు యోచిస్తున్నామని చెప్పారు.



సాక్షి
శుక్రవారం, ఫిబ్రవరి, 23


కమల్ కొత్త పార్టీ

తమిళనాడులో మరో సినీ ప్రముఖుడు కమల్‌హాసన్ 'మక్కళ్ నీది మయ్యం' (ప్రజా న్యాయ వేదిక) పేరిట బుధవారం లాంఛనంగా తన పార్టీని ప్రారంభించారు. ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జయలలిత 2016 డిసెంబర్‌లో కనుమరుగయ్యాక అక్కడి రాజకీయాల్లో ఏర్పడిందని చెబుతున్న శూన్యాన్ని భర్తీ చేయడానికి ఉవ్విళ్లూరుతున్నవారిలో ఆయన కూడా చేరారు. నూతన సంవత్సర ఆగమన వేళ సూపర్‌స్టార్ రజనీకాంత్ రాజకీయ రంగ ప్రవేశం చేయబోతున్నట్టు ప్రకటించినా పార్టీ ఏర్పాటును మాత్రం వచ్చే అసెంబ్లీ ఎన్నికల సమయానికి వాయిదా వేసుకున్నారు. ఇద్దరూ వర్తమాన తమిళనాడు దుస్థితిని చూసి ఆగ్రహించి రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించుకున్నట్టు చెప్పారు. అయితే రజనీకాంత్ ఇంతవరకూ ఎవరికీ పరిచయం లేని, బోధపడని 'ఆధ్యాత్మిక రాజకీయాలు' గురించి ప్రస్తావిస్తే.. హేతువాద దృక్పథం ఉన్న కమల్‌హాసన్ తాను ప్రజల చేతిలో ఆయుధాన్నని ప్రకటించారు. రజనీకాంత్ ఎవరితో వెళ్తానన్న అంశంలో స్పష్టతనీయకపోయినా ఆయన వెనక బీజేపీ ఉన్నదన్న అనుమానాలు తలెత్తాయి. కమల్ మాత్రం బీజేపీకి, హిందుత్వకు వ్యతిరేకంగా ప్రకటనలిస్తున్నారు. పార్టీ ఆవిర్భావ సదస్సులో కమల్ ప్రజాసేవ గురించి, అవినీతి నిర్మూలన గురించి మాట్లాడటం తప్ప తన పార్టీ విధానాలేమిటో స్పష్టతనీయలేదు. ఒకపక్క అవినీతి నిర్మూలన గురించి మాట్లాడుతూనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తన హీరో అని ఆయన ప్రకటించడం సహజంగానే అందరినీ విస్మయపరిచి ఉంటుంది. పొరుగునున్న తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకోవడానికి పాలక టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేకు భారీ మొత్తంలో లంచం ఇవ్వజూపిన ఉదంతం కమల్‌కు తెలియదంటే ఎవరూ నమ్మరు. చంద్రబాబుకు వ్యతిరేకంగా ఆడియో, వీడియో సాక్ష్యాలున్నప్పటికీ ఆ కేసు ఎందుకు ముందుకు సాగటం లేదో కూడా ఆయనకు అర్థమై ఉండాలి. అలాగే ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్ కాంగ్రెస్ నుంచి 23మంది ఎమ్మెల్యేలనూ, ముగ్గురు ఎంపీలను కొనుగోలు చేసి టీడీపీలో చేర్చుకోవడం, ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో కొందరికి మంత్రి పదవులు కట్టబెట్టడం తెలిసి ఉండాలి. ఇవన్నీ తెలియదంటే ఆయన రాజకీయ పరిణతిపైనా, చిత్తశుద్ధిపైనా సంశయం కలుగుతుంది. పెళ్లికి వెళ్తూ పిల్లిని చంకనబెట్టుకెళ్లిన చందాన పోయి పోయి బాబు ప్రస్తావన తీసుకురావడం ద్వారా పార్టీ ఆవిర్భావ సభ ఔన్నత్యాన్ని కమల్ తగ్గించుకున్నారు.

సినిమా మాధ్యమం ప్రజలను ఆకట్టుకునే బలమైన సాధనం కనుక ఆ రంగంలో ప్రజాదరణ పొందినవారు రాజకీయాల్లోకొచ్చి అదృష్టాన్ని పరీక్షించుకోవాలనుకుంటారు. అది సహజం. తమిళనాడులో సీఎన్ అన్నాదురై, కరుణానిధి, ఎంజీ రామచంద్రన్‌లు సినిమా రంగం ద్వారా రాజకీయాల్లోకి వచ్చినవారే. అయితే వీరందరి మూలాలూ తమిళనాడును ఒకప్పుడు ప్రభంజనంలా చుట్టుముట్టిన ద్రవిడ ఉద్యమంలో ఉన్నాయి. హేతువాదం, ఆత్మగౌరవం, మహిళల హక్కులు, కుల నిర్మూలన సిద్ధాంతాలతో బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమం నడిపిన పెరియార్ రామస్వామి సామాజిక, సాంస్కృతిక రంగాల్లో తాము సాధించుకున్న విజయాలను సుస్థిరం చేసుకోవడానికి ద్రవిడ కజగం పార్టీని స్థాపించారు. అందులో పాలుపంచుకున్న అన్నాదురై అనంతరకాలంలో ఆయనతో విభేదించి డీఎంకే పార్టీని ఏర్పాటుచేసుకున్నారు. దాని నేతృత్వంలో సాగిన హిందీ వ్యతిరేకోద్యమం తమిళనాడు రాజకీయాలను కీలక మలుపు తిప్పింది. అనంతరం 1967లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి కాంగ్రెస్ దిగ్గజం కామరాజ్ నాడార్ ఒక విద్యార్థి నాయకుడి చేతిలో ఓటమి చవిచూడటం పెను సంచలనం. ఆ తర్వాత జాతీయ పార్టీలకు అక్కడ స్థానం లేకుండాపోయింది. కాంగ్రెస్ అయినా, అనంతరకాలంలో బీజేపీ అయినా ద్రవిడ పార్టీల దయాదాక్షిణ్యాలు లేనిదే ఒక్క సీటయినా గెలవలేని దుస్థితిలో పడ్డాయి. ఎంజీఆర్ అనంతరం ఆయన వారసురాలిగా జయలలిత ప్రజాభిమానాన్ని పొందగలిగారు.

ప్రధాన ద్రవిడ పార్టీలతో సంబంధం లేకుండా, అసలు ద్రవిడ ఉద్యమం ప్రస్తావనే లేకుండా రాజకీయాల్లోకొచ్చిన తొలి తమిళ తారలు రజనీకాంత్, కమల్ హాసన్‌లే. వీరు తమ ప్రయత్నాల్లో ఏమాత్రం విజయం సాధించినా తమిళనాడు చరిత్ర మరో మలుపు తిరిగినట్టవుతుంది. గత అయిదు దశాబ్దాల్లో వైకో నేతృత్వంలోని ఎండీఎంకే, నటుడు విజయకాంత్ సారథ్యంలోని డీఎండీకే, డాక్టర్ రాందాస్ నాయకత్వంలోని పీఎంకే, ఇంకా అనేక ఇతర పార్టీలు రంగంలో కొచ్చాయి. ఇవన్నీ ద్రవిడ ఉద్యమం పేరు చెప్పుకునే ప్రజలను ఆకట్టుకోవాలని చూశాయి. ఉత్థానపతనాలు చవిచూశాయి. విజయకాంత్ పార్టీ ఒకానొక దశలో తృతీయ ప్రత్యామ్నాయంగా ఎదుగుతున్నదని అందరూ అభిప్రాయపడ్డారు. కానీ అయిదేళ్లు గడవకుండానే అది కాస్తా కొడిగట్టింది.

వర్తమాన తమిళ రాజకీయాల పట్ల అక్కడి ప్రజలు ఆగ్రహంతో ఉన్నారన్నది వాస్తవం. జయలలిత మరణానంతరం అన్నాడీఎంకే పార్టీకి, ముఖ్యమంత్రి పదవికి తాను సహజ వారసురాలినని అంచనా వేసుకుని ఆ దిశగా పావులు కదిపిన జయ సన్నిహితురాలు శశికళ అవినీతి కేసులో శిక్ష పడి జైలు పాలయ్యారు. ఆ తర్వాత తన మేనల్లుడు దినకరన్ ద్వారా పార్టీని నడిపించాలనుకుంటే అది కాస్తా అడ్డం తిరిగి ఆ పార్టీయే చేజారింది. ఆయన ఆర్‌కె నగర్ ఉప ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా విజయం సాధించారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లోపు అన్నా డీఎంకే తన చెంతకే చేరుతుందన్న విశ్వాసమేదో ఆయనకు ఉన్నట్టుంది. అటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న అన్నాడీఎంకే ముఖ్యమంత్రి పళనిస్వామి, మాజీ ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వంల మధ్య కొట్టుమిట్టాడుతూ అయోమయంలో కాలం గడుపుతోంది. ఈ పరిస్థితులే కమల్‌నూ, రజనీని రాజకీయాల్లోకి ఆకర్షించి ఉంటాయి. అయితే విస్పష్టమైన విధానాలూ, సిద్ధాంతాలూ, కార్యాచరణ ఉన్నప్పుడే ఎవరైనా ఈ రంగంలో రాణిస్తారు. ఆ సంగతిని కమల్‌హాసన్, రజనీకాంత్ గ్రహించాలి.




"రాజకీయ రంగంలో స్పష్టత, అవగాహన లేకుండా రాణించడం చాలా కష్టం."

– ఎడ్వర్డ్ బ్రూక్
అమెరికన్ రాజకీయ నేత

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, తిథి శు.అష్టమి రా.10.04 వరకు, తదుపరి నవమి నక్షత్రం కృత్తిక ఉ.10.31 వరకు, తదుపరి రోహిణి, వర్జ్యం రా.1.37 నుంచి 3.07 వరకు, దుర్ముహూర్తం ఉ.8.43 నుంచి 9.30 వరకు, తదుపరి ప.12.35 నుంచి 1.21 వరకు, అమృతఘడియలు ఉ.8.13 నుంచి 9.34 వరకు.

సూర్యోదయం	: 6.27	12.00 వరకు
సూర్యాస్తమయం	: 5.59	యమగండం :
రాహుకాలం :		ప.3.00 నుంచి
ఉ.10.30 నుంచి		4.30 వరకు




నమాజ్ వేళలు

ఫజర్	: 5.26	మగ్రీబ్	: 6.21
జొహర్	: 12.29	ఇషా	: 7.33
అసర్	: 4.43		

తప్పులు తెచ్చిన తిప్పలివి!

విశ్లేషణ



సి. రామచంద్రయ్య

రాజధాని నిర్మాణం మొదలుకొని ప్రతి అంశంలో పారదర్శకత పాటించకుండా రాష్ట్రాన్ని సొంత ఎస్టేట్ మాదిరిగా ప్రతి అంశంలో గుట్టుగా వ్యవహరించిన చంద్రబాబు.. చివరి బడ్జెట్ అనంతరం కేంద్రంపై 'యూ టర్న్' తీసుకోవడంలో ఆశ్చర్యం లేదు. మితిమీరిన అప్పులు, అక్రమాల పుట్టగా మారిన పోలవరం ప్రాజెక్టు అవకతవకలు, ప్రత్యేక హోదాపై ప్రజల్లో రగులుతున్న ఆగ్రహం తన మెడకు చుట్టుకునేలా ఉన్నాయని చంద్రబాబు స్పష్టంగా గ్రహించబట్టే, తనకు అలవాటైన బ్లేమ్ గేమ్‌ను తెలివిగా బీజేపీవైపు తిప్పారు.

''మమ్మల్ని ముంచాలని చూస్తే మీరూ మునిగిపోతారు'' రాష్ట్ర బీజేపీ నేత ఒకరు సీఎం చంద్రబాబును ఉద్దేశించి చేసిన వ్యాఖ్య ఇది. కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ నేతల మధ్య సాగుతున్న మాటల యుద్ధంలో భాగంగా వచ్చే ఎన్నికల్లో రాగల ఫలితాలను సదరు బీజేపీ నేత ముందుగా అంచనా వేశారు. ఎన్నికల్లో ఎవరు మునుగుతారు.. ఎవరు తేలుతారన్నది పక్కన పెడితే.. టీడీపీ, బీజేపీలు ఉమ్మడిగా రాష్ట్రాన్ని ముంచుతున్నాయి. నాలుగేళ్లుగా.. రాష్ట్రానికి సంబంధించి కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఏం చెప్పినా, ఏం చేసినా కిక్కురుమనకుండా వీర విధేయత ప్రదర్శిస్తూ వచ్చిన చంద్రబాబులో కేంద్రం ప్రవేశపెట్టిన ఐదో బడ్జెట్ తర్వాత చలనం వచ్చింది. నోరు విప్పకుండానే.. తను చెప్పదల్చుకొన్న సమాచారాన్నంతా లీకుల ద్వారా ప్రజలకు చేరవేస్తూ.. తప్పంతా కేంద్ర ప్రభుత్వానిదే అని ప్రజల్లో బలమైన అభిప్రాయాన్ని ఏర్పర్చడానికి తిప్పలు పడుతున్నారు. ప్రధాని మోదీ, బీజేపీల వైఖరితో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందని తన పార్టీ నేతలతో చాటింపు వేయిస్తున్నారు.

ప్రత్యేక హోదా డిమాండ్‌తో రాజీలేని పోరాటం చేస్తున్న ప్రతిపక్షాలను ప్రజలు ఆదరిస్తారనే భయంతో, ఎప్పుడో వదిలేసిన 'ప్రత్యేకహోదా' అంశాన్ని బాబు మళ్లీ ఎత్తుకోవడం ఆయన ఆడుతున్న రాజకీయ క్రీడలో సరికొత్త ట్విస్ట్. ప్రత్యేకహోదా కలిగిన రాష్ట్రాలకు పొడిగింపు ఇస్తున్నారు కనుక తాము కూడా డిమాండ్ చేస్తామంటూ తమ పార్టీ వేదికనుంచి చేసిన ప్రకటన బాబు ఊసరవెల్లి రాజకీయాలకు పరాకాష్ఠ. ఎన్డీఏతో తెగదెంపుల వరకూ వచ్చింది కాబట్టి.. మళ్లీ ఇప్పుడు బాబు ప్రత్యేక హోదాను తెరపైకి తెచ్చారు.

తొలి అడుగు నుంచీ ఎత్తుగడలే!

చంద్రబాబు నమ్మదగిన మిత్రుడు కాదని బీజేపీకి తెలుసు. 2004లో ఎదురైన ఓటమి తర్వాత ''జీవితంలో బీజేపీతో పొత్తు పెట్టుకొనే ప్రసక్తి లేదు'' అని భీషణ ప్రతిజ్ఞ చేసిన చంద్రబాబు నైజం బీజేపీకి, మరీ ముఖ్యంగా మోదీకి బాగా తెలుసు. కానీ, అధికారంలోకి రావడం ప్రధానం కనుక బీజేపీ చంద్రబాబుతో చేతులు కలిపింది. అధికారంలోకి రాగానే బాబు తన నైజం ఏమిటో ఎన్డీఏకు చూపారు. భర్తీ చేయవలసిన 'వనరుల అంతరం (రిసోర్స్ గ్యాప్)' ఖాతాలో రైతుల రుణమాఫీ మొత్తాన్ని, పెన్షన్ల మొత్తాన్ని 'రెవెన్యూ లోటు'గా లెక్కించి ఇవ్వవలసిన మొత్తాన్ని రూ. 16,073 కోట్లుగా చూపించారు.

ఇక, పునర్వ్యవస్థీకరణ బిల్లు ప్రకారం కేంద్ర సాయంతో రాజధాని నిర్మాణం సాగిస్తే.. క్రెడిట్ మొత్తం ఎన్డీఏ ప్రభుత్వానికి దక్కుతుందన్న దురాలోచనతో.. కొత్త రాష్ట్రంలో తనదైన ముద్ర వేసుకోవాలన్న తాపత్రయంతోనే చంద్రబాబు తలకు మించిన భారమైన 'అమరావతి' నిర్మాణం తలకెత్తుకున్నారు. ప్రపంచస్థాయి రాజధాని నిర్మాణం పేరుతో పచ్చటి పొలాల్లో కల్లోలం నింపి.. 4 పంటల సాగుతో సంతృప్తికరంగా జీవిస్తున్న రైతాంగానికి లేని ఆశలు చూపించారు. రాజధాని నిర్మాణానికి భూములిస్తే త్యాగధనులౌతారని, వాణిజ్యపరంగా కోట్లు వస్తాయని వారిని నమ్మించి ల్యాండ్ పూలింగ్ ద్వారా 36,000 ఎకరాల్ని సేకరించారు. దానిని పెట్టుబడిగా చూపుతూ.. ప్రత్యేక విమానాల్లో మందీ మార్బలంతో.. విదేశాలు తిరుగుతూ పెట్టుబడుల వేట మొదలుపెట్టారు. ఎప్పుడైతే బాబు.. పునర్వ్యవస్థీకరణ బిల్లు ప్రకారం శివరామకృష్ణన్ నేతృత్వంలో ఏర్పాటైన రాజధాని కమిటీ అందించిన నివేదికను ప్రక్కనపెట్టి.. సొంత నిర్ణయాన్ని తీసుకోవడం మొదలు పెట్టారో.. అప్పుడే కేంద్రం ప్రత్యేక హోదాను అటకెక్కించింది.



ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తే.. దక్షిణాది రాష్ట్రాల్లో అగ్రగామి రాష్ట్రంగా అవతరిస్తుందని, దానివల్ల ఇతర రాష్ట్రాల నుంచి రాజకీయంగా తమకు ఇబ్బందులు ఎదురవుతాయని బీజేపీకి తెలుసు. దక్షిణాదిలో 2019 ఎన్నికల్లో 150 లోక్‌సభ స్థానాలు గెలవాలనే లక్ష్యంగా పెట్టుకొన్న బీజేపీకి ఏపీలో కంటే ఇతర రాష్ట్రాల్లో పాగా వేయడం ముఖ్యం. అందుకే ఏపీకి ప్రత్యేకహోదా నిరాకరించడానికి రకరకాల సాకులు చూపింది. 14వ ఆర్థిక సంఘం ఏర్పాటయ్యాక 'ప్రత్యేక హోదా' అర్థం కోల్పోయిందన్నారు. ఆ తర్వాత నీతి ఆయోగ్‌ను తెరపైకి తెచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ, వైఎస్సార్‌సీపీ, వామపక్ష పార్టీలు చేసిన ధర్నాలు, ఆందోళనల్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖాతరు చేయలేదు. ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తేవాలని ప్రతిపక్ష పార్టీలు పలు సందర్భాలలో చేసిన విజ్ఞప్తులను బాబు తోసిపుచ్చారు. ప్రజలకు సహేతుక సమాధానాలు ఇవ్వకుండానే అప్పుడు కేంద్రమంత్రిగా ఉన్న వెంకయ్యతో ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయంగా ప్రకటించేశారు.

రక్తం సలసల మరిగిందన్న బాబు జావగారిపోయారెందుకు?

ప్రత్యేక హోదా రాకుంటే రాష్ట్రానికి ఒరిగేదేమీ ఉండదని అనుభవజ్ఞుడైన సీఎం బాబుకు తెలియనిదేమీ కాదు. అయితే, ఆయన ఎజెండా వేరు. మొదటి రెండేళ్లు.. పోలవరంను పక్కనపెట్టి.. ముడుపుల కోసం పట్టిసీమ నిర్మాణం చేపట్టారు. అందరూ అభ్యంతరాలు వ్యక్తం చేసినా.. మిత్రపక్షంగా ఉన్న బీజేపీ నేతలు మాత్రం.. పట్టిసీమను 'ఆహా ఓహో' అని పొగిడారు. పట్టిసీమలో రూ.400 కోట్లు అవినీతి జరిగిందని 'కాగ్' ఎత్తి చూపినా.. వారు నోరు మెదపలేకపోయారు. ''మీరు ఏమీ చేయకపోయినా మేము మాట్లాడం.. నేనేం చేసినా మీరు మాట్లాడొద్దు'' అనే తరహాలో చంద్రబాబు బీజేపీతో ఓ లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకొన్నారు. ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో సెప్టెంబర్ 7, 2016న అరుణ్‌జైట్లీ ప్రత్యేక హోదాకు మించిన ప్రయోజనాలు కలిగిన ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని అందిస్తామని ప్రకటించారు. ముందుగా ''రక్తం సలసల కాగిపోతోంది'' అని అన్న బాబు, ఆ తర్వాత సర్దుకోవడం; పోలవరం నిర్మాణ బాధ్యతల్ని రాష్ట్ర ప్రభుత్వానికే అప్పజెపుతున్నాం అంటూ జైట్లీ ప్రకటించడం చకచకా జరిగిపోయాయి.

ప్రత్యేక హోదాను హక్కుగా వదులుకోవడం అన్యాయం అని ఘోషించిన వారి గొంతుకలు.. పాలకపక్షం సాగించిన ప్రచార హోరు ముందు మూగపోయాయనే చెప్పాలి. పైగా, 2017 కేంద్ర బడ్జెట్ అనంతరం చంద్రబాబు స్వయంగా మీడియా ముందుకొచ్చి ''బడ్జెట్ బాగుంది. మనమే ఎక్కువ సాధించాం'' అంటూ కేంద్రాన్ని ఆకాశానికెత్తేశారు. ''ఏ రాష్ట్రానికైనా ఇంతకంటే ఎక్కువ వచ్చాయా? ఆధారాలుంటే చూపండి'' అంటూ ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. పైగా, ప్రతిపక్షాలు నల్లజెండాలతో నిరసన వ్యక్తం చేస్తే.. రిపబ్లిక్ డే సందర్భంగా నల్లజెండాలు ప్రదర్శించడం నేరం అంటూ 'ఆందోళనల విషయంలో చట్టం తనపని తాను చేస్తుంది' అని ప్రతిపక్ష నేతలను పరోక్షంగానే హెచ్చరించారు. రాజధాని నిర్మాణం మొదలుకొని ప్రతి అంశంలో పారదర్శకత పాటించకుండా రాష్ట్రాన్ని సొంత ఎస్టేట్ మాదిరిగా భావించి ప్రతి అంశంలో గుట్టుగా వ్యవహరించిన చంద్రబాబు.. చివరి బడ్జెట్ అనంతరం కేంద్రంపై 'యూ టర్న్' తీసుకోవడంలో ఆశ్చర్యపడాల్సింది లేదు.

వైఫల్యాల నుంచి బయటపడే మార్గం

పాలనారంగంలో వెంటాడుతున్న వైఫల్యాలు బాబును ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. రాష్ట్రాలు ఇష్టానుసారంగా అప్పులు చేయకుండా రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 3% మాత్రమే అప్పులు తెచ్చుకొనేందుకు కేంద్ర ప్రభుత్వం చేసిన 'ఎఫ్ ఆర్‌ఎంబి' చట్టాను ఇప్పటికే తెలుగుదేశం ప్రభుత్వం అతిక్రమించింది. ఈ నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా లక్షాపాతిక వేల కోట్ల మేర అప్పులు చేసింది. అమరావతి రాజధాని నిర్మాణానికి కేంద్రం ఇచ్చిన నిధుల్లో దాదాపు రూ.1500 కోట్లు తాత్కాలిక సచివాలయం, అసెంబ్లీ భవనాలకు ఖర్చు చేశారు. ప్రపంచాన్ని తలదన్నే రీతిలో కట్టాలనుకొంటున్న 'అమరావతి' నిర్మాణానికి కేంద్రం అదనంగా నిధులు ఇవ్వదని తేలింది. అంతర్జాతీయ సంస్థల నుంచి అప్పులు తేవడానికి 'ఎఫ్‌ఆర్‌ఎంబి' చట్టంను కాదని తమకు ప్రత్యేక అనుమతి ఇవ్వాలని కేంద్రాన్ని పదే పదే కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసే అప్పులకు కేంద్రం కౌంటర్ గ్యారెంటీ ఇవ్వాలి కనుక.. అటువంటి వెసులుబాటు ఇచ్చేందుకు కేంద్రం సిద్ధంగా లేదు. మరోవైపు, అవినీతి అక్రమాల పుట్టగా మారిన 'పోలవరం' ముందుకు సాగడం లేదు. ఈ ప్రతికూలతలు, చేసిన తప్పులు మెడకు చుట్టుకొంటున్న నేపథ్యంలో చంద్రబాబు తనకు అలవాటైన బ్లేమ్ గేమ్‌ను తెలివిగా బీజేపీవైపు తిప్పారు. పనిలో పనిగా.. రాష్ట్ర విభజన సహేతుకంగా జరగలేదని ఆ పాపం కాంగ్రెస్ పార్టీదేనని; వైఎస్సార్‌సీపీ, బీజేపీని గట్టిగా నిలదీయకుండా వారితో చెలిమికోసం అర్రులు చాస్తోందంటూ విమర్శలకు దిగారు.

ప్రశ్నించాల్సిన వారు ప్రశ్నించకపోవడం వల్లనే..!

ప్రత్యేక హోదా అంశంలోనే చంద్రబాబు ఎన్నిసార్లు నాలుక మడత వేశారో అందరికీ తెలుసు. ఈ నాలుగేళ్లల్లో, ఆయన ఏదైతే అన్యాయం, అక్రమం అన్నారో.. అదే మార్గంలో నడిచారు. పార్టీ ఫిరాయింపులపై తెలంగాణలో న్యాయపోరాటం చేస్తూ.. ఏపీలో ప్రోత్సహించారు. ఫిరాయింపుదార్లను మంత్రుల్ని చేశారు. రైతులు, మహిళలు, యువతకు ప్రతిపక్షంలో ఉండగా ఏం చెప్పారు.. ఇప్పుడేమి చేస్తున్నారో కూడా కళ్లకు కట్టినట్లు కన్పిస్తోంది. అయితే, ప్రజాస్వామ్యంలో పాలకపక్షం చేసే తప్పుల్ని ఒకప్పుడు మీడియా ఎత్తిచూపేది, ఏకిపారేసేది. ప్రజల్లో దోషులుగా నిలబెట్టేది. ఇప్పుడా బాధ్యతను అత్యధిక శాతం మీడియా చేయడం లేదు. చంద్రబాబు ఇచ్చే 'లీకులను' అక్షరం పొల్లుపోకుండా రాస్తున్నాయి, చూపిస్తున్నాయి. ప్రభుత్వం తప్పులు చేస్తే ఎటువంటి సంకోచం లేకుండా ఎత్తిచూపుతానని; ప్రజలకు అండగా ఉంటానని చెప్పిన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కారణాలు ఏవైనా కావొచ్చు.. పాలక పార్టీ చేస్తున్న తప్పులు ఆయనకు అగుపించడం లేదు.

చంద్రబాబు ఎప్పటికప్పుడు తనకు అనుకూలమైన వాదనల్ని తెరమీదకు తెస్తున్న విన్యాసాల్ని చూసీచూడనట్లు, వాటిని పట్టించుకోనవసరం లేదన్నట్లు ప్రవర్తించవచ్చు. కానీ ప్రజలు అన్నీ గమనిస్తారు. ప్రత్యేక హోదా అనే ఒక్క మాట లేదుగానీ.. దానికి మించిన ప్రయోజనాలతో ప్రత్యేక ఆర్థిక సాయం (స్పెషల్ అసిస్టెంట్స్) సాధించగలిగామంటూ తెలుగుదేశం, బీజేపీలు జరుపుకొన్న ఉమ్మడి ఉత్సవాలను, వెంకయ్యనాయుడికి జరిపిన సన్మానాల్ని, ఆ సందర్భంగా వారు మాట్లాడిన మాటల్ని ప్రజలు మర్చిపోలేరు. గౌతమ బుద్ధుడు అన్నట్లు ''ప్రజలు మౌనంగా ఉంటున్నారనుకోకు.. వారి ఆలోచనలు బిగ్గరగా ఉంటాయి'' అవసరమైన సందర్భంలో వారు స్పందిస్తారు. ఏపీ రాష్ట్ర భవిష్యత్తు విజ్ఞులైన ప్రజల మీదనే ఆధారపడి ఉంది.

వ్యాసకర్త మాజీ ఎంపీ । మొబైల్ : 81069 15555

తపాలా తప్పులకూ పరిహారమే!

ఒకప్పుడు పోస్ట్ ఆఫీస్ అన్నా, పోస్ట్ మ్యాన్ అన్నా నమ్మకానికి మారుపేర్లు. కానీ ఇటీవల పోస్టాఫీసులపై వస్తున్న ఫిర్యాదులు, ఆరోపణలు, సమాచార నిరాకరణలు వింటూ ఉంటే ఆశ్చర్యం వేస్తుంది. ఇవేనా ఆ తపాలా కార్యాలయాలు అనిపిస్తుంది.

విశ్లేషణ




మాడభూషి శ్రీధర్

తపాలా కార్యాలయం అంటే ప్రతి గ్రామంలో ఒక చైతన్య కేంద్రం. అందరికీ ఆత్మీయ సందేశాలను అందించే ఒక ఆప్త బంధువు. డబ్బు దాచుకోవచ్చు. కుటుంబానికి డబ్బు మనీయార్డర్ చేయవచ్చు. దేశమంతటా మారుమూల గ్రామాలలో సైతం విస్తరించిన పోస్టాఫీసులు ప్రజల మిత్రులు పోస్ట్ మ్యాన్ ఊళ్లో వాళ్లందరికీ పరిచితుడు. ఎవరెవరు ఎక్కడుంటారో తెలిసినవాడు. కానీ ఇటీవల పోస్టాఫీసులపై వస్తున్న ఫిర్యాదులు, ఆరోపణలు, సమాచార నిరాకరణలు వింటూ ఉంటే ఆశ్చర్యం వేస్తుంది. ఇవేనా ఆ తపాలా కార్యాలయాలు అనిపిస్తుంది. పోస్టాఫీసులు అనేకానేక మోసాలు, ఆరోపణలకు గురవుతున్నాయి.

సమాచార హక్కు ఈ శాఖలో జరుగుతున్న దురన్యాయాలను నిర్లక్ష్య ఆలస్యాలను, ఖాతాల్లో డబ్బు మాయం దుర్మార్గాలను ఎండగట్టడానికి ఒక అద్భుతమైన పరికరంగా ఉపయోగపడుతున్నది. ఉద్యోగానికి, లేదా కోర్సులో చేరడానికి ఆఖరి తేదీలోగా దరఖాస్తు పంపితే ఎందుకు చేర్చలేదని జనం నిలదీసి అడుగుతున్నారు. రిజిస్టర్డ్ పోస్ట్ చేసిన వస్తువులు ఉత్తరాలు, ముఖ్య పత్రాలు ఎందుకు మాయమై పోతున్నాయని చొక్కా పట్టుకుని ప్రశ్నిస్తున్నారు. వేలాది పోస్టాఫీసుల్లో అవినీతిని ఊడ్చివేయడానికి ఆర్టీఐ కొత్త చీపురు కట్టగా పనిచేస్తున్నది.

తపాలా సేవలను వినియోగించి భంగపడిన ఒక పౌరుడు ఆర్టీఐ అభ్యర్థనలో కొన్ని ప్రశ్నలు సంధించాడు. 2015 నవంబర్‌లో పంపిన రిజిస్టర్డ్ పోస్టు వస్తువు ఎందుకు చేరలేదు, తాను ఇచ్చిన మూడు ఫిర్యాదులపై ఏ చర్య తీసుకున్నారు అని. అది మరో డివిజన్‌కు సంబంధించిన విషయమని ఆ డివిజన్ ఫిర్యాదు నమోదు చేసుకుని దర్యాప్తు జరిపించారని సీపీఐఓ జవాబిచ్చాడు. సరైన సమాచారం ఇచ్చాడని మొదటి అప్పీలు అధికారి సమర్థించారు. ఫిర్యాదుల విచారణ పోర్టల్‌కు ఫిర్యాదు కూడా చేశాడు. రూ. 63ల నష్టపరిహారం తీసుకోవాలని అతనికి చెప్పారు. డిపార్ట్‌మెంట్ రూల్ ప్రకారం రూ. 63ల రిజిస్టర్డ్ చార్జీలతో పాటు వంద రూపాయల కనీస పరిహారం ఇవ్వవలసి ఉన్నా ఇవ్వలేదు. సరైన, పూర్తి సమాచారం ఇవ్వకపోవడం సీపీఐఓ చేసిన తప్పులు. కనుక జరిమానా ఎందుకు విధించకూడదో కారణాలు తెలపాలనే నోటీసు జారీ చేసింది కమిషన్. చాలా కీలకమైన పత్రాలను తన మేనల్లుడికి పంపానని, దానికి 480 రూపాయలు ఖర్చయిందనీ, దానితో పాటు 50 రూపాయల పుస్తకాన్ని పంపానని దరఖాస్తుదారుడు వివరించాడు. ఈ కవర్ అందకపోవడం వల్ల తన మేనల్లుడు ఒక పరీక్షకు హాజరు కాలేకపోయాడని, తదుపరి ఏడాది పరీక్షకు హాజరు కావలసి వచ్చిందని పరిహారం చెల్లించాలని కోరాడు. పరిహారం ఎందుకు ఇవ్వకూడదో వివరించాలని మరో నోటీసుకూడా జారీ చేసింది కమిషన్.

పోస్టాఫీసు అధికారి మాత్రం రిజిస్టర్డ్ పోస్ట్ ఎందుకు అందలేదో విచారించి రూపొందించిన నివేదిక ప్రతిని



ఆర్టీఐ అడిగిన వ్యక్తికి ఇచ్చామని చెప్పారు. విలువైన వస్తువులు పంపే వ్యక్తులు దానికి బీమా చేయించాలని, తాము పోయిన వస్తువు విలువను పరిహారంగా ఇచ్చే వీల్లేదని, రూల్స్ ప్రకారం కేవలం వంద రూపాయలు పరిహారం రూ. 63ల చార్జీలు మాత్రమే ఇస్తామని వివరించారు. సమాచారం త్వరగా ఇచ్చినప్పటికీ అది తప్పుడు సమాచారం కనుక పరిహారం ఇవ్వవలసిన కేసు అని కమిషన్ నిర్ధారించింది. సెక్షన్ 19(8)(బి) కింద రూ. 3,630ల పరిహారం (పూర్తి సమాచారం ఇవ్వకుండా వేధించినందుకు 2 వేలు, పరిహారం 100, ప్రయాణ ఖర్చుల కింద రూ. 1,000లు, కోల్పోయిన వస్తువుల విలువ రూ. 53లు) ఇవ్వాలని కమిషన్ ఆదేశించింది. సేవల వితరణలో నిర్లక్ష్యం కారణంగా వినియోగదారుడికి నష్టం జరిగితే పరిహారం ఇవ్వడం ఏ సర్వీసు సంస్థకయినా తప్పదు. కానీ చిన్న చిన్న పరిహారాలకోసం వినియోగదారులు కోర్టుకు వెళ్లడం లేదా మామూలు కోర్టుకు వెళ్లడం భరించలేని భారం అవుతుంది. కనుక డిపార్ట్‌మెంట్‌లోనే న్యాయంగా పరిహారం చెల్లించాలి.

పోస్ట్ చేసే వారు విలువైన వస్తువులను పంపేటప్పుడు వాటిని విధిగా బీమా చేయాలనే అంశానికి బాగా ప్రచారం ఇవ్వాలి. తరువాత ఆ బీమా సొమ్ము బాధితుడికి ఇవ్వడానికి తపాలా అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ కార్యాలయాలకన్న ఘోరంగా పోస్టాఫీసులు తయారవుతున్నందునే పౌరులు విధిలేక ఆర్టీఐ ఆసరా తీసుకుంటున్నారు. సమాచార హక్కు చట్టంలో సెక్షన్ 19 అనేక పరిష్కారాలను కల్పిస్తున్నది. అందులో ఒకటి నష్టపరిహార నియమం. సమాచారం సకాలంలో ఇవ్వకపోవడం వల్ల, పూర్తిగా ఇవ్వనందున, ఇచ్చినా ఆ సమాచారం తప్పుల తడక కావడం వల్ల కలిగిన నష్టాలకు అందుకు పౌరుడి పైన పడిన భారాన్ని కూడా ఆర్టీఐ భంగపరిచిన అధికార సంస్థ చెల్లించాలని 19(8) (బి) నిర్దేశిస్తున్నది. అయితే ఈ నష్టమే కాకుండా, ఇతర నష్టాలను, లోపాలను కూడా భర్తీ చేయాలని ఆ నియమంలో ఉంది. ఈ కేసులో పౌరుడి బంధువు పరీక్షకు హాజరుకాలేకపోవడం వల్ల నష్టపోయాడు. ఈ పరిహారాన్ని లెక్కించడం చాలా కష్టం. నామమాత్రంగా నష్టపరిహారం ఇవ్వవలసి ఉంటుంది. దరఖాస్తుదారుడు కూడా సరిగ్గా తన నష్టాన్ని అంచనా వేయవలసి ఉంటుంది. అది కూడా జరగడం లేదు. (CIC/POSTS/A/2017/167339 రాకేశ్ గుప్తా వర్సెస్ పోస్టాఫీస్ కేసులో సీఐసీ 9 జనవరి 2018 న ఇచ్చిన ఆదేశం ఆధారంగా).

వ్యాసకర్త కేంద్ర సమాచార కమిషనర్
professorsridhar@gmail.com

పోలవరమా.. ఎన్నికల 'వర'మా?

పోలవరం ప్రాజెక్టుపై టీడీపీకి ఇప్పుడు ప్రేమ పుట్టుకురావడానికి తెరవెనుక, ముందు చాలా కారణాలు ఉండి ఉండవచ్చు. కానీ, ఎన్నికల కోసం, ఓట్ల కోసం దీన్ని నిర్మించాలనుకుంటే చారిత్రక తప్పిదమే అవుతుంది.

సందర్భం



పురిఘళ్ల రఘురాం

పోలవరం ప్రాజెక్టును అడ్డుకోవాలని ఒడిశా శాసనసభ నిర్ణయించుకుంది. ప్రాజెక్టు పనుల్ని ఆపడమే ధ్యేయంగా.. అఖిలపక్ష ఎమ్మెల్యేలతో ఒక అసెంబ్లీ కమిటీ ఏర్పాటైంది. మరింత ఒత్తిడి పెంచేందుకు ఆ రాష్ట్ర ఎంపీలు పార్లమెంటు జరుగుతుండగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి వినతిపత్రం సమర్పించారు. అప్పుడు ఆయన నిర్ద్వంద్వంగా వారికి ఒక్కటే మాట చెప్పారు. 'పోలవరం ప్రాజెక్టును ఆపేది లేదు' అని. నిధుల విడుదలను అయినా ఆపేయాలని వారు కోరగా.. ఆ విజ్ఞప్తిని కూడా తోసిపుచ్చారు. ఇది జరిగింది ఇప్పుడు కాదు. రెండేళ్ల కిందట. ప్రధానమంత్రి మోదీ పోలవరం విషయంలో ఎంత చిత్తశుద్ధితో ఉన్నారో చెప్పటానికి ఇదొక ఉదాహరణ.

పోలవరం ప్రాజెక్టు కాంట్రాక్టరు పనుల్ని ఆలస్యం చేస్తున్నారని, సరిగ్గా చేయటం లేదని పలు ఆరోపణలు వచ్చాయి. అయినా కాంట్రాక్టరుని మార్చటానికి తొలుత రాష్ట్ర ప్రభుత్వం ఇష్టపడలేదు. తర్వాత కొన్నాళ్లకు మార్చాలని భావించింది. అయితే, ఆ కాంట్రాక్టరు కేంద్రానికి ఫిర్యాదు చేశారు. అయినా సరే కాంట్రాక్టరును మార్చాల్సిందేనని రాష్ట్ర ప్రభుత్వం పట్టుబట్టింది. కానీ, చట్టబద్ధంగా ఎంపికైన కాంట్రాక్టరును మార్చాలంటే నష్టపరిహారం చెల్లించాల్సి వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం అందుకు కూడా సిద్ధపడింది. కానీ, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఒక్క పైసా కూడా పరిహారం చెల్లించకుండా, పోలవరం పనులు ఆగకుండా, ఎలాంటి వివాదం లేకుండా ఈ సమస్యను పరిష్కరించారు. పోలవరం నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వ నిబద్ధతకు ఇదొక ఉదాహరణ.

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో చాలా మోసాలు జరుగుతున్నాయి. పోలవరం ప్రాజెక్టు విషయంలో కూడా ఇలాంటి తతంగమే జరుగుతోంది. 'పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసే ఎన్నికలకు వెళతాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. పోలవరం ప్రాజెక్టును ఇప్పటివరకూ 23 సార్లు స్వయంగానూ, 51 సార్లు వర్చ్యువల్‌గానూ పర్యవేక్షించానని ఆయన చెప్పుకొచ్చారు. పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాక రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ. 7,915 కోట్లు ఖర్చు పెట్టామని కూడా వివరించారు. ఇవన్నీ కూడా సత్యాలే. కానీ, నాణేనికి ఒకవైపున సత్యాలను మాత్రమే ఆయన పదే పదే వల్లె వేస్తున్నారు.

పోలవరం జాతీయ ప్రాజెక్టు. దాన్ని పూర్తి చేసే బాధ్యత తామే తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరి.. బాధ్యతలు తీసుకుంది. అలా తీసుకున్న తర్వాత దాన్ని పూర్తి చేసేందుకు సమీక్షలు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకుంది కనుక 'అవసరాలకు అనుగుణంగా' కొంత డబ్బు ఖర్చు



చేస్తోంది. అందులో తప్పు లేదు. కానీ, పోలవరం ప్రాజెక్టు పూర్తి కాకపోవటానికీ, ఆలస్యంగా పనులు జరగటానికీ కారణం ఎవరు?

పోనీ గతంగతః అనుకుందాం. 2014లో అధికారంలోకి వచ్చాక కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రానికి పోలవరమే జీవనాడి అని గుర్తించారు కాబట్టి దూకుడు పెంచారనుకుందాం. మరి అప్పట్లోనే కాంట్రాక్టరు నిర్లక్ష్యంపై పలు ఆరోపణలున్నా ఎందుకు మార్చలేదు? తర్వాత మార్చాలని ఎందుకు అంతగా పట్టుపట్టారు? రాష్ట్ర ప్రయోజనాలు, పోలవరం నిర్మాణాన్ని కూడా ఇబ్బందుల్లో పడేసేలాగా ఎందుకు వివాదం తలెత్తింది? దీనికి ఎవరు బాధ్యులు?

పోలవరం ప్రాజెక్టు నిర్మాణ వ్యయం గతంతో పోల్చితే పెరిగింది. అయితే, అది ఎంతమేరకు పెరిగిందో స్పష్టంగా లెక్కలు వేసి పంపించటంలో రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు అంత నిర్లక్ష్యం వహించింది? లేదా ఎందుకు 28 నెలల జాప్యం చేసింది? 2017 ఆగస్టులో రాష్ట్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనాలను సీడబ్ల్యూసీకి అందజేసింది. అయితే, వాటిలో తలెత్తిన సందేహాలు ఇప్పటివరకూ నివృత్తి కాలేదు. దీనికెవరు బాధ్యత వహించాలి?

'పోలవరం ప్రాజెక్టును మేమే పూర్తి చేస్తాం... మాకే బాధ్యతలివ్వండి' అని అడిగి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం... ఇప్పటివరకూ పోలవరం పునరావాసంపై దృష్టి పెట్టలేదు. లక్షలాదిమందిని పోలవరం ముంపు ప్రాంతం నుంచి తరలించాల్సి ఉంది. దానిపై నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళికల్లేవు. కానీ, పోలవరాన్ని మాత్రం 2019లోపు పూర్తి చేయాలి, అది పూర్తి చేశాకే ఎన్నికలకు వెళ్లాలన్న సంకల్పం మాత్రం ఉంది. అయితే, ఇది ఎవరి ప్రయోజనాల కోసం? దశాబ్దాల కల పోలవరం. మరికొన్ని శతాబ్దాలపాటు రాష్ట్ర ప్రజలు, భవిష్యత్ తరాలకు ఉపయోగపడాల్సిన ప్రాజెక్టు ఇది. అలాంటిదాన్ని ఎన్నికలతో ముడిపెట్టడం ఎంతవరకు సమంజసం?

పోలవరం ప్రాజెక్టుపై టీడీపీకి ఇప్పుడు ప్రేమ పుట్టుకురావడానికి చాలా కారణాలు ఉండి ఉండవచ్చు. కానీ, ప్రజల ప్రయోజనాలు, భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పనిచేయాలన్నదే బీజేపీ ఉద్దేశం. ఆ మేరకు తు.చ. తప్పకుండా పోలవరం ప్రాజెక్టును నిర్మించి తీరుతుంది. అంతే తప్ప ఎన్నికల కోసం, ఓట్ల కోసం దీన్ని నిర్మించాలని అనుకుంటే అది చారిత్రక తప్పిదమే అవుతుంది.

వ్యాసకర్త బీజేపీ సమన్వయకర్త, ఢిల్లీ
ఈ–మెయిల్ : raghuram.delhi@gmail.com



అవినీతిలో భారత్ @ 81

ముందు కంటే రెండు ర్యాంకులు దిగువకు • ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ నివేదిక

న్యూఢిల్లీ:

భారత్‌లో అవినీతి తీవ్రస్థాయిలో ఉందని తాజాగా ఓ నివేదిక వెల్లడించింది. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ అనే సంస్థ ప్రభుత్వ విభాగాల్లో అవినీతి, పత్రికా స్వేచ్ఛ ఆధారంగా మొత్తం 180 దేశాలకు ర్యాంకులు కేటాయించింది. ఇందుకోసం ఆయా దేశాల్లో గతేడాది జరిగిన సంఘటనలను పరిగణనలోనికి తీసుకున్న సంస్థ.. 'ప్రపంచ అవినీతి సూచీ-2017' పేరుతో ఓ నివేదికను విడుదల చేసింది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో అవినీతి, పత్రికా స్వేచ్ఛకు సంబంధించి అత్యంత తీవ్రమైన నేరాలు జరుగుతున్న దేశాల్లో భారత్ కూడా ఒకటని ఈ నివేదిక పేర్కొంది. 2016 అవినీతి సూచీలో 79వ ర్యాంకు పొందిన భారత్ తాజాగా మరో రెండు స్థానాలు దిగజారి 81వ స్థానంలో నిలవడం గమనార్హం. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో అవినీతి అత్యంత ఎక్కువగా, పత్రికా స్వేచ్ఛ అత్యంత తక్కువగా ఉన్న దేశాలు ఫిలిప్పీన్స్, ఇండియా, మాల్దీవులని నివేదిక వెల్లడించింది. జర్నలిస్టుల, సామాజిక కార్యకర్తల హత్యలను ఇందుకు కారణంగా చూపింది.

భారత్‌కు 40 మార్కులు..

అవినీతి, పత్రికా స్వేచ్ఛను ఆధారంగా చేసుకుని ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ ప్రతి దేశానికీ 0 నుంచి 100 మధ్య మార్కులు కేటాయించింది. అత్యంత తక్కువ అవినీతి కలిగిన దేశాలుగా న్యూజిలాండ్ (89 మార్కులు-మొదటి ర్యాంకు), డెన్మార్క్ (88 మార్కులు-రెండో ర్యాంకు)లు నిలిచాయి. భారత్‌కు వందకు 40 మార్కులు వచ్చాయి. సోమాలియా, దక్షిణ సూడాన్, సిరియాలు వరుసగా 9, 12, 14 మార్కులతో చివరి మూడు స్థానాలకు పరిమితమయ్యాయి.

పొరుగు దేశాల్లో భూటాన్ నంబర్ 1..

మన పొరుగు దేశాల్లో భూటాన్ 67 మార్కులతో ఏకంగా 26వ ర్యాంకును దక్కించుకోవడం గమనార్హం. భారత్ కన్నా చైనా ఒక్క మార్కు ఎక్కువ సాధించి 77వ స్థానంలో నిలిచింది. శ్రీలంక (91వ ర్యాంకు), పాకిస్తాన్ (117వ ర్యాంకు), మయన్మార్ (130వ ర్యాంకు) బంగ్లాదేశ్ (143వ ర్యాంకు)లు భారత్ కన్నా దిగువ స్థానాల్లోనే ఉన్నాయి. బ్రిక్స్ దేశాల వరకు చూస్తే దక్షిణాఫ్రికాకు అన్నింటికన్నా మెరుగైన ర్యాంకు (71) లభించగా, రష్యా అట్టడుగున (135వ ర్యాంకు) ఉంది. బ్రెజిల్‌కు 96వ ర్యాంకు దక్కింది.

వారానికో జర్నలిస్టు హత్య..

గత ఆరేళ్లుగా చూస్తే ప్రపంచవ్యాప్తంగా హత్యకు గురైన ప్రతి 10 మంది జర్నలిస్టుల్లో.. జాబితాలో 45 లేదా అంత కన్నా తక్కువ మార్కులు పొందిన దేశాలకు చెందిన వారే 9 మంది ఉన్నారని నివేదిక పేర్కొంది. అవినీతి ఎక్కువగా ఉన్న దేశాల్లో వారానికి కనీసం ఒక జర్నలిస్ట్ హత్యకు గురవుతున్నారంది. అవినీతిపై వార్తలు రాయడం వల్లనే ప్రతి ఐదుగురు జర్నలిస్టుల్లో ఒకరు చనిపోతున్నారని వెల్లడించింది. వీటిలోని చాలా కేసుల్లో దోషులకు సరైన శిక్ష కూడా పడటం లేదంది. పాత్రికేయులు, సామాజిక కార్యకర్తలు స్వేచ్ఛగా పనిచేసే వాతావరణం ఉండాలనీ, వారికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ ఎండీ పాట్రీసియా మొరీరా పేర్కొన్నారు.

మార్చి1 నుంచి ఎలక్టోరల్ బాండ్స్

న్యూఢిల్లీ: రాజకీయ పార్టీల నిధుల్లో పారదర్శకత కోసం కేంద్రం తెచ్చిన 'ఎలక్టోరల్ బాండ్ పథకం' మార్చి 1 నుంచి అమల్లోకి రానున్నట్లు ఆర్థిక శాఖ వెల్లడించింది. బాండ్లు కొనుగోలు చేసేవారు కచ్చితంగా భారతీయపౌరులై లేదా భారత వ్యాపార సంస్థలైనా అయి ఉండాలి. తొలి దశలో ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నైల్లోని ఎస్‌బీఐ ప్రధాన కేంద్రాల ద్వారా వీటిని జారీ చేస్తారు. '2018 తొలి త్రైమాసికానికి సంబంధించి మార్చి నెలలో ఈ పథకం తొలి ఇష్యూ ప్రారంభం కానుంది. మార్చి 1 నుంచి 10 వరకు ఎలక్టోరల్ బాండ్ల తొలి విడత అమ్మకం జరుగుతుంది. ఈ బాండ్లను అర్హతగల రాజకీయ పార్టీలు అధీకృత బ్యాంకు అకౌంట్ల ద్వారా ఎన్‌క్యాష్ చేసుకోవాలి. వ్యక్తిగతంగా కానీ, సంయుక్తంగా గానీ, ఇతరులతో కలిసైనా ఈ బాండ్లను కొనుగోలు చేయవచ్చు' అని ఆర్థిక శాఖ తెలిపింది. ఈ బాండ్ జారీచేసిన 15రోజుల వరకు చెల్లుబాటు అవుతుంది. ఆ సమయం దాటిన తర్వాత ఈ బాండ్ ద్వారా ఎట్టిపరిస్థితుల్లోనూ రాజకీయ పార్టీల ఖాతాలోకీ ఈ డబ్బులు జమకావు. గత లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఒక శాతం కన్నా ఎక్కువ ఓట్లు పొందిన గుర్తింపుపొందిన రాజకీయపార్టీలన్నీ ఈ బాండ్లను పొందవచ్చు.

పిల్లల నీలిచిత్రాల ముఠా గుట్టు రట్టు



న్యూఢిల్లీ: పిల్లల నీలిచిత్రాలకు (చైల్డ్ పోర్నోగ్రఫీ) సంబంధించిన అంతర్జాతీయ రాకెట్‌ను సీబీఐ గురువారం భగ్నం చేసింది. వాట్సాప్‌లో ఓ గ్రూప్‌లో పిల్లల నీలిచిత్రాలు షేర్ అవుతుండటాన్ని గుర్తించిన సీబీఐ మూడు నెలలపాటు శ్రమించి ఈ ముఠా పనిపట్టింది. ఆ గ్రూప్‌కు ఉత్తరప్రదేశ్‌కు చెందిన నిరుద్యోగ యువకుడు నిఖిల్ వర్మ అడ్మిన్‌గా ఉండటంతో అతణ్ని సీబీఐ అరెస్టు చేసింది. ఈ గ్రూప్‌లో అమెరికా, చైనా, న్యూజిలాండ్, మెక్సికో, అఫ్గానిస్తాన్, పాకిస్తాన్, నైజీరియా తదితర దేశాలకు చెందిన వారు సభ్యులుగా ఉన్నారు. వీడియోలు అప్‌లోడ్ చేస్తున్న ఐపీ అడ్రస్‌లను గుర్తించిన సీబీఐ.. ఢిల్లీ, ముంబై, నోయిడా, కన్నౌజ్‌లలోని ఐదు ప్రదేశాల్లో గురువారం దాడులు చేసింది. పిల్లల నీలిచిత్రాలను చూడటం, రికార్డు చేయడం, ఇంటర్నెట్‌లో అప్‌లోడ్ చేయడం నేరం. ఏడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా విధించొచ్చు.

సివిల్ సర్వీసెస్ అధికారులకు అవార్డులు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకమైన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లిన అధికారులకు ఏప్రిల్ 21న సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా ప్రధాని మోదీ అవార్డులు అందించనున్నారు. వివిధ శాఖల అధికారుల నుంచి మొత్తం 623 జిల్లాల నుంచి 2010 దరఖాస్తులు వచ్చినట్లు కేంద్ర సిబ్బంది శిక్షణ వ్యవహారాల శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ ఏడాది ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, డిజిటల్ చెల్లింపులు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్, రూరల్), దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ్ కౌశల్య యోజన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లిన అధికారులకు అవార్డులు ఇవ్వనున్నారు. కేంద్ర ప్రభుత్వంలో సేవలందిస్తున్న అడిషనల్ సెక్రటరీ /జాయింట్ సెక్రటరీ, డైరెక్టర్/ డిప్యూటీ సెక్రటరీ హోదాలో ఉన్న అధికారులకు ఈ అవార్డులు అందిస్తారు. కేంద్ర, రాష్ట్ర, జిల్లా స్థాయిలో వాతావరణ పరిరక్షణకు, విపత్తుల నిర్వహణ, జలవనరుల సంరక్షణ, విద్యుత్, విద్య, ఆరోగ్యం, మహిళలు, శిశువుల సంక్షేమానికి కృషి చేసిన వారికి కూడా అవార్డులు అందజేస్తారు.

బ్రిటన్‌లో భారతీయుడిపై జాత్యహంకార దాడి

లండన్: రన్వీత్‌పాల్ సింగ్ అనే పర్యావరణ కార్యకర్తపై బ్రిటన్‌లో జాత్యహంకార దాడి జరిగింది. బ్రిటన్ పార్లమెంటు ఎదుట 'ముస్లిం వెనక్కి వెళ్లు' అని అరుచుకుంటూ వచ్చిన ఓ శ్వేత జాతీయుడు సింగ్ తలపాగాను లాగేందుకు ప్రయత్నించాడు. సింగ్ గట్టిగా ప్రతిఘటించడంతో దుండగుడు పారిపోయాడు. ఎకోసిక్ సంస్థకు దక్షిణాసియా ప్రాజెక్టు మేనేజర్‌గా ఉన్న రన్వీత్‌పాల్ సింగ్.. మార్చి 14న నిర్వహించనున్న ప్రపంచ సిక్కు పర్యావరణ దినోత్సవంపై బ్రిటిష్ సిక్కు ఎంపీ తన్ దేశీతో చర్చించేందుకు వెళ్లారు. పోర్ట్‌కల్లిస్ హౌస్ వద్ద సెక్యూరిటీ క్యూలో ఉండగా ఈ దాడి జరిగింది. ఘటన సీసీటీవీ కెమెరాల్లో రికార్డయిందని, దాడి చేసిన వ్యక్తిని పట్టుకుంటామని పోలీసులు చెప్పినట్లు ఆయన వివరించారు.

టీచర్లకు తుపాకులు, శిక్షణ ఇవ్వాలి: ట్రంప్



వాషింగ్టన్: అమెరికా పాఠశాలల్లో తుపాకీ కాల్పుల ఘటనలను అరికట్టేందుకు కొంతమంది ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణనిచ్చి వారికి తుపాకులు కూడా అందజేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించారు. ఈ సమస్యకు ప్రభుత్వం దీర్ఘకాలిక పరిష్కారాన్ని కనుగొంటుందని హామీనిచ్చారు. ఇటీవల ఫ్లోరిడాలోని మేజరీ స్టోన్‌మన్ డగ్లస్ హైస్కూల్లో ఓ బహిష్కృత విద్యార్థి జరిపిన కాల్పుల్లో 17 మంది మరణించడం తెలిసిందే. ఆ పాఠశాల విద్యార్థులు, చనిపోయిన వారి తల్లిదండ్రులతో కూడిన బృందం ట్రంప్‌ను కలిసింది. ఉపాధ్యాయులందరికీ తుపాకులు ఇవ్వాలని తానెప్పుడూ అనలేదనీ, కొంతమంది టీచర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారికి మాత్రమే తుపాకులు ఇవ్వాలని అన్నానని ట్రంప్ వారికి వివరించారు.

'మోదీ కేర్'కు నిలేకనీ సాయం

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేయనున్న జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకానికి(ఎన్‌హెచ్‌పీఎస్) అవసరమయ్యే సాంకేతిక వనరుల(ఐటీ) కల్పనలో సాయానికి ఇన్ఫోసిస్ చైర్మన్ నందన్ నిలేకనీ అంగీకరించారని నీతి ఆయోగ్ తెలిపింది. మోదీ కేర్‌గా పిలుస్తున్న ఈ పథకంలో దేశవ్యాప్తంగా మొత్తం 10 కోట్ల కుటుంబాలకు ఆరోగ్య బీమాను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్న సంగతి తెలిసిందే. ఆధార్ తరహాలోనే ఎన్‌హెచ్‌పీఎస్ పథకానికి కూడా భారీ స్థాయిలో ఐటీ సేవలు అవసరమని, ఆ నేపథ్యంలో ఆధార్ జారీ వ్యవస్థ యూఐడీఏఐ మాజీ చైర్మన్ నిలేకనీని సంప్రదించామని నీతి ఆయోగ్ అధికారి ఒకరు తెలిపారు.

బాంబు దాడులు.. నెత్తుటి గాయాలు



సిరియాలో తిరుగుబాటుదారుల అధీనంలోని గౌటా భూభాగంలో ప్రభుత్వ దళాలు జరిపిన వైమానిక దాడుల్లో గాయపడి రోదిస్తున్న చిన్నారి. కొద్ది రోజులుగా ఉధృతంగా సాగుతున్న ఈ దాడుల్లో ఇప్పటికే 200 మందికి పైగా మృతిచెందినట్లు లండన్ కేంద్రంగా పని చేస్తున్న మానవ హక్కుల సంస్థ ఒకటి ప్రకటించింది.

'రొటొమ్యాక్' కొఠారి అరెస్టు

సీబీఐ అదుపులో విక్రమ్, అతని కుమారుడు

- హైదరాబాద్‌లో రూ. 1200 కోట్ల గీతాంజలి గ్రూపు ఆస్తుల అటాచ్
- పీఎన్‌బీ కేసులో ఈడీ సోదాలు.. రూ.100 కోట్ల ఆస్తుల స్వాధీనం...
- బకాయిల చెల్లింపునకు ప్రణాళికతో రండి: నీరవ్‌కు పీఎన్‌బీ లేఖ



విక్రమ్ కొఠారి



నీరవ్ మోదీ

ముంబై/న్యూఢిల్లీ

రూ. 3,695 కోట్ల రొటొమ్యాక్ కుంభకోణం కేసులో అరెస్టుల పర్వం మొదలైంది. గత నాలుగు రోజులుగా రొటొమ్యాక్ యజమాని విక్రమ్ కొఠారి, అతని కుమారుడు రాహుల్‌ను విచారించిన సీబీఐ గురువారం వారిని అదుపులోకి తీసుకుంది. సీబీఐ ప్రధాన కార్యాలయానికి హాజరైన వారిద్దరూ విచారణకు సహకరించకపోవడంతో అరెస్టు చేశామని సీబీఐ ప్రతినిధి వెల్లడించారు. విక్రమ్, రాహుల్‌లు డైరెక్టర్లుగా ఉన్న 'రొటొమ్యాక్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్' 2008 నుంచి ఏడు జాతీయ బ్యాంకుల నుంచి రూ. 2,919 కోట్ల రుణాలు తీసుకుని దారి మళ్లించినట్లు ఎఫ్ఐఆర్‌లో సీబీఐ ఆరోపించిన సంగతి తెలిసిందే. అసలు, వడ్డీ కలిపి బ్యాంకులకు రొటొమ్యాక్ కంపెనీ రూ. 3,695 కోట్లకు పైగా చెల్లించాలని తేల్చింది.

హైదరాబాద్ సెజ్‌లో..

పంజాబ్ నేషనల్ బ్యాంకును రూ. 11,400 కోట్లకు నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీలు మోసగించిన కేసులో.. పన్ను ఎగవేత ఆరోపణలపై హైదరాబాద్ సెజ్‌లో గీతాంజలి గ్రూపునకు చెందిన రూ.1200 కోట్ల ఆస్తిని ఆదాయపు పన్ను శాఖ గురువారం అటాచ్ చేసింది. ఇప్పటికే గీతాంజలి గ్రూపు, దాని ప్రమోటర్ మెహుల్ చోక్సీకి చెందిన 9 బ్యాంకు ఖాతాల్ని, ఏడు ఆస్తుల్ని ఐటీ శాఖ నిలుపుదల చేసిన సంగతి తెలిసిందే. దేశవ్యాప్తంగా పలు నగరాల్లో గురువారం ఎనిమిదో రోజూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడులు కొనసాగిస్తూ.. చోక్సీ, అతని గ్రూపునకు చెందిన రూ. 86.72 కోట్లు, మోదీ గ్రూపునకు చెందిన రూ. 7.8 కోట్ల మ్యూచువల్ ఫండ్‌లు, షేర్లు స్వాధీనం చేసుకుంది. రూ.కోట్ల రూపాయల విలువైన కార్లను కూడా స్వాధీనం చేసుకున్నామని.. సీజ్ చేసిన ఆస్తుల మొత్తం విలువ రూ. 100 కోట్లకు పైనే ఉంటుందని ఈడీ తెలిపింది.



ఈడీ జప్తు చేసిన నీరవ్ మోదీ లగ్జరీ కార్లు

ఈ కేసులో ఇంతవరకూ రూ. 5,826 కోట్ల ఆస్తుల్ని స్వాధీనం చేసుకుంది. సీజ్ చేసిన కార్లలో రోల్స్‌రాయిస్ 'ఘోస్ట్', మెర్సిడెస్ బెంజ్, పోర్షే పనమెరా, మూడు హోండా కంపెనీ కార్లు, ఒక టయోటా ఫార్చ్యూనర్, ఇన్నోవా ఉన్నాయి. ఇప్పటికే ఈ కేసులో నీరవ్ కుచెందిన 15 విలాసవంతమైన కార్లను స్వాధీనం చేసుకున్నారు. నీరవ్ గురువారం తన ముందు హాజరుకాకపోవడంతో .. ఈడీ తాజాగా మరోసారి సమన్లు జారీచేసింది. ఫిబ్రవరి 26లోపు హాజరుకావాలని ఆదేశించింది. అయితే తన పాస్‌పోర్టును తాత్కాలికంగా రద్దు చేయడం వల్లే హాజరుకాలేదని ఈడీకి నీరవ్ చెప్పినట్లు సమాచారం.

ఆచరణసాధ్య ఆలోచనతో రండి!

బకాయిల చెల్లింపునకు స్పష్టమైన, ఆచరణ సాధ్యమైన ప్రణాళికతో ముందుకు రావాలని పీఎన్‌బీ కుంభకోణం సూత్రధారి నీరవ్ మోదీని పంజాబ్ నేషనల్ బ్యాంకు లేఖలో కోరింది. పీఎన్‌బీ అత్యుత్సాహం వల్లే బకాయిలు చెల్లించే సామర్థ్యం తగ్గిపోయిందని మోదీ రాసిన లేఖకు సమాధానమిస్తూ.. 'కొందరు బ్యాంకు అధికారులు అక్రమంగా జారీ చేసిన ఎల్‌వోయూల్ని తప్పుడు మార్గాల్లో మీరు పొందారు. ఏ దశలోను అలాంటి సదుపాయాల్ని మీ కంపెనీలకు మా బ్యాంకు కల్పించలేదు' అని లేఖలో పీఎన్‌బీ జనరల్ మేనేజర్ (అంతర్జాతీయ బ్యాంకింగ్ విభాగం) అశ్వినీ వత్స్ పేర్కొన్నారు. 'మొత్తం అప్పును తీర్చేందుకు మీరు చూపిన నిబద్ధత, చొరవలో ఎక్కడా కూడా ముందస్తు చెల్లింపుల ప్రస్తావన, నిర్దేశిత సమయం పేర్కొనలేదు. ఏదేమైనా బకాయిల్ని తీర్చేందుకు మీ వద్ద సరైన ప్రణాళిక ఉంటే.. ఇప్పటికైనా సమాధానమివ్వండి' అని లేఖలో పీఎన్‌బీ పేర్కొంది. సంస్థ వాటాలు, ఆస్తులు అమ్మి రుణం చెల్లిస్తానని చెప్పినా.. అత్యుత్సాహంతో ఆస్తుల్ని సీజ్ చేసి తన బ్రాండ్ పేరును నాశనం చేశారంటూ ఫిబ్రవరి 13, 15 తేదీల్లో పీఎన్‌బీకి నీరవ్ లేఖ రాశారు. ఈ పరిస్థితుల్లో బకాయిలు చెల్లించడం కష్టమేనని అందులో పేర్కొన్న సంగతి తెలిసిందే.

ఖలిస్తాన్ ఉగ్రవాదికి ఆహ్వానం

ఢిల్లీలో కెనడా హైకమిషన్ నిర్వాకం

- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం: ట్రూడో
- వీసా జారీపై విచారణ జరుపుతున్నాం: భారత్



ముంబైలో జరిగిన కార్యక్రమంలో ట్రూడోతో జస్పాల్ అత్వాల్ (వృత్తంలోని వ్యక్తి)

న్యూఢిల్లీ: ఖలిస్తాన్ వేర్పాటువాదులకు మద్దతు ఇవ్వబోమని హామీ ఇచ్చి ఒక్కరోజు గడవకముందే కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తీవ్ర వివాదంలో చిక్కుకున్నారు. దేశరాజధానిలో గురువారం ట్రూడో గౌరవార్థం కెనడా హైకమిషనర్ నాదిర్ పటేల్ నిర్వహించనున్న విందుకు ఆ దేశ అధికారులు సాక్షాత్తూ ఓ ఉగ్రవాదికి ఆహ్వానం పంపారు. ప్రధాని మోదీని ట్రూడో కలుసుకోవడానికి కేవలం ఒక్కరోజు ముందే ఈ ఘటన జరిగింది. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన ట్రూడో.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 1986లో కెనడా పర్యటనకు వెళ్లిన పంజాబ్ మంత్రి మల్కియాత్ సింగ్ సిద్ధూపై వాంకోవర్‌లో హత్యాయత్నం చేసిన ఇంటర్నేషనల్ సిక్ యూత్ ఫెడరేషన్ సభ్యుడు జస్పాల్ అత్వాల్‌కు కెనడా అధికారులు గురువారం విందుకు ఆహ్వానం పంపారు. మంత్రిపై దాడి చేసినందుకు అప్పట్లో జస్పాల్‌కు కోర్టు 20 ఏళ్ల జైలుశిక్ష విధించింది. ట్రూడో గౌరవార్థం అంతకు ముందు ముంబైలో నిర్వహించిన కార్యక్రమానికి కూడా హాజరైన జస్పాల్, ఏకంగా కెనడా ప్రధాని భార్య సోఫీ, మంత్రి అమర్జిత్ సోహీలతో ఫొటోలు కూడా దిగాడు. ఈ ఫొటోల్లో ఉన్న జస్పాల్‌ను కెనడియన్ మీడియా గుర్తించడంతో ఆ దేశ అధికారుల వ్యవహారశైలిపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో స్పందించిన కెనడా హైకమిషన్.. జస్పాల్‌కు పంపిన ఆహ్వానాన్ని రద్దుచేసింది. తన సిఫార్సుతోనే కెనడా హైకమిషన్ సిబ్బంది జస్పాల్‌ను విందుకు ఆహ్వానించారని కెనడా ఎంపీ రణ్‌దీప్ సురాయ్ అంగీకరించారు. జస్పాల్ భారత్‌కు వచ్చేందుకు వీసా ఎలా లభించిందన్న దానిపై దర్యాప్తు జరుపుతున్నట్లు విదేశాంగ శాఖ చెప్పింది.

సీజేఐ వద్దకు భూ పంచాయితీ

సిఫార్సు చేసిన సుప్రీం ద్విసభ్య ధర్మాసనం

న్యూఢిల్లీ: భూసేకరణకు సంబంధించిన కేసుల విచారణకు తగిన ధర్మాసనం ఏర్పాటు చేయాలని కోరుతూ కేసును ప్రధాన న్యాయమూర్తికి సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం సిఫార్సు చేసింది. ఈ కేసులో ఫిబ్రవరి 8న వెలువరించిన తీర్పుపై బుధవారం ముగ్గురు సభ్యుల ధర్మాసనం స్టే విధించడంతో వివాదం నేపథ్యంలో ఈ అంశాన్ని సీజేఐ జస్టిస్ దీపక్ మిశ్రాకు రిఫర్ చేస్తూ న్యాయమూర్తులు జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ అమితవ రాయ్‌తో కూడిన ధర్మాసనం నిర్ణయం తీసుకుంది. ఈ అంశాన్ని సీజేఐకి సిఫార్సు చేయడమే సరైన నిర్ణయమని, బుధవారం నాటి ఉత్తర్వుల నేపథ్యంలో ఈ అంశంపై విచారణను కొనసాగించాలా? లేదా? అనే విషయాన్ని ఆయనే తేలుస్తారని ధర్మాసనం స్పష్టం చేసింది. నిర్దేశిత ఐదేళ్ల కాలంలో పరిహారం చెల్లించనట్లయితే దాని పేరు చెప్పి భూ సేకరణను రద్దు చేయడం చెల్లదని ఫిబ్రవరి 8న జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం తీర్పు వెలువరించింది. పుణే మున్సిపల్ కార్పొరేషన్ కేసులో 2014లో మరో త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును రద్దు చేసింది. అయితే దీనిపై జస్టిస్ మదన్ బి లోకూర్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం బుధవారం స్పందిస్తూ.. న్యాయ వ్యవస్థ అన్ని అంశాలపై ఒకేలా వ్యవహరించాలని పేర్కొంది. ఈనెల 8న వెలువరించిన తీర్పును పరిశీలించినట్లైతే.. న్యాయ వ్యవస్థ క్రమశిక్షణలో వ్యత్యాసం కనిపిస్తోందని, అభిప్రాయభేదాలు ఉన్నందున ఈ అంశాన్ని విస్తృత ధర్మాసనానికి అప్పగించాలని, అలాగే హైకోర్టులు ఈ అంశంపై దాఖలైన కేసులను విచారించొద్దని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులపై జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం గురువారం స్పందిస్తూ.. అందరి అభిప్రాయాలు తీసుకున్న తర్వాతే తీర్పు వెలువరించామని, తీర్పు పూర్తిగా చదవకుండానే దాడికి దిగుతారని, ముందు తీర్పు కాపీని చదివి ఆ తర్వాత మాట్లాడాలని స్పష్టం చేసింది. ఈ అంశాన్ని ఎవరు విచారించాలనేది సీజేఐ నిర్ణయిస్తారని పేర్కొంది.



రజనీ-కమల్ రహస్య భేటీ

పార్టీ పెట్టకముందే కలిశానన్న కమల్ హాసన్

చెన్నై: రాజకీయ అరంగేట్రానికి ముందు తాను సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో రహస్యంగా సమావేశమైనట్లు మక్కల్ నీది మయ్యం పార్టీ అధినేత కమల్ హాసన్ తెలిపారు. ఈ భేటీలో తన రాజకీయ ప్రవేశంపై రజనీతో చర్చించినట్లు పేర్కొన్నారు. తమిళ వారపత్రిక 'ఆనంద వికటన్'కు రాసిన వ్యాసంలో కమల్ ఈ వివరాలను వెల్లడించారు. అయితే ఈ భేటీ ఎప్పుడు జరిగిందన్న దానిపై ఆయన స్పష్టత ఇవ్వలేదు. చెన్నై సమీపంలో పూనామాల్లిలోని ఓ స్టూడియోలో బిగ్‌బాస్ షూటింగ్ జరుగుతుండగా, అక్కడికి సమీపంలోనే రజనీ 'కాలా' చిత్రం షూటింగ్ కూడా జరుగుతుండేదన్నారు. మనం రహస్యంగా కలుసుకోవచ్చా? అని రజనీకి తాను ప్రతిపాదించినట్లు కమల్ తెలిపారు. దీంతో తామిద్దరం ఓ కారులో రహస్యంగా సమావేశమయ్యామని వెల్లడించారు. ఈ సందర్భంగా రాజకీయ అరంగేట్రంపై తన నిర్ణయాలను రజనీకి వివరించినట్లు పేర్కొన్నారు. తొలుత రాజకీయ ప్రవేశంపై తన అభిప్రాయాన్ని విన్న రజనీ ఆశ్చర్యపోయారన్నారు. దీని కోసం కొన్నేళ్ల క్రితమే మానసికంగా సిద్ధమైపోయాననీ, ప్రస్తుతం ఆచరణలో పెడుతున్నానని రజనీకి సమాధానమిచ్చినట్లు కమల్ వ్యాసంలో తెలిపారు. భవిష్యత్‌లో ఇద్దరి రాజకీయ సిద్ధాంతాలు, మార్గాలు వేరైనా పరస్పరం గౌరవించుకోవాలని ఈ భేటీలో నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అలాగే, ప్రస్తుతం దేశంలో జరుగుతున్న కాషాయీకరణ రాజకీయాలను వ్యతిరేకిస్తున్నట్లు ఆ వ్యాసంలో కమల్ మరోసారి స్పష్టం చేశారు. 'కాషాయాన్ని కమల్ కించపరుస్తున్నాడని కొందరంటున్నారు. అది ఎంత మాత్రం నిజం కాదు. త్యాగానికి ప్రతీకైన కాషాయానికి అత్యంత గౌరవముంది. అంతకంటే ముఖ్యంగా జాతీయ జెండాలోనూ కాషాయానికి చోటుంది' అని కమల్ చెప్పారు.

మాకూ ఒక చాన్సివ్వండి!

మేఘాలయ ప్రజలను కోరిన ప్రధాని మోదీ

- కాంగ్రెస్ చేతుల్లో రాష్ట్రం భద్రంగా లేదు
- యాక్ట్ ఈస్ట్ పాలసీ ద్వారా చిత్తశుద్ధితో 'ఈశాన్య' అభివృద్ధి



ఫుల్బరీ/కోహిమా: మేఘాలయకు సుపరిపాలన అందించేందుకు బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని ప్రధాని మోదీ కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేతుల్లో మేఘాలయ భద్రంగా ఉండబోదని విమర్శించారు. తమకు అవకాశం ఇస్తే ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తామని.. ప్రతి రూపాయి సద్వినియోగమయ్యేలా పనిచేస్తామని అందుకు తనదే భరోసా అని ప్రధాని పేర్కొన్నారు. రాష్ట్రంలో రాజకీయ వ్యతిరేకత లేకపోవటాన్ని అలుసుగా తీసుకుని అవినీతికి పాల్పడుతోందన్నారు. మేఘాలయ, నాగాలాండ్ రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో మోదీ పాల్గొన్నారు. 'మేఘాలయలో అధికార ముకుల్ సంగ్మా ప్రభుత్వం కుంభకోణాల్లో కూరుకుపోయింది. గర్భిణులు ఇంట్లోనే ప్రసవించే దారుణ పరిస్థితిని కల్పిస్తున్నారు. ఇది తల్లీబిడ్డలకు ప్రమాదకరం. చాలా అంశాల్లో రాష్ట్రం అభద్రతతో తల్లడిల్లుతోంది' అని మోదీ విమర్శించారు. యాక్ట్ ఈస్ట్ పాలసీ ద్వారా ఈశాన్య భారతాన్ని.. ఆగ్నేయాసియాతో అనుసంధానిస్తామని నాగాలాండ్ ప్రచారంలో పునరుద్ఘాటించారు. తద్వారా ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు.

నిధుల దుర్వినియోగం

మేఘాలయలో 1100 కిలోమీటర్ల రహదారుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం 470 కోట్లు విడుదల చేస్తే.. అందులో కనీసం 50 శాతం నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం వినియోగించలేదన్నారు. కేంద్రం ఇచ్చిన చాలా పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. షిల్లాంగ్‌లో కొత్త ఎయిర్ పోర్టు నిర్మాణానికి రూ.180 కోట్లు ఖర్చుచేయనున్నట్లు ఆయన తెలిపారు. దీని ద్వారా రాష్ట్రంలో వ్యాపారాభివృద్ధి, ఉపాధికల్పన పెరుగుతుందన్నారు. ఇరాక్, సిరియాల్లో చిక్కుకున్న కేరళ నర్సులను కేంద్ర ప్రభుత్వం క్షేమంగా స్వదేశానికి తీసుకొచ్చిందన్న విషయాన్ని గుర్తుచేస్తూ.. క్రిస్టియన్ ఓటర్లను ఆకర్షించేందుకు ప్రయత్నించారు.

సుస్థిర ప్రభుత్వం అవసరం

'రవాణా ద్వారా ఈశాన్యరాష్ట్రాల్లో పరివర్తన తీసుకొచ్చే దిశగా, ఈ ప్రాంతం వేగవంతమైన అభివృద్ధి కోసం పనిచేస్తున్నాం' అని నాగాలాండ్ ప్రచారంలో మోదీ పేర్కొన్నారు. 'నవభారత నిర్మాణ స్వప్నం సాకారం.. నవ నాగాలాండ్ కోరుకుంటున్న ప్రజల ఆకాంక్షలతో పాటుగానే జరుగుతుంది. ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి జరగనంతవరకు దేశాభివృద్ధి స్వప్నం లక్ష్యాన్ని చేరదు. అందుకే ఈ ప్రాంతంపై బీజేపీ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. సుస్థిర, బలమైన రాష్ట్ర ప్రభుత్వం నాగాలాండ్‌కు చాలా అవసరం' అని మోదీ పేర్కొన్నారు. రాష్ట్రంలోని 60 అసెంబ్లీ స్థానాలకు ఫిబ్రవరి 27న జరగనున్న ఎన్నికల్లో బీజేపీ తరపున 20 మంది, మిత్రపక్షం ఎన్‌డీపీపీ తరపున 40 మంది బరిలో ఉన్నారు.

ప్రజాసంకల్ప యాత్ర


కనిగిరి నియోజకవర్గం హాజీస్‌పురం వద్ద అశేష ప్రజానీకానికి అభివాదం చేస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

మా కష్టాన్ని టీడీపీ నేతలు దోచుకున్నారన్నా..

ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ఎదుట వాపోయిన జాలర్లు




రామాపురంలో దివ్యాంగులతో ఆప్యాయంగా మాట్లాడుతున్న జననేత వైఎస్ జగన్

ప్రజా సంకల్ప యాత్ర నుంచి
సాక్షి ప్రత్యేక ప్రతినిధి

తాము కష్టపడి చెరువులో పెంచిన చేపలను అధికారం అండ చూసుకుని టీడీపీ నాయకులు దౌర్జన్యంగా పట్టుకెళ్లారని ప్రకాశం జిల్లా పీసీ పల్లి, కనిగిరి మండలాలకు చెందిన జాలర్లు ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో గోడు వెళ్లబోసుకున్నారు. గ్రామాల్లో అధికార పార్టీ నేతల దౌర్జన్యం శ్రుతి మించిపోయిందని, అది తమ కడుపుకొట్టే దాకా వెళ్లిందని ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం 95వ రోజు వైఎస్ జగన్ ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గంలోని పీసీ పల్లి, కనిగిరి మండలాల్లో ప్రజా సంకల్ప యాత్ర కొనసాగించారు. ఈ సందర్భంగా పామూరు మండలం మోపాడు, పామూరు, నుచ్చుపాద గ్రామాలకు చెందిన యానాది కుటుంబాల్లోని మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాదయాత్ర సాగుతున్న ప్రాంతానికి వచ్చి జగన్‌ను కలిశారు. నుచ్చుపాద జాలర్ల సహకార సంఘం పరిధిలోని ఎనిమిది చెరువుల్లో సభ్యులు పెంచుకున్న కోట్లాది రూపాయల విలువైన చేపలను స్థానిక అధికార పార్టీ ఎమ్మెల్యే అనుచరులు పట్టుకొని అమ్ముకున్నారని వాపోయారు. జాలర్ల సంఘంలో సభ్యులుగా ఉన్న తమ ఇళ్ల వద్ద భారీ సంఖ్యలో పోలీసులను మోహరించి.. 300 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మోపాడు (రిజర్వాయర్) చెరువులో గత ఆగస్టులో రూ.కోటిన్నర విలువైన చేపలను పట్టుకుపోయారని వివరించారు. తమ సంఘం పరిధిలో ఉండే మరో ఏడు చెరువుల్లో ఇప్పుడు నాలుగు కోట్ల రూపాయల విలువ చేసే చేపలు ఉన్నాయని, టీడీపీ నేతలు వాటిని కొట్టేసే ప్రయత్నాల్లో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ నేతల దౌర్జన్యం, అక్రమాలపై బహిరంగ విచారణ జరిపించాలని వారు కోరారు. బాధితుల గోడు సావధానంగా విన్న జగన్.. జాలర్ల కుటుంబాలకు తమ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

జీవాలకు బీమా కరువు..

పీసీ పల్లి మండలం రామాపురం వద్ద గొర్రెల కాపరులు జగన్‌ను కలిసి తమ సమస్యలు చెప్పుకున్నారు. గతంలో గొర్రెల కాపరులకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసేదని.. ఈ ప్రభుత్వంలో గొర్రెలకు బీమా సౌకర్యాన్ని అమలు చేయడం లేదని వారు జగన్‌కు వివరించారు. దీంతో గొర్రె చనిపోతే బీమా లేకుండా పోయిందని, గొర్రెల పెంపకంపైనే ఆధారపడిన తాము తీవ్రంగా నష్టపోతున్నామని తెలిపారు. జీవాలు వ్యాధుల బారిన పడితే వైద్యం కూడా సరిగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మేదరలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సామాజిక వర్గం ప్రతినిధులు ప్రతిపక్ష నేతను కోరగా, దళిత క్రిస్టియన్ ప్రతినిధులు తమను ఎస్సీలుగా గుర్తించాలని విన్నవించారు. రేగుల వెంకట సుబ్బులు అనే మహిళ తన కూతురు లౌఖ్యశ్రీకి జగన్ చేతుల మీదుగా అక్షరాలు దిద్దించి అక్షరాభ్యాసం చేయించింది. దారిపొడవునా వివిధ వర్గాల వారు జననేతకు సమస్యలు చెప్పుకున్నారు. అందరి కష్టాలు ఓపికగా విన్న జగన్.. మనందరి ప్రభుత్వం రాగానే అన్ని వర్గాల వారినీ ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగు నింపుతామన్నారు. అన్ని వర్గాల వారిని మోసం చేసిన చంద్రబాబుకు బుద్ధి చెప్పాలని కోరారు.


గుదేవారిపాలెం క్రాస్‌లో అవ్వతో ఆప్యాయంగా మాట్లాడుతున్న ప్రతిపక్షనేత జగన్


హాజీస్‌పురం సమీపంలో పాదయాత్ర సాగిస్తున్న ప్రతిపక్షనేత వైఎస్ జగన్

95వ రోజు
22-02-2018, గురువారం
హాజీస్‌పురం, ప్రకాశం జిల్లా

ప్రజా సంకల్పం పాదయాత్ర డైరీ



బాబుగారి మార్కు రుణమాఫీ అంటే ఇదేనా?!

ఈ రోజు నుచ్చుపాద జాలర్ల సహకార సంఘం సభ్యులు కలిశారు. తమ జీవనోపాధికొచ్చిన కష్టాల గురించి చెప్పుకున్నారు. 'సార్.. మేము ఎస్టీ తెగకు చెందిన యానాదోళ్లం. మా సహకార సంఘం తరఫున మోపాడు రిజర్వాయర్, చుట్టుపక్కల చెరువుల్లో చేపలు పట్టుకుని జీవించేవాళ్లం. ఈ ప్రభుత్వం వచ్చాక ఆ పార్టీ నేతల ఆగడాలు ఎక్కువైపోయాయి. నిబంధనలకు విరుద్ధంగా మా సంఘం అధ్యక్షుడిని, సభ్యులను తొలగించారు. స్కిల్ టెస్ట్ కూడా నిర్వహించకుండా ఇష్టారాజ్యంగా.. అర్హతలు లేనివారిని సభ్యులుగా చేర్చుకుని, కోట్లాది రూపాయల మత్స్య సంపదను కొల్లగొడుతున్నారు. మమ్మల్ని రానీయకుండా బయట జిల్లా నుంచి కూలీలను తెచ్చి, పోలీసు బందోబస్తు మధ్య చేపలు పడుతున్నారు. నిబంధనల ప్రకారం మాకు రావాల్సిన ఆదాయంలో ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదు. ఈ అక్రమాలను, అన్యాయాలను ప్రశ్నించినందుకు మా మీద అక్రమ కేసులు బనాయిస్తున్నారు. పోలీసులతో వేధింపులు, దౌర్జన్యాలు చేయిస్తున్నారు. దీనిపై కోర్టుకెళ్లినా.. కోర్టు ఆదేశాలను సైతం బేఖాతర్ చేస్తున్నారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు, ఎస్టీలు అని కూడా చూడకుండా వారి కడుపు కొడుతున్న ఈ అధికార పార్టీ నాయకుల దురాగతాలు ఇంకెన్నాళ్లు?

గుదేవారిపాలెం కొత్తూరులో చెంచయ్య అనే అన్న నన్ను తన గొర్రెల మంద దగ్గరకు తీసుకెళ్లాడు. 'సార్.. వర్షాలు పడక, నీళ్లులేక వ్యవసాయం భారమైంది. అది చేయలేక గొర్రెలుకొని వ్యాపారం చేసుకుందామంటే.. అదీ బరువైపోతోంది. ఈ జీవాలకు నీళ్లు లేవు, మేత కూడా దొరకడం లేదు. ప్రభుత్వం అందించే మందులూ లేవు.. బీమా కూడా లేదు. ఎలా బతకాలో అర్థంకావడం లేదు' అని ఆ అన్న చెబుతుంటే చాలా బాధనిపించింది. ఈ ప్రభుత్వం పంటల బీమానే కాదు.. సన్న జీవాల బీమాను కూడా నిర్లక్ష్యం చేస్తోంది. వ్యవసాయం లేక, పాడీ లేక, సన్న జీవాలనూ పెంచుకోలేక.. రైతన్నలు ఎలా బతకాలి?

అగ్రహారానికి చెందిన కేశవస్వామి అనే రైతన్నది మాఫీ కాని రుణ బాధ. 2012లో పాసు పుస్తకాలు పెట్టి రూ.60 వేలు అప్పుగా తీసుకున్నాడట. ఈ రైతన్న రుణ మాఫీకి అర్హుడంటూ బ్యాంకు వాళ్లు ధ్రువీకరణ పత్రం ఇచ్చినా.. ఒక్కపైసా కూడా మాఫీ కాలేదట. ఏమైందో కనుక్కోడానికి తిరగని చోటంటూ లేదని, విసుగొచ్చేసిందని చెప్పాడు. చివరికి, ఓసారి ముఖ్యమంత్రిగారు దర్శికి వచ్చినప్పుడు ఆయనను కలిసి తన సమస్య చెప్పుకుంటే.. ఆయన భుజం మీద చెయ్యేసి 'అయిపోతుంది తమ్ముడూ..' అన్నాడట. 'ఏమైందో.. ఏమైపోతుందో.. ఏమీ అర్థం కాలేదు. నాకు మాత్రం రుణమాఫీ కింద ఒక్కపైసా కూడా రాలేదు' అని ఆ రైతన్న బాధగా చెప్పుకున్నాడు.

ఎస్‌ఎన్ కండ్రికకు చెందిన వద్దినేని శ్రీహరిరావుదీ అదే వ్యథ. ఆ అన్న 2011లో బ్యాంకులో బంగారం పెట్టి రూ.88 వేల రుణం తీసుకున్నాడట. 2013లో బంగారం పెట్టి మరో రుణం కింద ఇంకో రూ.88 వేలు తీసుకున్నాడట. ఆయనకూ ఒక్క పైసా కూడా మాఫీ కాలేదట. ఈ ప్రభుత్వానికి ఎన్ని మార్గాల ద్వారా విన్నవించాలో.. అన్ని మార్గాల్లోనూ విన్నవించాడట. ఆఖరికి ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలోనూ అర్జీ పెట్టాడట. దానికి కనీసం సమాధానం కూడా లేదని విచారం వ్యక్తం చేశాడు. మొత్తానికి బాబుగారి రుణమాఫీ దెబ్బకు వ్యవసాయమే మానేశాడట. 'బ్యాంకులో బంగారం వేలం వేస్తారని భయపడ్డాను సార్.. పరువుపోతుందని వేరేవాళ్ల దగ్గర అప్పుచేసి, బర్రెల మీద లోను తీసుకుని బ్యాంకు అప్పు కట్టేశాను. బయట అప్పుల పాలయ్యాను. ఆ ప్రయివేటు అప్పును తీర్చడం కోసం బ్యాంకు నుంచి తీసుకున్న బంగారాన్ని వాళ్లకే ఇచ్చేశాను' అని ఆ అన్న చెబుతుంటే.. ముఖ్యమంత్రి దృష్టికి పోయినవాటికే దిక్కులేకపోతే ఇక ఇలాంటి బాధితులు ఎవరిని ఆశ్రయించాలో.. ఎవరిని నిలదీయాలో కదా!

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. అధికారంలోకి వచ్చిన వెంటనే వ్యవసాయ రుణాలన్నింటినీ బేషరతుగా, పూర్తిగా మాఫీ చేస్తానన్నారు. మీరు ప్రభుత్వ పగ్గాలు చేపట్టేప్పటికి రాష్ట్రంలోని మొత్తం వ్యవసాయ రుణాలు రూ.87,612 కోట్లు. చాలామందికి అసలేమీ చేయలేదు. కొందరికి చేసిన అరకొర మాఫీ.. వడ్డీలకు కూడా సరిపోకపోవడం నిజం కాదా? ఇదేనా బాబుగారి మార్కు రుణమాఫీ అంటే? మీ మాటలు నమ్మి రైతన్నలు అప్పుల ఊబిలో కూరుకుపోయి వ్యవసాయం చేయలేని పరిస్థితికి రావడం దారుణం కాదా?

వైఎస్. జగన్.

ప్రజా సంకల్ప యాత్ర — మరిన్ని చిత్రాలు టాబ్లాయిడ్‌లో


గుదేవారిపాలెం క్రాస్‌లో అవ్వలతో ఆప్యాయంగా మాట్లాడుతున్న ప్రతిపక్ష నేత జగన్




దివ్యాంగురాలి సమస్య వింటున్న జగన్

ప్రజాసంకల్ప యాత్ర 95వ రోజు

ఇప్పటి వరకూ నడిచిన దూరం
1,282.3 కిలోమీటర్లు

95వ రోజు నడిచిన దూరం
6.4 కిలోమీటర్లు

ప్రారంభం: ఉ.8 గంటలకు పెద్ద అలవలపాడు
ముగింపు: హాజీస్‌పురం
ముఖ్యాంశాలు:
- పెద్ద అలవలపాడు, రామాపురం, గుదేవారిపాలెం క్రాస్, హాజీస్‌పురంలో జనంతో మమేకం
- సమస్యలు చెప్పుకున్న జాలర్లు

హోదా ఒత్తిడిలో 'ఎల్లో' ఎత్తుగడ

▶ మొదటి పేజీ తరువాయి

ఇబ్బందుల్లో ఉన్నపుడు ప్రతిపక్షనేతపై ఉన్నవీ లేనివి కల్పించి దుష్ప్రచారం చేయడం, ఎల్లో మీడియాలో అభూత కల్పనలు, అసత్య కథనాలు ప్రచారం చేయడం అధికారపక్షానికి షరామామూలుగా మారింది. హోదాతో పాటు అనేక అంశాలలో ప్రజావ్యతిరేకత పెరుగుతున్ననేపథ్యంలోనే ఇపుడు మారిషస్ కంపెనీ కథనాన్ని ప్రచారంలోకి తెచ్చారు.

జగన్‌కు ఏం సంబంధం?

ఇందూటెక్ కంపెనీకి – మారిషస్ కంపెనీకి మధ్య తలెత్తిన వివాదంలో భారత ప్రభుత్వానికి నోటీసులు రావడాన్ని జగన్‌కు ఆపాదిస్తూ విషపూరిత ప్రచారానికి దిగారు. మారిషస్‌కి చెందిన 'కరిస్సా ఇన్వెస్ట్‌మెంట్స్ ఎల్‌ఎల్‌సి' అనే కంపెనీ ఇందూటెక్‌లో పెట్టుబడులు పెట్టింది. ఇందూకు కేటాయించిన భూమిని సీబీఐ కేసు సందర్భంగా ఈడీ అటాచ్ చేసిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఆ కేటాయింపును రద్దు చేసింది. ఆ ప్రాజెక్టు ముందుకు సాగకపోవడంతో తనకు నష్టం వచ్చిందంటూ మారిషస్ కంపెనీ అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఆ వ్యవహారంలో భారత ప్రభుత్వానికి నోటీసులు అందాయి. ఈ రెండు కంపెనీల వ్యవహారానికి జగన్‌మోహన్‌రెడ్డికి ఏం సంబంధం? మారిషస్ కంపెనీకి, ఇందూటెక్ కంపెనీకి మధ్య కుదిరిన ఒప్పందంలో జగన్ ఎక్కడున్నారు? ఇందూటెక్‌లో మారిషస్ కంపెనీ పెట్టుబడులకు జగన్ బాధ్యత వహించాలా..? ఆ రెండు కంపెనీలలో దేనిలోనూ జగన్ భాగస్వామి కానపుడు ఆ రెండు కంపెనీల మధ్య సమస్య తలెత్తితే జగన్ ఏం చేయాలి? సంబంధమే లేని రెండు కంపెనీల వివాదాన్ని జగన్ కు ఆపాదించడమంటే మోకాలికి, బోడిగుండుకు ముడిపెట్టడం కాదూ.. జగన్‌పై మోపిన అక్రమ కేసుల్లో ఇందూ టెక్ ఉంది కాబట్టి.. ఆ ఇందూటెక్‌పై ఏదో కేసు వచ్చింది కాబట్టి దానికి కాస్త మసాలా జోడించి జగన్ అకౌంట్‌లో వేసేందుకు ఎల్లో మీడియా పన్నాగం పన్నింది. కాంగ్రెస్ నుంచి బైటకు వచ్చిన తర్వాత కాంగ్రెస్, టీడీపీ కలసి రాజకీయ దురుద్దేశంతో, కక్షసాధింపుతో జగన్‌పై పెట్టిన కేసులు న్యాయస్థానంలో విచారణలో ఉన్నాయి. అవి కక్షసాధింపుతో పెట్టిన కేసులన్న విషయం ఇప్పటికే రుజువవుతూ ఉంది. ఒక్కొక్క ఆరోపణ నిరాధారమైనదని తేలిపోతూ ఉంది. వైఎస్ హయాంలో ఇందూటెక్‌కు నగరానికి దూరంగా రంగారెడ్డి జిల్లాలో మారుమూల.. అదీ బహిరంగ వేలంలో భూమి కేటాయించారు. అక్కడ ఇంకా అనేక కంపెనీలకూ భూములు కేటాయించారు. అందులో ఇందూటెక్ భూముల కేటాయింపు మాత్రమే రద్దు చేశారు. చంద్రబాబు తన హయాంలో రహేజా కంపెనీకి నగరం నడిబొడ్డున 250 ఎకరాలు కేటాయించారు. దానిమీద ఎవరైనా కేసు పెట్టి సీబీఐ విచారణ జరిగి ఆ భూములు కూడా ప్రభుత్వం వెనక్కు తీసుకుంటే వాళ్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించరా? ఇలా నోటీసులు రావా? పదేళ్ల నాటి పాత చింతకాయపచ్చడి కేసు సరే.. నాలుగేళ్లుగా చంద్రబాబు అన్ని రంగాలనూ అవినీతిమయం చేసినా, అనేక వ్యవహారాలలో సాక్ష్యాలతో సహా దొరికిపోతున్నా ఎల్లో మీడియా ఎందుకు పట్టించుకోవడం లేదు?

సాక్ష్యాలు కనిపిస్తున్నా పట్టదు...

ప్రతిపక్షనేతపై ఉన్నవీలేనివీ కల్పించి కథనాలు ప్రచురించే, ప్రసారం చేసే ఎల్లో చానళ్లు, పత్రికలు చంద్రబాబు సాక్ష్యాలతో సహా అడ్డంగా దొరికిపోయినా ఆయనపై ఈగవాలనివ్వవు. జగన్‌పై అభూత కల్పనలు ప్రచారం చేయడం కోసం ఆంగ్ల పత్రికలలో తమకు అనుకూల రిపోర్టర్లతో కథనాలు రాయించి వాటి ఆధారంగా రెచ్చిపోయే చానళ్లు, పత్రికలు బాబు సాక్ష్యాలతో దొరికిపోయినా చూసీచూడనట్లుంటాయి. బాబు జమానాలో అనేక రంగాలు అవినీతి మయంగా మారాయని కాగ్ కడిగేసినా, అవినీతిలో ఆంధ్రప్రదేశ్ నెంబర్‌వన్‌గా ఉందని ఎన్‌సీఏఈఆర్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలు నివేదికలిచ్చినా వీరికి కనిపించవు. ఇసుక నుంచి ఇరిగేషన్ దాకా, మట్టి నుంచి మద్యం దాకా అన్ని రంగాలలో ఆకాశమెత్తున అవినీతి సాగుతోంది. ఇన్‌సైడర్ ట్రేడింగ్‌తో రాజధాని భూములను కొల్లగొట్టారు. చివరకు గుడిభూములనూ, గుడిలో లింగాన్నీ కైంకర్యం చేస్తున్నారు. అలా సంపాదించిన అవినీతి సొమ్ముతోనే చంద్రబాబు పొరుగు రాష్ట్రంలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తూ అడ్డంగా దొరికిపోయినా ఎల్లో మీడియా పట్టించుకోదు. ఆడియో వీడియో టేపుల్లో దొరికిపోయి వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నా చూసీ చూడనట్లుంటాయి. నంద్యాలలో ఓటుకు ఆరువేల నుంచి ఎనిమిదివేల రూపాయలు పంచినా వీటికి పెద్దగా పట్టింపులేదు. అధికారంలోకి రాకముందు చంద్రబాబు కుటుంబ సంస్థ హెరిటేజ్‌రిటెయిల్ షేరు ధర రూ. 200 ఉండేది. బాబు అధికారంలోకి రాగానే అది మూడు రెట్లు పెరిగి రూ. 900కు చేరుకుంది. పెద్దనోట్ల రద్దు నిర్ణయాన్ని ముందుగానే పసిగట్టిన చంద్రబాబు నాయుడు సరిగ్గా రెండు రోజులకు ముందు హెరిటేజ్ వాటాలను కార్పొరేట్ దిగ్గజ సంస్థ 'ఫ్యూచర్ రిటెయిల్'కు విక్రయించేశారు. ఈ డీల్‌లో భాగంగా ఫ్యూచర్ రిటెయిల్‌లో హెరిటేజ్ సంస్థకు 3.65 శాతం షేర్లు దక్కాయి. వాటి విలువ రూ.295 కోట్లకు పైమాటే. ఆ నాటి మేలుకు ప్రతిఫలంగానా అన్నట్లు ఆ తర్వాత 'చంద్రన్న విలేజ్‌మాల్స్' వ్యాపారంలో ఫ్యూచర్ రిటెయిల్ సంస్థకూ చంద్రబాబు భాగం కల్పించడం తెల్సిందే. ఫ్యూచర్ సంస్థకు మేలు కల్పించడమంటే అందులో వాటాలున్న హెరిటేజ్‌కూ మేలు చేసుకోవడమేనని వేరే చెప్పాలా?

ఆర్బిట్రేషన్ నోటీసులు సర్వసాధారణమే..

ఇందూటెక్ – మారిషస్ కంపెనీల వ్యవహారంలో మారిషస్ ప్రభుత్వం ఫిర్యాదుతో ఆర్బిట్రేషన్ కోసం భారత ప్రభుత్వానికి నెదర్లాండ్స్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానం నోటీసు ఇచ్చింది. ఆ నోటీసులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేరు ఏమీ ఉండదు. ప్రధానమంత్రి కార్యాలయానికి నోటీసు వస్తుంది. ఆర్బిట్రేషన్ కోసం అంతర్జాతీయ కంపెనీలు ఇక్కడి కంపెనీలపై భారత ప్రభుత్వానికి పంపించే నోటీసులన్నీ అలాగే వస్తాయి. వొడాఫోన్ వంటి పెద్ద పెద్ద కంపెనీలతో ఆర్బిట్రేషన్ సమస్య వచ్చినపుడు ఇలానే నోటీసులు అందాయి. రిలయన్స్ సంస్థ కేజీ బేసిన్ గ్యాస్ రేట్లకు సంబంధించిన కేసులో కూడా ఆర్బిట్రేషన్ నోటీసులు ప్రధానమంత్రికి అందాయి. ఇవన్నీ రొటీన్‌గా జరుగుతూనే ఉంటాయి. కానీ సంబంధమే లేని రెండు కంపెనీలకు చెందిన ఒక వ్యవహారంలో జగన్ కు ఆపాదిస్తూ జగన్ వల్లనే భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి నోటీసులు వచ్చాయన్నట్లు విషప్రచారానికి దిగజారారు. ఆర్బిట్రేషన్ నోటీసులు ఎప్పుడూ రానట్లు.. ఇప్పుడే భూమ్యాకాశాలు బద్దలైపోయినట్లు దుష్ప్రచారం చేయడం ఎల్లో సిండికేట్ కుట్రపూరిత వైఖరిని బట్టబయలు చేస్తోంది.

సుజనా వ్యవహారాన్ని పట్టించుకున్నారా..?

జగన్‌పై ఉన్నవీ లేనివీ కల్పించి ప్రచారం చేసే ఎల్లో మీడియా.. ఆధారాలతో సహా అడ్డంగా దొరికిపోతున్నా చంద్రబాబు, ఆయన బినామీల విషయంలో కనీవిని ఎరుగని రీతిలో స్వయం ప్రకటిత 'సంయమనం' పాటిస్తుంటుంది. కేంద్ర మంత్రిగా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న తెలుగుదేశం నాయకుడు సుజనాచౌదరి మారిషస్ బ్యాంకు నుంచి రూ. 100 కోట్లు రుణం తీసుకుని ఎగ్గొట్టేశారు. 'సుజనా యూనివర్సల్' పేరుతో సుజనా చౌదరి తీసుకున్న రుణం తిరిగి చెల్లించడం లేదంటూ మారిషస్ కమర్షియల్ బ్యాంకు (ఎంసీబీ) కేసులు పెట్టింది. న్యాయస్థానం నుంచి నోటీసులూ అందాయి. దాని గురించి ఎల్లో మీడియా ఒక్క వార్త రాయలేదు. ఒక్క కథనాన్ని ప్రసారం చేయలేదు. కేంద్ర మంత్రి హోదాలో ఉంటూ ఒక బ్యాంకును మోసం చేసిన వ్యక్తి కోర్టు నుంచి నోటీసులు అందుకున్నా చూసీ చూడనట్లు వదిలేశాయి. తెలుగుదేశం ప్రభుత్వం గానీ, పార్టీ గానీ దీనిపై ఎలాంటి చర్యా తీసుకోలేదు. కనీసం మాటమాత్రంగానైనా ఖండించనూ లేదు. 'సుజనా యూనివర్సల్' అనే కంపెనీని స్వయంగా స్థాపించి అది స్టాక్ మార్కెట్‌లో లిస్టయిన తర్వాత ఆ కంపెనీ పేరుతో అనేక అప్పులు చేసి చివరకు డైరెక్టర్‌గా కంపెనీ నుంచి వైదొలగి తనకేమీ సంబంధం లేదని సుజనాచౌదరి బుకాయించారు. బ్యాంకులకు బురిడీ కొట్టినా.. కోర్టు చివాట్లు పెట్టినా చివరకు సుజనా కంపెనీని సీజ్ చేసినా ఎల్లో మీడియాలో ఒక్క వార్త రాలేదు.

సీనియర్ న్యాయవాదిని స్పెషల్ పీపీగా నియమిస్తాం

వాకపల్లి గిరిజన మహిళల అత్యాచార కేసులో హైకోర్టు స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: విశాఖపట్నం జిల్లా, వాకపల్లికి చెందిన గిరిజన మహిళలపై అత్యాచారం జరిపారన్న ఆరోపణలతో గ్రేహౌండ్స్ పోలీసులపై నమోదైన కేసులో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ నియామకానికి సీనియర్ న్యాయవాదిని ఎంపిక చేయనున్నట్లు గురువారం ఉమ్మడి హైకోర్టు వెల్లడించింది. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ నుంచి ముగ్గురు, తెలంగాణ నుంచి ముగ్గురు క్రిమినల్ కేసుల్లో నిష్ణాతులైన, మంచి ట్రాక్ రికార్డు కలిగిన న్యాయవాదుల జాబితాను సిద్ధం చేసి సమర్పించాలని ఈ మేరకు రిజిస్ట్రార్ జనరల్ (ఆర్‌జీ)ని ఆదేశించింది. ఆ జాబితా నుంచి ఒకరిని బాధిత మహిళల అభీష్టం మేరకు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమిస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. అంతేగాక గిరిజన మహిళలు ఇప్పటికే ఎంపిక చేసుకున్న న్యాయవాది పల్లా త్రినాథరావు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు సహాయకారిగా కొనసాగవచ్చని తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి, జస్టిస్ జి.శ్యాంప్రసాద్‌లతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. 2007లో కూంబింగ్‌కు వచ్చిన గ్రేహౌండ్స్ పోలీసులు తమపై అత్యాచారానికి పాల్పడ్డారంటూ వాకపల్లి గిరిజన మహిళలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుపై విశాఖపట్నం 11వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు, ఎస్‌సీ ఎస్‌టీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం కోర్టు విచారణ జరుపుతోంది. బాధిత మహిళల వినతి మేరకు ఈ కేసులో వాదనలు వినిపించేందుకు హైకోర్టు సింగిల్ జడ్జి.. స్పెషల్ పీపీగా త్రినాథరావును నియమించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. దాన్ని సవాలు చేస్తూ హోం, న్యాయశాఖ ముఖ్య కార్యదర్శులు, విశాఖ జిల్లా కలెక్టర్ ఓ అప్పీల్, గ్రేహౌండ్స్ పోలీసులు మరో అప్పీల్ దాఖలు చేశారు. వీటిపై ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

నాలుగేళ్లలో ఒక్క సంక్షేమ పథకమూ అందలేదు

ఫ్లెక్సీ ఏర్పాటు చేసి నిరసన తెలిపిన చింతపల్లి గ్రామ ఎస్సీలు

చింతపల్లి (అచ్చంపేట): గత నాలుగేళ్లుగా ఒక్క సంక్షేమ పథకమూ మా దరి చేరలేదంటూ గుంటూరు జిల్లా అచ్చంపేట మండలం చింతపల్లి గ్రామ ఎస్సీలు ఫ్లెక్సీ ఏర్పాటు చేసి వినూత్నంగా నిరసన తెలిపారు. 2014–18 వరకు గ్రామంలో ఐదు విడతలుగా నిర్వహించిన జన్మభూమి కార్యక్రమాల్లో కొత్త రేషన్ కార్డుల మంజూరు కోసం అర్జీలు ఇచ్చామని, అయితే ఇప్పటివరకూ మంజూరు చేయలేదని పేర్కొన్నారు. దీంతో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు తమకు అందడం లేదని ఫ్లెక్సీలో వివరించారు. ఫ్లెక్సీ ఫొటో కాపీని ముఖ్యమంత్రి కార్యాలయానికి, జిల్లా కలెక్టర్‌కు పంపుతామని గురువారం ఎస్సీ కాలనీవాసులు తెలిపారు. దళిత వర్గానికి చెందిన తమకు రేషన్‌కార్డు చాలా ముఖ్యమని, తక్షణమే వాటిని మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.


చింతపల్లి ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ


ప్రతీకాత్మక చిత్రం

నిన్నటి జీవితం నేడు అనుకుని.. నేటి జీవితమే నేను అనుకుని కొత్తగా మొదలుపెడదామంటే నీడను గుచ్చుకున్న ముల్లుకంటే నేటిని గుచ్చుతున్న ముళ్లే ఎక్కువగా బాధిస్తోంది! 'వన్స్ బిటెన్.. ట్వైస్ షై' అంటారు. ఒకసారి జరిగిన నష్టం రెండోసారి జరక్కుండా చూసుకోవాలని! ఇది ముందే తెలిసుంటే ఎంత బాగుండేది!

రెండు ముళ్ల పెళ్లి

పెళ్లికి మూడు ముళ్లు అవసరం.
యవ్వనంలో..
వృద్ధాప్యంలో..
మరోజన్మలో కూడా
కలిసి ఉండటానికే ఈ ముడులు.
కానీ ఈ చెల్లికి మాత్రం
రెండుసార్లూ.. పెళ్లి ముల్లైంది.
విధి మొదటి ముల్లు.
అందం రెండో ముల్లు.
ఈ రెండు ముళ్ల పెళ్లి..
రెండో భర్త రూపంలో
ఆమెకు నరకం చూపించింది!
ఆమె అంతరంగమిది.

నాకు పాతికేళ్ల వయసులో పెళ్లైంది. ఏడాదికే ఆయన రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. యుక్త వయసులోనే నా జీవితం రోడ్డు పాలైంది. ఇది చూసి మా అమ్మా నాన్న తట్టుకోలేక మళ్లీ పెళ్లి సంబంధాలు చూశారు. అదే సమయంలో ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్న ఆయన.. మొదటి భార్యకు విడాకులు ఇవ్వడం, మా ఇంటికి పెళ్లి చూపులకు రావడం, నేను నచ్చడం, ఇద్దరికీ పునర్వివాహం.. చకచకా జరిగిపోయాయి.

పాత బాధలన్నీ మర్చిపోయి కొత్త జీవితం వైపు అడుగులు వేసేందుకు మెట్టినింట్లో కాలు పెట్టాను. పెళ్లైన పది రోజుల వరకూ జీవితం సాఫీగానే సాగింది. ఎప్పుడూ నా వెంటే ఉండే వారు. నేను ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో జాబ్ చేస్తుండటంతో ఆయనే స్వయంగా నన్ను బ్యాంక్‌కు డ్రాప్ చేసే వారు. సాయంత్రం అరగంట ముందుగానే వచ్చి బ్యాంకులో నా ఎదురుగా కూర్చొని.. నన్ను చూస్తూ ఉండేవారు. కొన్నిసార్లు ఆలస్యమైనా కోపగించుకునేవారు కాదు. ఇవన్నీ చూసి నా అంత అదృష్టవంతురాలు లేదని అనుకున్నాను. ఎంతో ప్రేమగా చూసుకునే భర్త దొరికాడని సంబరపడిపోయాను. కానీ.. ఆ ఆనందమంతా కేవలం గాలి బుడగలేనని తెలుసుకోడానికి ఎంతో సమయం పట్టలేదు. ఒకే ఒక్క సంఘటన నా జీవితంలో ఎన్నో మర్చిపోలేని కాళరాత్రుల్ని పరిచయం చేసింది.

ఇంతసేపు ఎక్కడికెళ్లావ్?!

ఒక రోజు సాయంత్రం బ్యాంకు పని త్వరగా అయిపోయింది. ఆయనకు ఫోన్ చేశాను. లైన్ బిజీ అని రావడంతో నేనే ఆటోలో వెళ్లిపోయాను. దారిలో మార్కెట్‌కి వెళ్లి ఇంటికి కావలసిన సరకులు కొన్ని తీసుకున్నాను. స్వీట్స్ తీసుకున్నాను. ఓ బట్టల షాప్‌లో చీర నచ్చింది. ఆఫర్‌లో తక్కువ ధరకు వచ్చిందని తీసుకున్నాను. రాత్రి 8 గంటలు గడిచింది. ఇంటికి వెళ్లేసరికి ఆయన సోఫాలో గంభీరంగా కూర్చొని ఉన్నారు. ఎక్కడికి వెళ్లావంటూ గద్దించారు. విషయమంతా చెప్పినా విసుక్కున్నారు. కాల్ చేశానని చెప్పినా కసురుకున్నారు. ''ఇన్ని రోజులూ నీ వెంట వస్తోంది నువ్వంటే ఇష్టమని కాదు. నా మొదటి పెళ్లాంలా వేరే సంబంధం పెట్టుకోవని. కానీ ఇంతలా కాపలా కాస్తున్నా తప్పించుకున్నావ్! చెప్పు.. నీకు చీర ఎవరు కొనిచ్చారు?'' అంటూ అనుమానపు పిశాచిలా నన్ను ఆ రాత్రంతా చిత్రహింసలకు గురిచేశాడు. ఉదయం లేచేసరికి మామూలుగానే ప్రవర్తించారు!

> **"ఇన్ని రోజులూ నీ వెంట వస్తోంది నువ్వంటే ఇష్టమని కాదు. చెప్పు.. నీకు చీర ఎవరు కొనిచ్చారు?" అంటూ అనుమానపు పిశాచిలా నన్ను ఆ రాత్రంతా చిత్రహింసలకు గురిచేశాడు.**

ఆ నవ్వు వెనుక విషం!

''నువ్వు కనిపించలేదనే ఎమోషన్‌లో నోటికొచ్చినట్లు మాట్లాడేశాను'' అంటూ బుజ్జగించారు. నువ్వు చాలా అందంగా ఉంటావ్. అందుకే నిన్ను కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నానంటూ నవ్వుకుంటూ చెప్పడంతో నేనూ హ్యాపీ ఫీలయ్యాను. కానీ.. ఆ నవ్వుల వెనుక విషం అలాగే ఉందని గమనించలేకపోయాను.

పాప పుట్టినా మారలేదు

నేను అందంగా ఉన్నానని ఆయన చెప్పడంతో ఆయన కోసం మరింత అందంగా కనిపించాలని భావించేదాన్ని. మొదటి రెండు రోజులు గమనించిన ఆయన మూడో రోజునుంచి టార్చర్ పెట్టడం మొదలు పెట్టారు. ఎవరి కోసం ఇలా రెడీ అవుతున్నావంటూ అప్పటి నుంచి మనోవేదనకు గురి చేస్తున్నారు. రెండేళ్ల వరకూ రోజూ నరకం చూశాను. గర్భవతిని అయినా విడిచిపెట్టలేదు. ఆడపిల్ల ప్రసవించింది. పోనీ పాప పుట్టిన తర్వాత అయినా మారతారని అనుకున్నాను. కానీ ఆయన ప్రవర్తనలో మార్పు రాలేదు. పైగా ఆడపిల్ల పుట్టిందంటూ నానా గొడవా చేశారు. ఆ పిల్లను చంపేస్తానంటూ బెదిరించారు.

చిత్రహింసలు ఎక్కువయ్యాయి

విషయం తెలిసిన మా అమ్మా నాన్న కేసు పెడదామంటూ నన్ను తీసుకొచ్చారు. కానీ నేను ఒప్పుకోలేదు. ఆయనలో మార్పు వస్తుందన్నాను. కానీ హింస మరింత ఎక్కువైంది. ఈ నేపథ్యంలో బ్యాంకులో ఉన్న నా సహచరురాలు మహిళా శక్తి గురించి చెప్పింది. ఆ బృందంతో మాట్లాడాను. వారు మా ఆయనను పిలిపించారు. విషయం తెలుసుకున్నారు. ''నా మొదటి భార్య ఇలాగే చేసి నన్ను మోసం చేసింది. ఆమె కంటే ఈమె అందంగా ఉంది. అలాంటప్పుడు ఈమె కూడా ఆమెలాగే తనని మోసం చేయకుండా ఉంటుందా అని అనుమానపడ్డాను'' అని చెప్పారు.

ఆ తర్వాత వాళ్లు మా ఇద్దరికీ వేర్వేరుగానూ, ఇద్దరినీ కలిపి కౌన్సిలింగ్ చేశారు. అయినా.. ఈ మూడేళ్ల పడిన కష్టాలు జీవితంలో మర్చిపోలేను.

– కనకదుర్గ (పేరుమార్చాం), గాజువాక

ఇంటర్వ్యూ:
కరుకోల గోపి కిశోర్ రాజా,
విశాఖ సిటీ



> **గృహహింస లోని తీవ్రస్థాయి ఏంటంటే.. ఆ గృహహింసను భరించే స్థితికి వచ్చేయడం!**
>
> **- జూలీ జాన్‌స్టన్, యువ క్రీడాకారిణి**

అవునా!

అయ్యో! పిల్లలకిక చాక్లెట్లు ఉండవా?




కకోవా : చాక్లెట్ చెట్టు

ప్రపంచవ్యాప్తంగా ఆబాల గోపాలం అందరూ ఇష్టంగా తినే చాక్లెట్లు కొన్నాళ్లకు ఇక కనిపించక పోవచ్చు. మరో మూడు దశాబ్దాల తర్వాత చాక్లెట్లు పూర్తిగా అంతరించిపోవచ్చని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చాక్లెట్ల తయారీకి కకావో వాడతారు. ప్రపంచంలోని కకావో మొక్కల్లో సగానికి పైగా మొక్కలు పశ్చిమాఫ్రికాలోని రెండు దేశాల్లోనే ఉన్నాయి. వీటి ద్వారానే చాక్లెట్ తయారీ కంపెనీలకు భారీ పరిమాణంలో ముడి సరుకు సరఫరా అవుతోంది. అయితే, పర్యావరణ మార్పులు ఇదే తీరులో కొనసాగితే, 2050 నాటికి సగటు ఉష్ణోగ్రతల్లో 2.1 డిగ్రీల సెల్సియస్ పెరుగుదల నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని, ఆ పరిస్థితుల్లో మనుగడ సాగించలేక కకావో మొక్కలు పూర్తిగా అంతరించే ప్రమాదం ఉందని యూఎస్ నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ నిపుణులు అంచనా వేస్తున్నారు. కకావో ఎక్కువగా పండే ఆఫ్రికా దేశాల్లో కకావో సాగు పద్ధతులు శతాబ్దాలుగా ఒకే తీరులో కొనసాగుతున్నాయని, సాగు పద్ధతులు ఆధునికతను సంతరించుకోకపోవడం వల్ల కూడా కకావో మొక్కలు ముప్పు అంచులకు చేరుకున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే, ప్రముఖ చాక్లెట్ తయారీ సంస్థ 'మార్స్' ఆర్థిక సహకారంతో బర్కిలీలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాకు చెందిన శాస్త్రవేత్తలు కకావో మొక్కలు అంతరించిపోకుండా కాపాడేందుకు పరిశోధనలు ప్రారంభించారు.

చెట్టు నీడ

ఇక చేయగలిగింది ఏమీ లేనప్పుడు

ఇది ఒక ఆధ్యాత్మిక గురువు చెప్పిన కథ. ఒక అడవిలో ఒక జింక. అది నిండు చూలాలు. ప్రసవించడానికి తగిన చోటు వెతుకుతోంది. ఇంతలో ఎక్కడో దూరంగా మంటలు కనబడ్డాయి. చూస్తుండగానే కార్చిచ్చు కమ్ముకుంటూ వస్తోంది. జింక ముందుకు నడవడానికి ప్రయత్నించింది. దూరంగా చెట్టుచాటున వేటగాడు పొంచివుండటం గమనించింది. దాని ఇంద్రియాలు ఆ సమయంలో గొప్పగా పనిచేస్తున్నాయి. వేటగాడు బాణాన్ని ఎక్కుపెట్టి సిద్ధంగా ఉన్నాడు. జింక వెనక్కి తిరిగింది. అదేం విచిత్రమో, ఒక సింహం దూరం నుంచి దానివైపే వస్తోంది. ఒకవైపు దావానలం, మరోవైపు వేటగాడు, ఇంకోవైపు సింహం. ముప్పేట దాడి. అదే సమయంలో దానికి నొప్పులు ప్రారంభమైనాయి. ఇక జింక కదలడం మానేసింది. తన భయాన్ని వదిలిపెట్టింది. ఆ సమయానికి అది చేయవలసివున్న అతి ముఖ్యమైన కార్యం మీద మనసు నిల్పింది. జింక ఆగిన అదును చూడగానే వేటగాడు బాణం వదలబోయాడు. అప్పుడే ఉన్నట్టుండి ఆకాశంలో మెరుపు మెరిసింది. దానితో వేటగాడి గురితప్పింది. ఆ పదునైన బాణం చక్కగా వెళ్లి సింహాన్ని గుచ్చుకుంది. అక్కడికక్కడే అది నేలకూలింది. ఇంతలో మొదలైన వర్షం మంటలను ఆర్పేసింది. ఆ అద్భుతమైన ఘడియల్లో మరో బుల్లిజింక ఆ అడవిలో కళ్లు తెరిచింది.

> **ఒకవైపు దావానలం, మరోవైపు వేటగాడు, ఇంకోవైపు సింహం. ముప్పేట దాడి. అదే సమయంలో దానికి నొప్పులు ప్రారంభమైనాయి.**

మనం చేయగలిగిందంతా చేసినప్పుడు, ఇక మనం చేయడానికి ఏమీ మిగలనప్పుడు సమస్త ప్రకృతి మనకు సహకరిస్తుంది.

రిపోర్ట్

ఈ మగాళ్లు ఎప్పుడు తెలుసుకుంటారో!



ఈ మాట అన్నది ఏ మహిళో కాదు. ఐక్యరాజ్యసమితి! జీతం కోసం మగాళ్లు బయటికి వెళ్లి చేసే పనికి మూడింతల పనిని మహిళలు జీతం లేకుండా ఇంట్లో చేస్తున్నారని సమితి తన తాజా నివేదికలో వెల్లడించింది. పిల్లల్ని కనడం, వాళ్లను పెంచడం, ఇంట్లో పెద్దవాళ్ల సంరక్షణను చూసుకోవడం, కుటుంబ సభ్యులకు సేవలు అందించడం, మంచి నీళ్లు తెచ్చుకోవడం, వండి పెట్టడం.. వీటన్నిటికీ మహిళలు వెచ్చించే శ్రమకు విలువను కడితే.. పురుషుల కన్నా స్త్రీలకు మూడింతలు ఎక్కువగా జీతం రావలసి ఉంటుందని సమితి మహిళా విభాగంలో వివరాల విశ్లేషణ విభాగానికి ప్రధాన అధికారిగా ఉన్న షారా రజావీ ఆ నివేదికలో ఉదహరించారు. 'ఆడవాళ్ల పనులు' అని ముద్ర వేసి.. బాధ్యతను తప్పించుకుంటున్న పురుషులు ఒక విషయం గమనించాలి. మహిళలు ఈ పనులన్నిటినీ చేయడం మానేస్తే ప్రపంచ ఆర్థిక వ్యవస్థే మూల పడుతుంది అని కూడా రజావీ అన్నారు. ''దీనికి పరిహారం ఒక్కటే. మహిళ శ్రమను తగ్గించడం. వాళ్ల పనులను అందిపుచ్చుకోవడం' అని ఆమె ఒక సూచన కూడా చేశారు.

బ్యూటిప్స్


స్నానంతో...



స్నానం శరీరాన్ని ఆరోగ్యంగా, చురుగ్గా, మనసుని ఉల్లాసంగా ఉంచుతుంది. మెదడుని ఉత్తేజపరుస్తుంది. అలసిన దేహం తిరిగి తాజాదనం పొందుతుంది.

- ఉదయం వేళ రెండు స్పూన్ల నిమ్మరసాన్ని బకెట్ నీటిలో కలిపి స్నానం చేస్తే వేసవిలో బాధించే చెమట వాసన రాదు.
- పొడిచర్మం వున్నవాళ్లు బకెట్ నీటిలో అర టీ స్పూన్ కొబ్బరినూనె లేదా బాదంనూనె కలిపి స్నానం చేస్తే చర్మం మృదువుగా అవుతుంది.
- రోజంతా తాజాగా అనిపించాలంటే నీటిలో అరకప్పు రోజ్‌వాటర్ కలుపుకొని స్నానం చేయాలి.
- రోజూ సాయంకాలం గోరువెచ్చని నీటిలో గుప్పెడు గులాబీ రేకుల్ని వేసి స్నానం చేస్తే బడలిక తీరుతుంది. చర్మానికి మంచి రంగు వస్తుంది.
- చిన్న అల్లం ముక్క వేసి ఉడకబెట్టిన నీటిని కలుపుకొని స్నానం చేస్తే కీళ్ళనొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది.
- స్నానం చేసిన తరువాత తడి ఒంటికి మాయిశ్చరైజర్‌ని రాసుకుంటే చర్మం మృదుత్వాన్ని కోల్పోదు.
- స్నానానికి ముందు శరీరానికి, ముఖానికి నూనెతో మర్దన చేయడం వల్ల కండరాలు ఉత్తేజితమవుతాయి. చర్మం మృదువుగా తయారవుతుంది.

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్..! నేను ఫేస్‌బుక్‌లో పరిచయమైన ఒక అమ్మాయిని ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమిస్తున్నా. తను నన్ను కలవడానికి ఒక రోజు వాళ్ల ఊరు రమ్మంది. వెళ్లాను. బట్ తను నన్ను దూరం నుంచి చూసి పారిపోయింది. ఆ తరువాత కాల్ చేస్తే లిఫ్ట్ చెయ్యలేదు. నాకు నువ్వు నచ్చలేదని ఓ మెసేజ్ మాత్రం చేసింది. ఎందుకని అడిగితే.. 'నీకు ఆఫ్ ముక్కే ఉంది, అందుకే నచ్చలేదు' అంది. కానీ అరముక్కుతో పుట్టడం నా తప్పా సార్? నాకు తను కావాలి, ప్లీజ్ హెల్ప్ మీ.

– కార్తీక్

నీ మెయిల్‌లో వచ్చిన నీ బొమ్మ చూశాను.
'ఎలా ఉంది సార్?'
ఇదిగో నువ్వే చూడు...
'చక్కగా చీదుకునే అంత బాగుంది కదా సార్ ముక్కు??'
అవును నీలూ ఇది ఫుల్ ముక్కు...
'అందంగా కూడా ఉంది సార్!'
అమ్మాయి ముక్కుతాడు వెయ్యడానికి బాగానే ఉంది కదూ!
'సార్ ఇలాంటి ముక్కు మొక్కవోని ప్రేమను సూచిస్తుంది సార్!'
పోనీ.. నిజంగానే ముక్కు సగమే ఉంటే.. ఏం చెయ్యాలి నీలూ??
'సార్.. అసలు ముక్కు అడ్డం సార్!'
దేనికి అడ్డం నీలూ???
'మంచి పని చేద్దామంటే తుమ్ముతుంది సార్!'
తుమ్మితే ఊడిపోయే ముక్కు, ఉంటే ఏంటి లేకపోతే ఏంటి నీలూ?
'అవును సార్ ఉండాల్సింది ప్రేమే సార్!'

లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
lovedoctorram@sakshi.com

కాసుకో సుడోకు

	2				1	6		
4	9	1	8			5		
		3	7	4		2	9	
		2	4		6			5
	1						2	
5			1		7	3		
	8	6		3	9	7		
		9			4	8	5	6
		4	6				1	

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

6	8	1	2	5	7	9	4	3
7	9	4	3	8	6	2	1	5
2	3	5	4	1	9	7	6	8
8	1	6	5	7	3	4	2	9
5	4	9	1	2	8	6	3	7
3	7	2	6	9	4	8	5	1
1	6	8	7	4	5	3	9	2
9	2	3	8	6	1	5	7	4
4	5	7	9	3	2	1	8	6

అండర్‌స్టాండింగ్


మహేశ్‌బాబు

వార్ తప్పదు. సూర్య, భరత్‌కు బాక్సాఫీసు వార్ తప్పదనుకున్నారంతా. ఈ వార్ రెండు కాంపౌండ్‌ల మధ్య గొడవకు దారి తీస్తుందని, వినోదం చూడొచ్చని ఔత్సాహికరాయుళ్లు ఆసక్తిగా ఎదురు చూశారు. అది మాత్రం జరగకూడదని ఇండస్ట్రీ మేలు కోరుకునేవాళ్లు ఆకాంక్షించారు. చివరికి వాళ్లు అనుకున్నదే జరిగింది. ఔత్సాహికుల ఆసక్తి మీద బిందెడు నీళ్లు చల్లినట్లయింది. మహేశ్‌బాబు 'భరత్ అనే నేను', అల్లు అర్జున్ 'నా పేరు సూర్య–నా ఇల్లు ఇండియా' సినిమాల మధ్య వార్ లేదు. రెండు చిత్రాల నిర్మాతలు ఫ్రెండ్లీగా మాట్లాడుకుని, ఒక అండర్‌స్టాండింగ్‌కి వచ్చారు.


అల్లు అర్జున్

అప్పుడలా.. ఇప్పుడిలా!

మహేశ్‌బాబు ప్లేస్‌లోకి అల్లు అర్జున్ వచ్చారు. ఎలా అంటారా? ఇలా.. హరీష్ శంకర్ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా నటించిన 'డీజే' (దువ్వాడ జగన్నాథమ్) చిత్రం గతేడాది జూన్ 23న రిలీజైంది. ఇందులో విశేషం ఏంటంటే.. ఈ డేట్‌ను 'స్పైడర్' చిత్రం కోసం బుక్ చేసుకున్నారు. కానీ.. కొన్ని కారణాల వల్ల 'స్పైడర్' సినిమా వాయిదా పడటంతో సభ్య సమాజానికి మేసేజ్ అంటూ ఆ ప్లేస్‌లోకి 'డీజే' వచ్చాడు. అలా గతేడాది మహేశ్‌బాబు ప్లేస్‌లోకి అల్లు అర్జున్ వచ్చారు. ఇప్పుడు..సూర్య వర్సెస్ భరత్‌లో మహేశ్ ముందొచ్చారు. అదేనండీ.. ముందు మహేశ్ 'భరత్ అనే నేను', తర్వాత 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' వస్తున్నాయి కదా. అప్పుడలా.. ఇప్పుడిలా.

భరత్.. సూర్య.. కాలా


రజనీకాంత్

కొరటాల శివ దర్శకత్వంలో శ్రీమతి డి. పార్వతి సమర్పణలో డీవీవీ దానయ్య నిర్మిస్తున్న సినిమా 'భరత్ అనే నేను'. వక్కంతం వంశీ దర్శకత్వంలో కె.నాగబాబు సమర్పణలో రామ లక్ష్మీ క్రియేషన్స్ పతాకంపై రూపొందుతున్న సినిమా 'నా పేరు సూర్య–నా ఇల్లు ఇండియా'. తొలుత ఈ రెండు సినిమాలను ఏప్రిల్ 27న రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ సడన్‌గా మధ్యలో 'కాలా' దూసుకొచ్చాడు. అంతే ముక్కోణపు వార్ స్టార్టైంది. ఎందుకంటే.. రజనీకాంత్ హీరోగా 'కబాలి' ఫేమ్ పా.రంజిత్ దర్శకత్వంలో రూపొందిన 'కాలా' చిత్రాన్ని కూడా ఏప్రిల్ 27నే రిలీజ్ చేయనున్నట్లు ఎనౌన్స్ చేశారు. అంతే.. డబుల్.. ట్రిపుల్ అయ్యింది. అంటే.. బాక్సాఫీసు వద్ద ముక్కోణపు పోటీ అన్నమాట. అయితే 'కాలా'తో రాకుండా భరత్, సూర్య ఒక్కరోజు ముందుకొచ్చారు. ఏప్రిల్ 26న 'భరత్ అనే నేను', 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' సినిమాలను రిలీజ్ చేయనున్నట్లు చిత్రబృందాలు ప్రకటించాయి. కానీ, రెండు సినిమాల మధ్య పోటీ కూడా సరికాదని చాలామంది భావించారు. ఇప్పుడా చింత లేదు. ఎందుకుంటే.. భరత్, సూర్య చిత్రబృందాలు కూడా స్నేహపూర్వకంగానే వార్‌కు ప్యాకప్ చెప్పారు. రెండు సినిమాల రిలీజ్ డేట్స్‌ను మార్చుకున్నట్లు గురువారం నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. ఇప్పుడు ఫైనల్‌గా 'భరత్ అనే నేను' చిత్రాన్ని ఏప్రిల్ 20న, 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' చిత్రాన్ని మే 4న రిలీజ్ చేయనున్నట్లు నిర్మాతలు చెప్పారు. ఇప్పుడు బాక్సాఫీస్ వార్ లేదు. ఉన్నదల్లా స్నేహపూర్వకమైన వాతావరణం మాత్రమే.

పోటీ లేకుండాపోయింది

గతేడాది సెప్టెంబర్ చివరి వారంలో ముగ్గరు పెద్ద హీరోల సినిమాలు ఒకే వారంలో బాక్సాఫీస్ వద్ద క్లాష్ అవుతాయనుకున్నారు. అవే.. బాలకృష్ణ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిన 'పైసా వసూల్', మహేశ్‌బాబు హీరోగా మురుగదాస్ దర్శకత్వంలో తెరకెక్కిన తమిళ, తెలుగు బైలింగ్వల్ 'స్పైడర్', బాబీ దర్శకత్వంలో ఎన్టీఆర్ త్రిపాత్రాభినయం చేసిన 'జై లవ కుశ'. అనుకున్నట్లుగా అయితే.. సెప్టెంబర్ 21న 'జై లవ కుశ', 27న 'స్పైడర్', 'పైసా వసూల్' రిలీజ్ కావాల్సింది. కానీ.. చెప్పిన టైమ్‌కన్నా ముందే 'పైసా వసూల్' చిత్రాన్ని సెప్టెంబర్ 1న రిలీజ్ చేశారు చిత్రబృందం. 'జై లవ కుశ' సెప్టెంబర్ 21న, 'స్పైడర్' 27న వచ్చాయి. మొత్తం మీద పోటీ లేకుండాపోయింది.


'జై లవ కుశ' లో ఎన్టీఆర్

సంక్రాంతికి మినహాయింపు

ఇలా అండర్‌స్టాండింగ్‌కి రావడానికి ఏర్పాటైన సమావేశంలో ఆ రెండు చిత్రాల నిర్మాతలతో పాటు నిర్మాత 'దిల్' రాజు, కె.ఎల్ నారాయణ పాల్గొన్నారు. ''రెండు భారీ చిత్రాల మధ్య కనీసం రెండు వారాల గ్యాప్ ఉండాలని మాట్లాడుకున్నాం. అందుకే 'భరత్ అనే నేను' చిత్రాన్ని ఏప్రిల్ 20న,


దానయ్య, బన్నివాసు, నాగబాబు, శ్రీధర్, 'దిల్' రాజు, నారాయణ

'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' చిత్రాన్ని మే 4న రిలీజ్ చేయాలని నిర్ణయించాం. ఇండస్ట్రీలో ఆరోగ్యకరమైన వాతావరణం ఉండాలన్న అభిప్రాయంతో తీసుకున్న ఈ నిర్ణయాన్ని సపోర్ట్ చేసిన మా హీరోలు, దర్శకులకు కృతజ్ఞతలు'' అన్నారు నిర్మాతలు డీవీవీ దానయ్య, లగడపాటి శ్రీధర్, 'బన్నీ' వాసు. ''సంక్రాంతి సీజన్‌ను మినహాయించి మిగిలిన సందర్భాల్లో రెండు భారీ చిత్రాల మధ్య ఇలా రెండు వారాల గ్యాప్ ఇచ్చి రిలీజ్ డేట్స్ ప్లాన్ చేయడం వల్ల పరిశ్రమకు ఎంతో మేలు జరగుతుంది. 'భరత్ అనే నేను, నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' సినిమాల నిర్మాతల మధ్య మంచి అండర్‌స్టాండింగ్ కుదరడం శుభపరిణామంగా భావిస్తున్నాం'' అన్నారు నాగబాబు. ఏప్రిల్ 20న 'భరత్ అనే నేను', ఆరు రోజుల గ్యాప్ తర్వాత 27న 'కాలా', ఆ నెక్స్ వీక్ మే 4న 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' వస్తాయి. ఎలాగూ ఏప్రిల్ 5న నితిన్ 'ఛల్ మోహన్‌రంగ', ఏప్రిల్ సెకండ్ వీక్‌లో నాని 'కృష్ణార్జున యుద్ధం' వచ్చేస్తాయి. అటు ఆ రెండు సినిమాలకూ.. ఆ తర్వాత విడుదల కానున్న సినిమాలకూ మధ్య గ్యాప్ రావడంతో ఏప్రిల్ వార్ వేడి తగ్గింది.

స్పీడ్ పెంచిన హీరోలు


రాశీఖన్నా, వరుణ్ తేజ్

రెండు మూడేళ్ల క్రితంతో పోల్చితే ఇప్పుడు హీరోలు స్పీడ్ పెంచారు. ఒకేసారి రెండు సినిమాలు లేదా ఒకే సినిమాని త్వరగా పూర్తి చేయడం చేస్తున్నారు. దానివల్ల థియేటర్ల కొరత ఏర్పడుతోంది. ఇదే విషయాన్ని ఇటీవల 'దిల్' రాజు ప్రస్తావించారు. ఎన్ని ఎక్కువ సినిమాలు వస్తే అంత మంచిదే కానీ, రిలీజ్ విషయంలో అండర్‌స్టాండింగ్‌తో వెళ్లాలి. నిర్మాతలందరూ దాదాపు అలానే వెళుతున్నారు. ఫర్ ఎగ్జాంపుల్ ఫిబ్రవరి 9 గురించి మాట్లాడుకోవాలి. ఒకటి కాదు.. రెండు కాదు. ఏకంగా ఐదు సినిమాలు ఫిబ్రవరి 9న బాక్సాఫీస్ వార్‌కు రెడీ అయ్యాయి. మోహన్‌బాబు 'గాయత్రి', వరుణ్‌తేజ్ 'తొలిప్రేమ', సాయిధరమ్ తేజ్ 'ఇంటిలిజెంట్', నిఖిల్ 'కిర్రిక్ పార్టీ', నాగశౌర్య 'కణం' అదే రోజున రిలీజ్ కావాల్సింది. కానీ.. గాయత్రి, ఇంటిలిజెంట్ మాత్రమే ఫిబ్రవరి 9న థియేటర్‌లోకి వచ్చాయి. 'తొలిప్రేమ' నిర్మాత బీవీయస్‌యన్ ప్రసాద్, ఆ మూవీ డిస్ట్రిబ్యూటర్ 'దిల్' రాజు తమ 'తొలిప్రేమ' సినిమాను ఒక్క రోజు వాయిదా వేశారు. అంటే.. ఫిబ్రవరి 10న వరుణ్ తేజ్ 'తొలిప్రేమ' రిలీజైంది. 'ఇంటిలిజెంట్' నిర్మాత సి. కల్యాణ్, 'తొలిప్రేమ' నిర్మాత బీవీయస్‌యన్, డిస్ట్రిబ్యూటర్ రాజు.. ముగ్గురూ చర్చించుకుని ఈ నిర్ణయానికి వచ్చారు. అంతే కాదు.. ఇప్పుడు ఒకేరోజు సినిమాలు రిలీజ్ అవుతుంటే.. ఒక సినిమా హీరో, ఇంకో సినిమా హీరోకు సోషల్ మీడియాలో ఆల్ ది బెస్ట్ చెబుతున్నారు. అఖిల్ హీరోగా నాగార్జున నిర్మాణంలో వచ్చిన 'హలో', 'దిల్' రాజు నిర్మాతగా నాని హీరోగా వచ్చిన 'ఎమ్‌సీఏ' విషయం అప్పుడు ఇలానే పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఇటీవల 'మనసుకు నచ్చింది' రిలీజ్ అప్పుడు చిత్రకథానాయకుడు సందీప్ కిషన్.. నాని నిర్మించిన 'అ!'కి శుభాకాంక్షలు చెబితే.. నాని టీమ్ వీళ్లకు ఆల్ ది బెస్ట్ చెప్పారు.


సాయిధరమ్ తేజ్, లావణ్యా త్రిపాఠి

పి వర్సెస్ పి


సంజయ్‌లీలా భన్సాలీ, అక్షయ్‌కుమార్

టాలీవుడ్‌లోనే కాదు.. అటు బాలీవుడ్‌లోనూ రిలీజ్ డేట్స్ విషయంలో 'వార్' సహజమైంది. 'తమ సినిమాలను ఎప్పుడు కావాలంటే అప్పుడు రిలీజ్ చేసుకునే హక్కు ప్రతి చిత్రబృందానికి ఉంటుంది' అని అక్షయ్‌కుమార్ పేర్కొన్నారు. 'పద్మావత్' వర్సెస్ 'ప్యాడ్‌మ్యాన్' రిలీజ్ డేట్స్ విషయంలో. దీపికా పదుకోన్, రణ్‌వీర్ సింగ్, షాహిద్ కపూర్ ముఖ్య తారలుగా సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో రూపొందిన సినిమా 'పద్మావత్'. సెన్సార్ చిక్కులతో రిలీజ్ డేట్స్‌ను మార్చుకుంటూ ఫైనల్‌గా జనవరి 25కి థియేటర్స్‌లో సెటిల్ అవ్వాలనుకుంది 'పద్మావత్' చిత్రబృందం. చెప్పిన డేట్ (జనవరి 26)కి ఒక్కరోజు ముందుకు దూకాడు 'ప్యాడ్‌మ్యాన్'. అంటే.. రెండు సినిమాలూ ఒకేరోజున వచ్చే పరిస్థితి. అక్షయ్ కుమార్, రాధిక ఆప్టే, సోనమ్‌కపూర్ నటించిన చిత్రం 'ప్యాడ్‌మ్యాన్'. పద్మావత్, ప్యాడ్‌మ్యాన్ ఒకేరోజున రిలీజ్ కావడం సరికాదని ఫైనల్‌గా 'పద్మావత్' దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ, 'ప్యాడ్‌మ్యాన్' హీరో అక్షయ్‌కుమార్ మాట్లాడుకున్నారు. కలిసి విలేకర్ల సమావేశం పెట్టారు. అప్పుడే 'ప్యాడ్‌మ్యాన్' చిత్రాన్ని ఫిబ్రవరి 9కి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించాడు అక్షయ్‌కుమార్. అలాగే బాలీవుడ్ మూవీ 'అయ్యారీ'ని ఫిబ్రవరి 9న రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ క్లాష్ వద్దనుకుని ఫిబ్రవరి 16న రిలీజ్ చేశారు. అంతేకాదు అనుష్క శర్మ 'పరి' (మార్చి 2న విడుదల) సినిమాతో బాక్సాఫీస్ క్లాష్ వద్దనుకుని ముందుగా అనుకున్నట్లుగా 'హేట్‌స్టోరీ 4' చిత్రాన్ని మార్చి 2న కాకుండా వారం రోజులు ముందుకు (మార్చి 9) జరిపాడు ఆ చిత్ర దర్శకుడు విశాల్ పాండ్య.

– ముసిమి శివాంజనేయులు

అందమైన ఆకర్షణ

సుధీర్‌బాబు, బాలీవుడ్ నటి అదితీరావు హైదరీ జంటగా మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తోన్న ఈ సినిమాకి 'సమ్మోహనం' పేరు ఖరారు చేశారు. మోహనకృష్ణ ఇంద్రగంటి మాట్లాడుతూ– ''సమ్మోహనం' అంటే మంత్రముగ్ధులని చేసే ఒక అందమైన ఆకర్షణ. ఒక మ్యాజికల్ ఎట్రాక్షన్. మా చిత్రంలో హీరో హీరోయిన్ల మధ్య సమ్మోహనకరమైన రొమాన్స్‌తో పాటు ఇతర పాత్రలకి ఉండే విభిన్నమైన ఆకర్షణలు మెప్పిస్తాయి. ఓ కొత్త పోకడ ఉన్న నవతరం ప్రేమకథా చిత్రంగా ఉంటూనే హాస్యం, సజీవమైన కుటుంబ బంధాలతో ఉంటుంది'' అన్నారు. ''మూడు షెడ్యూళ్లు పూర్తయ్యాయి. ఈ నెల 22 నుంచి మార్చి 3 వరకు నాలుగో షెడ్యూల్ హైదరాబాద్‌లో, మార్చి 3వ వారం నుంచి ఏప్రిల్ 3 వరకూ హిమాచల్‌ప్రదేశ్, ముంబైలో షూటింగ్ చేస్తాం. మే మూడో వారంలో సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం'' అని శివలెంక కృష్ణప్రసాద్ అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: పి.జి.విందా, సంగీతం: వివేక్ సాగర్.


సుధీర్‌బాబు

పరి పరిశోధన

తాగుడును దూరం చేసే జన్యుమార్పులు!

తాగుడు అలవాటును అధిగమించేలా మనిషి పరిణమిస్తున్నాడా? అవునంటున్నారు పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు. నేచర్ ఎకాలజీ అండ్ ఎవల్యూషన్‌లో ప్రచురితమైన పరిశోధన వ్యాసం ప్రకారం.. మానవుల్లో ఏ రకమైన మార్పులు జరుగుతున్నాయో తెలుసుకునేందుకు శాస్త్రవేత్తలు ఒక అధ్యయనం జరిపారు. ఇప్పటికే పూర్తయిన దాదాపు వెయ్యి జన్యుక్రమ ప్రాజెక్టుల సమాచారాన్ని ఇందుకోసం విశ్లేషించారు. వేర్వేరు ప్రాంతాలకు చెందిన 2500 మంది డీఎన్‌ఏ వివరాలను పరిశీలించినప్పుడు కొన్ని ఆసక్తికరమైన అంశాలు తెలిశాయి. ఆఫ్రికా సంతతి వ్యక్తుల్లో మలేరియా వ్యాధికి నిరోధకత పెరుగుతూండగా, యూరోపియన్లలో ఒక అమినో యాసిడ్‌లో మార్పులు నమోదయ్యాయి. అలాగే నియాండెర్తల్ జాతికి సంబంధించిన మానవులతో కలవడం వల్ల వచ్చిన రెండు డీఎన్‌ఏ ముక్కలు అలాగే ఉన్నట్లు తెలిసింది. చివరగా ఏడీహెచ్ అనే జన్యువులో వచ్చిన మార్పు. ఈ జన్యువు శరీరంలో ఆల్కహాల్ డీహైడ్రోజనేస్ అనే ఎంజైమ్ తయారీకి ఉపయోగపడుతుంది. ఇది మద్యాన్ని విడగొట్టి అసిటాల్డీహైడ్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ జన్యువులో వచ్చిన మార్పులు భవిష్యత్తులో శరీరాన్ని మద్యం ప్రభావం నుంచి రక్షించేదిగా ఉందని శాస్త్రవేత్తల అంచనా. మద్యాన్ని వేగంగా విడగొట్టడం ద్వారా తాగుబోతులకు జబ్బు పడిన అనుభూతిని ఇవ్వడం ద్వారా ఈ జన్యువు పనిచేస్తుందని శాస్త్రవేత్తలు అంటున్నారు.



యాంటీబయాటిక్‌ల ప్రభావాన్ని పెంచే కార్బన్ మోనాక్సైడ్!

కార్బన్ మోనాక్సైడ్ అనే వాయువు కారణంగా యాంటీబయాటిక్ మందుల ప్రభావం గణనీయంగా వృద్ధి చెందుతుందని జార్జియా స్టేట్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు అధ్యయన పూర్వకంగా చెబుతున్నారు. మెట్రోనైడజాల్ అనే యాంటీబయాటిక్‌కు కార్బన్ మోనాక్సైడ్‌ను జోడించి ప్రయోగించినప్పుడు హెచ్.పైలోరీ రకం బ్యాక్టీరియా వేగంగా నాశనమైందని వీరు జరిపిన ప్రయోగాల ద్వారా స్పష్టమైంది. కడుపులో పుండ్లు అయ్యేందుకు ఈ హెచ్.పైలోరీ కారణమవుతుందన్నది తెలిసిన విషయమే. కార్బన్ మోనాక్సైడ్‌తో కలిపి ఇచ్చినప్పుడు యాంటీబయాటిక్ ప్రభావం 25 రెట్ల వరకూ ఎక్కువగా ఉందని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త డాక్టర్ బింగే వాంగ్ తెలిపారు. బ్యాక్టీరియా యాంటీబయాటిక్‌కు స్పందించకపోవడం నిరోధకత కాదని, చాలా సందర్భాల్లో అవి మందులకు అలవాటుపడిపోవడం వల్ల యాంటీబయాటిక్స్ పనిచేయకుండా పోతాయని ఆయన వివరించారు. బ్యాక్టీరియాను మళ్లీ మందులకు సున్నితంగా మారిస్తే అవి వాటి ప్రభావాన్ని చూపుతాయని చెప్పారు. గాఢత ఎక్కువగా ఉండే విషంలా పనిచేసే కార్బన్ మోనాక్సైడ్‌ను అతి తక్కువ సాంద్రతల్లో వాడినప్పుడు మాత్రం చికిత్సకు ఉపయోగపడుతుందని తాము గుర్తించినట్లు చెప్పారు. శరీరంలో సహజసిద్ధంగా ఉత్పత్తి అయ్యే ఈ వాయువు వాపును తగ్గించడమే కాకుండా.. బ్యాక్టీరియా, వైరస్‌లకు కణాలు ప్రతిస్పందించే గుణాన్ని కూడా పెంచుతాయని చెప్పారు.



కూల్‌డ్రింక్స్‌తో కేన్సర్ ముప్పు...

చక్కెరలు ఎక్కువగా ఉండే కూల్‌డ్రింక్స్ తాగే అలవాటు ఉన్న వారికి ఊబకాయ సంబంధిత కేన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువని మెల్‌బోర్న్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు జరిపిన అధ్యయనం ఒకటి తెలిపింది. దాదాపు 35 వేల మంది అలవాట్లను పరిశీలించి జరిపిన విశ్లేషణ ద్వారా కూల్‌డ్రింక్స్ 11 రకాల కేన్సర్లపై ప్రభావం చూపుతున్నట్లు తెలిసింది. ఇవన్నీ ఊబకాయానికి సంబంధించినవే అయినప్పటికీ అధ్యయనంలో పాల్గొన్న వారు మాత్రం ఊబకాయులు కాకపోవడం శాస్త్రవేత్తలను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. నిత్యం కూల్‌డ్రింక్స్ తాగేవారితో పోలిస్తే కృత్రిమ చక్కెరలతో కూడిన డైట్ కూల్ డ్రింక్స్ తాగే వారికి వ్యాధి ముప్పు తక్కువగా ఉన్నట్లు తమ అధ్యయనం ద్వారా తెలిసిందని అలిసన్ హాడ్జ్ అనే శాస్త్రవేత్త చెబుతున్నారు. అధిక చక్కెర... ఊబకాయానికి, మధుమేహానికి దారితీయవచ్చునని ఇప్పటికే అనేక పరిశోధనలు స్పష్టం చేస్తూండగా.. కేన్సర్ కారకమన్న అంశంపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. గత ఏడాది జరిగిన ఒక పరిశోధనలో చక్కెరలు కేన్సర్ కణాలను ఎలా ప్రేరేపితం చేస్తాయో స్పష్టం అవడమే కాకుండా.. చక్కెరలు కణతి ఎదుగుదలకు తోడ్పడుతున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో మెల్‌బోర్న్ యూనివర్శిటీ జరిపిన అధ్యయనం ప్రాధాన్యత సంతరించుకుంది. కేన్సర్ల నివారణకు చక్కెరలను పూర్తిస్థాయిలో త్యజించడమూ అంత మంచిదేమీ కాదని, కణాలకు అవసరమైన శక్తి గ్లూకోజ్ ద్వారానే లభిస్తుందన్న విషయం మరువరాదని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.



ఫ్యాషన్

రాధా తన్మయత్వం

కృష్ణ అన్నది ఒక భావం
ఒక స్ఫురణ
ఒక ప్రకృతి స్పర్శ..
వాటి కోసం
ఎదురు చూస్తూ
తన్మయత్వం చెందే ప్రాణి రాధ.
రాధా గోవిందం సీరీస్‌లో
వచ్చిన లెహెంగా డిజైన్లు ఇవి
తన్మయత్వాన్ని మీరూ ధరించండి.



ఆధునిక మహిళ అందమైన చీరను లేదా లెహెంగాను ధరించడమంటే సంప్రదాయానికి అద్దం పట్టడమే అని భావిస్తుంది. అందుకు తగ్గట్టుగానే సంస్కృతినీ, సంప్రదాయాన్నీ కలుపుకుంటూ ఆధ్యాత్మికతకూ కొత్త సొబగులు దిద్దుకుంటుంది. ఆధునిక పోకడలు పోతూనే ధరించే దుస్తులకు అసలైన అందం తీసుకురావడానికి రాబోయే వసంతరుతువు స్వాగతం పలకడానికి సిద్ధం అవుతుంది.

ఈ లెహంగాలకు ప్యానెల్స్ హంగామా అవసరం లేదు. ఎంబ్రాయిడరీ జిలుగులు అక్కర్లేదు. రంగుల ఫ్యాబ్రిక్, కుచ్చులతో స్కర్ట్‌ని తీర్చిదిద్దితే చాలు. దీనికి కాంట్రాస్ట్ బ్లౌజ్‌లు, ప్లెయిన్ దుపట్టాలు, ప్యాచ్‌లుగా అల్లుకుపోయిన అంచులు గల ఈ దుస్తులను ధరించి ఏ వేడుకలకైనా అద్భుతం అనిపించేలా సిద్ధం కావచ్చు.







మన చేనేతలు

మగ్గం మీద నేసిన ఖాదీ, టస్సర్, మల్ మల్, పట్టు ఫ్యాబ్రిక్స్‌ను ఎంచుకోవచ్చు. ప్లెయిన్‌తోనే వండర్స్ సృష్టించవచ్చు. ఎంబ్రాయిడరీ జిలుగులు వీటికి అక్కర్లేదని ఇలాంటి డిజైన్స్ చూస్తే మీకూ ఇట్టే తెలిసిపోతుంది.



















మెరుపుల హంగుల్లేని బుటీలు

ప్లెయిన్ ఫ్యాబ్రిక్ మీద సెల్ఫ్ డిజైన్లు, చిన్న చిన్న బుటీలు ఆకట్టుకుంటాయి. వాటికి కాంట్రాస్ట్ అంచులు అందాన్ని తీసుకువస్తాయి. అలంకరణ హంగామా ఎంత తక్కువగా ఉంటే ఈ దుస్తుల్లో అంతబాగా కనిపిస్తారు. ఆభరణాల హంగులు లేకుండా అలలుగా ఎగిసే కురులు ఈ డ్రెస్‌కి మరింత సొగసును తీసుకువస్తాయి.

ప్లెయిన్‌కి మల్టీకలర్స్ జత

ప్లెయిన్ క్లాత్ అది కాటన్ అయినా పట్టు అయినా స్కర్ట్ భాగానికి తీసుకోవాలి. ఫ్లెయిర్ విశాలంగా రావాలంటే మాత్రం ఆర్గంజా ఫ్యాబ్రిక్ నప్పుతుంది. దీనికి పూర్తి కాంట్రాస్ట్ బ్లౌజ్, ఒక ప్లెయిన్ మరో ఎంబ్రాయిడరీ చేసిన బార్డర్‌ని జత చేస్తే ఇలా చూడముచ్చటైన కళ ఉట్టిపడుతుంది. పండగకు కొత్త భాష్యం చెబుతుంది.

నిర్వహణ
ఎన్.ఆర్.

కార్డియాలజీ కౌన్సెలింగ్

ఫ్యామిలీ డాక్టర్

‘బైపాస్’ తర్వాత ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

మా పెద్దమ్మకు బైపాస్ సర్జరీ అయ్యింది. ఆమె విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెప్పండి.

– అమరనాథరెడ్డి, కర్నూలు

బైపాస్ సర్జరీ చేయించుకున్న వాళ్లు మొదటి ఆరు వారాల్లో ఈ కింద సూచించిన జాగ్రత్తలు తీసుకోవాలి.● శస్త్రచికిత్స కోసం శరీరంపై గాటు పెట్టిన చోట ఎలాంటి ఒత్తిడీ పడకుండా చూసుకోండి ● డాక్టర్లు సూచించిన మందులు క్రమం తప్పకుండా తీసుకోండి ● కొలెస్ట్రాల్ పాళ్లను అదుపులో ఉంచుకోండి. అందుకోసం డాక్టర్లు సూచించిన ఆహార, వ్యాయామ నియమాలను తప్పక పాటించండి ● రక్తపోటును అదుపులో ఉంచుకోండి. ఇందుకోసం డాక్టర్లు ఇచ్చిన మందులు వాడుతూనే... రిలాక్సేషన్ ప్రక్రియలైన ధ్యానం, యోగా వంటివి చేయండి ● రక్తంలో చక్కెర పాళ్లను తెలుసుకునే పరీక్షలను క్రమం తప్పకుండా చేయించుకుంటూ, మీ డాక్టర్‌కు తెలియజేస్తూ ఉండండి. అందులో వచ్చిన మార్పులను బట్టి వైద్యులు మీ మందులను మార్చడం వంటివి చేస్తారు ● సిగరెట్ పొగకు ఎలాంటి పరిస్థితుల్లోనూ ఎక్స్‌పోజ్ కావద్దు. అది రక్తనాళాల మృదుత్వాన్ని దెబ్బతీయడంతో పాటు అవి రక్తనాళాలు సన్నబారేలా చేస్తుంది; గుండె వేగాన్ని పెంచుతుంది. కాబట్టి పొగాకు ఏరూపంలోనైనా మంచిది కాదు ● మద్యంకూడా గుండెకు హానిచేసేదే ● ఒత్తిడికి గురికావడం రక్తపోటును పెంచి, గుండెపోటుకు దారితీసేలా చేసే అంశం. కాబట్టి ఒత్తిడి లేకుండా చూసుకోండి ● ఒకే చోట కూర్చొని ఉండకండి. చురుగ్గా ఉండే జీవనశైలి మార్పుతోనూ గుండెజబ్బును నివారించుకోండి ● డాక్టర్లు సూచించిన ఆరోగ్యకరమైన వ్యాయామాలను రోజుకు రెండుసార్లు... పదినిమిషాల పాటు చేయాలి ● ఏమాత్రం భారం పడకుండా పది పదిహేను నిమిషాల పాటు రోజుకు రెండుసార్లు నడక (వాకింగ్)కు ఉపక్రమించాలి ● అకస్మాత్తుగా ముందుకు, వెనక్కు, పక్కలకు ఒంగడం వంటివి చేయకూడదు ● మూడు కిలోలకు మించిన బరువు కనీసం నెలరోజుల పాటు ఎత్తవద్దు ● నేల మీద కూర్చోవడం, కాలుమీద కాలేసుకోవడం వంటివి చేయకండి.



అరిథ్మియా అంటే ఏమిటి?

నా వయసు 35 ఏళ్లు. రెండు వారాల క్రితం అకస్మాత్తుగా స్పృహ కోల్పోయాను. స్పృహవచ్చాక చాలా నీరసంగా అనిపించింది. కళ్లు తిరుగుతున్నట్లుగా అనిపించడం, ఆయాసంగా ఉండటం, ఊపిరితీసుకోవడంలో ఇబ్బందిగా అనిపించడం వంటి లక్షణాలు కనిపించాయి. డాక్టర్‌ను కలిస్తే ఎరిథ్మియా ఉండవచ్చు అని అన్నారు. అసలు అరిథ్మియా అంటే ఏమిటి? నాకు చాలా ఆందోళనగా ఉంది. తగిన సలహా ఇవ్వండి. **– సుబ్బారావు, పెందుర్తి**

సాధారణంగా మన గుండె మామూలుగా నిమిషానికి 60 నుంచి 100 సార్లు కొట్టుకోవాలి. అలా కాకుండా 60 కన్నా తగ్గినా లేదా 100 కన్నా పెరిగినా ఆ కండిషన్‌ను అరిథ్మియా అంటారు. కానీ ఎవరైనా తీవ్ర భయాందోళనలకు గురైనప్పుడు, వ్యాయామం చేసినప్పుడు గుండె వేగం 100 నుంచి 160 మధ్యన ఉంటుంది. దీన్ని సైనస్ టాకికార్డియా అంటారు. ఇలా కాకుండానే గుండె వేగం దానంతట అదే ఇంకా పెరిగితే అది జబ్బువల్ల కావచ్చు. ఈ లక్షణంతో మరికొన్ని రకాల గుండెజబ్బులు ఉండవచ్చు. సమస్య ఏదైనా గుండె వేగం మరింత పెరిగినా లేదా తగ్గినా స్పృహ కోల్పోయే ప్రమాదం ఉంది. మీరు కూడా స్పృహ కోల్పోయినట్లు చెప్పారు కాబట్టి వెంటనే దగ్గర్లోని కార్డియాలజిస్ట్‌ని కలిసి ఈసీజీ, ఎకో, హోల్టర్ పరీక్షల్లాంటివి చేయించండి. మీరు స్పృహ కోల్పోడానికి గుండె జబ్బే కారణమా, మరి ఇంకేదైనా సమస్య వల్ల ఇలా జరిగిందా తెలుసుకొని దానికి తగిన విధంగా చికిత్స తీసుకోవడం అవసరం. ఇప్పుడు ఆధునిక వైద్య విజ్ఞానం వల్ల అన్ని రకాల జబ్బులకు మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. కాబట్టి మీరు ఆందోళన చెందకండి.






డాక్టర్ హేమంత్ కౌకుంట్ల
కార్డియో థొరాసిక్ సర్జన్, సెంచరీ హాస్పిటల్స్,
బంజారాహిల్స్, హైదరాబాద్.

మళ్లీ చెప్పకుందాం! రీటోల్డ్ కథలు - 13

చెంబుడు నీళ్లు





● షాజహానా

వలీమా ధూమ్‌ధామ్‌గా జరిగింది.

అంటే ఏం లేదు. ఇరవై కిలోల దొడ్డు బియ్యంలో పది కిలోల మటన్ ముక్కలు కలిపి, కొత్తిమీర అల్లం లొస్సన్ వేసి బిరియానీ వొండి అడిగినవారికి అడిగినంత ఆకులో వేయడమే.

పెళ్లి చేయడం ఆడపెళ్లివాళ్ల వంతు. వలీమా చేయడం మగపెళ్లివాళ్ల వంతు.

వలీమా బాగా జరగడం కొత్త పెళ్లికూతురికి సంతోషం కలిగించింది. అబ్బాయి యోగ్యుడు. సొంతగా సైకిల్ షాపు ఉందంటే యోగ్యుడే. యాభై వేలే తీసుకున్నాడు. ఎక్కువ బంగారం అడగలేదు. పలుచగా పొడవైన వేళ్లతో ఉన్నాడు కనుక చక్కగా నవ్వుతున్నాడు కనుక కొడతాడనే భయం మొదటి చూపులోనే లేదు. అత్తగారు స్నేహశీలి. ఇంటికి పెద్దదిక్కుగా ఉన్న ముసలామె మాటకారి. ఇద్దరు ఆడపడుచులు. కదిలే తిరిగే ఇంట్లో వచ్చి పడింది.

కదిలే తిరిగే ఇల్లేనా?

బస్టాండ్ దాకా కదలొచ్చు. తర్కారీకి వెళ్లొచ్చు. టైలర్ షాపుకు పోయి రావచ్చు. కాలేజీకి వెళ్లి రావచ్చు. నీళ్లబావి దాకా రాకపోకలు కొనసాగించవచ్చు. కానీ అక్కడకు మాత్రం వెళ్లడానికి లేదు.

ఎక్కడకు?

అక్కడికే.

అల్లామియా ఆడవాళ్ల కోసమే రాత్రిళ్లు సృష్టించాడు. అబ్బ ఎంత మంచి దేవుడు ఆయన. రాత్రి లేకుంటే ఆడవాళ్ల బతుకు ఏంగాను. చెంబు తీసుకొని, లోటా తీసుకొని, ప్లాస్టిక్ సీసాతో, ఒకరికొకరు కూడబలుక్కుని రాత్రి చీకటిలో అలా తుప్పల్లోకి వెళ్లి వస్తారు.

చిన్నప్పుడు అలా వెళ్లడం బాగుండేది. కానీ ఊహ తెలిశాక, ఇంట్లో ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని తండ్రి దానిని కట్టించాడు. అమ్మ చెవి కమ్మలు గిర్వీ పెట్టి, తెలిసిన ఇటుకల బట్టీ ఆయన ఉంటే బతిమిలాడుకుని, బేల్దారును మంచి చేసుకొని, సీలింగ్ రేకు కొని... ఉన్న వాళ్లకు ఇది చీమ. లేనివాళ్లకు ఇదే ఏనుగు.

అమ్మకు భలే జుగుత్ ఉండేది. ఇల్లు నీట్‌గా పెట్టేది. దానిని కూడా. రోజూ నిర్మా చల్లి కడిగేది. ఇది బంధువుల్లో చోద్యం. దానిని కూడా తోముతారా. యాక్. తోమకపోతేనే యాక్.

ఈ యాక్‌కి భయపడే బంధువుల ఇళ్లకు వెళ్లేది కాదు. వెళ్లినా రాత్రిళ్లు ఉండేది కాదు. ఉదయం పూట వెళ్లాల్సి వస్తుంది గదా. దానినెందుకు అంత గలీజుగా ఉంచుకుంటారు?

‘ఇంటిని చక్కబెట్టుకోవడానికే టైము లేదు. దాన్ని కూడా ఎక్కడ చక్కదిద్దేది’ అనింది ఒక బంధువులామె.

వంట చేసి, పిల్లల్ని చూసుకుని, బట్టలుతుక్కుని, బాసన్లు కడుక్కుని, వాకిలి చిమ్ముకుని... ఇవిగాక ఉప్పు చింతపండుక్కూడా బజారుకు పరుగు దీస్తూ... అసలు మగాడనేవాడు లేచి రెండు బకెట్లు నింపి ఠాప్ ఠాప్ కొడితే ఎంత బాగుంటుంది. మగాళ్లు చేస్తారా? టేప్ రికార్డర్‌లో ఖవ్వాలీలు వినమంటే వింటారు.

కానీ ఈ పెళ్లికొడుకు చేసేలాగే ఉన్నాడు.

చేస్తాడులే.

ఏం చేయడం. అసలు అది ఉంటే కదా. కాలేజీకి వెళ్లే ఇద్దరు ఆడపిల్లలు, తల్లి, ముసలామె ఉన్న ఇంట్లో అది లేకుండా ఎలా ఉంటుంది అనే భరోసాతో పెళ్లికి ముందు మాటమాత్రం కూపీ లాగలేదు. పెళ్లయ్యాక చూస్తే అది ఉంది. కానీ తన ఇంట్లోదాని లాగా లేదు. నాలుగు గోతం పట్టాలు నాలుగువైపులా కట్టి, ఒక గోతం పట్టాను తలుపు లాగా వేలాడ దీసి.. ఇదా? లోపల ఒక మట్టిగొయ్యి... దానికి అటో కాలు... ఇటో కాలు వేసి కూచోడానికి ఇటుక రాళ్లు... ఆ గొయ్యిలో నిన్నటిదీ మొన్నటిదీ ....

డోక్... డోక్... పెళ్లికూతురికి వాంతులు.

ఆ తర్వాత కడుపు నొప్పి. వలీమాకు వచ్చిన పెళ్లికూతురు అత్తారింటి నుంచి మొదటి శుక్రవారం అయ్యేదాకా కదల కూడదు. ఈ అమ్మాయి వెళతానని కూచుంది. అన్నం తినదు. తింటే అది వస్తుందని చెప్పదు. కడుపునొప్పి అంటుంది. రాత్రయితే ఆడపడుచుని తీసుకొని తుప్పల్లోకి వెళ్లే సాహసం చేయగలదు. కాని ముస్లింలు అలా వెళ్లకూడదట. గోషా అట. చిన్నప్పుడు అల్లరి చేస్తే తల్లి నరకం గురించి చెప్పి భయపెట్టేది. తనకు మాత్రం నరకం అంటే ఆ నాలుగు గోతం పట్టాల మధ్య ఉన్నదే.

పూలంటే ఇష్టం పండ్లంటే ఇష్టం అని చెప్పాల్సిన కొత్త పెళ్లికూతురు నాకు సిమెంటుతో కట్టి నీటుగా ఉంచిన అదంటే ఇష్టం అని భర్తతో నోరు తెరిచి ఎలా చెప్తుంది. మీ ఇంట్లో అది అసయ్యంగా ఉంది అని ఎలా చెప్తుంది. ఇలా ఉంటే నేను ఉండను అని ఎలా చెప్తుంది.

‘మా ఇంటికి వెళ్తాను’ అంది.

ఏమనుకున్నాడో ఏమో పెళ్లికూతురిని తీసుకొని బయలుదేరాడు. ఇంకా బంధువులు పూర్తిగా వెళ్లలేదు. తననే చూస్తున్నారు. అత్తగారు మనసు విప్పి మాట్లాడలేదు. తననే చూస్తోంది. ఆడపడుచులు సరదాలు సల్లాపాలు చేయలేదు. తననే చూస్తున్నారు.

వెళుతోంది.

తిరిగి వస్తుందా?

మనసు గుర్రంలాగా పరుగు తీస్తోంది. వేరు కాపురం పెట్టించాలి. తన ఊరికే తీసుకెళ్లిపోయి అక్కడే పెట్టించాలి. అక్కడైతే ఇల్లుంది. ఇంట్లో అది ఉంది. అమ్మయ్య... అది ఉంటే కలిగే నిశ్చింత ఆడవాళ్లుగా పుడితే తప్ప తెలియదు. చెంబు పట్టుకుని నాకిప్పుడు అది వస్తోందహో అని ఊరందరికీ తెలిసేలా దారిలో నడవడం కంటే సిగ్గుతో చచ్చి భూమిలోకి పాతుకుపోవడమే మేలు అని ఈ మగవారికి ఎప్పటికి తెలుస్తుంది.

ఇల్లు వచ్చింది.

ఎలా ఉన్నావమ్మా– తల్లి ఎదురొచ్చింది.

అక్కా– చెల్లెలు పరిగెత్తింది.

కానీ నేరుగా వెళ్లి దానిలో దూరి తలుపు మూసుకుంది. కొత్తపెళ్లికూతురు పుట్టింట్లో మొదటగా దానినే పలకరించాల్సి రావడం కన్నా విషాదం ఉంటుందా?

రాత్రి మాటల్లో తెలిసింది. ఇల్లు ఖాళీ చేస్తున్నారట. పెళ్లికి అప్పు ఇచ్చినాయన తనఖా తీరేదాక ఇందులోనే ఉంటానని అంటున్నాడట.

‘మరి ఇప్పుడు?’

‘ఊరికి దూరంగా ఒక రేకుల ఇల్లు దొరికింది. చిన్నది.’

‘అందులో అది ఉందా?’

‘అదీ.. అదీ’..

జవాబు చెప్పబోతుంటే ఊపిరి బిగబట్టి ఉంది.

కథ ముగిసింది.

షాజహానా రాసిన ‘సండాస్’ కథ ఇది. అంటే ‘టాయిలెట్’ అని అర్థం.

‘టాయిలెట్ ఏక్ ప్రేమకథ’లాంటి సినిమాలు దానికి కారణమైన ఘటనలు దేశంలో జరగకముందే 2004లో షాజహానా ఈ కథ రాశారు. ఇవాళ ప్రభుత్వం సాయం చేస్తున్నా కడుతున్నానని అంటున్నా సవాలక్ష పల్లెల్లో ఆడవాళ్ల పరిస్థితి నేటికీ ఇదే. ఒకవేళ కట్టుకున్నా శుభ్రం చేసే చాకిరీ ఆడవాళ్లదే. ‘దానిని కడగటం తప్ప ఏ పనైనా’ అని పని మనుషులు పని మాట్లాడుకుంటున్నారిప్పుడు. దానిని కడగటం తప్ప ఏ పనైనా అని పెళ్లి మాట్లాడుకోగలుగుతున్నారా ఆడవాళ్లు?

పునః కథనం: **ఖదీర్**



స్క్రీన్ టెస్ట్

9 కార్తీ నటించిన మొదటి సినిమా 'పరుత్తివీరన్'. అందులో నటించిన హీరోయిన్‌కి నేషనల్ అవార్డు వచ్చింది. ఎవరా హీరోయిన్?
ఎ) త్రిష బి) ప్రియమణి
సి) రీమాసేన్ డి) ఆండ్రియా

16 'వచ్చిండే పిల్లా మెల్లగ వచ్చిండే క్రీమ్ బిస్కట్ వేసిండే..' పాట 'ఫిదా' చిత్రంలోనిది. ఈ పాట రచయిత ఎవరో తెలుసా?
ఎ) సుద్దాల అశోక్ తేజ బి) సిరివెన్నెల
సి) వనమాలి డి) కృష్ణచైతన్య

3 దర్శకుడు ఇ.వి.వి. సత్యనారాయణ తెలుగు తెరకు పరిచయం చేసిన విజయవాడ అమ్మాయి ఎవరో తెలుసా?
ఎ) రంభ బి) రోజా
సి) లయ డి) రవళి

1 మహేశ్‌బాబు హీరో కాకముందు బాల నటుడిగా ఎన్ని సినిమాల్లో నటించాడో తెలుసా?
ఎ) 6 బి) 5 సి) 9 డి) 4

11 'అల్లరి' నరేశ్ తన తర్వాతి చిత్రంలో మొదటిసారి ఓ ప్రముఖ హీరోకి సోదరుడిగా నటిస్తున్నాడు. ఎవరా హీరో కనుక్కోండి?
ఎ) మహేశ్‌బాబు బి) యన్టీఆర్
సి) నాని డి) రవితేజ

6 టాలీవుడ్‌లో వీఎఫ్‌ఎక్స్ (గ్రాఫిక్స్) స్టూడియోను ప్రారంభించిన హీరో ఎవరో తెలుసా?
ఎ) ఉదయ్‌కిరణ్
బి) కల్యాణ్‌రామ్
సి) నితిన్ డి) మంచు విష్ణు

15 ప్రత్యూష ఫౌండేషన్ అనే సేవాసంస్థ ద్వారా తన సహాయ సహకారాల్ని అందిస్తున్న టాలీవుడ్ టాప్ హీరోయిన్?
ఎ) అనుష్క శెట్టి బి) సమంతా అక్కినేని
సి) రకుల్‌ప్రీత్ సింగ్ డి) శ్రుతీహాసన్

4 కోటా శ్రీనివాసరావు, బాబుమోహన్‌లది చాలా క్రేజీ కాంబినేషన్. ఏ చిత్రం ద్వారా ఈ కాంబినేషన్ ఫేమస్ అయ్యిందో తెలుసా?
ఎ) మామగారు బి) చినరాయుడు
సి) ఆ ఒక్కటీ అడక్కు డి) మాయలోడు

19 ఏఎన్నార్, వాణిశ్రీ నటించిన ఈ స్టిల్ ఏ సినిమాలోనిది?
ఎ) ప్రేమనగర్
బి) ప్రేమాభిషేకం
సి) ప్రేమ
డి) ప్రేమంటే ఇదేరా

12 తమన్నా ట్విట్టర్ ఐడీ ఏంటో చెప్పుకోండి చూద్దాం?
ఎ) ఐ తమన్నా బి) యువర్స్ తమన్నా
సి) తమన్నా స్పీక్స్ డి) తమన్నాభాటియా

14 'అర్జున్‌రెడ్డి' తెలుగు సినిమాను తమిళ్‌లో 'వర్మ' అనే పేరుతో రీమేక్ చేస్తున్నారు. ఇందులో హీరోగా నటిస్తోన్న ధృవ్ ఓ ప్రముఖ హీరో కొడుకు. ఎవరా హీరో?
ఎ) విక్రమ్
బి) అర్జున్ సర్జా
సి) కార్తీక్ డి) ప్రభు

7 'దిల్' సినిమా నిర్మించటం ద్వారా వెంకటరమణారెడ్డి 'దిల్ రాజు' అయ్యాడు. మరి 'దిల్' సినిమా దర్శకుడెవరో చెప్పుకోండి?
ఎ) బోయపాటి శ్రీను బి) సుకుమార్ సి) వీవీ వినాయక్ డి) వంశీ పైడిపల్లి

5 'మనసుగతి ఇంతే.. మనిషి బతుకింతే.. మనసున్న మనిషికి సుఖము లేదింతే..' పాట రచయిత ఎవరో తెలుసా?
ఎ) ఆత్రేయ బి) కొసరాజు
సి) దాశరథి డి) ఆరుద్ర

10 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' చిత్రంలో అల్లు అర్జున్ ఏ పాత్రను పోషిస్తున్నాడో తెలుసా?
ఎ) ఆర్మీ ఆఫీసర్ బి) పైలెట్
సి) పోలీసాఫీసర్ డి) నేవల్ ఆఫీసర్

17 'సైరా నరసింహారెడ్డి' చిరంజీవికి 151వ చిత్రం. ఈ చిత్రకథ ఏ తెలుగు ప్రాంతానికి చెందిన కథో తెలుసా?
ఎ) రాయలసీమ బి) కోనసీమ
సి) తెలంగాణ డి) ఉత్తరాంధ్ర

20 ఈ ఫొటోలో ఉన్న బాలనటుడు, ఇప్పటి హీరో ఎవరో గుర్తుపట్టగలరా?
ఎ) కమల్‌హాసన్
బి) అల్లు అర్జున్
సి) తరుణ్
4) మహేశ్‌బాబు

2 హీరో రామ్ 'దేవదాసు' చిత్రం ద్వారా హీరోగా పరిచయమయ్యాడు. అదే సినిమా ద్వారా పరిచయమైన హీరోయిన్ ఎవరు?
ఎ) కాజల్ అగర్వాల్
బి) హన్సిక సి) షీలా
డి) ఇలియానా

18 నటి ఖుష్బూను తెలుగు చిత్రసీమకు పరిచయం చేసిన దర్శకుడెవరో తెలుసా?
ఎ) ఎ.కోదండరామిరెడ్డి
బి) కె.రాఘవేంద్రరావు సి) బి.గోపాల్ డి) కోడి రామకృష్ణ

8 శ్రీకాంత్ నటించిన ఓ సినిమాకు హీరో నాని అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశాడు. ఆ సినిమా పేరేంటి?
ఎ) ఆపరేషన్ దుర్యోధన బి) రాధాగోపాళం
సి) కౌసల్య సుప్రజ రామ
డి) శ్రీకృష్ణ 2006

13 విఘ్నేశ్ శివన్ అనే తమిళ దర్శకుడు తెలుగులో చాలామంది టాప్ హీరోలతో నటించిన హీరోయిన్‌తో లవ్‌లో ఉన్నాడు. ఆ మలయాళ కుట్టి ఎవరో కనుక్కోండి చూద్దాం?
ఎ) మమతా మోహన్‌దాస్ బి) నివేథా థామస్
సి) నయనతార డి) అనుపమ పరమేశ్వరన్

సమాధానాలు
1) సి 2) డి 3) ఎ 4) ఎ
5) ఎ 6) డి 7) సి 8) బి
9) బి 10) ఎ 11) ఎ 12) సి
13) సి 14) ఎ 15) బి
16) ఎ 17) ఎ 18) బి
19) ఎ 20) సి

మీరు 6 సమాధానాల కంటే తక్కువ చెబితే...
- మీకు సినిమా అంటే ఇష్టం

10 సమాధానాల వరకూ చెప్పగలిగితే...
- మీకు సినిమా అంటే ఇంట్రెస్ట్

15 సమాధానాల వరకూ చెప్పగలిగితే...
- మీకు సినిమా అంటే పిచ్చి

20 సమాధానాలూ చెప్పగలిగితే...
- ఇంకోసారి ఈ క్విజ్ చదవకండి!

నిర్వహణ: **శివ మల్లాల**

కొత్త సినిమా అంటే కొత్త ఎగ్జైట్‌మెంట్ వస్తుంది

- సాయి శ్రీనివాస్



వై.శ్రీనివాసరావు, బెల్లంకొండ శ్రీనివాస్, నవీన్, ఛోటా కె.నాయుడు, శ్రీనివాస్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా వంశధార క్రియేషన్స్ పతాకంపై నవీన్ శొంఠినేని (నాని) నిర్మాణంలో శ్రీనివాస్ దర్శకునిగా పరిచయమవుతున్న సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. ప్రముఖ దర్శకుడు వీవీ వినాయక్ క్లాప్ ఇచ్చారు. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కెమెరా స్విచ్చాన్ చేశారు. తొలి సన్నివేశానికి తెలంగాణ ఎఫ్‌డీసీ చైర్మన్ పి. రామ్మోహన్‌రావు గౌరవ దర్శకత్వం వహించారు. సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ– ''కొత్త సినిమా అంటే కొత్త ఎగ్జైట్‌మెంట్ వస్తుంది. నవీన్‌గారితో సినిమా చేయాలని ఎప్పటినుంచో అనుకుంటున్నాను. చాలా కథలు విన్నాం. దర్శకుడు శ్రీనివాస్ చెప్పిన కథ నచ్చింది. ఈ సినిమా డిఫరెంట్‌గా ఉంటుంది. 'అల్లుడు శీను' చిత్రం తర్వాత ఛోటాగారితో, తమన్‌తో తొలిసారి వర్క్ చేయబోతున్నందుకు హ్యాపీ'' అన్నారు. ''మా బ్యానర్‌లో వస్తున్న తొలి చిత్రమిది. కథ, కాన్సెప్ట్ కొత్తగా ఉంటాయి. కాంప్రమైజ్ కాకుండా నిర్మిస్తాం'' అన్నారు నవీన్. ''రొమాంటిక్ థ్రిల్లర్ చిత్రమిది. కథను నమ్మి అవకాశం ఇచ్చిన బెల్లంకొండ సురేశ్‌గారికి కృతజ్ఞతలు. నా పై నమ్మకంతో మంచి టీమ్‌ను అందించిన నిర్మాతలకు ధన్యవాదాలు. దర్శకునిగా నా ప్రయాణం స్టార్ట్ చేయడానికి కారణమైన నవీన్, శాంతయ్య, సాయి శ్రీనివాస్‌కు థ్యాంక్స్. పెద్ద దర్శకులతో పనిచేసిన బెల్లంకొండ శ్రీనివాస్ కొత్త డైరెక్టర్ అయిన నాతో సినిమా చేయడానికి ఒప్పుకున్నారు. మార్చి 2 నుంచి షూటింగ్ స్టార్ట్ చేయాలనుకుంటున్నాం. ఈ సినిమాలో ఇద్దరు ప్రముఖ హీరోయిన్స్ ఉంటారు'' అన్నారు. ''కో–డైరెక్టర్‌గా ఎప్పటినుంచో శ్రీనివాస్ నాకు తెలుసు. కొత్తగా అద్భుతమైన కథ చెప్పారు. టీమ్ అందరికీ మంచి పేరు తెచ్చేలా ఈ సినిమా ఉంటుంది'' అన్నారు కెమెరామెన్ ఛోటా కె. నాయుడు. యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ– ''బెల్లంకొండ సురేశ్ మంచి సినిమాలను నిర్మించారు. ఆయన తనయుడు శ్రీనివాస్ నటిస్తున్న ఈ సినిమా వంద రోజులు ఆడాలి. వంశధార క్రియేషన్స్ పతాకంపై రూపొందుతున్న ఈ తొలి సినిమా హిట్ సాధించాలి'' అన్నారు.

అందుకే డైరెక్టర్ పేరు వేయలేదు!

''ఇంతకుముందు మొహమాటానికి కొన్ని సినిమాలు ఒప్పుకున్నాను. ఇప్పుడు ఒప్పుకోవడం లేదు. నాకు ఇష్టం అయితే సినిమా చేస్తాను. హీరోగా చేస్తా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా చేస్తా, విలన్‌గా చేస్తా. డెస్టినీ ఎటు తీసుకెళ్తే అటు వెళ్తా. హీరోగా మంచి హిట్స్ ఉన్నప్పుడు కూడా నటుడిగా డిఫరెంట్ క్యారెక్టర్స్ చేశాను. ఇప్పుడు ఇండస్ట్రీలో నేనున్న పొజిషన్‌పై హ్యాపీగానే ఉన్నాను'' అన్నారు శ్రీకాంత్. శ్రీ మిత్ర చౌదరి సమర్పణలో శ్రీకాంత్, నాజియా హీరోహీరోయిన్లుగా విజి చరిష్ విజన్స్ పతాకంపై విజయ్ నిర్మించిన 'రా..రా' చిత్రం ఈ రోజు విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన పాత్రికేయుల సమావేశంలో శ్రీకాంత్ చెప్పిన విశేషాలు...

- నా కెరీర్‌లో 'రా..రా' సినిమా 125వ మూవీ అనుకుంటున్నాను. తొలిసారి ఎంటర్‌టైన్మెంట్ మిక్స్ ఉన్న హారర్ జోనర్‌ను టచ్ చేశాను. నిర్మాతలు నా మిత్రులే. అగ్రిమెంట్ పరంగా డైరెక్టర్‌కు, నిర్మాతలకు అభిప్రాయభేదాలు వచ్చాయి. అందుకే రిలీజ్ పోస్టర్స్‌పై దర్శకుని పేరు లేదు. సమస్యను సాల్వ్ చేయడానికి ట్రై చేశాం. కుదర్లేదు. ఏ సినిమాకైనా నిర్మాత ముఖ్యమని నేను భావిస్తాను. కథ వేరే రేంజ్‌లో ఉంటుంది. ఒక పెద్ద పేరున్న డైరెక్టర్ ఈ సినిమాను టేకప్ చేశారు. పేరొద్దన్నారు. సినిమా హిట్టైనా, ఫ్లాప్ అయినా ఆయన పేరు వేసుకోవద్దనుకున్నారు.
- కథ విషయానికొస్తే.. మూవీ డైరెక్టర్‌గా ఉన్న నేను తెలియక దెయ్యాన్ని ప్రేమిస్తాను. అప్పుడు ఏం జరిగింది అనేదే స్క్రీన్‌పై సూపర్‌గా ఉంటుంది. ఇందులో మూడు పాటలున్నాయి. ర్యాప్‌రాక్ షకీల్ మంచి సంగీతం అందించారు. సినిమా చూశాను. అవుట్‌పుట్ పట్ల ఫుల్ హ్యాపీ. 'ఆపరేషన్–2019'కి కూడా షకీల్ స్వరకర్త.
- కృష్ణవంశీగారితో తప్పకుండా సినిమా ఉంటుంది. ఎప్పుడనేది చెప్పలేను. ఫెయిల్యూర్స్ వచ్చాయని స్నేహితులను దూరం చేసుకోను. 'శ్రీనివాస కళ్యాణం' సినిమాలో నేను నటించడానికి చర్చలు జరిగాయి. ప్రస్తుతానికైతే నేను చేయడం లేదు. నేను విలన్‌గా చేసిన 'యుద్ధం శరణం' సినిమా నిరాశ పరిచింది. నిరుత్సాహపడ్డాను. ఆ తర్వాత కూడా విలన్‌గా ఆఫర్స్ వచ్చాయి. కానీ చేయలేదు.
- హిందీ, తమిళ్, తెలుగు, కన్నడ భాషల్లో ప్రభుదేవా ముఖ్యపాత్రలో రూపొందుతున్న సినిమాలో నా మూడో అబ్బాయి రోహన్ నటిస్తున్నాడు. కన్నడలో వేరే వాళ్లు కనిపిస్తారు. ఇప్పుడు షూటింగ్ కోసం రోహన్ ఊటీలో ఉన్నాడు. నేను, రోహన్ ఓ సినిమా చేయాల్సింది.. కుదర్లేదు.
- ప్రస్తుతం యాక్టింగ్‌లో డిప్లొమా చేస్తున్నాడు రోషన్. నెక్ట్స్ సినిమా చేయడానికి టు ఇయర్స్ టైమ్ పడుతుంది. 'నిర్మలా కాన్వెంట్' సినిమా రోషన్‌లో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. యాక్టింగ్ మీద మరింత ఆసక్తి పెరిగింది. మా అమ్మాయి బాగా చదువుకుంటుంది. స్పోర్ట్స్ బాగా ఆడుతోంది. ఎవరి డెస్టినీ ఎలా ఉంటుందో ముందే ఊహించలేం.
- 'ఆపరేషన్ 2019' పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే సినిమా. కరణం బాబ్జీ దర్శకుడు. ఏ పార్టీని టార్గెట్ చేయడం లేదు. వివాదాలు తలెత్తకుండా తెరకెక్కిస్తున్నాం. ఇందులో హీరో మంచు మనోజ్ పోలీసాఫీసర్‌గా గెస్ట్ రోల్ చేయనున్నారు. కన్నడలో సుదీప్, శివరాజ్‌కుమార్ కలిసి నటిస్తున్న సినిమాలో విలన్‌గా చేస్తున్నాను. కన్నడలో ఆఫర్స్ వచ్చాయి. కానీ టాలీవుడ్ నా ఇంట్రెస్ట్.



శ్రీకాంత్



హరీష్ శంకర్

సీటీమార్.. సీటీ మార్

'దువ్వాడ జగన్నాథమ్' సినిమాలోని 'సీటీమార్.. సీటీమార్' పాట ఎంత పాపులర్ అయ్యిందో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ఆ పాటలో అల్లు అర్జున్, పూజా హెగ్డే ఏ రేంజ్‌లో సందడి చేశారో తెలిసిందే. ఆ హిట్ సాంగ్‌లోని 'సీటీమార్ ' టైటిల్‌తో ఓ సినిమా తెరకెక్కనుంది. 'దువ్వాడ జగన్నాథమ్' చిత్రదర్శకుడు హరీష్ శంకర్ ఈ 'సీటీమార్' సినిమాకి దర్శకుడు. ప్రస్తుతం నిర్మాత 'దిల్' రాజు బ్యానర్‌లో చేయనున్న 'దాగుడుమూతలు' సినిమా స్క్రిప్ట్ పనుల్లో బిజీగా ఉన్నారు హరీష్. ఈ సినిమాకి గుమ్మడికాయ కొట్టగానే 'సీటీమార్' సినిమాకి కొబ్బరికాయ కొడతారు. అరుణాచల్ క్రియేషన్స్ పతాకంపై సాయిధరమ్ తేజతో 'జవాన్' సినిమా నిర్మించిన కొమ్మలపాటి కృష్ణ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. వరుస విజయాలు సాధిస్తున్న ఓ యువ కథానాయకుడు ఈ సినిమాలో హీరోగా నటించనున్నారు. త్వరలోనే నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను తెలియజేయనున్నట్లు ప్రకటించింది చిత్రబృందం.

టైటిల్ క్యాచీగా ఉంది

- ఎన్.శంకర్

''మనం తరచుగా వాడే పదం 'వాడేనా'ని టైటిల్‌గా పెట్టడం క్యాచీగా ఉంది. ఈ సినిమా ట్రైలర్, సాంగ్స్, ఆర్.ఆర్ బాగున్నాయి. టైటిల్ ఇంట్రెస్ట్‌గా ఉంటే సినిమాపై క్యూరియాసిటీ పెరుగుతుంది. సినిమా తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుందని ఆశిస్తున్నా'' అని దర్శకుడు ఎన్. శంకర్ అన్నారు. శివ తాండేల్, నేహా దేశ్‌పాండే జంటగా సాయిసునీల్ నిమ్మల దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా 'వాడేనా'. ఓం సాయిరామ్ సమర్పణలో మణిపాల్ మచ్చి అండ్ సన్స్ నిర్మిస్తున్నారు. కిరణ్ వెన్న స్వరపరచిన ఈ చిత్రం పాటలను ఎన్.శంకర్ విడుదల చేశారు. నిర్మాత రాజ్ కందుకూరి ట్రైలర్ ఆవిష్కరించారు. సాయిసునీల్ నిమ్మల మాట్లాడుతూ– ''ఎన్.శంకర్‌గారిని చూసి ఇన్‌స్పైర్ అయ్యా. రాజ్ కందుకూరిగారి 'పెళ్ళిచూపులు' సినిమాను 22 సార్లు చూసి ఎంతో నేర్చుకున్నా. అందుకే వీరిద్దరినీ ఈ వేడుకకు పిలిచాం. నేను ఎవరి దగ్గరా అసిస్టెంట్‌గా పని చేయలేదు. సినిమాలు చూసి, చాలామందిని స్ఫూర్తిగా తీసుకుని 'వాడేనా' చేశా. నేను దర్శకత్వం వహించడంతో పాటు 4పాటలు రాశా. కొరియోగ్రఫీ కూడా చేశా. మంచి విషయం ఉన్న చిత్రంగా నిలిచిపోతుంది'' అన్నారు. నిర్మాతలు ధృవ్, మణిపాల్ మచ్చి, శివ తాండేల్, నేహా దేశ్‌పాండే తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: డి.ఆర్. వెంకట్.



సాయిసునీల్, నేహా, ఎన్.శంకర్, మణిపాల్, రాజ్ కందుకూరి, శివ తాండేల్

10,000 ఏళ్ల భారీ గడియారం

- పశ్చిమ టెక్సాస్‌లోని కొండల్లో నిర్మాణం
- మానవాళిని హెచ్చరించేందుకే అంటున్న బిజోస్



పశ్చిమ టెక్సాస్‌లో గడియారాన్ని అమరుస్తున్న సిబ్బంది

వాషింగ్టన్: ఆన్‌లైన్ మార్కెటింగ్ దిగ్గజం అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బిజోస్ సంచలన ప్రకటన చేశారు. అమెరికాలోని పశ్చిమ టెక్సాస్ పర్వతాల్లో 10,000 సంవత్సరాల వరకూ పనిచేసే భారీ గడియారాన్ని(క్లాక్‌ఆఫ్ లాంగ్ నౌ) రూపొందిస్తున్నట్లు బిజోస్ తెలిపారు. దాదాపు 500 అడుగులు ఎత్తుండే ఈ గడియారానికి భూమి థర్మో సైకిల్స్ ఆధారంగా శక్తి చేకూరుతుందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టుపై గత 30 ఏళ్లుగా పనిచేస్తున్నామనీ, ప్రస్తుతం టెక్సాస్ కొండల్లో ఈ గడియారాన్ని అమర్చే ప్రక్రియ శరవేగంగా సాగుతోందని పేర్కొన్నారు. 'ఇది ప్రత్యేకమైన గడియారం. దీర్ఘకాలిక ఆలోచనకు గుర్తుగా, చిహ్నంగా దీన్ని రూపొందిస్తున్నాం'అని బిజోస్ తెలిపారు. ఈ గడియారం నిర్మాణానికి సంబంధించి ఓ వీడియోను ఆయన ట్విటర్‌లో పోస్ట్ చేశారు.

ప్రత్యేకత ఏంటి...

అమెరికాకు చెందిన డ్యాని హిల్లీస్ 1989లో భారీ గడియారాన్ని నిర్మించాలన్న ఆలోచన చేశారు. జెఫ్ బిజోస్ చేరికతో భారీ గడియారం ప్రాజెక్టు వాస్తవరూపం దాల్చింది. అమెరికాలోని టెక్సాస్ కొండల్లో రూ.272.20 కోట్లతో నిర్మిస్తున్న ఈ భారీ గడియారంలో సమయాన్ని అత్యంత కచ్చితత్వంతో లెక్కించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రతిరోజూ మధ్యాహ్నం సూర్యకాంతి సాయంతో ఈ గడియారం తన సమయాన్ని సరిచేసుకుంటుంది. ఈ గడియారం సమయాన్ని గ్రెగొరియన్ పద్ధతిలో, 5 అంకెల రూపంలో తెలుపుతుంది. అంటే 2018ని ఈ గడియారం 02018గా సూచిస్తుంది. ఇందులోని ఓ ముల్లు ఏడాదికోసారి మాత్రమే కదిలితే.. మరో ముల్లు ప్రతి వందేళ్లకోసారి మాత్రమే ముందుకెళ్తుంది. ప్రతి 1,000 ఏళ్లకు ఓసారి కూకూ(పక్షిలాంటి నిర్మాణం) బయటికొచ్చేలా ఈ గడియారంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అత్యంత కచ్చితత్వంతో పనిచేసేలా రూపొందించడంతో ప్రతి 20 వేల ఏళ్లలో ఒక రోజు మాత్రమే తేడా వస్తుంది. ఈ భారీ గడియారానికి ఇంకో ప్రత్యేకత కూడా ఉంది. వచ్చే 10,000 ఏళ్ల పాటు ప్రతిరోజూ మధ్యాహ్నం ఈ గడియారంలో గంట మోగుతుంది. అయితే ఓసారి మోగిన గంట స్వరం వచ్చే 10 వేల ఏళ్లలో ఎన్నడూ పునరుక్తి కాకుండా దీని రూపకర్తలు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు.

ఎందుకు రూపొందిస్తున్నారు

గ్లోబల్ వార్మింగ్, సహజవనరుల విచ్చలవిడి వాడకంతో భవిష్యత్ తరాలపై మనవల్ల కలిగే దుష్పరిణామాలపై హెచ్చరించేందుకు, మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించేందు వీలుగా ఈ గడియారాన్ని బిజోస్ నిర్మిస్తున్నారు. అంతేకాకుండా ప్రపంచవ్యాప్తంగా చాలా నాగరికతలు 10,000 ఏళ్లలోపే అంతమైన నేపథ్యంలో ఈ గడియారంలో జీవితకాలాన్ని 10 వేల ఏళ్లుగా నిర్ణయించారు. అయితే టెక్సాస్‌లోని ఈ భారీ గడియారం దగ్గరకు చేరుకోవాలంటే మాత్రం అంత సులభమైన విషయం కాదు. ఎందుకంటే సమీపంలోని విమానాశ్రయం నుంచి ఇక్కడకు చేరుకోవాలంటే కొన్ని గంటల పాటు కారులో ప్రయాణించాల్సి ఉంటుంది. అక్కడికి చేరుకున్నాక దాదాపు రెండు వేల అడుగులు కొండపైకి కాలినడకన వెళ్లాల్సి ఉంటుంది. చివరికి భారీ స్టీల్ తలుపులు దాటుకుని వెళ్తే ఈ భారీ గడియారాన్ని చూడొచ్చు.

పోలీస్ స్టేషన్ ఎదుటే రాళ్ల దాడి

- హాస్టల్ నిర్వాహకులు, విద్యార్థుల మధ్య ఘర్షణ
- విలేకరులపై దాడి, కెమేరా ధ్వంసం



పెనమలూరులో రాళ్లతో దాడి చేసుకుంటున్న రెండు వర్గాలు



ధర్నా చేస్తున్న విలేకరులు

పెనమలూరు: కృష్ణా జిల్లా, పెనమలూరు పోలీస్‌స్టేషన్ ఎదుట గురువారం రెండు వర్గాల వారు రాళ్లతో దాడి చేసుకున్నారు. అసలేం జరుగుతుందో తెలియక పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న వారు భయంతో పరుగులుదీశారు. కృష్ణా జిల్లా, పెనమలూరు మండలం, కానూరు గ్రామంలో సాయిచలపతి హాస్టల్ ఉంది. గతంలో ఈ హాస్టల్లో ఉన్న విద్యార్థి సూర్యవంశీ ఖాళీ చేసి వెళ్లే సమయంలో రూ.1400 బాకీ ఉన్నాడు. బాకీ సొమ్ము కోసం హాస్టల్ నిర్వాహకురాలు బాగం శ్రీలత బుధవారం సూర్యవంశీని నిలదీసి, సెల్‌ఫోన్ లాక్కున్నారు. దీంతో సూర్యవంశీ, మరో ఇద్దరు విద్యార్థులు ముస్తాఫా, భార్గవ్‌లు హాస్టల్ వద్దకెళ్లి నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఇరు వర్గాలవారు పోలీసులకు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు.

పోలీస్‌స్టేషన్ ఎదుటే..

బాధిత విద్యార్థి ఓ చానెల్ విలేకరులకు ఫోన్ చేయడంతో వారు గురువారం హాస్టల్ వద్దకెళ్లి అక్కడ వివరాలు చిత్రీకరించి పెనమలూరు పోలీస్ స్టేషన్ వద్దకొచ్చారు. శ్రీలత, ఆమె భర్త సాయిప్రసాద్ మరి కొందరు వచ్చి విలేకరులపై దాడికి దిగి, కెమేరాను ధ్వంసం చేశారు. దీంతో విద్యార్థులు, హాస్టల్ నిర్వాహకులు ఘర్షణపడ్డారు. అక్కడే ఉన్న గుట్టలోని రాళ్లతో పరస్పరం దాడులు చేసుకున్నారు. పోలీస్‌స్టేషన్ ఎదురుగానే ఇదంతా జరుగుతుంటే.. అక్కడ ఉన్న జనాలు భయంతో పరుగులు దీశారు. ఏసీపీ సత్యానందం, సీఐ దామోదర్ సిబ్బందిని రంగంలోకి దింపి హాస్టల్ నిర్వాహకులు, విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. తమపై అన్యాయంగా దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలంటూ విలేకరులు ధర్నాచేస్తుండగా.. జాయింట్ సీపీ కాంత్రిరాణా టాటా, డీసీపీ గజారావ్‌భూపాల్, ఏసీపీ సత్యానందం, సీఐ దామోదర్‌లు వారితో మాట్లాడారు. హాస్టల్ నిర్వాహకులపై కేసు నమోదుచేశారు.

ఏఎన్‌యూ దూరవిద్య పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రం గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన హెచ్‌ఐవీ డిప్లొమా కోర్సు, ఎమ్మెస్సీ మ్యాథమాటిక్స్, మైక్రోబయాలజీ, కెమిస్ట్రీ, హెచ్‌ఐవీ (కౌన్సెలింగ్) కోర్సుల పరీక్షా ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. ఈ ఫలితాలను www.anucde.info వెబ్‌సైట్‌లో పొందవచ్చని ఆ పరీక్షల విభాగం డిప్యూటీ రిజిస్ట్రార్ జాన్సన్ తెలిపారు. విద్యార్థులు రీవాల్యుయేషన్ ఫీజును మార్చి 7వ తేదీలోగా ఒక్కో పేపర్‌కు రూ.960 చెల్లించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

సెన్సార్ బేసిక్ టెక్నాలజీతో

పశుపోషణ లాభదాయకం

ఎస్వీయూ పాలకవర్గ సభ్యులు ప్రొ.జగదీశ్వరరావు

గన్నవరం: పశువుల్లో వచ్చే అనారోగ్య సమస్యలను సెన్సార్ బేసిక్ టెక్నాలజీ ద్వారా ముందుగానే గుర్తించవచ్చని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పాలకవర్గ సభ్యులు ప్రొఫెసర్ ఎస్.జగదీశ్వరరావు తెలిపారు. కృష్ణా జిల్లా గన్నవరంలోని ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల్లో శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం, పశుగణక్షేత్ర సముదాయ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ''పశు యాజమాన్యం–అధునిక పద్ధతులు''పై శిక్షణ కార్యక్రమాన్ని అసోసియేట్ డీన్ డాక్టర్ జి.శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలకు చెందిన వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్లు, పశువైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీశ్వరరావు మాట్లాడుతూ.. పశుపోషణలో ప్రస్తుతం వస్తున్న మార్పులకు అనుగుణంగా యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా లాభసాటిగా మార్చుకోవచ్చని సూచించారు. పశుగణక్షేత్ర సముదాయ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్.వెంకటశేషయ్య మాట్లాడుతూ... సెన్సార్ బేసిక్ టెక్నాలజీలో రూమెన్ బోలస్‌ను పశువు కడుపులోకి పంపించడం ద్వారా శరీరంలోని మార్పులను 24 గంటలు పాటు పర్యవేక్షించవచ్చని తెలిపారు. శరీరంలోని ఉష్ణోగ్రతలు, పొదుగు వ్యాధులు, అజీర్తి, అంటువ్యాధులను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు తీసుకోవచ్చని చెప్పారు. దీని వల్ల ఖర్చులు కూడా తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మాంస ఉత్పత్తి అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రకాష్‌నాయుడు, ప్రొఫెసర్లు డాక్టర్ వైకుంఠరావు, డాక్టర్ ధర్మారావు, డాక్టర్ సౌజన్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

చారిత్రక కట్టడాల పరిరక్షణకు నిధులివ్వండి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని కేంద్ర పురావస్తుశాఖ పరిధిలో ఉన్న చారిత్రక కట్టడాల పరిరక్షణకు నిధులు విడుదల చేయాలని అఖిల భారత పంచాయితీ పరిషత్ జాతీయ కార్యదర్శి జాస్తి వీరాంజనేయులు కోరారు. గురువారం ఢిల్లీలో కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ ఉషా శర్మను కలసి ఈ మేరకు ఆయన వినతి పత్రం అందజేశారు. గుంటూరు జిల్లాలోని నాగార్జునకొండ, అమరావతి, వైఎస్సార్ జిల్లాలోని గండికోట వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ అభివృద్ధి పనులకు సంబంధించి నివేదిక వచ్చాక నిధులు మంజూరు చేస్తామని ఉషాశర్మ హామీ ఇచ్చారని వీరాంజనేయులు తెలిపారు.

పేదల బియ్యం ప్రతిచోటా పక్కదారి

అధికారులపై మంత్రి ప్రత్తిపాటి ఆగ్రహం



గుంటూరు వెస్ట్: రేషన్ షాపుల ద్వారా పేదలకు ఇస్తున్న బియ్యం ప్రతి ప్రాంతంలోనూ పక్కదారి పడుతోందని పౌర సరఫరాలశాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. ఈ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి రైస్ మిల్లుల్లో విక్రయించడం తమ దృష్టికి వచ్చిందన్నారు. చౌక ధరల దుకాణాల పట్ల 1100 కాల్ సెంటర్‌కు అందుతున్న ఫిర్యాదుల ప్రకారం కేవలం 50 శాతం మంది మాత్రమే సంతృప్తి వ్యక్తం చేయటంతో అధికారులు ఏం చేస్తున్నారంటూ మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం గుంటూరు కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. అధికారులు ప్రజా పంపిణీ వ్యవస్థను పట్టించుకోకపోవడమే దీనికి కారణమన్నారు. జాయింట్ కలెక్టర్ల అలసత్వం కొట్టొచ్చినట్టు కనిపిస్తోందన్నారు. మార్చి నుంచి బియ్యంతో పాటు పంచదార, కందిపప్పు కూడా సరఫరా చేస్తామన్నారు.

వారం తెరవకుంటే డీలర్ షిప్ రద్దు

రాష్ట్రంలో 50 శాతం రేషన్ దుకాణాలు సమయపాలన పాటించడం మంత్రి పుల్లారావు చెప్పారు. కొందరు డీలర్లు ప్రజలతో అమర్యాదగా మాట్లాడుతున్నారన్నారు. ఇక నుంచి ఒక రోజు రేషన్ దుకాణం తీయకపోతే రూ.వెయ్యి, రెండు రోజులు తీయకపోతే రూ.1,500 మూడు రోజులు తీయకపోతే రూ.2,000 అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు. వారం రోజులు దుకాణం తెరవకుంటే డీలర్ షిప్ రద్దు చేయాలని ఆదేశించారు. జూన్ 30 నాటికి రాష్ట్రంలో 6,500 చంద్రన్న మాల్స్ నెలకొల్పాలని సూచించారు. ఖాళీగా ఉన్న రేషన్ దుకాణాలను రోస్టర్ పద్ధతిలో భర్తీ చేస్తామన్నారు. అలసత్వం వహించే అధికారులపై కఠిన చర్యలుంటాయన్నారు. సమావేశంలో పౌర సరఫరాల శాఖ ఎండీ రామ్‌గోపాల్, డైరెక్టర్ రవిబాబు, జాయింట్ కలెక్టర్ ముంగా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్ని గుండెకు పెద్ద కష్టం



బిడ్డను ఎత్తుకుని రోదిస్తున్న తల్లి లక్ష్మీ

ప్రొద్దుటూరు క్రైం: తల్లి కడుపులో ఉండగానే ఆ శిశువుకు కష్టాలు మొదలయ్యాయి.. గుండె సంబంధిత వ్యాధితో ఆ పసికందులో ఎదుగుదల లోపించింది. ఇప్పుడా పాపకు 11 నెలలు. అయినా అదే పరిస్థితి. బోసి నవ్వులతో కళకళలాడాల్సిన ఆ ఇంట్లో తీవ్ర మనోవేదన ఆవరించింది. బిడ్డను బతికించుకునేందుకు ఆ తల్లిదండ్రులకు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం అడ్డొచ్చింది. ఏపీకి చెందిన వారికి ఆరోగ్యశ్రీ వర్తించదని హైదరాబాద్ డాక్టర్లు చెబుతుండడంతో వారిప్పుడు దాతల సాయాన్ని అర్థిస్తున్నారు. వైఎస్సార్ జిల్లా రాజుపాళెం మండలం పొట్టిపాడు గ్రామానికి చెందిన లక్ష్మి, రాజయ్య దంపతులకు కీర్తన (3), చిన్ని కీర్తన (11 నెలలు) అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రెండో పాప గుండెకు రంధ్రాలు ఉన్నాయని డాక్టర్ చెప్పడంతో తల్లిదండ్రులు హతాశులయ్యారు. రెండోసారి గర్భం ధరించిన లక్ష్మి చెకప్ కోసం 7వ నెలలో ఆస్పత్రికి వెళ్తే.. బిడ్డ పెరగలేదనే విషయం డాక్టర్ చెప్పారు. 9వ నెలలోనూ ఇదే పరిస్థితి గుర్తించారు. బిడ్డ పెరగకపోవడానికి గుండెకు సమస్య ఉన్నట్టు అనుమానంగా ఉందని డాక్టర్ చెప్పారు. అనంతరం ఆమె ఆడ శిశువును జన్మనిచ్చింది. పరిశీలించిన డాక్టర్ గుండెకు రెండు రంధ్రాలున్నాయని.. చెడు రక్తం, మంచి రక్తం కలిసి గుండెలో ప్రవహిస్తున్నాయని.. దీనివల్లే బిడ్డలో ఎదుగుదల లేదని తేల్చారు.

ఏపీ వారికి ఆరోగ్యశ్రీ వర్తించదని చెప్పారు

ఈ నేపథ్యంలో వైద్యుల సూచన మేరకు లక్ష్మీ దంపతులు చిన్ని కీర్తనను హైదరాబాద్‌లోని కేర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చిన్నారికి పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు ఆపరేషన్ జనవరిలో చేస్తామని చెప్పారు. ఆ సమయంలో బిడ్డకు జ్వరం, జలుబు తీవ్రంగా ఉండటంతో 20 రోజుల తర్వాత వస్తే ఆపరేషన్ చేస్తామన్నారు. మళ్లీ వెళ్తే.. ఏపీ వారికి ఆరోగ్యశ్రీ ఆపరేషన్లు చేయబోమని, ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీచేసిందని పేర్కొనడంతో వారికి ఏం చేయాలో పాలుపోలేదు. కాగా, చిన్నారికి తలెత్తిన టెట్రాలజీ ఆఫ్ ఫ్యాల్లెట్ వ్యాధిని నయం చేసే ఆస్పత్రులు ఏపీలో లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో హైదరాబాద్‌లోనే చికిత్స చేయించాల్సి ఉంటుంది. అయితే, రెండు ఆపరేషన్లు చేయాల్సి ఉందని.. ఇందుకు 2–3లక్షల వరకు ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పారు. కానీ తమ చేతిలో చిల్లిగవ్వ కూడా లేదని తల్లి లక్ష్మి కన్నీటిపర్యంతమవుతోంది.

రాత పరీక్షల్లో ఫస్టొచ్చినా రేషన్ దుకాణం దక్కలే

- రేషన్ డీలర్ల ఎంపికలో సిఫారసులకే పెద్దపీట
- తూతూ మంత్రంగా రాత పరీక్షలు, ఇంటర్వ్యూలు



సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూలకోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు

గత డిసెంబర్‌లో విజయవాడ జక్కంపూడిలో రేషన్ దుకాణం కోసం దరఖాస్తు చేసుకున్న ఓ మహిళా అభ్యర్థి రాత పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించింది. రెండో స్థానంలో ఉన్న అభ్యర్థి కంటే కనీసం పది మార్కులు ముందు ఉంది. అయితే జిల్లాకు చెందిన ఓ కీలకమంత్రి సిఫార్సు ఉండటంతో రెండో స్థానంలో ఉన్న అభ్యర్థికి ఇంటర్వ్యూలో ఎక్కువ మార్కులు వేసి డీలర్ షిప్ కట్టబెట్టారు.

విజయవాడ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఇటీవల డీలర్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరిగాయి. అంతకు ముందే రాత పరీక్షలు నిర్వహించారు. నగర శివారులోని ఓ రేషన్ దుకాణం కోసం దరఖాస్తు చేసుకున్న మొదటి అభ్యర్థికి 58 మార్కులు వచ్చాయి. నాలుగో స్థానంలో ఉన్న అభ్యర్థికి 45 మార్కులొచ్చాయి. అయితే 45 మార్కులు వచ్చిన అభ్యర్థికి 55 మార్కులు వచ్చేలా వాల్యుయేషన్ చేయాలంటూ ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి వచ్చింది.

సాక్షి, విజయవాడ: చంద్రబాబు వస్తే జాబు వస్తుందని ఆశపడ్డ నిరుద్యోగులకు ఉద్యోగాలు రాకపోగా కనీసం రేషన్ దుకాణంతోనైనా ఉపాధి దక్కుతుందని ఆశపడితే అక్కడా అవినీతి రాజ్యమేలుతోంది. గత ఏడాది విజయవాడ రెవెన్యూ డివిజన్‌లో నాలుగుసార్లు రేషన్ డీలర్ అభ్యర్థుల ఎంపిక జరిగింది. అయితే రాతపరీక్ష, ఇంటర్వ్యూలు పెద్ద ప్రహసనంగా మారాయి. 'ఉత్తరమో–దక్షిణమో' సమర్పిస్తేనే రేషన్ దుకాణం పొందడం సాధ్యమని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు.

బేరాలు కుదుర్చుతున్న బ్రోకర్లు

గత ఏడాది కృష్ణా జిల్లాలో 225 రేషన్ దుకాణాలకు పరీక్షలు జరిగాయి. అభ్యర్థుల ఎంపిక వెనుక అధికార పార్టీ ఎమ్మెల్యే సిఫార్సులే ఎక్కువ. దుకాణాల నోటిఫికేషన్ వెలువడగానే బ్రోకర్లు రంగంలోకి దిగి ప్రజాప్రతినిధులు, అభ్యర్థులకు మధ్య రూ.లక్షల్లోనే బేరం కుదుర్చుతున్నట్లు పౌరసరఫరాల శాఖకు చెందిన ఓ అధికారి 'సాక్షి'తో వ్యాఖ్యానించారు. డీలర్ల బంధువులో, వారి కన్నుసన్నల్లో పనిచేసే వారే 70 శాతం దుకాణాలను దక్కించుకుంటున్నారు. ఖాళీ అయిన దుకాణాలను వెంటనే భర్తీ చేయకుండా పొరుగున ఉండే డీలర్‌కు అప్పగించి జేబులు నింపుకుంటున్నారు.

ఖాళీగా పలు దుకాణాలు..

టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రేషన్ దుకాణాల్లో పలు సరుకులను అటకెక్కించారు. డీలర్లకు పెద్దగా గిట్టుబాటు కాకపోవటంతో గత ఏడాది వ్యవధిలో జిల్లాలోని సుమారు 100 దుకాణాలు ఖాళీగా మిగిలాయి. గతంలో రేషన్ దుకాణాన్ని సీజ్ చేస్తే ప్రజాప్రతినిధుల ద్వారా విడిపించుకునేందుకు డీలర్లు ప్రయత్నించే వారు. అయితే ఇప్పుడు వదిలివేయడానికి డీలర్లు ఏమాత్రం వెనుకాడటం లేదని అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఎవరిష్టం వారిదే...

- మున్సిపల్ టీచర్ల పదోన్నతుల తీరు
- డైరెక్టరేట్ ఆదేశాలు పట్టించుకోని కమిషనర్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మున్సిపల్ టీచర్ల పదోన్నతుల్లో ఎవరిష్టం వారిదే అన్నట్లు సాగుతోంది. మున్సిపల్ రీజనల్ డైరక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు ముడుపులు దండుకొంటూ తమకు నచ్చినవారికి పదోన్నతులు కల్పిస్తుండడంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మున్సిపల్ డైరక్టరేట్ నుంచి ఇచ్చే ఉత్తర్వులను సైతం అధికారులు బేఖాతరంటున్నారు. డీఎస్సీలో ఎక్కువ మార్కులు సాధించిన వారికి ప్రమోషన్లలో అన్యాయం చేస్తూ, తక్కువ మార్కులు, తక్కువ ర్యాంకు వచ్చిన వారికి ప్రమోషన్ ఇస్తుండడం వివాదంగా మారుతోంది. కమిషనర్ల నుంచి వచ్చిన సీనియార్టీ జాబితాల ప్రకారమే చేస్తున్నామని రీజనల్ డైరక్టర్లు పేర్కొంటుండగా, తమకు సంబంధం లేకుండా ఆర్డీలే అన్నీ చేస్తున్నారంటూ ఒకరిపై ఒకరు నెపాన్ని తోస్తున్నారు. ఇప్పటికే పదోన్నతులు పొందిన వారిని వెనక్కు పంపి అర్హులైన వారికి న్యాయం చేయాలని పలువురు మున్సిపల్ టీచర్లు కోరుతున్నా ఫలితం కనిపించడం లేదు. అక్రమ పదోన్నతులపై విచారణ జరపాలని మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ తెలిపారు. పదోన్నతులకు సంబంధించి హడావుడిగా కౌన్సెలింగ్ చేపట్టడం సరికాదని ఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జోసెఫ్ సుధీర్‌బాబు, గాజుల నాగేశ్వరరావులు విమర్శించారు.

అక్రమాల వివరాలు...

- జోన్2లోని పశ్చిమగోదావరి, తూర్పుగోదావరిలో మెరిట్‌ను పాటించలేదు. మెరిట్ ప్రకారం జాబితాలను మార్పు చేశాకనే పదోన్నతులు ఇవ్వాలని అధికార్లు పేర్కొన్నా కమిషనర్లు బేఖాతరు చేశారు.
- ఏలూరు నగరపాలక సంస్థ ఉపాధ్యాయుల సీనియార్టీ లిస్టు డీఎస్సీ మెరిట్ ఆధారంగా కాకుండా రోస్టర్ పాయింట్ ఆధారంగా చేశారు.
- కర్నూలు కార్పొరేషన్లో తెలుగు పండితుల జాబితాలో ఎస్‌జీటీలకు అవకాశం ఇచ్చారు. రాష్ట్రంలో ఎక్కడా ఇలా ఇవ్వలేదు. కేవలం గ్రేడ్2 తెలుగు పండిట్లకు మాత్రమే అప్‌గ్రెడేషన్ పోస్టుల్లో పదోన్నతులు చూపించాల్సి ఉన్నా అందుకు భిన్నంగా చేశారు.
- నరసరావుపేటలో నిబంధనలకు భిన్నంగా ఎస్‌జీటీ ఉర్దూ టీచర్లకు స్కూల్ అసిస్టెంటు (తెలుగు మీడియం)గా పదోన్నతి కల్పిస్తున్నారు. దీంతో తెలుగు మీడియం అభ్యర్థులకు నష్టం జరుగుతుంది.
- నంద్యాల మున్సిపాలిటీలో ఒక టీచర్ పేరును సీనియారిటీ లిస్టునుంచి తొలగించి మరొకరికి ప్రమోషన్ కల్పిస్తున్నారు.
- ప్రకాశం జిల్లా మార్కాపురం మున్సిపాలిటీలో సీనియర్ ఎస్‌జీటీ టీచర్ స్థానంలో యూఎల్‌బీ కోఆర్డినేటర్‌కు అవకాశం కల్పించడం వివాదాస్పదమైంది.
- విజయనగరం మున్సిపాల్టీలో 17, 51వ ర్యాంకుల్లో ఉన్న టీచర్లను కొన్ని సంఘాల ఒత్తిళ్లతో 4, 5 ర్యాంకుల్లో ఉన్నట్లు చూపిస్తున్నారు.
- తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురంలో 70 మార్కులు పొందిన వారిని 3వ స్థానంలో ఉంచి, 69 మార్కులు, 64 మార్కులు పొందిన వారిని మొదటి రెండు స్థానాల్లో చూపించారు.
- రాజమండ్రి కార్పొరేషన్లో 1వ ర్యాంకు అభ్యర్థి రెండు రోజుల ఆలస్యంగా సర్వీసులో చేరిన కారణంగా 7వ ర్యాంకు స్థానంలో ఉంచారు.

రైతు సమస్యల పరిష్కారానికి.. మార్చిలో చలో అసెంబ్లీ

రైతు రక్షణ వేదిక రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం



మాట్లాడుతున్న మాజీ మంత్రి వడ్డే, చిత్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షులు నాగిరెడ్డి

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై ప్రత్యక్ష ఆందోళన చేపట్టాలని రైతు రక్షణ వేదిక నిర్ణయించింది. ఇందులో భాగంగా మార్చిలో ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశాల తొలిరోజున 'చలో అసెంబ్లీ' కార్యక్రమం చేపట్టాలని తీర్మానించింది. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో రైతు రక్షణ వేదిక ఆధ్వర్యంలో రైతు సమస్యలపై గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు కీలక అంశాలను చర్చించారు. గిట్టుబాటు ధరలు, రుణమాఫీ, ఇతర సమస్యలపై అన్ని జిల్లాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు, సదస్సులు నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. ఈ సందర్భంగా వడ్డే మాట్లాడుతూ.. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ పెద్ద బూటకమన్నారు. గిట్టుబాటు ధర నిర్ణయంలో శాస్త్రీయత లేదన్నారు. ఉత్పత్తి వ్యయానికి యాభై శాతం కలిపి గిట్టుబాట ధర ఇస్తున్నామంటూ కేంద్ర ఆర్థికమంత్రి ప్రకటించడం ఆవాస్తమన్నారు. ఉత్పత్తి వ్యయాన్ని లెక్కించే విధానమే తప్పన్నారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీఎస్ నాగిరెడ్డి మాట్లాడుతూ, వ్యవసాయ సంక్షోభానికి పాలకుల విధానాలే కారణమన్నారు. పెరుగుతున్న ఉత్పత్తి వ్యయానికి అనుగుణంగా మద్దతు ధర పెంచడం లేదన్నారు. డీజిల్, ఎరువుల ధరలు పెంచుతూ రైతుకు ఇవ్వాల్సిన గిట్టుబాటు ధరను పరిమితం చేస్తున్నారన్నారు. అనంతరం 15 మంది సభ్యులతో రైతు కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో యెర్నేని నాగేంద్రనాథ్ (రైతు సంఘాల సమాఖ్య), వై కేశవరావు (ఏపీ రైతు సంఘం), ముప్పాళ్ల భార్గవశ్రీ (రైతుకూలీ సంఘం), డి హరినాథ్ (ఏఐకేఎం), దుర్గాప్రసాద్ (ఏఐకెఎంఎస్), అనుమోలు గాంధీ, డా. కొల్లా రాజామోహన్ (నల్లమడ రైతు సంఘం), తూమాటి శివయ్య (ఏఐకేఎఫ్), పెద్దిరెడ్డి (ఏపీ రైతు సంఘం), టి రామకృష్ణారెడ్డి (వైఎస్సార్ రైతు విభాగం) తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులకు రూ.8.24 కోట్ల సబ్సిడీ రుణాలు

సింహాద్రి కనకాచారి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని విశ్వబ్రాహ్మణులకు 105 సంఘాల్లో 1,311 మందికి రూ. 8,24,63,000 మొత్తాన్ని సబ్సిడీ రుణాలుగా ఇచ్చినట్లు రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కో–ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ సింహాద్రి కనకాచారి తెలిపారు. విజయవాడలోని రాష్ట్ర బీసీ కార్పొరేషన్స్ కార్యాలయంలో గురువారం జరిగిన రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కో–ఆపరేటివ్ కార్పొరేషన్ బోర్డు డైరెక్టర్ల సమావేశంలో కనకాచారి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక విశ్వబ్రాహ్మణ సహకార సంఘాలను కార్పొరేషన్‌కు అనుసంధానం చేస్తామన్నారు. విశ్వబ్రాహ్మణులకు స్కిల్ డెవలెప్‌మెంట్ శిక్షణ ఇవ్వాలని, వారిని ఆలయ పూజారులుగా నియమించాలనే డిమాండ్లను ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో కార్పొరేషన్ ఎండీ కృష్ణమోహన్, జాయింట్ రిజిస్ట్రార్ కృష్ణమూర్తి, డైరెక్టర్లు గోడె నర్సింహాచారి, బంగారు వెంకటేశ్వర్లు (గుంటూరు), దశరథాచారి (చిత్తూరు), బీఎం రామమూర్తి, ఏలూరు కోటేశ్వరరావు, ముగడ సత్యనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా రాఘవేంద్రుడి జన్మదిన వేడుకలు



మూలరాములకు మహా మంగళహారతులు పడుతున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం: కర్నూలు జిల్లా మంత్రాలయంలోని శ్రీమఠంలో రాఘవేంద్రస్వామి 423వ జన్మదిన వేడుకలను వైభవంగా నిర్వహించారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు భానోదయాన మూల బృందావనంలో విశేష పంచామృత అభిషేకం, పూజలతో వేడుకలకు అంకురార్పణ చేశారు. పూలమందిరంలో మూలరాములకు పూజలు, గ్రామ దేవత మంచాలమ్మకు పట్టువస్త్రాలు, బంగారు పతక ధారణతో హారతులు పట్టారు. రాఘన్నకు టీటీడీ తరపున డాలర్‌శేషాద్రి పట్టువస్త్రాలు సమర్పించారు. గురువారం మధ్యాహ్నం శ్రీ రాఘవేంద్రస్వామి విరాట్‌ను నవరత్న రథంపై అంగరంగ వైభవంగా ఊరేగించారు.

రవాణా శాఖలో కేంద్ర ప్రాయోజిత ప్రాజెక్టులకు గ్రహణం

కేంద్రం నిధులు ఇచ్చి ఏళ్లవుతున్నా ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

ఐడీటీఆర్, ఐ అండ్ సీ తదితర ప్రాజెక్టుల్లో ఒక్కటీ ఏర్పాటు చేయని వైనం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో రవాణా శాఖ ప్రాజెక్టులకు కేంద్రం నిధులు కేటాయించినా.. ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైవింగ్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్ (ఐడీటీఆర్), ఇన్‌స్పెక్షన్ అండ్ సర్టిఫికేషన్ సెంటర్ (ఐ అండ్ సీ), ఆటోమేషన్ ఆఫ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ల ఏర్పాటుకు కేంద్రం సాయం చేసేందుకు ముందుకొచ్చింది. ఈ మూడు ప్రాజెక్టులకు రూ.41.91 కోట్లు, మహిళా రక్షణకు 'అభయ్' అనే కార్యక్రమానికి రూ.56 కోట్లు కలిపి మొత్తం రూ.97.91 కోట్లు కేంద్రం మంజూరు చేసింది. నిధుల్ని రవాణా శాఖ ఖాతాకు బదిలీ చేసింది. అయితే ఇప్పటికీ ఈ ప్రాజెక్టులు రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రతిపాదనలు, శంకుస్థాపనలకే పరిమితమయ్యాయి.

అడుగు ముందుకు పడని ఐడీటీఆర్ టెండర్లు

రవాణా శాఖలో డ్రైవర్లకు ఆధునిక శిక్షణనిచ్చేందుకు కేంద్రం 2014లో ఐడీటీఆర్‌ను మంజూరు చేసింది. ఈ సెంటర్‌ను మారుతీ సుజుకీ కంపెనీ నిర్వహించేలా ప్రకాశం జిల్లా దర్శి మండలం వెంకటాచలంపల్లికి కేటాయించారు. దీనికి కేంద్రం రూ.16.34 కోట్లు, మారుతీ సుజుకీ కంపెనీ రూ.1.69 కోట్లు కలిపి మొత్తం రూ.18.51 కోట్లు భరిస్తాయి. టెండర్లకు కేంద్రం రూ.1.50 కోట్లు విడుదల చేసినా ఇంతవరకు టెండర్లు ఖరారు కాకపోవడం గమనార్హం. ఇలా 2016, ఏప్రిల్ 25న ఐడీటీఆర్‌కు శంకుస్థాపన చేసినా ఇంతవరకు అడుగు ముందుకు పడలేదు.

'అభయ' ప్రాజెక్టుకు రూ.56 కోట్లు

మహిళల రక్షణ కోసం 'అభయ' అనే ప్రాజెక్టు మంజూరు చేయాలని రెండేళ్ల క్రితం కేంద్రాన్ని ప్రభుత్వం కోరింది. రూ.వంద కోట్లతో ప్రతిపాదనలు రూపొందించగా, గతేడాది రూ.56 కోట్లు కేటాయించింది. దీనికి సంబంధించి నిధుల్ని రవాణా శాఖకు కేంద్రం బదిలీ చేసింది. కానీ నేటికీ ప్రాజెక్టు ప్రారంభం కాలేదు.

ఐ అండ్ సీ సెంటర్‌కు భూములే లేవట!

రహదారి భద్రత, డ్రైవింగ్, వాహనాల తనిఖీలో సాంకేతిక విధానాలను పాటించేందుకు కేంద్రం 2014లోనే ఐ అండ్ సీ సెంటర్‌ను మంజూరు చేసింది. దీనికి రూ.14.40 కోట్లను భరించేందుకు అంగీకరించింది. అయితే సెంటర్ నిర్మాణానికి కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లిలో ఐదెకరాల స్థలాన్ని ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించడం లేదు. కార్పొరేట్ కంపెనీ హెచ్‌సీఎల్‌కు 24 ఎకరాల ఆర్టీసీ శిక్షణ కేంద్రం స్థలాల్ని ధారాదత్తం చేసిన ప్రభుత్వం ఐ అండ్ సీ సెంటర్‌కు భూములివ్వడానికి విముఖత చూపింది.

ఆటోమేషన్ ట్రాక్‌ల ఏర్పాటుపై నీలినీడలు

రెండేళ్ల క్రితం ఆటోమేషన్ విధానంలో డ్రైవింగ్ పరీక్షలకు డ్రైవింగ్ ట్రాక్‌ల ఏర్పాటు కోసం కేంద్రం రూ.9 కోట్లు కేటాయించింది. విశాఖపట్నం, కాకినాడ, ఏలూరు, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు, అనంతపురంలలో మొదటి దశలో ఆటోమేషన్ విధానంలో డ్రైవింగ్ పరీక్షలు నిర్వహించేందుకు రవాణా శాఖ నిర్ణయించింది. ఈ నగరాల్లో డ్రైవింగ్ ట్రాక్‌లు నిర్మించాల్సి ఉండగా, ఇంతవరకు అడుగు ముందుకు పడలేదు.

బయోమెట్రిక్‌తో ఆందోళనలో టీచర్లు

వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయులకు ఈ–హాజరు పేరుతో బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టి భయభ్రాంతులకు గురిచేయడం సరికాదని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాలిరెడ్డి, ఓబుళపతి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పనిచేయని నాసిరకం యంత్రాలను ఇచ్చి ఉపాధ్యాయులను భయాందోళనకు గురిచేస్తున్నారని విమర్శించారు. ఉపాధ్యాయులు పాఠశాలలకు సరైన సమయానికి వచ్చినప్పటికీ బయోమెట్రిక్ యంత్రాలు సరిగా పనిచేయట్లేదని, దీంతో సమయానికి హాజరు పడట్లేదన్నారు. అలాగే హాజరు పడలేదంటూ ఉపాధ్యాయులకు మెసేజ్‌లు రావటం వల్ల ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. అసలు బయోమెట్రిక్ విదానాన్ని వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

రేపు కార్యవర్గ సమావేశం

వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం ఈ నెల 24న విజయవాడలో జరుగుతుందని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు. సమావేశానికి రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు హాజరుకావాలన్నారు. ఈ సమావేశానికి రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు.

ఇస్రో చైర్మన్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం

మరో ముగ్గురు ప్రముఖులకు కూడా

సవిత విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో సత్కారం



ఉపరాష్ట్రపతి చేతులమీదుగా గౌరవ డాక్టరేట్‌ను అందుకుంటున్న ఇస్రో చైర్మన్

కొరుక్కుపేట (చెన్నై): ఇస్రో చైర్మన్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. చెన్నైలోని సవిత విశ్వవిద్యాలయం 11వ స్నాతకోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు పాల్గొని వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న నలుగురు ప్రముఖులను గౌరవ డాక్టరేట్‌తో సత్కరించారు. ఇస్రో చైర్మన్ డాక్టర్ కె.శివన్, డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు దుబ్యేందు ముజుందార్, మిసైల్స్ అండ్ స్ట్రాటజిక్ సిస్టమ్స్, డీఆర్‌డీఓ డైరెక్టర్ జనరల్, రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి, కేసీపీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ మేనేజింగ్ డైరెక్టర్ వీఎల్ ఇందిరాదత్తు డాక్టరేట్ పొందిన వారిలో ఉన్నారు. వెంకయ్యానాయుడు మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందించేలా విశ్వవిద్యాలయాలు కృషి చేయాలని కోరారు. మాతృభాషను మరువొద్దని, దేశంలో ఎక్కడున్నా తమ మాతృభాషను నేర్చుకోవాలని, దీనికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలన్నారు. కనీసం హైస్కూల్ స్థాయి వరకైనా మాతృభాషల్లో చదువుకునే అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. స్నాతకోత్సవంలో భాగంగా 41 మంది పీహెచ్‌డీ, ఎంబీబీఎస్, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు.

గిరిజనులకు గనుల నిర్వహణ బాధ్యతలు

రాష్ట్ర మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు వెల్లడి

రామభద్రపురం (బొబ్బిలి): గిరిజన ప్రాంతాల్లోని గనులు నిర్వహించుకునే బాధ్యతను గిరిజనులకే అప్పగిస్తామని రాష్ట్ర భూగర్భ గనుల శాఖ మంత్రి ఆర్.వి.సుజయ్‌కృష్ణ రంగారావు తెలిపారు. గురువారం విజయనగరం జిల్లా రామభద్రపురం మండలం పెదసెలగాంలో నిర్మించిన 42 పక్కా గృహాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సుజయ్‌కృష్ణ మాట్లాడుతూ.. గిరిజనులంతా ఒక సంఘంగా ఏర్పడి గనుల కోసం దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. లక్షలాది రూపాయలు వెచ్చించి ఇళ్లు నిర్మించినందుకు.. గ్రామ పునర్నిర్మాణ సంస్థను అభినందించారు. కార్యక్రమంలో గ్రామ పునర్నిర్మాణ సంస్థ గవర్నింగ్ బోర్డు మెంబర్ గోపాలరావు, ఆ సంస్థ డైరెక్టర్ పీటర్ డేనియల్. ఆర్డీవో సుదర్శన దొర తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న మానసిక వ్యాధుల ముప్పు!

దేశ ప్రజారోగ్య రంగంలో పరిచయం అవసరంలేని పేరు ప్రొఫెసర్ దిలీప్ మవలంకర్. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (ఐఐపీహెచ్)లో కొత్త వైద్య కోర్సుల ద్వారా దేశానికి వైద్య సిబ్బందిని అందించడంలోనూ, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ద్వారా ప్రజారోగ్యంపై ప్రజలను, స్వచ్ఛంద సంస్థలను చైతన్యపర్చడంలోనూ డాక్టర్ మవలంకర్ కీలక భూమిక పోషిస్తున్నారు. గుజరాత్ యూనివర్సిటీ నుంచి ప్రివెంటివ్ అండ్ సోషల్ మెడిసిన్‌లో ఎండీ చేసిన అనంతరం అమెరికాలో ప్రజారోగ్య నిర్వహణపై ఆయన పలు కోర్సులు చేశారు. 2012 నుంచి ఐఐపీహెచ్ డైరెక్టర్‌గా ఉంటూ ప్రజారోగ్య రంగం మెరుగుకు ఆయన విశేష కృషి చేస్తున్నారు. ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు విజయవాడ వచ్చిన ఆయన 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో అనేక అంశాలు వివరించారు. ఇంటర్వ్యూ ముఖ్యాంశాలు.. **-సాక్షి, అమరావతి**

2030 నాటికి ఇవే ప్రధాన సవాళ్లు

- ప్రాణాలు తీయవుగానీ పిండేస్తాయి
- ఆధునిక జీవనశైలితో అనేక అనర్థాలు
- రసాయన ఎరువుల వల్లే క్యాన్సర్ మరణాలు అధికం
- ఆర్గానిక్ వ్యవసాయానికి ప్రాచుర్యం కల్పించాలి
- 'సాక్షి' ఇంటర్వ్యూలో ఐఐపీహెచ్ డైరెక్టర్ డాక్టర్ దిలీప్ మవలంకర్



భవిష్యత్తులో ఏ వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉండనుంది?

మవలంకర్: మానసిక వ్యాధులు సమాజానికి పెను సవాల్‌గా పరిణమించనున్నాయి. 2030 నాటికి కుంగుబాటు, మానసిక ఒత్తిడి, వీటివల్ల వచ్చే మానసిక వైకల్యాలు తలెత్తవచ్చు. ఇవి ప్రాణాలు తీయకపోయినా కుటుంబాలను ఆర్థికంగానే కాకుండా సామాజికంగానూ కుంగదీస్తాయి.

ఏ వ్యాధులవల్ల ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయి?

మవలంకర్: ప్రస్తుతం దేశంలో గుండె జబ్బులవల్ల అత్యధిక మరణాలు సంభవిస్తున్నాయి. గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లో న్యుమోనియా, డయేరియా, టీబీ, మలేరియా లాంటి వాటివల్ల ఎక్కువమంది మరణిస్తున్నారు. తర్వాత స్థానంలో క్యాన్సర్ మరణాలు ఉంటున్నాయి.

ప్రజారోగ్యం మెరుగుకు ప్రణాళికలు ఎలా ఉన్నాయి?

మవలంకర్: ఆరోగ్య ప్రణాళికలకు అత్యంత ప్రధానమైనవి ఆరోగ్య సూచికలే (హెల్త్ ఇండికేటర్స్). దురదృష్టవశాత్తూ దేశంలో వైద్య రికార్డుల నిర్వహణ అధ్వానంగా ఉంది. ఆరోగ్య గణాంకాల సేకరణ, నిర్వహణ సరిగ్గాలేదు. చనిపోయిన వారి గణాంకాలు నమోదు చేస్తున్నారేగానీ మరణాలకు కారణాలు సక్రమంగా రికార్డు చేయడంలేదు. ఉన్నంతలో తమిళనాడులోనే ఆరోగ్య గణాంగాలు మెరుగ్గా ఉన్నాయి.

గతంలో లేని మానసిక ఒత్తిడి ఇప్పుడెందుకు వస్తోంది?

మవలంకర్: మా చిన్నతనంలో అందరూ రాత్రి ఎనిమిది గంటలకే పడుకునే వారు. తెల్లవారుజామునే లేచి ఎవరి పనులకు వారు వెళ్లేవారు. విద్యార్థులు కూడా పాఠశాలలు, కళాశాలలకు మైళ్ల దూరం నడిచి వెళ్లే వారు. శారీరక శ్రమ ఎక్కువగా ఉండేది. దీంతో శారీరక, మానసిక దృఢత్వం ఏర్పడేది. ఇప్పుడా పరిస్థితి ఏది?

ఆధునిక జీవన విధానంవల్ల ఎలాంటి నష్టాలు ఉంటాయి?

మవలంకర్: నేడు కొద్దిదూరం కూడా వాహనాలపైనే వెళ్తున్నారు. వాహనాలు లేనివారు కూడా ఆటోలనో, బస్సులనో ఆశ్రయిస్తున్నారు. అలాగే.. టీవీలు, కంప్యూటర్లు, సెల్‌ఫోన్లతో అర్ధరాత్రి వరకు గడపడం అలవాటుగా మారింది. ఆలస్యంగా పడుకుని ఆలస్యంగా లేస్తున్నారు. పిజ్జాలు, బర్గర్లు అంటూ పోషకాహారం లేని తినుబండారాలు తింటూ ఊబకాయం పెంచుకుంటున్నారు. జీవనశైలిలో వచ్చిన ఈ మార్పులన్నీ అనారోగ్య హేతువులే.

జీవనశైలి వ్యాధుల నియంత్రణకు ఏం చేయాలి?

మవలంకర్: రక్తపోటు, హైపర్‌టెన్షన్, మధుమేహం, క్యాన్సర్, గుండెజబ్బులు తదితర జీవన శైలి (అసాంక్రమిక) వ్యాధుల నియంత్రణకు జీవన విధానంలో మార్పులు చాలా అవసరం. ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం.. జంక్ ఫుడ్ పరిహరించడం.. సరైన నిద్ర వేళలు పాటించడం.. యోగ లాంటి విధానాల ద్వారా ఒత్తిడిని అధిగమించడం.. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండడం ద్వారా చాలా వరకూ ఈ వ్యాధులకు దూరంగా ఉండవచ్చు.

క్యాన్సర్ కేసులు అధికమవడానికి ప్రత్యేకమైన కారణాలు ఏమైనా ఉన్నాయా?

మవలంకర్: పొగాకు ఉత్పత్తుల వాడకం, తినుబండారాల్లో రసాయనాల పరిమాణం పెరగడం, వాయు కాలుష్యం, పంటలకు అధిక పరిమాణంలో క్రిమి సంహారక మందులు వాడకం క్యాన్సర్ పెరగడానికి ప్రధాన కారణాలని తేలింది. దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నందున ఆర్గానిక్ వ్యవసాయానికి ప్రాచుర్యం కల్పించాల్సిన అవసరం ఉంది.

చదువుల సరస్వతులు

- సీఎంఏ ఫలితాల్లో సత్తా చాటిన తెలుగు విద్యార్థినులు
- ఆలిండియా స్థాయిలో ఫస్ట్ ర్యాంక్ సాధించిన పూజిత
- ద్వితీయ ర్యాంకు పొందిన ఆటో డ్రైవర్ల బిడ్డలు


పూజిత


జె.లక్ష్మీప్రసన్న


బి.మనీషా

వీరవాసం/లబ్బీపేట (విజయవాడ తూర్పు): సీఎంఏ(ఐసీడబ్ల్యూఏఐ) ఫలితాల్లో తెలుగు విద్యార్థినులు అఖిల భారత స్థాయిలో సత్తా చాటారు. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పూజిత అనే విద్యార్థిని సీఎంఏలో ఆలిండియా ఫస్ట్ ర్యాంకు సాధించగా.. కృష్ణా జిల్లాకు చెందిన ఇద్దరు ఆటోడ్రైవర్ల కుమార్తెలు రెండో ర్యాంకు సాధించి ఘనత చాటారు. సీఎంఏ(ఐసీడబ్ల్యూఏఐ) ఫైనల్ ఫలితాల్లో పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం మండలం రాయకుదురుకు చెందిన గణపతినీడి మురళీధర్, కృష్ణకుమారి కుమార్తె పూజిత 543/800 మార్కులు సాధించింది. సీఏ ఎంట్రన్స్ టెస్ట్(సీపీటీ)లోనూ ఆలిండియా 10వ ర్యాంక్ సాధించింది. మరోవైపు కోల్‌కతాలోని ఐసీడబ్ల్యూఏ చాప్టర్ ప్రకటించిన ఇంటర్, ఫైనల్ ఫలితాల్లో కృష్ణా జిల్లాకు చెందిన ఇద్దరు ఆటో డ్రైవర్ల కుమార్తెలు ఆలిండియా సెకండ్ ర్యాంకులు సాధించి సత్తా చాటారు. కోడూరు మండలం పోటుమీద గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ వీరరాఘవయ్య కుమార్తె జె.లక్ష్మీప్రసన్న, పాయకాపురానికి చెందిన బి.మనీషా ఈ ఘనతను సాధించారు.

మంచి ఉద్యోగం చేయాలనదే నా ఆకాంక్ష...

మాది పోటుమీద గ్రామం. నాన్న మాకున్న కొద్దిపాటి పొలంలో వ్యవసాయం చేస్తూ.. ఆటో నడుపుతుంటారు. అమ్మ ఓ ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తోంది. ఆలిండియా ర్యాంకు సాధించడానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం, సూపర్‌విజ్ శిక్షణ దోహదం చేసింది. తాజాగా విడుదల చేసిన ఫైనల్స్‌లోనూ ఆలిండియా రెండో ర్యాంకు సాధించడం చాలా సంతోషంగా ఉంది. మంచి ఉద్యోగం చేయాలన్నదే నా ఆకాంక్ష.

– జె.లక్ష్మీప్రసన్న, ఐసీడబ్ల్యూఏ ఫైనల్, ఆలిండియా సెకండ్ ర్యాంకర్

తల్లిదండ్రుల కష్టానికి ఫలితం

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఐసీడబ్ల్యూఏ ఇంటర్‌లో ఆలిండియా స్థాయిలో రెండో ర్యాంకు సాధించా. పాయకాపురంలో నివసించే మా కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. నాన్న ఆటో నడుపుతూ ఎంతో కష్టపడి రూపాయి రూపాయి కూడబెట్టి నన్ను చదివిస్తున్నారు. ఆలిండియా స్థాయిలో రెండో ర్యాంకు రావడం ఎంతో సంతోషంగా ఉంది. ఇదే స్ఫూర్తితో ఐసీడబ్ల్యూఏ, సీఏ పూర్తి చేసేందుకు కృషి చేస్తా.

– బి.మనీషా, ఐసీడబ్ల్యూ ఇంటర్, ఆలిండియా సెకండ్ ర్యాంకర్

బెంగళూరు ఫిల్మ్‌సిటీ అగ్నికి ఆహుతి


స్టూడియో కాలిపోతున్న దృశ్యం

బెంగళూరు (దొడ్డబళ్లాపురం): బెంగళూరు సమీపంలోని బిడదిలోనున్న ఇన్నోవేటివ్ ఫిల్మ్ సిటీలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో సుమారు రూ.8 కోట్లకు పైగా ఆస్తినష్టం వాటిల్లింది. స్టూడియోలోని ఉన్న కన్నడ బిగ్‌బాస్ సీజన్–5 సెట్‌తో పాటు పదుల సంఖ్యలో సెట్స్ చాలావరకు కాలిపోయాయి. ముఖ్యంగా స్టూడియోలో ప్రముఖుల మైనపు విగ్రహాల మ్యూజియం తుడిచిపెట్టుకుపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది కొన్ని గంటల పాటు కష్టపడి మంటలను అదుపుచేశారు. అప్పటికే నష్టం జరిగిపోయింది. సెట్టింగులు మొత్తం చెక్కలతో, గడ్డితో చేసినవి కావడంతో క్షణాల్లో మంటలు వ్యాపించాయి. మంటలకు షార్ట్ సర్క్యూట్ కారణమని పోలీసులు భావిస్తున్నారు. మొదట మంటలు మైనపు విగ్రహాలున్న మ్యూజియంలో మంటలు కనిపించినట్టు సిబ్బంది చెబుతున్నారు. ఈ ఫిల్మ్‌సిటీలో కన్నడ భాషలో అత్యంత ప్రజాదరణ పొందిన బిగ్‌బాస్ 3, 4, 5 సీజన్స్ నిర్వహించారు. ఆ కారణంగా స్టూడియోకు ఎంతో పేరురావడంతో జనం కూడా పర్యాటక కేంద్రంగా భావించి సందర్శించేవారు. ప్రమాద సమయంలో షోలు ఏవీ జరగడం లేదు. లేదంటే ప్రాణనష్టం ఎక్కువగానే ఉండేది. బిగ్‌బాస్ సెలబ్రిటీలు చందన్‌శెట్టి, దివాకర్, సమీరాచార్య తదితరులు తమ ఇల్లే కాలిపోయినంత బాధ కలుగుతోందని ఫేస్‌బుక్‌లో ఆవేదన వ్యక్తం చేశారు.

హోదాతోనే యువతకు భవిత


చర్చావేదికలో మాట్లాడుతున్న కొమ్మినేని శ్రీనివాసరావు, పాల్గొన్న వివిధ రాజకీయ, ప్రజాసంఘాల ప్రతినిధులు

- 'హోదాకోసం ఎందాకైనా' గుంటూరు చర్చా వేదిక
- కేంద్ర మంత్రులు, ఎంపీల రాజీనామాతోనే సాధ్యం
- ప్రత్యేక హోదా–ఆంధ్రుల హక్కు అని నినదించిన విద్యార్థులు

సాక్షి, అమరావతి బ్యూరో: రాజకీయ చైతన్యానికి, పోరాట పటిమకు మారుపేరుగా నిలుస్తున్న గుంటూరు మరోసారి ప్రతిధ్వనించింది. ప్రత్యేక హోదా–ఆంధ్రుల హక్కు అని ప్రజల గొంతుకలు గర్జించాయి. 'ప్రత్యేక హోదా లేకుండా ఏపీ అభివృద్ధి చెందగలదా..? ప్రత్యేక ప్యాకేజీలతో వచ్చే డబ్బుల మూటలు రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తాయా..? వెనుకబడిన ప్రాంతాలకు ప్యాకేజీ ఊతమిస్తుందా? చేతిలో డిగ్రీ పట్టాలున్నవారికి ఉద్యోగం ఇవ్వగలరా..? రాయితీలు లేకుండానే పరిశ్రమలు పెట్టించగలరా..?''అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. గుంటూరులోని కేకేఆర్ ఫంక్షన్ ప్లాజాలో సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'హోదాకోసం ఎందాకైనా' చర్చా వేదికలో ప్రత్యేకహోదా మా హక్కు అని పలువురు గళమెత్తారు. హోదా వస్తేనే యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు పార్లమెంట్ ఇన్‌చార్జి శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. తిరుపతి వెంకన్న సాక్షిగా 15 ఏళ్లు ప్రత్యేక హోదా ఇస్తామన్న నరేంద్రమోదీ, తెస్తామన్న చంద్రబాబు నాయుడు ఇప్పుడు ఎందుకు వెనక్కు తగ్గారని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలారి రోశయ్య ప్రశ్నించారు. విభజన చట్టంలో ప్రత్యేక హోదా ఇవ్వాలని ఉందని, అది విభజన హామీ కాదని గుర్తించాలని సీనియర్ న్యాయవాది వై.కోటేశ్వరరావు చెప్పారు.

హోదా రాజకీయ అజెండా కావాలి...

హోదా అంశం రాజకీయ అజెండాగా మారాలని, కేంద్ర మంత్రులు, 25 మంది ఎంపీలు రాజీనామా చేస్తేనే హోదా వస్తుందని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అభిప్రాయపడ్డారు. ప్రతి వ్యక్తి సైనికుడిలా ఉద్యమం చేసి, హోదాను సాధించేవరకు పోరాడాలని వైఎస్సార్‌సీపీ గుంటూరు నగర అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి లేళ్ళ అప్పిరెడ్డి చెప్పారు. హోదాకోసం మొదటి నుంచి పోరాడుతుంది తమ పార్టీయేనని వైఎస్సార్‌సీపీ గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా తెలిపారు. సీఎం ప్యాకేజీ తీసుకోవడం ఓ చారిత్రాత్మక తప్పిదమని ఆర్థిక వేత్త డాక్టర్ ఐ.ఎస్.ఎన్.ప్రసాద్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వమే తమకు ప్యాకేజీ కావాలని తీసుకుందని బీజేపీ అధికారప్రతినిధి జూపూడి రంగరాజు తెలిపారు. ఇప్పటికైనా సీఎం రాష్ట్ర ప్రయోజ నాలకోసం ప్రత్యేక హోదా సాధనదిశగా అడుగులేయాలని పలువురు హెచ్చరించారు.

జాబ్‌చార్టు అమలు చేయాలి

రేషన్ డిపో డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుగత

విజయనగరం గంటస్తంభం: రేషన్ డిపోలు ప్రతీరోజూ తెరవకుంటే రూ.500 నుంచి రూ.2వేల వరకు జరిమానా వేయడం, సస్పెండ్ చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దారుణమని రేషన్ డిపో డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుగత వెంకటేశ్వరరావు విమర్శించారు. విజయనగరం కలెక్టరేట్‌లో గురువారం ఆయన జిల్లా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సముద్రపు రామారావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. చాలీచాలనీ కమీషన్‌తో ఎలా పనిచేస్తామని, జాబ్‌చార్టు అమలుచేయాలంటే వేతనాలు ఇవ్వాలని వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు.

ఆత్మహత్యలపై ఏం చేస్తున్నారు?

తెలుగు రాష్ట్రాల సీఎస్‌లకు ఎన్‌హెచ్‌ఆర్సీ నోటీసు

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో ప్రైవేటు కళాశాలల్లో విపరీతమైన ఒత్తిడి వాతావరణం నేపథ్యంలో విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారంటూ సుప్రీం కోర్టు న్యాయవాది కె.శ్రవణ్‌కుమార్ దాఖలు చేసిన ఫిర్యాదుపై స్పందిస్తూ జాతీయ మానవ హక్కుల కమిషన్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు నోటీసు జారీచేసింది. ఈ అంశంపై ప్రభుత్వాలు తీసుకున్న చర్యలేవో నాలుగు వారాల్లో తెలపాలని నోటీసులో పేర్కొంది. కనీస మౌలిక వసతులు లేకుండా కళాశాలలు హాస్టళ్లను నిర్వహిస్తున్నాయని, తగినన్ని స్నాన గదులు, మరుగుదొడ్లు కూడా లేవని ఫిర్యాదులో న్యాయవాది పేర్కొన్నారు. ఉదయం 5 నుంచి రాత్రి 10 వరకు చదువు పేరుతో మానసిక క్షోభకు గురిచేయడం కారణంగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు.

హోదా ఉద్యమంలో చంద్రబాబు కోవర్ట్

- వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి అంబటి ధ్వజం
- ఉద్యమాన్ని బాబు హైజాక్ చేయాలని చూస్తున్నారు
- ఉద్యమాలతో హోదా ఆశలను బతికించింది వైఎస్సార్ సీపీనే
- చంద్రబాబు మాటలు నమ్మి మరోసారి మోసపోవద్దు



విజయవాడ సిటీ: రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరో అవతారం ఎత్తబోతున్నారని, ప్రత్యేక హోదా ఉద్యమాన్ని మళ్లీ అణగదొక్కేందుకు ఉద్యమంలో కోవర్ట్‌గా ప్రవేశించాలని చూస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు అన్నారు. హోదా ఉద్యమాన్ని మరోసారి నట్టేట ముంచడానికి సీఎం చంద్రబాబు, ఆయన అనుకూల మీడియా ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. విజయవాడలోని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యాలయంలో అంబటి రాంబాబు గురువారం విలేకరులతో మాట్లాడారు. గతంలో హోదా కంటే ప్యాకేజీనే బ్రహ్మాండంగా ఉందని చెప్పి ఇప్పుడు ప్రత్యేక హోదా కావాలని అనడానికి సిగ్గుందా అని ధ్వజమెత్తారు.

ఎప్పుడైనా పోరాటం చేశావా బాబూ?

ప్రత్యేక హోదా వస్తే పరిశ్రమలు బాగా వస్తాయంటున్న సీఎం చంద్రబాబు.. ఏనాడైనా ప్రత్యేక హోదా కోసం పోరాడటానికి సిద్ధపడ్డారా అని అంబటి ప్రశ్నించారు. విభజన సమయంలో కేంద్రమంత్రులుగా ఉన్న చిరంజీవి, పనబాక లక్ష్మి, కావూరి సాంబశివరావు, జేడీ శీలం, పురందేశ్వరీ వంటి వారు మంత్రి పదవులకు రాజీనామా చేయకుండా సమైఖ్య రాష్ట్రం కోసం పోరాడతామని డ్రామాలు ఆడారని అంబటి గుర్తు చేశారు. ఇప్పుడు మంత్రి పదవులకు రాజీనామా చేయకుండా నాటకాలు ఆడుతున్న టీడీపీ, బీజేపీలకు కాంగ్రెస్‌కు పట్టిన గతేపడుతుందని అంబటి అన్నారు.

హోదాను బతికించింది వైఎస్సార్‌సీపీనే..

ప్రత్యేక హోదా ఉద్యమాన్ని చంపేయాలని సీఎం చంద్రబాబు ప్రయత్నిస్తే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బతికించిందన్నారు. నిరాహారదీక్షలు, ధర్నాలు, యువభేరీలు, చర్చలు ఇలా అనేక రకాలుగా ఉద్యమాలు చేసి హోదాను బతికించిన వ్యక్తి వైఎస్ జగన్ అనే విషయాన్ని సగర్వంగా చెప్పగలమన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీలను సాధించడం కోసం పార్టీ ఎంపీలతో రాజీనామాలు చేయించడానికి జగన్ సిద్ధపడ్డారన్నారు. అంతేకాకుండా పార్లమెంట్‌లో ప్రత్యేక చర్చ కోసం అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు కూడా వైఎస్సార్‌సీపీ నిర్ణయించుకుందన్నారు.

చంద్రబాబుతో జాగ్రత్తగా ఉండాలి..

పిల్లనిచ్చిన మామనే మోసం చేసిన సీఎం చంద్రబాబుకు ప్రజలను మోసం చేయడం ఒక లెక్కకాదని, హోదా ఉద్యమంలో ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని అంబటి సూచించారు. సీఎం చంద్రబాబును ఓ కంట కనిపెడుతూ ఉండాలని రాజకీయ పార్టీలకు, ప్రజా సంఘాలను కోరారు. ప్రత్యేక హోదా ఉద్యమంలో అందరూ వైఎస్సార్ సీపీతో కలసి నడవాలని, హోదాను సాధించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని అంబటి పిలుపునిచ్చారు.

● తెలంగాణ

రాష్ట్ర 'రైతు' కార్పొరేషన్

తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి పేరిట ఏర్పాటు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి పేరిట రాష్ట్రంలో కొత్త కార్పొరేషన్ ప్రారంభించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. వ్యవసాయాభివృద్ధి–రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను క్షేత్ర స్థాయికి తీసుకుపోవడంలో ఈ కార్పొరేషన్ కృషి చేస్తుందని ప్రకటించారు. లాభాపేక్ష లేని సంస్థ (నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్) లాగా ఈ కార్పొరేషన్ పనిచేస్తుందని, ఈ సంస్థకు సమకూరిన నిధులను సంస్థ ఏర్పాటు చేసిన లక్ష్యాల సాధన కోసమే వినియోగిస్తారని స్పష్టం చేశారు.

ప్రతీ దశలోనూ చురుకైన పాత్ర..

విత్తనం వేసిన దగ్గర నుంచి పంటకు మద్దతుధర వచ్చే వరకు ప్రతీ దశలోనూ రైతు సమన్వయ సమితులు చురుకైన పాత్ర పోషించేలా వారికి విధులు, బాధ్యతలుంటాయని సీఎం స్పష్టం చేశారు. సమితుల్లో కనీసం 51 శాతం మంది బలహీన వర్గాలు, మహిళల ప్రాతినిధ్యం ఉండేలా నిర్మాణం జరుగుతుందని చెప్పారు. ఈ నెల 25, 26 తేదీల్లో జరిగే సదస్సుల్లో మండల రైతు సమన్వయ సమితి సభ్యులతోపాటు ఆయా జిల్లాలకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్‌పర్సన్లు హాజరు కావాలన్నారు. రైతు వేదికల నిర్మాణానికి అవసరమైన స్థలాలను ఎంపిక చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రభుత్వ భూముల నుంచిగానీ, దాతల నుంచిగానీ, కొనుగోలు ద్వారాగానీ స్థలం సేకరించాలని చెప్పారు. సమీక్షలో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఈటల రాజేందర్, ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీలు బి.వినోద్, గుత్తా సుఖేందర్‌రెడ్డి, బాల్క సుమన్, అడ్వొకేట్ జనరల్ ప్రకాశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలన.. వైఫల్యాలమయం

పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్ : టీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, మేలు చేయాల్సిన ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ప్రజలను అణచివేస్తున్నారని పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ఆ నలుగురి బాగు కోసమే రాష్ట్రం వచ్చిందా.. అనే భావన ప్రజల్లో వ్యక్తమవుతోందని అన్నారు. గురువారం ఇక్కడ జరిగిన రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ సదస్సులో ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల పట్ల ప్రభుత్వం అవమానకర వైఖరిని అవలంబిస్తోందని, హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోందని ధ్వజ మెత్తారు. రెండు కోట్ల మంది మహిళల్లో మంత్రిగా పనిచేసే అర్హత కలిగినవారు ఒక్కరు కూడా కేసీఆర్‌కు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడానికే ఈ నెల 26 నుంచి ప్రజా చైతన్యయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ఆర్‌సి కుంతియా మాట్లాడుతూ దేశం బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ సేవాదళ్ పనిచేస్తుంటే దేశాన్ని ముక్కలు చేసేందుకు ఆర్ఎస్ఎస్ కంకణం కట్టుకుందని విమర్శించారు.

కటకటాల పాలైన అన్నా చెల్లెలు

- అనైతిక బంధంతో వరుడిపై హత్యాయత్నం
- పెట్రోలు పోసి నిప్పంటించిన అన్న
- విచారణలో అనైతిక బంధం వెలుగులోకి
- ఇరువురి అరెస్ట్.. విషమ పరిస్థితిలో వరుడు

రఘునాథపల్లి: మానవత్వమే కాదు.. సంబంధ బాంధవ్యాలకు ఇది మాయని మచ్చ. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం మాదారం గ్రామానికి చెందిన అరూరి బాలస్వామి వరుసకు చెల్లెలైన అరూరి అరుణతో అనైతిక బంధం కొనసాగించి ఆమెకు కాబోయే భర్తపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటన సంచలనం సృష్టించింది. వరుడిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన బాలస్వామితో పాటు అతడికి సహకరించిన అరుణ గురువారం కటకటాల పాలయ్యారు. కంచనపల్లికి చెందిన గొంగళ్ల యాకయ్యతో మాదారం గ్రామానికి చెందిన అరుణకు బుధవారం పెళ్లి జరగాల్సి ఉంది. ఈ పెళ్లయితే తమ బంధం దూరం అవుతుందని భావించి ఇరువురు కలసి యాకయ్యను చంపాలని పథకం వేశారు. అందులో భాగంగా ఈ నెల 18న యాకయ్యకు అరుణ ఫోన్ చేసి ఇంటినుంచి బయటకు పిలిపించింది. బాలస్వామి పెట్రోల్ పోసి నిప్పంటించి పరారయ్యాడు. సెల్ ఫోన్ కాల్‌డేటా, సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా పోలీసులు బాలస్వామి, అరుణను అరెస్ట్ చేశారు. కాగా, తీవ్ర గాయాలైన యాకయ్య సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. యాకయ్యకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

డీసీపీ బాబురావుపై డీజీపీకి ఫిర్యాదు

- విడాకులివ్వకుండానే మరో మహిళతో సహజీవనం
- వేధిస్తున్నాడని మొదటి భార్య వేదశ్రీ ఆరోపణ

సాక్షి, హైదరాబాద్: నగర కమిషనరేట్ ఆర్మ్‌డ్ హెడ్‌క్వార్టర్స్‌లో డీసీపీగా పనిచేస్తున్న బాబురావుపై అతడి మొదటి భార్య వేదశ్రీ డీజీపీ మహేందర్‌రెడ్డికి గురువారం ఫిర్యాదు చేసింది. తనతో 25ఏళ్ల పాటు కాపురం చేసి నలుగురు పిల్లలకు తండ్రి అయిన బాబురావు విడాకులివ్వకుండానే మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడని ఆమె ఆరోపించింది. తమకు తెలియకుండానే మతం మార్చుకున్నాడని, చాలా మంది మహిళలతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. రూ.5 లక్షలు తీసుకుని విడాకులకు ఒప్పుకోవాలని వేధిస్తున్నాడని తెలిపింది. విజయవాడలో తనకు సంబంధించిన రూ.కోటి విలువ చేసే భూమిని, తానే వేదశ్రీ అని చెప్పుకుని బాబురావు రెండో భార్య అమ్ముకుందని ఆరోపించింది. బాబురావు వ్యవహారంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరింది.

విద్యార్థినిపై ప్రేమోన్మాది కత్తితో దాడి

- ప్రేమించాలంటూ నిత్యం వేధింపులు
- నిందితుడిపై గతంలో ఫోక్సో కేసు నమోదు


గాయాలపాలైన యమున

బోనకల్: విద్యార్థినిపై ఓ ప్రేమోన్మాది కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం ఖమ్మం జిల్లా బోనకల్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కోలా వెంకటేశ్వర్లు కుమారుడు రామలింగయ్య.. అదే గ్రామానికి చెందిన మన్నెం అంజయ్య కూతురు యమునను ప్రేమిస్తున్నానంటూ నిత్యం వేధిస్తున్నాడు. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ఆమెను గతంలోనూ తరచూ ఇబ్బందులకు గురిచేసేవాడు. ఈ విషయమై ఆమె /తల్లిదండ్రులు 2017, డిసెంబర్ 18న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు అతడిపై ఫోక్సో కేసు నమోదు చేశారు. రిమాండ్‌కు వెళ్లిన అతను బెయిల్‌పై వచ్చి మళ్లీ వెంట పడటం ప్రారంభించాడు. దీంతో యమున తల్లిదండ్రులు యమునను కళాశాలకు మాన్పించి.. యాదగిరిరెడ్డిపల్లిలోని తమ బంధువుల ఇంటికి పంపించారు. ప్రస్తుతం ఇంటర్ పరీక్షలు దగ్గర పడటంతో ఆమె ఇంటికి వచ్చింది. విషయం తెలుసుకున్న రామలింగయ్య.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో లోపలికి వెళ్లి గడియ పెట్టాడు. యమునను కత్తితో ఛాతి, కడుపులో పొడిచాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు తలుపులు తెరిచి చూడగా.. వారిని చూసి పారిపోయాడు. బాధితురాలిని వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స కోసం ఖమ్మంలోని ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఫొటోలు ఉన్నాయి.

డీజిల్ లోకో వర్క్స్-వారణాసిలో 4,350 సమ్మర్ ఇంటర్న్‌షిప్ ఖాళీలు

వారణాసిలోని డీజిల్ లోకో వర్క్స్(డీఎల్‌డబ్ల్యూ) టెక్నికల్ ట్రైనింగ్ సెంటర్(టీటీసీ).. సమ్మర్ ఇంటర్న్‌షిప్‌లో భాగంగా 4,350 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఇంటర్న్‌షిప్ వ్యవధి 6-8 వారాల లోపు ఉంటుంది. ఇంజనీరింగ్/టెక్నాలజీ విభాగాల్లో అండర్ గ్రాడ్యుయేషన్ ఇంజనీరింగ్ చదువుతున్న అభ్యర్థులు అర్హులు. ఫిబ్రవరి 26, 2018 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు.
చివరి తేదీ: మార్చి 5, 2018. వెబ్‌సైట్: www.dlw.indianrailways.gov.in

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

గ్రాడ్యుయేట్స్ స్పెషల్



ఐసెట్ 2018..
విజయాన్ని అందుకోండిలా..

రాష్ట్ర స్థాయిలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఇంటెగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఐసెట్) తేదీలను తెలుగు రాష్ట్రాల్లో ప్రకటించారు. ఎంబీఏ పట్టాతో మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్స్‌గా; ఎంసీఏ పూర్తిచేసి సాఫ్ట్‌వేర్ నిపుణులుగా రాణించాలనుకునే ఔత్సాహికులు రాయాల్సిన పరీక్ష ఐసెట్. తెలంగాణలో మే 23, 24న; ఏపీలో మే 2న పరీక్ష జరగనుంది. ఉన్నత విద్యాసంస్థల్లో ఎంబీఏ/ఎంసీఏ ప్రవేశం పొందాలనుకునే ఔత్సాహిక అభ్యర్థులు ఇప్పటినుంచే ప్రిపరేషన్ ప్రారంభించాలి.

- ఐసెట్‌ను తెలుగు రాష్ట్రాలు వేర్వేరుగా నిర్వహిస్తున్నాయి. ఈ పరీక్ష ద్వారా ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు.
- ఐసెట్ ప్రిపరేషన్.. బ్యాంక్ పీవో, క్లరికల్, ఇతర పోటీ పరీక్షలకూ ఉపయోగపడుతుంది. ఐసెట్ సిలబస్.. బ్యాంకింగ్, ఎస్ఎస్‌సీ, రైల్వే, పోలీసు ఉద్యోగాల సిలబస్‌ను పోలి ఉంటుంది కాబట్టి ఐసెట్‌కు బాగా ప్రిపేరైతే.. ఇటు ప్రభుత్వ ఉద్యోగమూ పొందే అవకాశం ఉంటుంది.
- ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకొని, మంచి ర్యాంకు సాధిస్తే యూనివర్సిటీల క్యాంపస్ కాలేజీల్లో ప్రవేశాలను ఖరారు చేసుకోవచ్చు.

అర్హతలు

- ఎంబీఏకు ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత; ఎంసీఏకు బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు ఇంటర్మీడియెట్‌లో మ్యాథమెటిక్స్ సబ్జెక్టు చదివుండాలి.

సన్నద్ధత

అనలిటికల్ ఎబిలిటీ: డేటా సఫిషియన్సీలో రాణించాలంటే.. అర్థమెటిక్ అంశాలపై పట్టు సాధించడం ప్రధానం. 'స్టేట్‌మెంట్ బేస్డ్' ప్రశ్నలు ఎదురయ్యే ఈ విభాగంలో ఇచ్చిన స్టేట్‌మెంట్లలో సరైనదేదో గుర్తించాల్సి ఉంటుంది. దీనికోసం సునిశిత పరిశీలన.. గణితంపై ప్రాథమిక అవగాహన తప్పనిసరి. అనలిటిక్ ఎబిలిటీ విభాగంలో సుమారు 15 ప్రశ్నలు డేటా విశ్లేషణపై ఉంటాయి. సీక్వెన్స్ అండ్ సిరీస్ విభాగం కీలకం. దీన్నుంచి దాదాపు 10 ప్రశ్నలొస్తాయి. వర్డ్ అనాలజీ, నంబర్ సిరీస్, బ్లడ్ రిలేషన్, సీటింగ్ అరేంజ్‌మెంట్, కోడింగ్, డీ-కోడింగ్, కేలండర్, క్లాక్, ట్రైన్ ప్రాబ్లమ్స్ తదితరాలపై పట్టు సాధించాలి. ఏదైనా ఒక ప్రామాణిక రీజనింగ్ పుస్తకాన్ని తీసుకొని చదివితే సరిపోతుంది.

మ్యాథమెటికల్ ఎబిలిటీ

నాన్ మ్యాథ్స్ అభ్యర్థులకు కఠినంగా అనిపించే విభాగమిది. ఆరు నుంచి పదో తరగతి వరకు ఉన్న మ్యాథ్స్ అంశాల నుంచి ప్రశ్నలొస్తాయి. తొలుత మ్యాథమెటిక్స్‌లోని ప్రాథమిక సూత్రాలపై అవగాహన పెంపొందించుకోవాలి. హైస్కూల్ స్థాయి గణిత పుస్తకాలను అధ్యయనం చేయాలి. స్టాటిస్టికల్ ఎబిలిటీ కోసం ఇంటర్మీడియెట్ పుస్తకాల ప్రిపరేషన్ అవసరం.
ముఖ్యంగా ప్రాబబిలిటీ, ఇనీక్వాలిటీస్ అంశాలకు ఈ స్థాయి ప్రిపరేషన్ తప్పనిసరి. అర్థమెటిక్ విభాగంలోని ప్రశ్నలకు సులువుగా సమాధానాలు గుర్తించాలంటే.. శాతాలు, లాభనష్టాలు, నిష్పత్తులు, మెన్సురేషన్, పని-కాలం, పని-సమయం తదితర అంశాలపై పట్టు సాధించాలి. ట్రిగనోమెట్రీ, సెట్స్ అండ్ రిలేషన్స్, లీనియర్ ఈక్వేషన్స్, ప్రోగ్రెషన్స్ తదితర అంశాలపైనా పట్టు సాధించాలి.

కమ్యూనికేషన్ ఎబిలిటీ

బేసిక్ నాలెడ్జ్‌తో మంచి స్కోరు సాధనకు అవకాశమున్న సెక్షన్ ఇది. వొకాబ్యులరీ కోసం బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్ నైపుణ్యాలు సొంతం చేసుకోవాలి. రోజూ కొత్త పదాలు నేర్చుకోవడం, వాటిని ఉపయోగించే విధానాన్ని ప్రాక్టీస్ చేయాలి. బిజినెస్ అండ్ కంప్యూటర్ టెర్మినాలజీలో వ్యాపార-వాణిజ్య అంశాలు, తాజా పరిణామాలు, కంప్యూటర్ బేసిక్స్‌పై అవగాహనను పరీక్షించేలా ప్రశ్నలుంటాయి. వీటికోసం బిజినెస్ టెర్మినాలజీ, వ్యాపార విధానాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

- కంప్యూటర్ టెర్మినాలజీకి సంబంధించి బేసిక్ ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ టూల్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్‌కు సంబంధించిన అంశాలను తెలుసుకోవాలి.
- రీడింగ్ కాంప్రెహెన్షన్ విభాగంలో ప్యాసేజీల ఆధారంగా అడిగే 15 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలంటే.. ముందుగా అభ్యర్థులకు ఒక అంశాన్ని, అందులోని కీలక పదాలను, సారాంశాన్ని పసిగట్టే నేర్పు అవసరం. దీనికోసం వ్యాసాలు, ఇంగ్లిష్ స్టోరీ పుస్తకాలు చదవడం ఉపయుక్తం. ఫంక్షనల్ గ్రామర్‌లో మంచి మార్కుల కోసం సినానిమ్స్, యాంటానిమ్స్, క్వశ్చన్ ట్యాగ్స్, డైరెక్ట్-ఇన్‌డైరెక్ట్ స్పీచ్ తదితర అంశాలను ప్రాక్టీస్ చేయాలి.

పరీక్ష విధానం

మూడు సెక్షన్ల నుంచి 200 ప్రశ్నలుంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు ఉంటుంది. అందుబాటులో ఉన్న సమయం 150 నిమిషాలు.

విభాగం	ప్రశ్నలు	మార్కులు
విభాగం-ఎ (అనలిటికల్ ఎబిలిటీ)		
డేటా సఫిషియన్సీ	20	20
ప్రాబ్లమ్ సాల్వింగ్	55	55
విభాగం-బి (మ్యాథమెటికల్ ఎబిలిటీ)		
అర్థమెటికల్ ఎబిలిటీ	35	35
ఆల్జీబ్రా అండ్ జామెట్రికల్ ఎబిలిటీ	30	30
స్టాటిస్టికల్ ఎబిలిటీ	10	10
విభాగం-సి (కమ్యూనికేషన్ ఎబిలిటీ)		
వొకాబ్యులరీ	10	10
బిజినెస్ అండ్ కంప్యూటర్ టెర్మినాలజీ	10	10
ఫంక్షనల్ గ్రామర్	15	15
రీడింగ్ కాంప్రెహెన్షన్	15	15
మొత్తం	200	200

తగ్గిన క్రేజ్

గత ఐదారేళ్లుగా ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో చేరడానికి విద్యార్థులు వెనకడుగు వేస్తున్నారు. ఎంబీఏకు ఆదరణ తగ్గకపోయినప్పటికీ ఎంసీఏలో చేరేవారి సంఖ్య ఏటా తగ్గుతోంది. అలాగే ఈ కోర్సులు పూర్తిచేశాక.. అభ్యర్థులు జాబ్‌మార్కెట్‌కు అవసరమైన జాబ్ స్కిల్స్, కమ్యూనికేషన్ నైపుణ్యాలు అందిపుచ్చుకుంటేనే ఉద్యోగాలు పొందే పరిస్థితి ఉంది. ప్లేస్‌మెంట్స్ అవకాశాలు ఉన్న కాలేజీలో చేరేందుకు విద్యార్థులు ప్రయత్నించాలి.

టీఎస్ ఐసెట్ నోటిఫికేషన్ వివరాలు

తెలంగాణలో ఐసెట్‌ను మొదటిసారిగా ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలవగా.. పరీక్ష నిర్వహణ బాధ్యతలను ఈసారి కాకతీయ యూనివర్సిటీ పర్యవేక్షిస్తోంది. మార్చి 6 నుంచి ఏప్రిల్ 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు ఫీజు రూ.650; ఎస్సీ, ఎస్టీలకు రూ.450. పరీక్ష మే 23, 24 తేదీల్లో మూడు సెషన్లుగా ఆన్‌లైన్‌లో జరుగుతుంది. జూన్ 6న ఫలితాలు విడుదలవుతాయి.
వెబ్‌సైట్: www.kakatiya.ac.in, tsche.cgg.gov.in

నాలెడ్జ్ Bytes

శ్రీహరికోట నుంచే రాకెట్ ప్రయోగాలు ఎందుకు..?




1. భూమధ్య రేఖకు దగ్గరగా ఉండటం. ఇక్కడి నుంచి రాకెట్ ప్రయోగిస్తే పైసా ఖర్చు లేకుండా భూభ్రమణం వల్ల సెకనుకు 0.4 కిలోమీటర్ల అదనపు వేగం వస్తుంది.
2. సుదీర్ఘ తీరప్రాంతం ఉండటం. సాంకేతిక కారణాల వల్ల రాకెట్‌లు కుప్పకూలి పోయినప్పుడు శకలాలు జనావాసాలు మీద పడి ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా సముద్రంలో పడిపోతాయి.
3. రవాణా సదుపాయం. రాకెట్ ప్రయోగాలకు అవసరమైన పరికరాలు, యంత్రాలను దిగుమతి చేసుకునేందుకు వీలుగా రోడ్డు, రైలు, జల రవాణా సదుపాయం ఉంది.
4. అనుకూల వాతావరణం. ఎక్కువ ఎండలు, ఎక్కువ వర్షపాతం లేకుండా ఏడాది పొడవునా ప్రయోగాలకు అనుకూల వాతావరణం ఉంటుంది.
5. ధృడమైన భూ స్వభావం. రాకెట్ ప్రయోగ సమయంలో భూమి తీవ్రంగా కంపిస్తుంది. దాన్ని తట్టుకునేలా భూమి అత్యంత ధృడంగా ఉండాలి. శ్రీహరికోటలో భూమి రాళ్లతో ధృడంగా ఉంటుంది.

పాన్ కార్డు ఎప్పుడు అవసరం..?

ఆదాయపు పన్ను శాఖ ప్రతి ఒక్కరికీ కేటాయించే శాశ్వత ఖాతా సంఖ్య (పర్మెనెంట్ అకౌంట్ నెంబర్)ను పాన్ అంటారు. ఐటీ పాన్ సర్వీస్ సెంటర్లలో, టిన్ ఫెసిలిటేషన్ కేంద్రాల్లో పాన్‌కార్డ్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.



- రూ.50 వేల కంటే ఎక్కువ మొత్తాన్ని బ్యాంకులో డిపాజిట్ చేసేటప్పుడు.
- బ్యాంకు ఖాతా, డీ మ్యాట్, ట్రేడింగ్ ఖాతా తెరిచేందుకు.
- చెక్కులు, డీడీల లావాదేవీలు రూ.50 వేలకు మించితే.
- స్థిరాస్తి, వాహనాల కొనుగోలు, అమ్మకాలు జరిపేటప్పుడు.
- ఆదాయపు పన్ను రిటర్న్‌లు సమర్పించేటప్పుడు పాన్ కార్డ్ అవసరం.



Quote of the Day
Education is an ornament in prosperity and a refuge in adversity. - ***Aristotle***

బాఫ్టా ఉత్తమ చిత్రం?

బాఫ్టా అవార్డులు



బ్రిటిష్ అకాడమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఆర్ట్స్ (బాఫ్టా).. లండన్ కేంద్రంగా పనిచేస్తున్న సంస్థ. ఇది ఏటా బ్రిటిష్ అకాడమీ ఫిల్మ్ అవార్డులు లేదా బాఫ్టా ఫిల్మ్ అవార్డులను ప్రదానం చేస్తోంది. ఈ అవార్డులను 1949 నుంచి ఇస్తున్నారు. వీటిని బ్రిటన్‌లో ఆస్కార్ అవార్డులకు సమానంగా పరిగణిస్తారు (ఆస్కార్ అవార్డులను అమెరికాలో ప్రదానం చేస్తారు).

- 71వ బాఫ్టా అవార్డుల ఉత్సవం 2018, ఫిబ్రవరి 18న లండన్‌లోని రాయల్ ఆల్బర్ట్ హాల్లో జరిగింది. ''త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి'' అనే చిత్రానికి అత్యధికంగా 5 అవార్డులు దక్కాయి. ఇందులో ఉత్తమ చిత్రం, ఉత్తమ బ్రిటిష్ చిత్రం అవార్డులు కూడా ఉండటం విశేషం. బాఫ్టా ఫెలోషిప్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రఖ్యాత దర్శకుడు సర్ రిడ్లీ స్కాట్‌కు అందజేశారు.
- **ఉత్తమచిత్రం:** త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి.
- **ఉత్తమ దర్శకుడు:** గిలెర్మో డెల్ టోరో (ది షేప్ ఆఫ్ వాటర్).
- **ఉత్తమ నటుడు:** గ్యారీ ఓల్డ్‌మ్యాన్ (డార్కెస్ట్ అవర్).
- **ఉత్తమ నటి:** ఫ్రాన్సెస్ మెక్ డొర్మాండ్ (త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి).
- **ఉత్తమ సహాయ నటుడు:** సామ్ రాక్‌వెల్ (త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి).
- **ఉత్తమ సహాయనటి:** ఆలిసన్ జేనీ (ఐ, టోన్యా).

గోల్డెన్ గ్లోబ్ అవార్డులు



గోల్డెన్ గ్లోబ్ అవార్డులను అమెరికాలో చలనచిత్ర, టెలివిజన్ రంగాల్లో చూపిన ప్రతిభకు ఇస్తారు. వీటిని 1944లో ప్రారంభించారు. 75వ గోల్డెన్ గ్లోబ్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం 2018, జనవరి 7న కాలిఫోర్నియాలోని బెవర్లీ హిల్స్‌లో జరిగింది. త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి.. అత్యధికంగా నాలుగు అవార్డులు గెలుచుకుంది.

'డ్రామా' విభాగంలో విజేతల వివరాలు..

- **ఉత్తమ చిత్రం:** త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైట్ ఎబ్బింగ్, మిస్సోరి.
- **ఉత్తమ నటుడు:** గ్యారీ ఓల్డ్‌మ్యాన్ (డార్కెస్ట్ అవర్).
- **ఉత్తమ నటి:** ఫ్రాన్సెస్ మెక్ డొర్మండ్ (త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి).
- **ఉత్తమ దర్శకుడు:** గిలెర్మో డెల్ టోరో (ది షేప్ ఆఫ్ వాటర్).


ఫిల్మ్‌ఫేర్ అవార్డులు



63వ ఫిల్మ్‌ఫేర్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని 2018, జనవరి 20న ముంబైలో నిర్వహించారు. 2017లో విడుదలైన ఉత్తమ హిందీ చిత్రాలకు అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమానికి షారుక్ ఖాన్, కరణ్ జోహార్ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. జగ్గా జాసూస్ చిత్రం అత్యధికంగా నాలుగు అవార్డులు గెలుచుకుంది.

- **ఉత్తమ చిత్రం:** హిందీ మీడియం.
- **ఉత్తమ నటుడు:** ఇర్ఫాన్ ఖాన్ (హిందీ మీడియం).
- **ఉత్తమ నటి:** విద్యాబాలన్ (తుమ్హారీ సులూ).
- **ఉత్తమ దర్శకురాలు:** అశ్విని అయ్యర్ తివారీ (బరేలీ కీ బర్ఫీ).
- **ఉత్తమ సహాయ నటుడు:** రాజ్‌కుమార్ రావ్ (బరేలీ కీ బర్ఫీ).
- **ఉత్తమ సహాయనటి:** మెహర్ విజ్ (సీక్రెట్ సూపర్‌స్టార్).
- **క్రిటిక్స్ ఉత్తమ చిత్రం:** న్యూటన్.
- **క్రిటిక్స్ ఉత్తమ నటుడు:** రాజ్‌కుమార్ రావ్ (ట్రాప్డ్).
- **క్రిటిక్స్ ఉత్తమ నటి:** జైరా వసీం (సీక్రెట్ సూపర్‌స్టార్).
- **లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు:** మాలాసిన్హా , బప్పీ లహిరి.

క్రిస్టల్ అవార్డులు



ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సమావేశాలు ఏటా జనవరిలో స్విట్జర్లాండ్‌లోని దావోస్ నగరంలో జరుగుతాయి. ఈ సమావేశాల్లో క్రిస్టల్ అవార్డులను బహూకరిస్తారు. ప్రపంచ స్థితిగతులను అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తున్న ప్రఖ్యాత కళాకారులకు ఈ అవార్డులను అందజేస్తారు. 2018, జనవరి 22న క్రిస్టల్ అవార్డులను ముగ్గురు కళాకారులకు ప్రదానం చేశారు. వీరిలో బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్ కూడా ఉండటం విశేషం.

24వ క్రిస్టల్ అవార్డు విజేతలు

- **కేట్ బ్లాంచేట్:** ప్రఖ్యాత హాలీవుడ్ నటి. 2016లో యునైటెడ్ నేషన్స్ హై కమిషనర్ ఫర్ రెఫ్యూజీస్ (యుఎన్‌హెచ్‌సీఆర్)కు ప్రపంచ సౌహార్ద రాయబారిగా నియమితులయ్యారు. శరణార్థుల సంక్షోభం గురించి అవగాహన కల్పించినందుకు కేట్.. క్రిస్టల్ అవార్డు అందుకున్నారు.
- **సర్ జాన్ ఎల్టన్:** ఇంగ్లండ్‌కు చెందిన విఖ్యాత గాయకుడు. ఎయిడ్స్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్నారు.
- **షారుక్ ఖాన్:** లాభాపేక్ష లేని 'మీర్ ఫౌండేషన్'ను స్థాపించారు. ఈ సంస్థ యాసిడ్ దాడికి గురైన మహిళలకు చేయూతనిస్తోంది.

సివిల్స్, గ్రూప్స్ ప్రత్యేకం
జీకే, కరెంట్ అఫైర్స్

మోడల్ ప్రశ్నలు

1. 71వ బ్రిటిష్ అకాడమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఆర్ట్స్ (బాఫ్టా) అవార్డుల్లో ఉత్తమ చిత్రంగా ఎంపికైనది?
   1) త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి
   2) ది షేప్ ఆఫ్ వాటర్
   3) డార్కెస్ట్ అవర్ 4) ఐ, టోన్యా
2. బాఫ్టా అవార్డులను ఎప్పటి నుంచి ప్రదానం చేస్తున్నారు?
   1) 1987 2) 1973
   3) 1965 4) 1949
3. త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి ఎన్ని బాఫ్టా అవార్డులను గెలుచుకుంది?
   1) 1 2) 5 3) 3 4) 6
4. 2018లో బాఫ్టా ఫెలోషిప్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ఎవరికి అందజేశారు?
   1) ఆలిసన్ జేనీ 2) మెక్ డొర్మాండో
   3) గిలెర్మో డెల్ టోరో
   4) సర్ రిడ్లీ స్కాట్
5. 63వ ఫిల్మ్‌ఫేర్ అవార్డుల్లో ఎక్కువ అవార్డులు గెలుచుకున్న చిత్రం?
   1) హిందీ మీడియం 2) జగ్గా జాసూస్
   3) సీక్రెట్ సూపర్‌స్టార్ 4) ట్రాప్డ్
6. 2018, జనవరి 22న డబ్ల్యూఈఎఫ్ వార్షిక సమావేశాల్లో ముగ్గురు క్రిస్టల్ అవార్డులు అందుకున్నారు. వీరిలో ఉన్న బాలీవుడ్ నటుడు?
   1) అమీర్‌ఖాన్ 2) షారుక్ ఖాన్
   3) నానా పటేకర్ 4) గోవింద

సమాధానాలు
1) 1; 2) 4; 3) 2; 4) 4; 5) 2; 6) 2.



ఎన్.విజయేందర్‌రెడ్డి
విజయేందర్ అకాడమీ
హైదరాబాద్.

బులెటిన్ బోర్డ్

ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో 15 ఖాళీలు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ (ఎన్ఐఆర్‌డీపీఆర్)... కాంట్రాక్టు పద్ధతిలో 15 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు-ఖాళీలు:** పీఎంఏ హెడ్-1; డిప్యూటీ పీఎంఏ హెడ్-3; థిమాటిక్ ఎక్స్‌పర్ట్-11. థిమాటిక్ ఎక్స్‌పర్ట్‌లో స్ట్రాటజీ డెవలప్‌మెంట్, సోషల్ బ్రాండ్ మేనేజ్‌మెంట్, ఐఈసీ అండ్ ఐసీటీ, కెపాసిటీ బిల్డింగ్, రీసెర్చ్ అండ్ పాలసీ, ఫైనాన్స్, స్టాండర్డ్స్ అండ్ క్వాలిటీ అస్యూరెన్స్, ప్రొక్యూర్‌మెంట్, డేటా అనాలిసిస్, అసెస్‌మెంట్ అండ్ సర్టిఫికేషన్, ఎంఐఎస్ విభాగాల్లో ఒక్కొక్కటి చొప్పున ఖాళీలున్నాయి.
- **వేతనం:** పీఎంఏ హెడ్-రూ.2,50,000; డిప్యూటీ పీఎంఏ హెడ్-రూ.1,50,000; థిమాటిక్ ఎక్స్‌పర్ట్-రూ.1,00,000.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి పీజీతో పాటు నిబంధనల మేరకు ఉద్యోగానుభవం, సంబంధిత రంగంలోని ప్రత్యేకాంశాలపై నైపుణ్యం తదితర అర్హతలుండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** మార్చి 6, 2018.
- **వెబ్‌సైట్:** **www.nird.org.in**

ఎస్‌వీఎన్ఐటీలో 8 ఖాళీలు

సూరత్‌లోని సర్దార్ వల్లభాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్‌వీఎన్ఐటీ)... 8 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు-ఖాళీలు:** రీసెర్చ్ అసోసియేట్-1 (ఆర్ఏ1)-2; సీనియర్ రీసెర్చ్ ఫెలో (ఎస్ఆర్ఎఫ్)-2; జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్)-2; స్కిల్డ్/క్లరికల్-1; అన్‌స్కిల్డ్-1.
- **స్టైపెండ్:** ఆర్ఏ 1కు రూ.36,000; ఎస్ఆర్ఎఫ్-రూ.28,000; జేఆర్ఎఫ్-రూ.25,000; స్కిల్డ్/క్లరికల్-రూ.17,370; అన్‌స్కిల్డ్-రూ.13,110.
- **అర్హతలు:** అన్‌స్కిల్డ్‌కు కనీసం పదోతరగతి; స్కిల్డ్/క్లరికల్‌కు ఐటీఐ/ఇంజనీరింగ్ డిప్లొమా; మిగిలిన వాటికి మెకానికల్/ఏరోస్పేస్/ఏరోనాటికల్/ఎలక్ట్రానిక్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్/ఎలక్ట్రికల్‌లో బీఈ/బీటెక్/ఎంఈ/ఎంటెక్/పీహెచ్‌డీ. అలాగే పోస్టును బట్టి నిబంధనల మేరకు అనుభవం, నెట్/గేట్/కంప్యూటర్ పరిజ్ఞానం తదితర అర్హతలుండాలి.
- **ఎంపిక:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు విధానం:** ఈ-మెయిల్.
- **దరఖాస్తు సమర్పణకు చివరి తేదీ:** ఫిబ్రవరి 28, 2018.
- **వెబ్‌సైట్:** **www.svnit.ac.in**

సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైకియాట్రీలో ప్రవేశాలు

ఛత్తీస్‌గఢ్‌లోని రాంచీలో ఉన్న సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైకియాట్రీ... పీజీ డిగ్రీ/డిప్లొమా, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

- **కోర్సులు-సీట్లు:** డిప్లొమా (సైకియాట్రిక్ నర్సింగ్)-15; ఎంఫిల్ (క్లినికల్ సైకాలజీ)-12; ఎంఫిల్ (సైకియాట్రిక్ సోషల్ వర్క్)-12; పీహెచ్‌డీ (క్లినికల్ సైకాలజీ)-4. ఇందులో ఎంఫిల్, పీహెచ్‌డీకి నెలకు రూ.8,000; డిప్లొమాకు నెలకు రూ.2,500 స్కాలర్‌షిప్ ఇస్తారు.
- **అర్హతలు:** పీహెచ్‌డీకి ఎంఫిల్ (మెడికల్ అండ్ సోషల్ సైకాలజీ/క్లినికల్ సైకాలజీ); ఎంఫిల్ (క్లినికల్ సైకాలజీ)కి ఎంఏ/ఎంఎస్సీ (సైకాలజీ); ఎంఫిల్ (సైకియాట్రిక్ సోషల్ వర్క్)కు ఎంఏ (సోషియాలజీ/మాస్టర్ ఇన్ సోషల్ వర్క్; డిప్లొమా (సైకియాట్రీ నర్సింగ్)కు జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీలో 'ఎ' గ్రేడ్ సర్టిఫికెట్/డిప్లొమా.
- **ఎంపిక:** పీహెచ్‌డీ, ఎంఫిల్ కోర్సులకు రాతపరీక్ష, ఇంటర్వ్యూ, ప్రాక్టికల్ టెస్ట్; డిప్లొమా కోర్సుకు ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు రుసుం:** అన్‌రిజర్వ్‌డ్/ఓబీసీ-రూ.400; ఎస్సీ/ఎస్టీ-రూ.300.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకొని, హార్డ్‌కాపీకి సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి పంపాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 15, 2018.
- **హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ:** మార్చి 20, 2018.
- **వెబ్‌సైట్:** **www.cipranchi.nic.in**

సాక్షి బిజినెస్
శుక్రవారం 23-2-2018
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
25 ▼	15 ▼
33,819	10,383

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 10.30కి)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	7,270	▲	51
డోజోన్స్	25,129	▲	331
ఎఫ్‌టీఎస్ఈ 100	7,252	▼	29
డాక్స్	12,462	▼	9
షాంఘై	3,269	▲	70
నికాయ్	21,736	▼	234

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	65.80	65.93
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	91.79	91.97
€	యూరో	ఎస్‌బీఐ	81.10	81.26
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	61.58	61.70
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.65	51.76
SS	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	49.85	49.95
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.74	18.66
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	16.11	18.83
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.25	11.76

'టైమ్'.. చాలా ఖరీదు!

ప్రీమియం వాచీలకు డిమాండ్ ● వేగంగా వృద్ధి చెందుతున్న భారత్ ● 2025 నాటికి టాప్-10లో చేరిక



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: చోపా, పాటక్ ఫిలిప్, జేగర్ లేకూల్, వషెరో కున్‌స్టాంటా, ఒడేమార్ పీగే, ఒమేగా, రోలెక్స్, టాగ్ హోయెర్.. ఇటువంటి అత్యంత ఖరీదైన చేతి వాచీ బ్రాండ్లకు భారతీయులు ఉవ్విళ్లూరుతున్నారట. ఇలాంటివి ఇప్పుడు 30 దాకా బ్రాండ్లు ఇక్కడ కొలువుదీరాయి. వీటికోసం కోట్ల రూపాయలు వెచ్చించేందుకు కస్టమర్లు వెనుకాడటం లేదు. పైగా దుబాయ్ వంటి షాపింగ్ కేంద్రాలతో పోలిస్తే వాచీల ధర భారత్‌లోనే తక్కువగా ఉంది. ఇక్కడ అమ్మకాలు పెరిగేందుకు ఈ అంశం దోహదం చేస్తోందని విక్రేతలు చెబుతున్నారు. 2025 నాటికి టాప్-10 లగ్జరీ వాచీల మార్కెట్‌గా భారత్ అవతరించనుందని 160 ఏళ్ల చరిత్ర కలిగిన బ్రాండ్ చోపా అంటోంది.

ఖరీదుకు వెనుకాడరు..

లగ్జరీ కోసం భారతీయులు ఎంతైనా వెచ్చిస్తారని చోపా బ్రాండ్ ఇంటర్నేషనల్ సేల్స్ మేనేజర్ జవియే లెస్సే సాక్షి బిజినెస్ బ్యూరోకు తెలిపారు. రూ.6.9 కోట్ల విలువైన ఇంపీరియల్ వాచీని సైతం భారత్‌లో విక్రయించామని చెప్పారు. తమ కంపెనీకి చెందిన 45 విభాగాల నిపుణులు ఏడాది పాటు శ్రమిస్తే ఒక వాచీ తయారవుతుందని వెల్లడించారు. భారత్ కోసం తయారైన ఎక్స్‌క్లూజివ్ మోడళ్ల కంటే అంతర్జాతీయంగా లభిస్తున్న వాచీలను కొనేందుకు ఇక్కడివారు మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. లగ్జరీ విషయంలో 2025 నాటికి టాప్-10 మార్కెట్లలో ఒకటిగా భారత్ నిలుస్తుందని పేర్కొన్నారు.

నాల్గవ స్థానంలో హైదరాబాద్..

రూ.2 లక్షలు ఆపైన ధర గల వాచీల విభాగం ఏటా 20 శాతం వృద్ధి నమోదు చేస్తోంది. ఈ విభాగంలో నెలకు దేశవ్యాప్తంగా 300 పీసులు అమ్ముడవుతున్నాయని అంచనా. మూడేళ్ల క్రితం ఈ సంఖ్య 200 పీసులు ఉండేదని సమాచారం. కొనుగోళ్ల పరంగా ఢిల్లీ, ముంబై, బెంగళూరు తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. నాల్గవస్థానం కోసం హైదరాబాద్, చెన్నైలు పోటీపడుతున్నాయని వాచీల రిటైల్ దిగ్గజం కమల్ వాచ్ కంపెనీ ఎండీ వేణు గోపాల్ తెలిపారు. దుబాయ్ వంటి షాపింగ్ డెస్టినేషన్లతో పోలిస్తే భారత్‌లోనే ధర 8 శాతం దాకా తక్కువగా ఉందన్నారు. దీంతో దేశీయంగా కొనుగోళ్లు పెరిగాయని తెలిపారు. 23 స్టోర్ల ద్వారా తాము 50 రకాల బ్రాండ్ల వాచీలను హైదరాబాద్ సహా పలు నగరాల్లో విక్రయిస్తున్నట్టు చెప్పారు. వచ్చే ఏడాది చివరినాటికి మరో 15 కేంద్రాలు నెలకొల్పుతామన్నారు.

ఇదీ వాచీల మార్కెట్..

భారత్‌లో వాచీల విపణి వార్షిక పరిమాణం రూ.7,700 కోట్లకు చేరుకుంది. అవ్యవస్థీకృత రంగంలోనూ ఇదే స్థాయిలో వ్యాపారం జరుగుతోంది. వ్యవస్థీకృత రంగంలో అన్ని ధరల శ్రేణుల్లో 75 బ్రాండ్ల దాకా పోటీపడుతున్నాయి. ఏటా పరిశ్రమ 15 శాతం వృద్ధి చెందుతోంది. మొత్తం అమ్మకాల్లో రూ.10,000 లోపు వాచీలు 65 శాతం ఉంటాయి. రూ.10 వేల నుంచి రూ.1 లక్ష వరకు 20 శాతం, రూ.1 లక్ష పైన ఖరీదైన వాచీల పరిమాణం 15 శాతముందని రిటైల్ చైన్ బ్రాండ్ జస్ట్ వాచెస్ చెబుతోంది. ఇక భారత్‌కు దిగుమతి అవుతున్న వాటిలో స్విస్ వాచీల వాటా ఏకంగా 30 శాతం దాకా ఉంది. పెద్ద పెద్ద బ్రాండ్లను పోలిన నకిలీ వాచీలు ఆన్‌లైన్‌లో లక్షలాది రకాలు లభిస్తున్నాయి.

మార్కెట్‌లోకి రోల్స్‌రాయిస్ 'ఫాంటమ్-8'

ప్రారంభ ధర రూ.9.5 కోట్లు



చెన్నై: అల్ట్రా-లగ్జరీ కార్ల తయారీ కంపెనీ 'రోల్స్‌రాయిస్' తాజాగా 8వ జనరేషన్ ఫాంటమ్ కారును భారత్ మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. దీని ప్రారంభ ధర రూ.9.5 కోట్లు. ప్రొడక్టు పోర్ట్‌ఫోలియో విస్తరణ భాగంలో కంపెనీ ఈ కారును ఆవిష్కరించింది. 'మాకు మంచి భాగస్వామి (కేయూఎన్ ఎక్స్‌క్లూజివ్) లభించింది. దక్షిణ భారతదేశంలో వ్యాపారం వృద్ధి చెందుతోంది' అని రోల్స్‌రాయిస్ మోటార్ కార్స్ (ఆసియా-పసిఫిక్) రీజినల్ డైరెక్టర్ పాల్ హారిస్ తెలిపారు. ఆయన ఇక్కడ జరిగిన కారు ఆవిష్కరణ కార్యక్రమంలో మాట్లాడారు. కేయూఎన్ ఎక్స్‌క్లూజివ్ చెన్నై, హైదరాబాద్‌లో కంపెనీకి అధికారిక డీలర్‌గా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. కాగా రోల్స్‌రాయిస్‌కి దక్షిణ భారతదేశంలో ఐదు ఔట్‌లెట్స్ ఉన్నాయి.

ప్రత్యేకతలు

6.75 లీటర్ ఇంజిన్..

ఫాంటమ్-8లో 6.75 లీటర్ ట్విన్ టర్బోచార్జ్‌డ్ వీ-12 ఇంజిన్‌ను అమర్చినట్లు కంపెనీ తెలిపింది. ఇది 0-100 కిలోమీటర్ల వేగాన్ని కేవలం 5.4 సెకన్లలో అందుకుంటుందని పేర్కొంది. ఇక ఫాంటమ్ స్టాండర్డ్ వీల్‌బేస్ వేరియంట్ ధర రూ.9.5 కోట్లుగా, ఫాంటమ్ ఎక్స్‌టెండెడ్ వీల్‌బేస్ వేరియంట్ ధర రూ.11.35 కోట్లుగా ఉంటుందని తెలిపింది. నాలుగేళ్ల సర్వీస్ ప్యాకేజ్, రీజినల్ వారంటీ వంటివి ఈ ధరలో భాగమేనని పేర్కొంది.

జీడీపీలో 15 శాతానికి కుబేరుల సంపద

- మరింత పేదరికంలోకి బడుగువర్గాలు
- భారత్‌లో మూడు దశాబ్దాల్లో పెరిగిన అసమానతలు
- ఆక్స్‌ఫామ్ ఇండియా నివేదిక



న్యూఢిల్లీ: ప్రభుత్వాల అసమగ్ర విధానాలతో భారత్‌లో గడిచిన మూడు దశాబ్దాల్లో అసమానతలు భారీగా పెరిగిపోయాయి. స్థూల దేశీయోత్పత్తిలో (జీడీపీ) కేవలం కొద్ది మంది కుబేరుల వాటా పెరుగుతుండగా.. పేదల వాటా అంతకంతకూ తగ్గిపోతోంది. ఆక్స్‌ఫామ్ ఇండియా విడుదల చేసిన ఓ నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం అయిదేళ్ల క్రితం జీడీపీలో పది శాతానికి పరిమితమైన కుబేరుల సంపద వాటా ప్రస్తుతం ఏకంగా 15 శాతానికి పెరిగిపోయింది. వారసత్వ ఆస్తులతోను, క్రోనీ క్యాపిటలిజం మార్గంలోనూ దేశీయంగా సంపన్నులు భారీ ఎత్తున సంపదను పోగేసుకుంటున్నట్లు ఆక్స్‌ఫామ్ వివరించింది. భారత్‌లో ఆర్థిక అసమానతలు గణనీయంగా పెరుగుతుండటానికి.. 1991 నాటి ఆర్థిక సంస్కరణల సమయంలోనూ, ఆ తర్వాత నుంచీ వివిధ ప్రభుత్వాలు పాటిస్తూ వస్తున్న విధానాలే కారణమని పేర్కొంది. 2017లో భారత్‌లో 101 మంది బిలియనీర్స్ ఉన్నారు.

నివేదిక ప్రకారం.. ఆదాయం, వినియోగం, సంపద మొదలైన విషయాలన్నింటిలోనూ అత్యధిక అసమానతలున్న దేశాల జాబితాలో భారత్ కూడా ఉంది. ఒకదానితర్వాత మరొకటి వచ్చిన ప్రభుత్వాలు ఎంచుకున్న అసమగ్ర విధానాలే ఇందుకు కారణమని వివరించింది. 1980లలో ఒకే స్థాయిలో స్థిరంగా కొనసాగిన అసమానతలు.. 1991 నుంచి 2017 దాకా ఏ విధంగా పెరుగుతూ వచ్చాయన్నది.. వివిధ గణాంకాల ఆధారంగా ఆక్స్‌ఫామ్ ఇండియా విశ్లేషించింది. 'ఇప్పటికే కులం, మతం, ప్రాంతం మొదలైన అంశాలతో బీటలు బారిన సమాజానికి ఆర్థిక అసమానతలు కూడా తోడవుతుండటం ఆందోళనకరమైన విషయం. నైతికత కోణంలోనే కాకుండా.. ప్రజాస్వామ్య వ్యవస్థ సజావుగా పనిచేసేందుకు కూడా అసమానతలను తగ్గించడం చాలా ముఖ్యం' అని నివేదికను రూపొందించిన ప్రొఫెసర్ హిమాంశు తెలిపారు.

ప్రగతిశీల పన్నుల విధానాలే మందు..

పెరుగుతున్న ఆర్థిక అసమానతల తీరును తగ్గించేందుకు ప్రగతిశీల పన్నుల విధానాలతో పన్ను రాబడులు పెంచుకోవడమే సరైన పరిష్కారం కాగలదని నివేదిక పేర్కొంది. సంపద పన్ను, వారసత్వ పన్ను మొదలైనవి ప్రవేశపెట్టాలని.. ఆ రూపంలో వచ్చే ఆదాయాన్ని పేదల విద్య, వైద్యం, పౌష్టికాహార కల్పన తదితర అంశాలకు ఉపయోగించాలని సూచించింది. బడుగువర్గాలు అభివృద్ధి చెందేందుకు .. ఆయా వర్గాల పిల్లలకు బాల్యం నుంచే తోడ్పాటు అందించడంపై మరింతగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పేర్కొంది.

ప్రభుత్వ బ్యాంకులపై అంచనాల కోత

షేర్ల ధరల లక్ష్యాలూ తగ్గింపు ● గోల్డ్‌మ్యాన్ శాక్స్ నిర్ణయం



న్యూఢిల్లీ: గోల్డ్‌మ్యాన్ శాక్స్ గ్రూపు భారత్‌కు చెందిన మూడు ప్రభుత్వరంగ బ్యాంకుల ఆదాయ అంచనాలను తగ్గించింది. ఆయా బ్యాంకుల షేర్ల ధరల అంచనాలకూ కోతేసింది. ప్రభుత్వరంగ పంజాబ్ నేషనల్ బ్యాంకులో భారీ స్కామ్ వెలుగు చూసిన నేపథ్యంలో ఈ మేరకు సవరణలు చేసింది. ఎస్‌బీఐ ఒక శాతం మేర, బ్యాంకు ఆఫ్ బరోడా 12 శాతం మేర, పంజాబ్ నేషనల్ బ్యాంకు 30 శాతం మేర ఆదాయాన్ని కోల్పోతాయని గోల్డ్‌మ్యాన్ అంచనాలు వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వ భారీ రీక్యాపిటలైజేషన్ సాయంలో మొదటి విడత అందిన నిధులను పరిగణనలోకి తీసుకుని మరీ అంచనాలకు కోతేయడం గమనార్హం. 2019, 2020 సంవత్సరాలకు సంబంధించి కూడా ఈ మేరకు అంచనాలను తగ్గించింది. రిస్క్ భరించాల్సిన సామర్థ్యం, స్కామ్ అనంతరం నియంత్రణలపై మరింత దృష్టి సారించాల్సి రావడం అన్నవి స్వల్ప కాలంలో వృద్ధిని దెబ్బతీయవచ్చని గోల్డ్‌మ్యాన్ శాక్స్ అనలిస్ట్ తన నివేదికలో పేర్కొన్నారు. ఎస్‌బీఐ, బీవోబీలకు సంబంధించి ఈక్విటీ విస్తరణ కారణంగా ఈపీఎస్ అంచనాలను తగ్గిస్తున్నట్టు పేర్కొంది. ముఖ్యంగా పీఎన్‌బీలో స్కామ్ కారణంగా కేటాయింపులు పెరిగి ఈపీఎస్ గణనీయంగా తగ్గుతుందని, వృద్ధి కూడా తక్కువగానే ఉంటుందని పేర్కొంది. పీఎన్‌బీలో స్కామ్ బయటకు వచ్చిన తర్వాత స్టాక్ మార్కెట్లో బ్యాంకు షేర్లు భారీగా పడిన సంగతి తెలిసిందే.

బ్యాంకుల ఆదాయం తగ్గుతుంది

ఆర్‌బీఐ కొత్త నిబంధనలపై ఫిచ్ అంచనాలు



మొండి బకాయిల వసూళ్లను వేగవంతం చేసే లక్ష్యంతో ఆర్‌బీఐ తీసుకొచ్చిన నూతన నిబంధనలు స్వల్పకాలంలో బ్యాంకింగ్ రంగ ఆదాయాలను దెబ్బతీయవచ్చని రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ అభిప్రాయపడింది. అయితే, ప్రభుత్వం నుంచి మూలధన సాయం, మొండి బకాయిల సమస్యను పరిష్కరించేందుకు నియంత్రణ పరంగా బలమైన చర్యల వల్ల మధ్యకాలంలో ఈ రంగం పుంజుకుంటుందని తన నివేదికలో అంచనా వేసింది. దేశ బ్యాంకింగ్ రంగంపై ఈ సంస్థ ప్రతికూల ధోరణితో ఉంది. బ్యాంకులు భారీగా రుణం తీసుకున్న వారి ఎగవేతల గురించి ప్రతీ వారం వెల్లడించాల్సి ఉంటుందని, మొండి బాకీల పరిష్కారంలో వేగవంతమైన విధానాన్ని ఇది సూచిస్తోందని పేర్కొంది.

కుంభకోణంతో పీఎన్‌బీపై దిద్దుబాటు చర్యలు



భారీ కుంభకోణం నేపథ్యంలో ప్రభుత్వ రంగ పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) విషయంలో రిజర్వ్ బ్యాంక్ సత్వర దిద్దుబాటు చర్యలు (పీసీఏ) అమలు చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో పీఎన్‌బీలో కొన్నాళ్ల పాటు రుణ వితరణ కార్యకలాపాలు నిల్చిపోవచ్చని కోటక్ ఇనిస్టిట్యూషనల్ ఈక్విటీస్ సంస్థ ఒక నివేదికలో పేర్కొంది. కుంభకోణం నేపథ్యంలో దిద్దుబాటు చర్యలు అమలు చేసే అవకాశాలను తోసిపుచ్చలేమని వివరించింది. స్కామ్ ఉదంతంతో మూలధన నిష్పత్తిపై సుమారు 230 బేసిస్ పాయింట్ల మేర ప్రతికూల ప్రభావం పడగలదని తెలిపింది. దీంతో తగినంత స్థాయికి మూలధనం పెంచుకునేదాకా పీఎన్‌బీ రుణ వితరణను నిలిపివేయొచ్చని కోటక్ వివరించింది. ఒకవేళ నిధుల సమీకరణ కోసం కొన్ని అనుబంధ సంస్థలు, జాయింట్ వెంచర్స్‌లో వాటాలు విక్రయించినా.. కాంట్రాక్టుల నిబంధనల ప్రకారం ఆ నిధులు చేతికొచ్చేందుకు కొంత సమయం పడుతుందని తెలిపింది.

భారత్‌లో పెట్టుబడులు కొనసాగిస్తాం

- పదేళ్లలో 10 రెట్లు వృద్ధి లక్ష్యం
- ఉబెర్ సీఈవో దారా ఖోస్రోషాహి



న్యూఢిల్లీ: ప్రముఖ ట్యాక్సీ సేవల సంస్థ 'ఉబెర్' తాజాగా భారత్‌లో పెట్టుబడులు కొనసాగిస్తామని స్పష్టం చేసింది. 'ఇండియా మాకు చాలా ముఖ్యమైన ప్రాంతం. ప్రధానమైన మార్కెట్ కూడా. ఇక్కడ వచ్చే దశాబ్ద కాలంలో దాదాపు 10 రెట్లు వరకు వృద్ధిని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం' అని ఉబెర్ సీఈవో దారా ఖోస్రోషాహి తెలిపారు. తొలిసారి భారత్‌లో పర్యటిస్తోన్న ఆయన.. సంస్థ ప్రధాన ఇన్వెస్టర్ అయిన సాఫ్ట్‌బ్యాంక్ సలహాలను స్వీకరించబోమనే సంకేతాలిచ్చారు. కంపెనీ వ్యూహాలను బోర్డు నిర్ణయిస్తుందని తెలిపారు. 'సాఫ్ట్‌బ్యాంక్‌కు ఒక అభిప్రాయం ఉండొచ్చు. అయితే అదే అంతిమం కాదు. సంస్థలో చాలా అభిప్రాయాలు ఉంటాయి' అని పేర్కొన్నారు. ఇన్వెస్ట్‌మెంట్లు, వృద్ధి వంటి అంశాల పరంగా చూస్తే కంపెనీ సంతులిత ప్రొఫైల్‌ను కలిగి ఉండాలని తెలిపారు. ఉబెర్ ఇప్పటికే బలమైన మార్కెట్ కలిగిన దేశాలకు తిరిగి వెళ్లాలని, లాభదాయకతపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాలని సాఫ్ట్‌బ్యాంక్ ఇటీవల అభిప్రాయపడిన విషయం తెలిసిందే. ఉబెర్‌లో సాఫ్ట్‌బ్యాంక్ ప్రధాన వాటాదారు. ఈ సంస్థకు ఉబెర్ ప్రత్యర్థి ఓలాలోనూ వాటా ఉంది.

ఇక్కడి మార్కెట్‌పై నమ్మకముంది..

భారత్‌లో ఎంత మొత్తంలో ఇన్వెస్ట్ చేస్తారనే విషయాన్ని మాత్రం దారా ఖోస్రోషాహి వెల్లడించలేదు. అయితే అధిక మొత్తంలో పెట్టుబడులు పెడతామని, అలాగే వీటిని భవిష్యత్‌లోనూ కొనసాగిస్తామని పేర్కొన్నారు. 'భారత్‌లో మా వ్యాపారం లాభదాయకంగా ఏమీ లేదు. అయినా ఇక్కడి మార్కెట్‌పై నమ్మకంగా ఉన్నాం. అందుకే పెట్టుబడులను కొనసాగిస్తాం' అని తెలిపారు. ఉబెర్ గ్లోబల్ ట్రిప్స్‌లో ఇండియా 10 శాతానికి పైగా వాటాను కలిగి ఉందని, రానున్న రోజుల్లో ఈ వాటా మరింత పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. భారత్, లాటిన్ అమెరికా వంటి మార్కెట్లు రానున్న కాలంలో ఉబెర్‌కు అపార వృద్ధి అవకాశాలను అందిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కాగా దారా ఖోస్రోషాహి తన రెండు రోజుల పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీని, ఇతర ప్రముఖులను కలిసే అవకాశముంది. ఇక ఇండియాలో 29 పట్టణాల్లో ఉబెర్‌కు దాదాపు 3 లక్షల మంది డ్రైవర్ పార్ట్‌నర్లు ఉన్నారు.

మీ ఫండ్ పేరు మారుతోందా!?



- సెబీ 'వన్ స్కీమ్ పర్ కేటగిరీ' నిబంధన నేపథ్యం
- ఇప్పటికే పలు పథకాల పేర్లలో మార్పులు
- ఇన్వెస్టర్లు, డిస్ట్రిబ్యూటర్లు, అడ్వైజర్లకు సమస్యే!
- స్కీమ్స్ బ్రాండ్‌పై ప్రతికూల ప్రభావం పడొచ్చు!!
- విలీనాలతో గణనీయంగా తగ్గనున్న స్కీమ్స్ సంఖ్య

మ్యూచువల్ ఫండ్ సంస్థలు వాటి పథకాల పేర్లను మారుస్తున్నాయి. మార్కెట్ నియంత్రణ సంస్థ 'సెబీ' ఇటీవల ప్రకటించిన కొత్త నిబంధనల నేపథ్యంలో ఆయా ఫండ్ సంస్థలు ఈమేరకు వాటి పథకాల పేర్లలో మార్పులు చేస్తున్నాయి. దీంతో రానున్న కొన్ని వారాల్లో దాదాపు 300-400 వరకు మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) స్కీమ్స్ పేర్లు మారబోతున్నాయి. సెబీ 'వన్ స్కీమ్ పర్ కేటగిరీ' రూల్ (ఒక కేటగిరీ నుంచి ఒక స్కీమ్) వల్ల ప్రతి ఐదు పథకాల్లో ఒకదాని పేరు మారుతుందని పరిశ్రమ నిపుణులు అభిప్రాయపడ్డారు.

పేర్ల మార్పు ప్రారంభమైంది..

మ్యూచువల్ ఫండ్ స్కీమ్స్ పేర్ల మార్పు ఇప్పటికే ప్రారంభమైంది. డీఎస్‌పీ బ్లాక్‌రాక్ ఎంఎఫ్, మోతీలాల్ ఓస్వాల్ అసెట్ మేనేజ్‌మెంట్, హెచ్‌ఎస్‌బీసీ ఎంఎఫ్ వంటి సంస్థలు పలు పథకాల పేర్లను మారుస్తున్నట్లు ప్రకటించాయి. ఇంకా చాలా ఫండ్ హౌస్‌లు రెగ్యులేటరీ అనుమతుల కోసం వేచిచూస్తున్నాయని సమాచారం. అంటే రానున్న రోజుల్లో చాలా కంపెనీలు పథకాల పేర్ల మార్పునకు సంబంధించి ప్రకటనలు చేయనున్నాయి.

పథకాలన్నీ ఐదు కేటగిరీల్లోనే..

సెబీ గత అక్టోబర్‌లో ఎంఎఫ్ స్కీమ్స్ కేటగిరైజేషన్, విలీనాలకు సంబంధించి ఒక సర్క్యులర్‌ను జారీ చేసింది. దీని ప్రకారం.. ఫండ్ పథకాలన్నీ .. ఐదు కేటగిరీల్లోనే ఉండాలి. మ్యూచువల్ ఫండ్ సంస్థలు నిధుల సమీకరణ కోసం ఒకే థీమ్ కింద అనేక స్కీములను ప్రవేశపెడుతుండటాన్ని చెక్ పెట్టడానికి, ఇన్వెస్టర్లను మభ్యపెట్టి వారిని పథకాలలో ఇన్వెస్ట్ చేసేలా చేయడాన్ని అడ్డుకోవడానికి సెబీ ఈ కొత్త నిబంధనలు రూపొందించింది. ఇకపై మ్యూచువల్ ఫండ్ స్కీముల్లో కేవలం ఐదు రకాలు ఉండాలని నిర్దేశించింది. దీని ప్రకారం స్కీములన్నింటినీ కూడా ఈక్విటీ, డెట్, హైబ్రీడ్, సొల్యూషన్ ఓరియంటెడ్, అదర్ స్కీమ్ అనే ఐదు కేటగిరీల్లోనే వర్గీకరించాల్సి ఉంటుంది. ఒక కేటగిరీ నుంచి ఒకటే స్కీముకు అనుమతి ఉంటుంది. అయితే ఇండెక్స్ ఫండ్స్, వివిధ సూచీల ఆధారంగా పనిచేసే ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్), రకరకాల స్కీమ్‌ల ఆధారంగా ఉండే ఫండ్ ఆఫ్ ఫండ్స్, వివిధ థీమ్స్‌లో ఇన్వెస్ట్ చేసే సెక్టోరల్ లేదా థీమాటిక్ ఫండ్స్‌కి దీన్నుంచి మినహాయింపు ఉంటుంది.

1,910 పథకాలున్నాయి!

ప్రస్తుతం ఇన్‌కమ్, ఈక్విటీ, ఈక్విటీ లింక్డ్ సేవింగ్ స్కీమ్స్ (ఈఎల్ఎస్ఎస్), బ్యాలెన్స్‌డ్, మనీ మార్కెట్, ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్) వంటి పలు కేటగిరీల్లో దాదాపు 1,910 మ్యూచువల్ ఫండ్ స్కీమ్స్ ఉన్నాయి. సెబీ ఒక కేటగిరీలో ఒకటి కన్నా ఎక్కువ స్కీమ్స్ ఉంటే వాటిని విలీనం చేయడమో లేక వాటి ఫండమెంటల్స్ మార్చడమో చేయాలని అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలను కోరింది. అయితే ఇలా చేయడానికి ఆయా ఫండ్ సంస్థలు సెబీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. స్కీమ్స్ విలీనం వల్ల పథకాల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు పేర్కొన్నాయి. ఇక అడ్వాంటేజ్, క్రెడిట్, ప్లస్, ఆపర్చ్యునిటీస్, ప్రుడెన్స్, ఫోకస్ట్ వంటి పదాలు పథకాల పేర్లలో ఉండటానికి సెబీ అభ్యంతరం తెలిపిందని సమాచారం. ఈ పదాలు ఇన్వెస్టర్లను తప్పుదోవ పటిస్తున్నాయని సెబీ భావిస్తున్నట్లుంది. కాగా స్కీమ్స్ వర్గీకరణ అనేది పరిశ్రమకు చాలా కఠినమైన పని అని నిపుణులు పేర్కొన్నారు. జూన్ వరకు ఈ ప్రక్రియ కొనసాగవచ్చని అంచనా వేశారు.

గందరగోళం తప్పదు..

సెబీ ఎంఎఫ్ పథకాల కేటగిరైజేషన్ నిర్ణయం వల్ల ఇన్వెస్టర్లలో గందరగోళం నెలకొనవచ్చని పరిశ్రమ నిపుణులు అభిప్రాయపడ్డారు. 'పేరు మార్పు వల్ల ఇన్వెస్టర్లలో గందరగోళం ఏర్పడవచ్చు. కొన్ని స్కీమ్స్ బ్రాండ్‌గా అవతరించాయి. ప్రజలు వాటితో అనుసంధానమయ్యారు. ఏ స్కీమ్ పేరు ఏ విధంగా మారిందో తెలుసుకోవడం కష్టమౌతుంది' అని మార్నింగ్‌స్టార్ ఇండియా ఫండ్ రీసెర్చ్ డైరెక్టర్ కౌస్తుభ్ బెలపుర్కర్ తెలిపారు. 'సెబీనే తొలిగా పేర్లకు అనుమతించింది. దశాబ్దాలుగా ఉన్న ఆ పేర్లతోనే ఇప్పుడు సమస్య వస్తోంది. మాకు ఎలాంటి ఆప్షన్ లేదు. రెగ్యులేటర్ నిబంధనలకు అనువుగా మసులుకోవాల్సిందే. కానీ ఇది సరైన పద్ధతి కాదు' అని పేరు వెల్లడించడానికి ఇష్టంలేని ఒక పెద్ద ఫండ్ హౌస్ సీఈవో తెలిపారు. కేవలం ఇన్వెస్టర్లకు మాత్రమే కాకుండా డిస్ట్రిబ్యూటర్లు, అడ్వైజర్లకు కూడా కొత్త నిబంధన వల్ల సమస్యలు ఎదురుకానున్నాయని పేర్కొన్నారు. 'హెచ్‌డీఎఫ్‌సీ ఈక్విటీ, రిలయన్స్ గ్రోత్, రిలయన్స్ ఈక్విటీ ఆపర్చ్యునిటీస్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ వాల్యు డిస్కవరీ ఫండ్, బిర్లా సన్‌లైఫ్ ఫ్రంట్‌లైన్ ఈక్విటీ, హెచ్‌డీఎఫ్‌సీ ప్రుడెన్స్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఫోకస్డ్ బ్లూచిప్, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ ప్రైమా ప్లస్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ వంటి పేరొందిన స్కీమ్స్‌కు ఇన్వెస్టర్లు త్వరగా కనెక్ట్ అవుతారు. ఇవి కేవలం స్కీమ్స్ మాత్రమే కాదు బ్రాండ్స్ కూడా' అని ఓ డిస్ట్రిబ్యూటర్ తెలిపారు.

నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

పత్తి (వరంగల్, వ్యాపారస్తులు)	మిర్చి (వరంగల్, తేజ)	పసుపు (నిజామాబాద్, కొమ్ము)	ఉల్లి (కర్నూలు)	చక్కెర (చెన్నై)	బియ్యం (కరీంనగర్)	కందిపప్పు (చెన్నై)	సుబాబులు (కృష్ణా)	ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)
-- --	-- --	-- --	-- --	రూ.3,600	రూ. 3,800 (హెచ్ఎంటీ)	రూ.7,200	రూ.4,400 (టన్నుకు)	--

త్వరలో భారత్ డైనమిక్స్ ఐపీఓ

- వరుసలో ఐఆర్ఈడీఏ కూడా
- ఈ రెండు ఐపీఓలకు సెబీ ఆమోదం



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ భారత్ డైనమిక్స్ త్వరలో ఐపీఓ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్)కు రానున్నది. ఈ కంపెనీతో పాటు మరో ప్రభుత్వ రంగ సంస్థ ఐఆర్ఈడీఏ(ఇండియన్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ) కూడా ఐపీఓకు రానున్నది. ఈ రెండు కంపెనీల ఐపీఓలకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఇటీవలనే ఆమోదం తెలిపింది.

భారత్ డైనమిక్స్ ఐపీఓ @ రూ.1,000 కోట్లు

1970లో ప్రారంభమైన భారత్ డైనమిక్స్ కంపెనీ క్షిపణులను , ఇతర రక్షణ సాధనాలను తయారు చేస్తోంది. ఐపీఓలో భాగంగా 13 శాతం వాటాకు సమానమైన 2.2 కోట్ల షేర్లను జారీ చేయనున్నది. ఈ ఐపీఓ ద్వారా ఈ కంపెనీ రూ.1,000 కోట్లు సమీకరించే అవకాశాలున్నాయి. గత ఏడాది మార్చి నాటికి కంపెనీ నెట్‌వర్త్ రూ.2,212 కోట్లుగా ఉంది. ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్, ఐడీబీఐ క్యాపిటల్ మార్కెట్స్ అండ్ సెక్యూరిటీస్, యస్ సెక్యూరిటీస్ సంస్థలు ఈ ఐపీఓకు లీడ్ మేనేజర్లుగా వ్యవహరించనున్నాయి.

ఐఆర్ఈడీఏ సమీకరణ... రూ.900 కోట్లు

ఇక ఐఆర్ఈడీఏ ఐపీఓలో భాగంగా 15 శాతం వాటాకు సమానమైన 13.90 కోట్ల ఈక్విటీ షేర్లను జారీ చేయనున్నది. అర్హులైన ఉద్యోగులకు 6.95 లక్షల ఈక్విటీ షేర్లను రిజర్వ్ చేశారు. ఇష్యూ సైజ్ రూ.850–900 కోట్ల రేంజ్‌లో ఉండొచ్చన్న అంచనాలున్నాయి. ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులను భవిష్యత్తు మూలధన అవసరాలకు, సాధారణ వ్యాపార కార్యకలాపాలకు వినియోగించాలని ఈ కంపెనీ యోచిస్తోంది. లిస్టింగ్ తర్వాత ప్రస్తుతం రూ.784 కోట్లుగా ఉన్న ఈ కంపెనీ చెల్లించిన మూల ధనం రూ.923 కోట్లకు పెరుగుతుంది. ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థగా ఈ కంపెనీ 1987 మార్చి నుంచి కార్యకలాపాలు ప్రారంభించింది. ఈ ఐపీఓకు యస్ సెక్యూరిటీస్(ఇండియా), ఎలార క్యాపిటల్(ఇండియా), ఐడీబీఐ క్యాపిటల్ మార్కెట్స్ అండ్ సెక్యూరిటీస్, ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరిస్తాయి.

స్వల్ప నష్టాలు

బలహీనంగా అంతర్జాతీయ సంకేతాలు ● 25 పాయింట్ల పతనంతో 33,820కు సెన్సెక్స్



అంతర్జాతీయ సంకేతాలు అంతంతమాత్రంగానే ఉండడం, రూపాయి బలహీనతల కారణంగా స్టాక్ మార్కెట్ గురువారం క్షీణించింది. ఫిబ్రవరి సిరీస్ డెరివేటివ్స్ కాంట్రాక్టుల ముగింపు కారణంగా సూచీలు ఒడిదుడుకులకు గురయ్యాయి. చివరకు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 25 పాయింట్ల నష్టంతో 33,820 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 15 పాయింట్ల నష్టంతో 10,382 పాయింట్ల వద్ద ముగిశాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 153 పాయింట్లు నష్టపోయింది.

ద్రవ్యోల్బణ భయాలు...

రేట్ల పెంపు అవకాశాలు అధికంగానే ఉన్నాయని అమెరికా ఫెడరల్ రిజర్వ్ మినట్స్ వెల్లడించడం, బాండ్ ఈల్డ్స్ పెరుగుతుండటంతో బుధవారం అమెరికా స్టాక్ మార్కెట్ నష్టపోయింది. ఈ ప్రభావంతో గురువారం ఆసియా మార్కెట్లు నష్టపోవడం మన మార్కెట్‌పై ప్రభావం చూపించింది. ఈ నెల 6–7 మధ్య జరిగిన ఆర్‌బీఐ మోనేటరీ పాలసీ కమిటీ సమావేశంలో ద్రవ్యోల్బణంపై ఆందోళన, ఆర్థిక వ్యవస్థ రికవరీపై అనిశ్చితి వ్యక్తమయ్యాయని వెల్లడి కావడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఇక డాలర్‌తో రూపాయి మారకం ఒక దశలో 34 పైసలు క్షీణించి తాజా మూడు నెలల కనిష్టానికి పడిపోవడం (ఇంట్రాడేలో) ప్రతికూల ప్రభావం చూపించింది. అయితే ఎఫ్ అండ్ ఓ ముగింపు నేపథ్యంలో షార్ట్ కవరింగ్ చోటు చేసుకోవడంతో నష్టాలు తగ్గాయి. ఇక ఈ నెల డెరివేటివ్స్ కాంట్రాక్టుల కాలానికి సెన్సెక్స్ 2,231 పాయింట్లు, నిఫ్టీ 687 పాయింట్లు చొప్పున పతనమయ్యాయి.

ఆర్థిక పరిస్థితులు మెరుగుపడడంతో రేట్లను పెంచాలని అమెరికా ఫెడరల్ రిజర్వ్ సమావేశ వివరాలు వెల్లడించాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. దీనికి తోడు ఈ నెల డెరివేటివ్స్ కాంట్రాక్టుల ముగింపు నేపథ్యంలో ఒడిదుడుకులు చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు. భారత పదేళ్ల బాండ్ల రాబడులు పెరగడం, రూపాయి క్షీణత.. భవిష్యత్తులో అప్రమత్త ట్రేడింగ్‌ను సూచిస్తున్నాయని పేర్కొన్నారు.

ఐడీబీఐ బ్యాంక్ షేరు జోరు: ఐడీబీఐ బ్యాంక్ 5% లాభపడి రూ.74 వద్ద ముగిసింది. గత నాలుగు ట్రేడింగ్ సెషన్లలో ఈ షేర్ 21% ఎగసింది. ఈ బ్యాంక్‌లో 10% వాటా విక్రయం కోసం ప్రభుత్వం సింగపూర్‌కు చెందిన పీఈ సంస్థతో చర్చలు జరుపుతోందన్న వార్తల కారణంగా ఈ షేర్ పెరుగుతోందని నిపుణులంటున్నారు. గత రెండు ట్రేడింగ్ సెషన్లలో స్వల్పంగా లాభపడిన పీఎన్‌బీ షేరు గురువారం 2% పతనమై రూ.115 వద్ద ముగిసింది. ఇక గీతాంజలి జెమ్స్ షేర్ 5% క్షీణించి రూ.26కి పతనమైంది. గత వారం రోజుల్లో ఈ షేర్ 59% వరకూ నష్టపోయింది.

స్టాక్ మార్కెట్ డేటా

టర్నోవర్ (రూ. కోట్లలో)	
బీఎస్ఈ	3,473
ఎన్ఎస్ఈ (ఈక్విటీ)	37,007
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	14,03,991
ఎఫ్ఐఐ	-2,335
డీఐఐ	1,059

ఫెడరల్ బ్యాంక్ చేతికి ఈక్విరస్‌లో 26 శాతం వాటా



ముంబై: ప్రైవేట్ రంగ ఫెడరల్ బ్యాంక్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ రంగంలోకి ప్రవేశించింది. ఇన్వెస్ట్‌మెంట్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈక్విరస్ క్యాపిటల్‌లో 26 శాతం వాటాను కొనుగోలు చేశామని ఫెడరల్ బ్యాంక్ తెలిపింది. ఈ సంస్థలో వాటా కొనుగోలు ద్వారా ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ రంగంలోకి ప్రవేశిస్తున్నామని బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గణేశ్ శంకరన్ తెలిపారు. ఈ వాటా కొనుగోలుతో క్లయింట్లకు మరింత విస్తృతంగా సేవలందించగలమని పేర్కొన్నారు. డెట్, ఈక్విటీ మార్కెట్లకు సంబంధించి, ఆర్థిక, సలహా సేవలందిస్తామని వివరించారు. ప్రవాస భారతీయులకు, సంపన్న వర్గాలకు(హెచ్ఎన్ఐ) వెల్త్ మేనేజ్‌మెంట్ సర్వీస్‌తో సహా మరిన్ని సేవలను అందుబాటులోకి తెస్తామని తెలిపారు.

65 దిగువకు రూపాయి



ముంబై: అమెరికాలో ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు పెంచే అవకాశాలపై మార్కెట్లలో ఆందోళన నెలకొన్న నేపథ్యంలో గురువారం రూపాయి మారకం విలువ గణనీయంగా తగ్గింది. డాలర్‌తో పోలిస్తే 28 పైసలు క్షీణించి 3 నెలల కనిష్టానికి పడిపోయింది. 65.04 వద్ద క్లోజయ్యింది. గతేడాది నవంబర్ 20 తర్వాత ఇదే కనిష్ఠ స్థాయి. దేశీ స్టాక్ మార్కెట్స్ నుంచి పెట్టుబడులు తరలిపోతుండటం కూడా రూపాయి క్షీణతకు కారణమైంది. అమెరికాలో కొంత సానుకూల ఆర్థిక పరిస్థితుల కారణంగా.. వచ్చే నెలలో ఫెడరల్ రిజర్వ్ పలు దఫాలు వడ్డీ రేట్లు పెంచవచ్చన్న అంచనాలకు.. అమెరికా ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ విధాన సమీక్ష మినిట్స్ ఊతమిచ్చేవిగా ఉండటం ఫారెక్స్ మార్కెట్ సెంటిమెంటును ప్రభావితం చేశాయి. రూపాయి విలువ తీవ్ర హెచ్చుతగ్గులకు లోనవుతుండటంతో.. దిగుమతిదారులు తాము విదేశాల్లో జరపాల్సిన చెల్లింపుల లావాదేవీలను సత్వరం పూర్తి చేయడంపై దృష్టి పెట్టారు. బ్యాంకులు, కార్పొరేట్ల నుంచి డాలర్లకు డిమాండ్ భారీగా పెరగడంతో రూపాయి మారకం విలువ క్షీణించినట్లు ఫారెక్స్ డీలర్ ఒకరు తెలిపారు. క్రితం ముగింపు 64.76తో పోలిస్తే మరింత తక్కువగా 65.02 వద్ద గురువారం రూపాయి ట్రేడింగ్ ప్రారంభమైంది. ఒక దశలో 65.11కి పడిపోయింది. చివరికి 0.43 శాతం నష్టంతో (28 పైసలు) 65.04 వద్ద క్లోజయ్యింది.

విదేశాలకు పారిపోం: సింగ్ సోదరులు



న్యూఢిల్లీ: బిలియనీర్ సింగ్ సోదరులు– మల్వీందర్ సింగ్, శివిందర్ సింగ్‌లు విదేశాలకు పారిపోబోమని ఉద్ఘాటించారు. ఈ సింగ్ సోదరులిరువురు ఇటీవలనే ఫోర్టిస్, రెలిగేర్ కంపెనీల బోర్డుల నుంచి వైదొలిగారు. ఫోర్టిస్ హెల్త్‌కేర్, రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్‌ల్లో ఆర్థిక పరమైన అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలు, దైచీ శాంక్యో కంపెనీకి రూ.3,500 కోట్ల మేర ఆర్బిట్రేషన్ చెల్లింపుల వివాదం తదితర సమస్యలను వీరు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యల నుంచి గట్టెక్కడానికి శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తున్నామని, తమ బాధ్యతలను విస్మరించబోమని పేర్కొన్నారు. నిజాయితీగా ఈ సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్నామని, ఎక్కడకీ పారిపోబోమని భరోసానిచ్చారు. సత్యం వెలుగులోకి వచ్చేదాకా సహకరిస్తామని పేర్కొన్నారు. రూ.11,400 కోట్ల పీఎన్‌బీ కుంభకోణంలో కీలకమైన నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీలు దేశం విడిచి పారిపోయిన నేపథ్యంలో సింగ్ సోదరులు సంయుక్తంగా ఈ ప్రకటన విడుదల చేశారు.

ఏడీఎఫ్ఐఏపీ వార్షిక సదస్సు ప్రారంభం



న్యూఢిల్లీలో ఇటీవల జరిగిన 41వ ఏడీఎఫ్ఐఏపీ వార్షిక సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ. చిత్రంలో ఐడీబీఐ బ్యాంక్ ఎండీ, సీఈవో ఎం.కె. జైన్, తదితరులు ఉన్నారు.

బిలియన్ డాలర్ల పెట్టుబడులు సాధించాం

వీటితో 6,000 ఉద్యోగాలు వస్తాయి ● కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో



న్యూఢిల్లీ: భారత పర్యటనలో ఉన్న కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులను సాధించామని, వీటితో తమ దేశంలో ఆరు వేల మెరుగైన ఉపాధి అవకాశాలు ఏర్పాటవుతాయని చెప్పారు. భారత వ్యాపార సమూహం సంపూర్ణ విశ్వాసానికి ఇది నిదర్శనమన్నారు. కెనడాలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు ఎన్నో కంపెనీలు ఆసక్తితో ఉన్నాయని చెప్పారు. సీఐఐ గురువారం ఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో ట్రూడో పాల్గొని మాట్లాడారు. వ్యాపార నిర్వహణకు కెనడా ఉత్తమ ప్రదేశంగా పేర్కొన్నారు. భారత్, కెనడా తమ స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని ఆకాంక్షించారు. అందుకే తాను భారత్‌లో పర్యటిస్తున్నట్టు చెప్పారు. 400కుపైగా కెనడా కంపెనీలు భారత్‌లో పనిచేస్తున్నాయని, రానున్న కాలంలో ఈ సంఖ్య ఇంకా పెరుగుతుందనడంలో సందేహం లేదన్నారు. ''వైవిధ్యం అనేది ప్రగతికి కీలకం. ఆర్థికాభివృద్ధి అన్నది మన సమాజంలోని ప్రజలందరికీ ప్రయోజనం చేకూర్చాలి. మన మధ్య వాణిజ్యం, పెట్టుబడులు ఉండాలి. వీటితో ప్రయోజనం పొందొచ్చు''అని ట్రూడో చెప్పారు. కోల్డ్ చెయిన్, రిఫ్రిజిరేషన్‌లో రెండు దేశాల మధ్య విస్తృత సహకారానికి ఎన్నో అవకాశాలున్నాయని ఇదే సమావేశంలో పాల్గొన్న కేంద్ర మంత్రి హరిసిమ్రత్‌కౌర్ బాదల్ అన్నారు.

బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ విలీన యోచన లేదు: మనోజ్ సిన్హా



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ టెల్కో సంస్థలు బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌ను విలీనం చేసే యోచనేదీ ప్రస్తుతానికి లేదని కేంద్ర టెలికం శాఖ మంత్రి మనోజ్ సిన్హా తెలిపారు. అయితే, పరస్పరం సహకరించుకుంటూ పనిచేయడం ద్వారా రెండు సంస్థలూ ప్రయోజనం పొందే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ విధంగా ఇరు సంస్థలను పటిష్టం చేసే దిశగా.. వ్యూహాత్మక ప్రణాళిక అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. టెలికం రంగంలోని ప్రభుత్వ రంగ కంపెనీలు, ఇతర సంస్థలు సమన్వయంతో పనిచేసి మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉద్దేశించిన వ్యూహాత్మక ప్రణాళికను టెలికం శాఖ గురువారం ఆవిష్కరించిన సందర్భంగా మంత్రి ఈ విషయాలు తెలిపారు.

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9, 10గ్రా)	30,555	▼	30
బంగారం (99.5, 10గ్రా)	30,405	▼	30
వెండి (కిలో)	38,315	▲	135
చెన్నై			
బంగారం (24 క్యారెట్లు)	– –		
బంగారం (22 క్యారెట్లు)	29,090	▼	30
వెండి (కిలో)	--		
హైదరాబాద్			
బంగారం (24 క్యారెట్లు)	30,540	▼	40
బంగారం (22 క్యారెట్లు)	29,090	▼	30
వెండి (కిలో)	41,400	▲	100
ప్రొద్దుటూరు			
బంగారం (24 క్యారెట్లు)	31,400	▲	100
బంగారం (22 క్యారెట్లు)	28,980		0
వెండి (కిలో)	39,500	▲	100
విశాఖపట్నం			
బంగారం (24 క్యారెట్లు)	31,734	▲	434
బంగారం (22 క్యారెట్లు)	29,090	▼	20
వెండి (కిలో)	41,000	▲	1,100
విజయవాడ (బుధవారం ధరలు)			
బంగారం (24 క్యారెట్లు)	31,500		
బంగారం (22 క్యారెట్లు)	29,150		
వెండి(కిలో)	39,500		
ఏపీ బులియన్ అసోసియేషన్			
బంగారం (24 క్యారెట్లు)	31,450	▼	30
బంగారం (22 క్యారెట్లు)	29,090	▼	30
వెండి (కిలో)	39,450	▲	150

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	63.08 (రాత్రి 11.00కు)	$61.68 (బుధవారం ముగింపు)
బ్రెంట్	66.54 (రాత్రి 11.00కు)	$65.42 (బుధవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 23-2-2018

విశాఖ	365–00
చిత్తూరు	388–00
వరంగల్	357–00
ముంబై	400–00
చెన్నై	395–00
విజయవాడ	363–00
గోదావరి	363–00
నమక్కల్	380–00
22-2-2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	355–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.15
బెంగళూరు	395–00
కోల్‌కతా	415–00
ఢిల్లీ	375–00

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	404	395.6
AMBUJA CEME	256.9	261.7
ASIAN PAINT	1118.1	1127.2
AXIS BANK L	530.25	535.8
BAJAJ AUTO	2974.3	3012.6
BAJAJ FINAN	1600.35	1596.45

A B C D

20 MICRONS	50.25	50.35
3M INDIA LI	20725.25	20543.45
5PAISA CAPI	368.1	350.6
63 MOONS TE	93.85	93.75
8K MILES SO	758.7	766.9
A AND M JUM	65.05	65.05
AARTI DRUGS	607	607.7
AARTI INDUS	1155.1	1167.25
ABAN OFFSHO	168.3	168.75
BAYER CROPS	3827.7	3828.3
BEARDSELL L	56.15	55.85
BEML LIMITE	1194.2	1204.6
BERGER PAIN	240.6	246.35
BETA DRUGS	154.6	146.5
BF INVESTME	318.3	318.45
BF UTILITIE	440.95	439.95
BGR ENERGY	118.25	118.75
BHAGERIA IN	284.5	290.15
BHANSALI EN	160.6	163.95
BHARAT BIJL	1422.3	1427.9
BHARAT FIN	977.5	969.2
DILIP BUILD	958.85	936.15
DISH TV IND	74.35	72.9
DISHMAN CAR	331.25	337.2
DIXON TECHN	3265.9	3229.4
DOLLAR INDU	417.1	422.4
DOLPHIN OFF	88.95	89.65
DONEAR IND.	61.45	62.35
DR. LAL PAT	905.85	905.1
DYNAMATIC T	1623.05	1617.45
DYNEMIC PRO	199	202.5

E F G H

GUJARAT AMB	232.25	233.75
GUJARAT FLU	749.45	748.1
GUJARAT GAS	860.1	860.75
GUJARAT MIN	138.55	139.55
GUJARAT PIP	141.9	142.7
GUJARAT STA	199.95	198.4
GULF OIL LU	985	1000.3
GULSHAN POL	78.05	78.75
HARITA SEAT	933.7	914.75
HARRISON MA	82	82.3
HATSUN AGRO	768.95	767.15
HCL INFOSYS	62.25	61.6

I J K L

JHS SVEND.	66.9	68
JIND POL IN	64.2	65.2
JINDAL DRIL	157.8	161.45
JINDAL PHOT	64	62.9
JINDAL POLY	330.6	341.8
JINDAL SAW	134.25	136.4
JINDAL STAI	100.4	100.95
JINDAL STAI	178.95	184.5
JINDAL STEE	250.25	247.3
JINDAL WORL	620.75	616.65
JK CEMENT L	1019.45	1037.1
JK LAKSHMI	420.6	420.15

M N O P

MANGALAM CE	331.45	334.45
MANGALAM DR	160.2	159.8
MANPASAND B	378.8	389.4
MARATHON NX	467.65	471.45
MAS FINANCI	600.8	603.15
MASTEK LTD	493.9	495.7
MATRIMONY.C	852.3	863.5
MAWANA SUGA	60.6	60.2
MAX FINANCI	494.95	499.7
MAX INDIA L	95.9	97.7
MAX VENTURE	77.7	77.75
MAYUR UNIQU	509.7	506.45
PIONEER DIS	180.25	180.95
PLASTIBLEND	197	198.55
PNB HOUSING	1206.35	1207.95
PNC INFRATE	163.8	167
PODDAR HOUS	1170	1171.1
PODDAR PIGM	282.7	283.1
POKARNA LIM	207.05	210.2
POLY MEDICU	243.45	244.3
POLYPLEX CO	479.8	485.2
PONNIE SUGA	165.8	167.8
POWER MECH	917.55	903.7
PPAP AUTOMO	539.5	544.95

R S T U

SHANTHI GEA	139.85	138.9
SHARDA CROP	387.3	392
SHARDA MOTO	2269.7	2281.5
SHEELA FOAM	1596.15	1599.9
SHEMAROO EN	516.2	514.35
SHILPA MEDI	443.05	456.4
SHIPPING CO	72.8	74.65
SHIRPUR GOL	152.1	153.5
SHIVA TEXYA	530.05	537.65
SHIVAM AUTO	76.85	77.75
SHOPPERS ST	522.05	526.2
SHRADHA INF	60	61
SHRE PUSH C	223.95	224.85
THE HI-TECH	430.1	431.8
THE INDIA C	155.1	158
THE INDIAN	132.55	132.65
THE MANDHAN	130.75	133.55
THE NEW IND	704.7	705
THE PHOENIX	566.25	585
THE RAMCO C	714.1	730.7
THE RUBY MI	330.75	324.25
THE STATE T	150.55	150.7
THE TINPLAT	228.4	232.05
THEMIS MEDI	539.15	558.45
THERMAX LTD	1152.65	1147.45
THIRUMALAI	1968.6	2012.05

V W X Z

బీఎస్ఈలో ఎస్ఎంఈ షేర్లు

ఒప్పందాలతోనే సరి.. పరిశ్రమలు ఏవీ?


విశాఖ ఏపీఐఐసీ గ్రౌండ్‌లో మూడోవిడత భాగస్వామ్య సదస్సు కోసం ఏర్పాట్ల దృశ్యాలు

▶ మొదటి పేజీ తరువాయి

సదస్సులో రూ. 4.76 లక్షల కోట్ల విలువైన 328 ఒప్పందాలు జరిగినట్టు ప్రభుత్వం తెలిపింది. వీటి ద్వారా 9.58 లక్షల ఉద్యోగాలు రాష్ట్రానికి వస్తాయని పేర్కొంది. 2017 భాగస్వామ్య సదస్సులో రూ.10.54 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులతో 666 ఒప్పందాలు చేసుకున్నట్టు, 22.34 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొంది. ఈ రెండు సదస్సుల్లో మొత్తం 31.92 లక్షల మందికి ఉపాధి కల్పిస్తామని నమ్మబలికింది. అయితే అధికారుల నివేదిక ప్రకారం రాష్ట్రంలో ఇప్పటి వరకూ కేవలం 137 పరిశ్రమలు మాత్రమే ఉత్పత్తిలోకి వచ్చాయి. వీటిలోనూ భారీ స్థాయిలో ఉపాధి కల్పించే పరిశ్రమలు అతి తక్కువ. 16 పరిశ్రమలు ఉత్పత్తికి సిద్ధమవుతున్నాయని, మరో 17 పరిశ్రమలు యంత్ర సామాగ్రిని సమకూర్చుకుంటు న్నాయని, ఇంకో 53 పరిశ్రమలు సివిల్ పనులు పూర్తి చేసే దశలో ఉన్నాయని తెలిపారు. ఇవన్నీ కలిపినా రూ. 67,890 కోట్ల పెట్టుబడులే రాష్ట్రానికి వచ్చినట్లని అధికారుల లెక్కలు తేల్చాయి. ఇవన్నీ ఎప్పటికి వాస్తవ రూపం దాలుస్తాయన్న విషయాన్ని అధికారులే చెప్పలేకపోతున్నారు.

పాత పరిశ్రమలకే కొత్త ముసుగు..

పెట్టుబడుల ఆకర్షణలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఉత్పత్తిలో ఉన్న పరిశ్రమలు, విస్తరణకు సిద్ధమైన పరిశ్రమలను కొత్తగా వచ్చినట్టు చెప్పే ప్రయత్నం చేస్తోంది. దేశవ్యాప్తంగా వ్యాపారం చేస్తూ రాష్ట్రంలో కూడా చేయడానికి ఏపీ ప్రభుత్వంతో ఎంవోయు చేసుకున్న కంపెనీలను కూడా కొత్తగా వచ్చినట్టే చూపించింది. ఆ సంస్థల్లో ఇతర రాష్ట్రాల్లో పనిచేసే వారిని కూడా ఉపాధి లెక్కల్లో చూపించింది. రోజువారీ కూలీలను శాశ్వత ఉపాధి వర్గంగా జాబితాలో చేర్చింది. ఇంత చేసినా ఎంవోయూల పురోగతి రెండు శాతం కూడా లేదని అధికారవర్గాలే అంటున్నాయి. ఈ నేపథ్యంలో కొన్ని సంస్థల్లో పెట్టుబడులు, లభించిన ఉపాధి పరిశీలిస్తే....

- ➡ విశాఖలో రెండు దశాబ్దాల క్రితమే ఏర్పాటైన హిందూజా నేషనల్ పవర్ కార్పొరేషన్‌తో ఉమ్మడి ఏపీ ప్రభుత్వం ఎంవోయూ చేసుకుంది. ఈ ప్లాంట్‌తో 2016 భాగస్వామ్య సదస్సులో ప్రభుత్వం మళ్లీ ఎంవోయూ చేసుకుని రూ. 5,545 కోట్ల పెట్టుబడులు వచ్చాయని, 700 మందికి ఉపాధి లభించిందని టీడీపీ ప్రభుత్వం తన ఖాతాలో వేసుకుంది.
- ➡ నెల్లూరు జిల్లాలో గాయత్రి థర్మల్ పవర్ ప్లాంట్ ఎప్పటి నుంచో ఉత్పత్తిలో ఉంది. 2016లో విదేశీ కంపెనీ సెంబ్‌కార్ప్ భాగస్వామ్యమైంది. కొత్తగా వచ్చిన పెట్టుబడి ఏమీ లేకపోయినా... ప్రభుత్వం మాత్రం రూ. 8,580 కోట్లు పెట్టుబడులు వచ్చాయని, 1,620 మందికి ఉపాధి లభించిందని ప్రకటించింది.
- ➡ కృష్ణా జిల్లాలో ఓ మెరైన్ ఎక్స్‌పోర్ట్ కంపెనీతో 2016లో ఏపీ ప్రభుత్వం ఎంవోయు చేసుకుంది. ఈ కంపెనీ రూ. 22 కోట్లు పెట్టుబడి పెట్టిందని, దీనితో 1,500 మందికి ఉపాధి లభించిందని వెల్లడించి.. మత్స్యకారులు, దినసరి కూలీలను ఉపాధి పొందిన వారి జాబితాలో చూపింది.
- ➡ అనంతపురంలో ఓ సంస్థ బేసిక్ మెటల్స్, అల్లాయిస్ ఇండస్ట్రీని రూ. 400 కోట్ల పెట్టుబడితో స్థాపించినట్టు, దీనివల్ల 2,800 మందికి ఉపాధి లభించినట్టు ప్రభుత్వం లెక్కచూపింది. దేశవ్యాప్తంగా ఆ సంస్థలో పనిచేసే వాళ్లందరినీ ఇక్కడే ఉపాధి పొందుతున్నట్టు చెప్పుకొచ్చింది.
- ➡ చిత్తూరు జిల్లాలో షాహీ ఎక్స్‌పోర్ట్స్ కేవలం రూ. 143 కోట్ల పెట్టుబడి పెట్టి, 11 వేల మందికి ఉపాధి ఇస్తున్నట్టు లెక్కచెప్పారు.

ఈసారి రూ.3 లక్షల కోట్లు లక్ష్యం

ఈ ఏడాది జరిగే సదస్సు ద్వారా రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులొస్తాయని ప్రభుత్వం చెబుతోంది. గత సదస్సుల్లోని ఒప్పందాల విలువతో పోలిస్తే ఇది చాలా తక్కువ. ఈసారి కార్యరూపం దాల్చే కంపెనీలతోనే ఒప్పందాలు చేసుకుంటామని ప్రభుత్వం చెబుతోంది. వీటిలో కనీసం 50–60 శాతానికి తగ్గకుండా గ్రౌండింగ్ అయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటున్నామని మంత్రులు చెబుతున్నారు. సదస్సుకు మొత్తం 40 దేశాల నుంచి దాదాపు 2 వేల మంది ప్రతినిధులకు ఆహ్వానాలు పంపారు. భాగస్వామ్య సదస్సును వ్యతిరేకిస్తూ కొందరు ఆందోళనలు చేపడుతున్న నేపథ్యంలో పోలీసు యంత్రాంగం విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేసింది. పెట్టుబడులను ఆకర్షించే బాధ్యతను భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ)కు అప్పగించారు. ఒక్కో రంగానికి రెండు, ఒక్కో దేశానికి నాలుగు కన్సల్టెన్సీల చొప్పున సీఐఐ నియమించింది. ఈ విషయంలో పరిశ్రమల శాఖకు ఎలాంటి బాధ్యత ఉండదని అధికారులు తెలిపారు. ఎంవోయు సందర్భంగా పెట్టుబడి, యూనిట్ వివరాలు మాత్రమే తీసుకుంటామని సీనియర్ అధికారి చెప్పారు. ఆ తర్వాత సమగ్ర నివేదిక (డీపీఆర్) సమర్పించే బాధ్యత కూడా కన్సల్టెన్సీలే చూసుకుంటాయని, డీపీఆర్‌లు వచ్చిన తర్వాతే పరిశ్రమలు, ఇతర శాఖలు తదుపరి కార్యక్రమాలు పూర్తి చేస్తాయని తెలిపారు.

భాగస్వామ్య సదస్సు ద్వారా భారీగా పెట్టుబడులు

మంత్రి గంటా శ్రీనివాసరావు



సాక్షి, విశాఖపట్నం/పెదవాల్తేరు (విశాఖ తూర్పు): శనివారం నుంచి విశాఖలో జరిగే భాగస్వామ్య సదస్సులో కనీసం మూడు లక్షల కోట్ల రూపాయలన విలువైన 400 ఎంవోయూలు జరుగుతాయని అంచనా వేస్తున్నామని మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. మూడ్రోజులు పాటు జరగనున్న ఈ సదస్సు ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. సదస్సును ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారని, లూలూ సంస్థ నిర్మించే ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌కు కూడా శంకుస్థాపన చేస్తారని చెప్పారు. లూలూ సంస్థకు జరిగిన భూ కేటాయింపుల్లో ఎలాంటి అవకతవకలు జరగలేదని మంత్రి చెప్పారు. ఈ వ్యవహారంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు రూ. 500 కోట్లు ముడుపులందాయనడంతో వాస్తవం లేదన్నారు. భాగస్వామ్య సదస్సుల ద్వారా గత నాలుగేళ్లుగా రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులపై, ఉపాధి కల్పనపై బహిరంగ చర్చకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. విలేకరుల సమావేశంలో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జేసి సిరి, జీవీఎంసీ కమిషనర్ హరినారాయణన్, డీఐసీ జీఎం రామలింగరాజు తదితరులు పాల్గొన్నారు.

నోబెల్ బహుమతి సాధిస్తే రూ.100 కోట్లు

రాష్ట్రానికి చెందిన ఎవరైనా నోబెల్ బహుమతి సాధిస్తే వారికి రూ. 100 కోట్లు ఇస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నామని మంత్రి గంటా అన్నారు. విశాఖపట్నం చినవాల్తేరులోని కోటక్ స్కూలులో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి గంటా మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులకు రూ. 4,800 కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. ఇకనుంచి సైన్స్ ఫెయిర్ విజేతలలో 8 మందికి ప్రభుత్వం తరపున ప్రతిభ అవార్డులు అందజేయనున్నట్టు తెలిపారు.

క్యాథలిక్ మిషన్ రీజనల్ యూత్ కౌన్సిల్ కార్యవర్గం ఎన్నిక


ప్రాంతీయ యువత సంస్థకు ఎన్నికైన సభ్యులతో బిషప్ జయరావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రోమన్ క్యాథలిక్ మిషన్ అనుబంధ రీజనల్ యూత్ కమిషన్‌కు (ప్రాంతీయ యువత) రాష్ట్రస్థాయి కార్యవర్గ ఎన్నిక గురువారం జరిగింది. స్థానిక ఏపీఎస్‌ఎస్‌ఎస్ భవనంలో ప్రాతీయ యువత చైర్మన్, బిషప్ పొలిమేర జయరావు పర్యవేక్షణలో జరిగిన 63వ ప్రాంతీయ సదస్సు (ఆంధ్ర, తెలంగాణ స్థాయి)లో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా జయరావు మాట్లాడుతూ.. యువతను మంచి పౌరులుగా, బాధ్యతాయుత వ్యక్తులుగా తీర్చిదిద్దటంలో నూతనంగా ఎన్నికైన సభ్యులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రెండేళ్ల పాటు ఉచితంగా సమాజ సేవకు ముందుకు రావడం అభినందనీయమని, సేవా ధృక్పథాన్ని ప్రతి ఒక్కరిలో పెంపొందింప చేయడానికి ఈ సభ్యులు పనిచేస్తారన్నారు. ప్రాంతీయ యువత అధ్యక్షుడిగా ఏలూరు మేత్రాసనానికి చెందిన ఎస్.కాసు ఎన్నికయ్యారు. సదస్సులో జాతీయ యువత డైరెక్టర్ ఫాదర్ చేతన్, ఫాదర్ జీ మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ప్రజల్ని రోడ్డున పడేసిన టీడీపీ, బీజేపీ..!

17 పార్టీల మద్దతుతో అవిశ్వాసం: రఘువీరా



చిత్తూరు అర్బన్: తెలుగుదేశం, బీజేపీలు సొంత లాభం కోసం ఏపీ ప్రజలను నడిరోడ్డున పడేశాయని ఏపీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి విమర్శించారు. రెండు పార్టీలు రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేశాయని ఆయన మండిపడ్డారు. నాలుగేళ్లుగా పొత్తు పేరిట అధికారం కొనసాగించి, ఇప్పుడు ప్రజల్ని మోసం చేయడానికి కొత్త నాటకం ఆడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2019లో రాహుల్‌గాంధీ ప్రధాని కాగానే ఏపీకి ప్రత్యేక హోదాపైనే తొలి సంతకం చేస్తారని స్పష్టం చేశారు. గురువారం చిత్తూరు నగరంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయం ఎదుట 'ఆంధ్రుల ఆత్మగౌరవ దీక్ష' పేరిట సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘువీరారెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యేక హోదీపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాటకాలు ఆడుతున్నాయని ఆరోపించారు. రానున్న పార్లమెంటు సమావేశాల్లో రాహుల్ గాంధీ నేతృత్వంలో 17 పార్టీల మద్దతు కూడగట్టి పార్లమెంటులో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతామన్నారు. ప్రత్యేక హోదా డిమాండ్‌తో మార్చి 2న రాష్ట్రవ్యాప్తంగా జాతీయ రహదారుల దిగ్బంధం, 6, 7, 8 తేదీల్లో పార్లమెంటు ముట్టడి చేపడుతున్నట్లు వెల్లడించారు. మాజీ ఎంపీ చింతా మోహన్, మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌భాషలు మాట్లాడుతూ.. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టుపెట్టిన వ్యక్తిగా చంద్రబాబునాయుడు చరిత్రలో నిలిచిపోతారన్నారు. కాంగ్రెస్ నేతలు మాట్లాడుతుండగా విద్యుత్ సరఫరా ఆగిపోయింది. దీంతో రఘువీరాతో పాటు నాయకులంతా రోడ్డుపై కూర్చుని టీడీపీకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలరెడ్డి, నగర అధ్యక్షుడు టిక్కి రాయల్, పార్టీ నాయకులు పరదేశి, శ్రీదేవి, ప్రమీళ, సావిత్రి, లీలా తదితరులు పాల్గొన్నారు.

నేడు కర్నూలులో బీజేపీ అత్యవసర సమావేశం

సాక్షి, అమరావతి: రాయలసీమ సమస్యల పరిష్కారానికి భారతీయ జనతా పార్టీ నాయకులు శుక్రవారం కర్నూలులో అత్యవసరంగా సమావేశం కానున్నారు. రాష్ట్ర విభజన తరువాత కూడా రాయలసీమ ప్రాంత సమస్యలు పరిష్కారం కాకపోవడంతో అక్కడి రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటారని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు విష్ణువర్ధనరెడ్డి తెలిపారు. గురువారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ, రెండు కోట్ల రాయలసీమ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా భవిష్యత్ కార్యక్రమాల రూపకల్పన జరుగుతుందన్నారు. సినీనటుడు శివాజీ ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ, ఇతర సీనియర్ నాయకులపై చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. సంచలనాల కోసం శివాజీ చేసే ప్రకటనలను ప్రజలు రెండు రోజులే గుర్తుంచుకుంటారని, వాటిని పరిగణనలోకి తీసుకోవద్దని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆయన్ను క్షమించి వదిలేయాలని, వివాదాలకు దిగవద్దని సూచించారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటూ ఆంధ్రప్రదేశ్ గురించి మాట్లాడే ఎంపీలు, సీనియర్ నాయకులు ఆంధ్ర ద్రోహులని ఆరోపించారు. ఎంపీలు గల్లా జయదేవ్, జేసీ దివాకర్‌రెడ్డి, మాగంటి మురళీమోహన్ హైదరాబాద్‌లో ఉంటూ రాష్ట్ర సమస్యలు గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు.

జనసేన విద్యార్థి విభాగం ఏర్పాటు

సాక్షి, అమరావతి: భగత్ సింగ్ స్టూడెంట్స్ యూనియన్ (బీఎస్‌యూ) పేరుతో జనసేన పార్టీ విద్యార్థి విభాగాన్ని ఏర్పాటు చేసింది. ప్రత్యేక హోదాపై విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా 'ప్రత్యేక హోదా – ఆంధ్రుల హక్కు' అని ముద్రించిన టీ షర్టులను విద్యార్థులకు పంపిణీ చేయనున్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ఆదోని టౌన్: రుణపాశం మరో రైతును బలిగొంది. కర్నూలు జిల్లా ఆదోని మండలం గణేకల్లు గ్రామానికి చెందిన రైతు లక్ష్మయ్య (65) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య తిక్కమ్మ, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. లక్ష్మయ్యకు రెండున్నర ఎకరాల పొలం ఉంది. ఖరీఫ్‌లో పత్తి పంట సాగు చేశాడు. తెగుళ్లు సోకి దిగుబడి పడిపోయింది. లక్ష్మయ్యకు భార్యతో పాటు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెల పెళ్లిళ్లు, కుటుంబ పోషణ, పంటల సాగు కోసం ప్రైవేటు వ్యక్తుల వద్ద రూ.2 లక్షల దాకా అప్పు చేశాడు. అలాగే గత ఏడాది పెద్దతుంబళం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో రూ.లక్ష పంట రుణం తీసుకున్నాడు. దీంతో అప్పులు రూ.3 లక్షలకు చేరడంతో ఎలా తీర్చాలోనన్న బెంగ పట్టుకుంది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి ఇంట్లోనే పురుగు మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని కుటుంబ సభ్యులు గమనించి ఆదోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పెద్దతుంబళం పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రత్యేక హోదా కోసం గర్జించిన ప్రజలు


చిలకలూరిపేటలో యువభేరికి హాజరైన యువత


గుంటూరులో వైఎస్సార్‌సీపీ మహిళా కార్యకర్తల నిరసన

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు

శ్రీకాకుళం పాతబస్టాండ్/ చిలకలూరిపేట/ పట్నంబజారు(గుంటూరు): ప్రత్యేక హోదా సాధన కోసం ఆంధ్రప్రదేశ్ ప్రజలు గర్జించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనంటూ నినదించారు. ఈ మేరకు గురువారం రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. 'దగా పడ్డా యువతా మేలుకో' పేరిట శ్రీకాకుళంలో జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్వర్యంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ ధర్మాన ప్రసాదరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదాతోనే యువతకు ఉపాధి సాధ్యమని స్పష్టం చేశారు. చంద్రబాబు ఓటుకు కోట్లు కేసు నుంచి తప్పించుకునేందుకు కేంద్రం దగ్గర ప్రత్యేక హోదాను తాకట్టుపెట్టారని విమర్శించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు తమ్మినేని సీతారాం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డి శాంతి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ప్రధాన రాజేంద్ర, వైఎస్సార్‌సీపీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు ధర్మాన కృష్ణదాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా హామీని నెరవేర్చాలి


పార్లమెంటు సాక్షిగా రాష్ట్రానికి కల్పిస్తామన్న ప్రత్యేక హోదా హామీని నెరవేర్చి తీరాలని విద్యార్థులు నినదించారు. గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో గురువారం వివిధ కళాశాలల విద్యార్థులతో యువభేరి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడి తదితరులు పాల్గొన్నారు.

హోదా కోసం గళమెత్తిన మహిళాలోకం

రాష్ట్ర ప్రత్యేక హోదా సాధన కోసం జరుగుతున్న పోరులో మహిళాలోకం సైతం గర్జించింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు నగర మహిళా విభాగం ఆధ్వర్యంలో గురువారం లాడ్జి సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆతుకూరి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయానికి ఎల్‌ఈడీ శోభ

తిరుమలలో రూ.5 కోట్లతో 56 వేల ఎల్‌ఈడీ బల్బుల ఏర్పాటు


విద్యుత్ వెలుగుల్లో తిరుమల ఆలయం

సాక్షి, తిరుమల: రెండు వేల ఏళ్ల చరిత్ర కలిగిన తిరుమలేశుని ఆలయంతోపాటు తిరుమలలోనూ దాతల సహకారంతో సరికొత్త సాంకేతిక విద్యుత్ వ్యవస్థతోపాటు త్రీడీ విద్యుత్ కాంతులు ఏర్పాటు చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం చర్యలు చేపట్టింది. తిరుమలలోని శ్రీవారి ఆలయం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లు, కల్యాణకట్ట, అన్నప్రసాద కేంద్రంతోపాటు అన్ని కాటేజీలు, అతిథిగృహాలు, వీధి లైట్లకు రోజూ సుమారు 1.25 నుండి 1.50 లక్షల యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతోంది. అంటే ఏడాదికి 4.5 కోట్ల యూనిట్ల విద్యుత్ అన్నమాట. ఇందుకు టీటీడీ సుమారుగా రూ.14 కోట్లు ఖర్చు చేస్తోంది. ఇంత భారీ స్థాయిలో జరుగుతున్న విద్యుత్ వినియోగాన్ని అదుపు చేసేందుకు టీటీడీ నిర్ణయించింది.

ఎల్‌ఈడీ బల్బుల ఏర్పాటు

శ్రీవారి ఆలయంలో ప్రస్తుతం ఎక్కడబడితే అక్కడ విద్యుత్ వైర్లు, బల్బులు వేలాడుతున్నాయి. ప్రణాళిక బద్ధంగా విద్యుత్ సరఫరా, వైరింగ్, లైటింగ్ వ్యవస్థ లేదు. ఈ నేపథ్యంలో విద్యుత్ వ్యవస్థ ఆధునీకరణపై టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ సమగ్ర సర్వే చేయించారు. లోపభూయిష్టంగా, ప్రమాదాలకు తావిచ్చేలా ఆలయ విద్యుత్ వ్యవస్థ ఉందని నిర్ధారించారు. అలాగే, ఆలయంతోపాటు వీధుల్లో వాడుతున్న 240 వాట్స్ సోడియం వేపర్ బల్బులు, కాటేజీల్లో వాడే 40వాట్స్ ఫ్లోరోసెంట్ బల్బులతో విద్యుత్ ఖర్చు పెరిగిపోతోందని గుర్తించారు. దీంతో విద్యుత్‌ను ఆదా చేసేందుకు పాత వాటి స్థానంలో ఎల్‌ఈడీ బల్బులు ఏర్పాటుచేశారు. రూ.5 కోట్ల ఖర్చుతో ఆలయంతోపాటు తిరుమలలోని దాదాపుగా అన్ని కాటేజీల్లో ఎల్‌ఈడీ బల్బులు అమర్చారు. దేవదేవుడు కొలువైన స్వర్ణకాంతులీనే ఆనంద నిలయం, మహాద్వార గోపురం, వెండి వాకిలి గోపురాలు మరింత శోభాయమానంగా కనిపించేలా తీర్చిదిద్దాలని టీటీడీ సంకల్పించింది. ఇందుకోసం దాతల సహకారంతో తీసుకోవాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు.

ప్రాణదానం ట్రస్టుకు రూ.కోటి విరాళం

టీటీడీకి చెందిన శ్రీవారి ప్రాణదాన ట్రస్టుకు గురువారం కోటి రూపాయల విరాళం అందింది. మలేసియాకు చెందిన ప్రవాస భారతీయుడు కెవిన్ సుగుమారన్ విరాళం డీడీని టీటీడీ జేఈఓ కేఎస్ శ్రీనివాసరాజుకు అందజేశారు.

పది కేంద్ర పథకాల నుంచి పైసా తెచ్చుకోని ఏపీ

- పది పథకాలకు కేంద్ర బడ్జెట్‌లో రూ.3481 కోట్లు కేటాయింపు
- నిధులు తెచ్చుకున్న తెలంగాణతో సహా మిగతా రాష్ట్రాలు
- రాష్ట్ర సర్కారుకు తెలియజేసిన ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్



సాక్షి, అమరావతి: కేంద్ర ప్రయోజిత పథకాల ద్వారా ఇచ్చిన నిధులను వీలైనంత త్వరగా వ్యయం చేసి వాటికి సంబంధించి వినియోగ పత్రాలను సమర్పించి మరిన్ని నిధులను తెచ్చుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తాయి. కానీ మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించింది. ఏకంగా పది కేంద్ర పథకాలకు కేటాయించిన నిధుల నుంచి ఇప్పటివరకు పైసా తెచ్చుకోకుండా నిర్లక్ష్యంగా కాలం గడిపేసింది. కేంద్ర బడ్జెట్‌లో పది పథకాలకు రూ.3,481 కోట్లను కేటాయించారు. ఆ పథకాల నుంచి నిధులు వచ్చేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన సంబంధిత శాఖలు ప్రతిపాదనలను రూపొందించి ఆయా కేంద్ర మంత్రిత్వ శాఖలకు సమర్పించాల్సి ఉంది. ఆ పథకాల నిబంధనల మేరకు ప్రతిపాదనలు ఉంటే కేంద్ర మంత్రిత్వ శాఖలు రాష్ట్రానికి నిధులను విడుదల చేస్తాయి. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇక కేవలం నెల 40 ఉన్నప్పటికీ కేంద్ర బడ్జెట్‌లో కేటాయించిన పది పథకాల నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు పైసా కూడా తెచ్చుకోలేకపోయింది. అంటే రాష్ట్ర ప్రభుత్వ శాఖలు కేంద్రం నుంచి ఆ పథకాల నుంచి నిధులు రాబట్టడంలో ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించాయో స్పష్టంగా తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్రంతో సహా పలు రాష్ట్రాలు ఈ పది పథకాల నుంచి నిధులను రాబట్టుకున్నాయి. కానీ రాష్ట్ర ప్రభుత్వానికి పది పథకాల నుంచి పైసా రాలేదని న్యూఢిల్లీలోని ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. ఇతర రాష్ట్రాలు ఈ పది పథకాల నుంచి నిధులు రాబట్టుకున్నప్పుడు మన రాష్ట్రం ఎందుకు రాబట్టుకోలేకపోయిందో అర్థం కావడం లేదని ఉన్నతాధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

ఏపీకి పైసా రాని కేంద్ర 10 పథకాల వివరాలు

పథకం పేరు	శాఖ	కేంద్ర బడ్జెట్	ఏపీ మినహా ఇతర రాష్ట్రాలు పొందిన నిధులు
1. మదర్సా మైనార్టీ విద్య	విద్య	120 కోట్లు	త్రిపుర, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, ఉత్తరఖండ్ 64 కోట్లు
2. నేషనల్ రివర్ కన్జర్వేషన్	పర్యావరణం	108 కోట్లు	గుజరాత్, నాగాలాండ్, ఒడిశా, పంజాబ్, సిక్కిం 129 కోట్లు
3. ప్లాంట్ ప్రొటెక్షన్	వ్యవసాయం	50 కోట్లు	తెలంగాణ 10 కోట్లు
4. న్యాయ మౌలికవసతులు	న్యాయ	621 కోట్లు	ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గోవా, బీహార్, నాగాలండ్ 531 కోట్లు
5. గ్రామ న్యాయాలయాలు	న్యాయ	8 కోట్లు	కేరళ, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర రూ.8 కోట్లు
6. దివ్యాంగుల సంక్షేమం	సామాజిక	207 కోట్లు	25 రాష్ట్రాలు రూ.129 కోట్లు
7. పీఎంకేఎస్‌వై	నీటి	1,827 కోట్లు	6 రాష్ట్రాలు రూ.670 కోట్లు
8. మైనారిటీ సంక్షేమం	మైనారిటీ	2,054 కోట్లు	18 రాష్ట్రాలు రూ.132 కోట్లు
9. స్కిల్ డెవలప్‌మెంట్	మైనారిటీ	464 కోట్లు	మధ్యప్రదేశ్, ఢిల్లీ రూ.29 కోట్లు
10. స్పెషల్ ప్రోగ్రామ్ మైనారిటీలు	మైనారిటీ	64 కోట్లు	నాలుగు రాష్ట్రాలు ఆరు కోట్లు

సాగునీరివ్వకపోతే పురుగుమందు ఇవ్వండి!

- పంటలు దక్కించుకోలేకపోతే మేం జీవించలేం
- మేము చచ్చాక మా భార్య, పిల్లలనైనా ఆదుకోండి
- ఆర్డీవో వద్ద దివిసీమ రైతుల ఆవేదన


అవనిగడ్డలో దీక్ష చేస్తున్న రైతులు

అవనిగడ్డ: మొక్కజొన్న పొలాలకు సాగునీరన్నా ఇవ్వండి.. లేదంటే పురుగు మందు డబ్బాలన్నా సరఫరా చేస్తే చనిపోతామని పలువురు దివిసీమ రైతులు కృష్ణా జిల్లా మచిలీపట్నం ఆర్డీవో ఉదయభాస్కర్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. మొక్కజొన్న పంటకు సాగునీరందించాలని కోరుతూ గత నాలుగు రోజులుగా రైతులు ఆందోళనలు చేస్తున్నారు. పంటకాలువ ద్వారా కాకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, మంత్రులు ఆదేశించడంతో గురువారం బందరు ఆర్డీవో అవనిగడ్డ వచ్చి రైతులతో చర్చించారు. పులిగడ్డ వద్ద పంట కాలువకు ఇరువైపులా ఉన్న బోర్లు నుంచి నీటిని తోడి పంటకాలువ ద్వారా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అందుకు రైతులు స్పందిస్తూ దీనివల్ల సాగునీరు అందకపోగా, తమ మధ్య కొట్లాటలు జరుగుతాయని, పంటకాలువ ద్వారానే సాగునీరు విడుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా అవనిగడ్డ మండలం వేకనూరుకు చెందిన రైతు తుంగల ప్రసాదరావు మాట్లాడుతూ కాలువల ద్వారా సాగునీరు సరఫరా చేయండి, లేదంటే పురుగు మందుల డబ్బాలన్నా ఇవ్వండని కన్నీటి పర్యంతం అయ్యారు. కండెలు వస్తున్న కీలకదశలో సాగునీరందక పోతే తీవ్రంగా నష్టపోతామని, ఆత్మహత్యలే శరణ్యమని మరికొంతమంది రైతులు ఆవేదన చెందారు. తాము చనిపోయాక తమ భార్య, పిల్లలు రోడ్డున పడకుండా అదేదో చంద్రన్న బీమా అంటున్నారుగా, దాంతో అయినా ఆదుకుని పుణ్యం కట్టుకోండి సారూ... అంటూ ఆర్డీవో వద్ద రైతు ప్రసాదరావు వేడుకోవడం చూపరులకు కన్నీళ్లు తెప్పించాయి. అలాంటి పనులేమీ చేసుకోవద్దని, పంటలను కాపాడే ప్రయత్నం చేస్తున్నామని, సాయంత్రం సమీక్ష సమావేశంలో కలెక్టర్, మంత్రుల దృష్టికి తీసుకెళతానని ఆర్డీవో హామీ ఇచ్చి వెళ్లిపోయారు. అంతకు ముందు స్థానిక తహసీల్దార్, కార్యాలయం ఎదుట రెండు గంటల పాటు రైతులు ధర్నా చేశారు. అనంతరం ప్రధాన రహదారి పక్కన నిరవధిక నిరాహారదీక్ష చేపట్టారు. అవనిగడ్డ, నాగాయలంక మండలాల నుంచి పెద్ద ఎత్తున రైతులు ఈ దీక్షలో పాల్గొనగా, వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి గుడివాక శివరావ్, రైతు విభాగం నేత బీసాబత్తిన ప్రసాద్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడివాక అంజిబాబు, బీజేఎంఎం రాష్ట్ర కార్యదర్శి జీవీ నగరాయలు సంఘీభావం తెలిపారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కన్వీనర్ సింహాద్రి రమేష్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కడవకొల్లు నరసింహారావు, రైతువిభాగం రాష్ట్ర కార్యదర్శి కొండవీటి వెంకటనారాయణ మద్దతు తెలిపారు.

క్షమాభిక్ష ద్వారా రాష్ట్రానికి వస్తున్న వారిని ఆదుకోవాలి

మంత్రి కొల్లు రవీంద్రకు వైఎస్సార్‌సీపీ కువైట్ కమిటీ సభ్యుల వినతి

కడప కార్పొరేషన్: కువైట్ ప్రభుత్వం ప్రకటించిన క్షమాభిక్ష ద్వారా మన రాష్ట్రానికి వస్తున్న వారిని ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కువైట్ కమిటీ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి, కమిటీ సభ్యులు కోరారు. గురువారం కువైట్‌లో వారు మంత్రి కొల్లు రవీంద్ర, ఏపీఎన్‌ఆర్‌టీ చైర్మన్ వేమూరి రవిని కలసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కువైట్ ప్రభుత్వం జనవరి 29 నుంచి అకామా లేనివారు, ఏజెంట్ల చేతిలో మోసపోయి పాస్‌పోర్టు లేని వారికి క్షమాభిక్ష ప్రకటించిందన్నారు. ఎలాంటి కేసులు, జరిమానా లేకుండా వెళ్లి మళ్లీ కొత్త వీసాపై కువైట్‌కు వచ్చే అవకాశం ఉన్న 9 వేల మందికి ఈ నిర్ణయం ఊరట కలిగించిందన్నారు. ఏడేళ్ల తర్వాత ఈ అవకాశం వచ్చినా దీన్ని సద్వినియోగం చేసుకునేందుకు టికెట్లు కొనుగోలు చేసే స్తోమత లేక అనేక మంది అవస్థలు పడుతున్నారని తెలిపారు. వారిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. క్షమాభిక్ష ద్వారా రాష్ట్రానికి వచ్చిన వారికి పునరావాసం కల్పించాలని, పేదవారికి ప్రభుత్వం తరుపున టికెట్లు ఇవ్వాలని కోరారు. కువైట్‌లో వివిధ ప్రమాదాల వల్ల మరణించిన వారికి, ప్రమాదాల్లో వికలాంగులు అయిన వారికి బీమా ద్వారా ఆదుకోవాలని, దొంగ ఏజెంట్ల నుంచి అమాయక ప్రజలను రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కువైట్ కమిటీ సలహాదారు అబుతురాబ్, ఎన్. చంద్రశేఖర్‌రెడ్డి, రమణ యాదవ్, యువజన విభాగం నాయకుడు మర్రి కళ్యాణ్ తదితులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదాపై మార్చి 5న యూనివర్సిటీల బంద్

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో మార్చి 5న యూనివర్సిటీల బంద్ చేపట్టనున్నట్టు ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్ తెలిపారు. విజయవాడలోని ఎన్జీవో కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం ఈనెల 24వ తేదీన నాగార్జున వర్సిటీ, 26న కృష్ణా వర్సిటీ, 28న విక్రమ సింహపురి యూనివర్సిటీ, మార్చి 2న ఎస్వీయూ, 4న ఒంగోలులోని విద్యార్థులతో సమావేశాలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. సమైక్యాంధ్ర ఉద్యమంలో ద్రోహం చేసిన ఎంపీలనే మళ్లీ గెలిపించడం వల్ల రాష్ట్రానికి అన్యాయం జరిగిందన్నారు.



కోహ్లిని చూసే నేర్చుకున్నా...

విరాట్ కోహ్లిని చూసే స్పిన్‌ను ఎలా ఆడాలో తాను నేర్చుకున్నానని ఆస్ట్రేలియా సారథి స్టీవ్ స్మిత్ అన్నాడు. కోహ్లి ఆఫ్‌సైడ్ బంతిని కొట్టే పద్ధతిని తాను అనుసరించినట్లు వివరించాడు. భారత పర్యటనలో కీపర్, స్లిప్ క్యాచ్‌లతో అవుట్ కాకుండా ఉండేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడిందని పేర్కొన్నాడు. బ్యాట్‌ను పట్టుకునే తీరు మార్చుకోవడం వల్ల మైదానంలో అన్నివైపులా షాట్లు కొట్టగలిగానన్న స్మిత్... కోహ్లితో పాటు డివిలియర్స్, విలియమ్సన్‌లను కూడా వేర్వేరు అంశాల్లో అనుకరించినట్లు వెల్లడించాడు.

ఆంధ్ర అద్భుతం

క్వార్టర్ ఫైనల్లో ఢిల్లీపై ఘనవిజయం
- శివకుమార్‌కు 4 వికెట్లు
- విజయ్ హజారే వన్డే టోర్నీ

న్యూఢిల్లీ: దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో ఆంధ్ర జట్టు జోరు కొనసాగుతోంది. గ్రూప్ 'సి'లో ఆడిన ఆరు లీగ్ మ్యాచ్‌ల్లోనూ గెలుపొంది అజేయంగా క్వార్టర్స్ చేరిన ఆంధ్ర... గురువారం ఇక్కడ జరిగిన నాలుగో క్వార్టర్ ఫైనల్లో పటిష్ట ఢిల్లీని చిత్తు చేసి సెమీస్‌కు దూసుకెళ్లింది. కీలకమైన పోరులో ఆంధ్ర బౌలర్లు శివకుమార్ (4/29), భార్గవ్ భట్ (3/28) విజృంభించడంతో సంచలన విజయం నమోదు చేసింది. ఈ టోర్నీ చరిత్రలో ఆంధ్ర సెమీస్ చేరడం ఇదే తొలిసారి కావడం విశేషం. పటిష్ట బ్యాటింగ్ లైనప్ ఉన్న ఢిల్లీ జట్టు ఆంధ్ర బౌలర్ల ధాటికి నిలవలేక 32.1 ఓవర్లలో 111 పరుగులకే ఆలౌటైంది. అనంతరం రికీ భుయ్ (36; 5 ఫోర్లు), అశ్విన్ హెబ్బర్ (38; 4 ఫోర్లు) రాణించడంతో 28.4 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 112 పరుగులు చేసి గెలుపొందింది. ఆదివారం జరిగే రెండో సెమీ ఫైనల్లో ఆంధ్ర, సౌరాష్ట్ర జట్లు తలపడనున్నాయి.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీకి శుభారంభం లభించలేదు. ఓపెనర్లు ఉన్ముక్త్ చంద్ (4), హితేన్ దలాల్ (11)లతో పాటు సీనియర్ బ్యాట్స్‌మన్ గౌతమ్ గంభీర్ (8)లను శివ కుమార్ పెవిలియన్ పంపి ఆ జట్టును కోలుకోలేని దెబ్బతీశాడు. అనంతరం నితీశ్ రాణా (2), ప్రదీప్ సాంగ్వాన్ (10) కూడా వారిని అనుసరించారు. రిషభ్ పంత్ (38; 2 ఫోర్లు, 1 సిక్స్), ధ్రువ్ షోరే (21; 2 ఫోర్లు) ఓ మోస్తరుగా ఆడటంతో ఆ జట్టు స్కోరు వంద దాటింది. ఆంధ్ర బౌలర్లలో బండారు అయ్యప్ప 2, నరేన్‌రెడ్డి ఓ వికెట్ పడగొట్టారు. అనంతరం మరో 21.2 ఓవర్లు మిగిలి ఉండగానే గెలిచి ఆంధ్ర... దేశవాళీ క్రికెట్‌లో బంతులపరంగా ఢిల్లీకి అతి పెద్ద పరాజయాన్ని మిగిల్చింది. మరో క్వార్టర్ ఫైనల్లో బరోడాపై సౌరాష్ట్ర గెలుపొందింది. మొదట బరోడా 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 247 పరుగులు చేయగా... ఆ తర్వాత సౌరాష్ట్ర 7 వికెట్లు కోల్పోయి 251 పరుగులు చేసి సెమీస్‌కు చేరింది.



స్వయంకృతం

అనూహ్యంగా చేజారిన రెండో టి20
వాతావరణమూ కొంత కారణమే



సాక్షి క్రీడా విభాగం

తరిమిన మేఘావృత వాతావరణం...
చేజారిన కొన్ని అవకాశాలు...
కీలక సమయంలో నిర్ణయ లోపాలు...
ప్రత్యర్థి జట్టులో ఓ అద్భుత భాగస్వామ్యం...

సెంచూరియన్ పిచ్‌పై సరిపడా పరుగులు చేసినా రెండో టి20లో భారత్ ఓడిపోవడానికి కారణాలివే! ఇప్పుడో అప్పుడో వాన కురుస్తుందేమో అన్న ఊగిసలాట మధ్య సాగిన ఆటలో ప్రొటీస్‌ది పైచేయి కావడానికీ ఇవే ఆస్కారమిచ్చాయి. వాస్తవానికి ఈ మ్యాచ్‌లో రెండో ఇన్నింగ్స్ ఏడో ఓవర్ వరకు వర్షం వెంటాడింది. దీంతో 'డక్‌వర్త్ లూయిస్' లెక్కలు బయటకు వచ్చాయి. తొలుత దక్షిణాఫ్రికా దీన్ని దృష్టిలో పెట్టుకునే ఆడింది. అలా వర్తింపజేసినా గెలుపు మనవైపే ఉంది. ఎప్పుడైతే వాన ముప్పు తప్పిందో... అప్పుడే మరో ప్రమాదం క్లాసెన్ రూపంలో ముంచుకొచ్చింది. నాలుగో వన్డేలో మన జట్టు జోరును సైంధవుడిలా అడ్డుకున్న ఈ సఫారీ వికెట్ కీపర్ ఈసారి టి20లో సరిగ్గా అదే పాత్ర పోషించాడు. ఒక్కసారిగా విరుచుకుపడి సమీకరణాలు మార్చేశాడు.

బౌలర్లు ఇబ్బందిపడ్డారు

మేం 175 పరుగులే చేయగలమనుకున్నా. రైనా, మనీశ్, ధోని అద్భుతంగా ఆడటంతో 190కి చేరువయ్యాం. ఇది గెలిచే స్కోరే. వాతావరణంతో బౌలర్లకు ఇబ్బంది ఎదురైంది. చినుకుల కారణంగా 13వ ఓవర్ నుంచి బంతిపై పట్టు చిక్కలేదు. దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్‌దే ఘనతంతా. రిస్క్ తీసుకుంటూనే క్లాసెన్, డుమిని బాగా ఆడారు. ఆ జట్టు నుంచి ఇలాంటి ప్రతిఘటననే మేం ఆశిస్తున్నాం. ప్రేక్షకుడి కోణంలో ఇది మంచి మ్యాచ్.

– భారత కెప్టెన్ విరాట్ కోహ్లి

ఆరంభం మనదే అయినా...

186... సెంచూరియన్‌లో టి20ల్లో మొదట బ్యాటింగ్ చేసిన జట్ల సగటు స్కోరిది. టీమిండియా దీనికి రెండు పరుగులు అదనంగానే చేసింది. భువనేశ్వర్, శార్దుల్ ప్రారంభ ఓవర్ల బౌలింగ్, ఓపెనర్లు త్వరగా వెనుదిరగడం చూస్తే ప్రత్యర్థికి ఛేదన కష్టమే అనిపించింది. అయితే, వచ్చీరావడంతోనే రెండు సిక్స్‌లు కొట్టిన క్లాసెన్... తర్వాత స్పిన్నర్ చహల్‌ను లక్ష్యంగా చేసుకుని విరుచుకుపడ్డాడు. అతడు వేసిన 13వ ఓవర్లో విశ్వరూపం చూపాడు. దీంతో అప్పటిదాకా 10కి పైగా ఉన్న సాధించాల్సిన రన్‌రేట్ 8కి పడిపోయింది. వెంటనే క్లాసెన్ వెనుదిరిగినా... అప్పటికే చేయాల్సినంత నష్టం చేసేశాడు. తర్వాత డుమిని కెప్టెన్ ఇన్నింగ్స్‌తో పని పూర్తిచేశాడు.

లోటు కనిపించింది...

ప్రభావం చూపని ఉనాద్కట్ బౌలింగ్‌తో పాటు, ప్రధాన పేసర్ బుమ్రా లేని లోటు ఈ మ్యాచ్‌లో స్పష్టంగా కనిపించింది. క్లిష్టమైనదైనా... డుమిని స్టంపౌట్ (16వ ఓవర్‌లో)ను ధోని చేజార్చాడు. వికెట్ల వెనుక చురుగ్గా ఉండే ధోని చేతిలో ఇలా జరగడం ఊహించనిదే. ఇక ఒత్తిడిలో కెప్టెన్ కోహ్లి సందర్భానికి తగిన నిర్ణయాలు తీసుకోలేకపోయాడు. రైనా వంటి ప్రత్యామ్నాయాన్ని ఆలోచించకుండా.., గాలిలో తేమ కారణంగా బంతిపై పట్టు చిక్కక ఇబ్బంది పడుతూ, ఓవర్‌కు 15పైగా పరుగులిస్తూ, రెండుసార్లు రనప్ విరమించుకున్న చహల్‌నే కొనసాగించాడు. రైనా ఒక్క ఓవరే వేసి ఏడెనిమిది పరుగులిచ్చినా కొంతలో కొంత నయంగా ఉండేది. పేలవ సారథ్యం అంటూ దీనిపై వ్యాఖ్యలు కూడా వచ్చాయి. ఇక 12 బంతుల్లో 16 పరుగులు చేయాల్సిన దశలో భువనేశ్వర్‌ను కాదని ఉనాద్కట్‌కు బంతినివ్వడమూ సరైనదిగా అనిపించలేదు. భువీ 19వ ఓవర్ వేసి కట్టడి చేసి ఉంటే... ఒత్తిడిలో చేతులెత్తేసే లక్షణమున్న దక్షిణాఫ్రికాకు చివరి ఓవర్లో పరీక్ష ఎదురయ్యేది. తద్వారా ఆశలు నిలిచి ఏదైనా జరిగేందుకు అవకాశం చిక్కేది.

అసహనం బయటకొచ్చింది...

సెంచూరియన్‌లో రెండుసార్లు భారత ఆటగాళ్ల సహనానికి పరీక్ష ఎదురైంది. బ్యాటింగ్ సందర్భంగా చివరి ఓవర్‌లో రెండో పరుగుకు రాని మనీశ్‌పాండేపై ధోని ఆగ్రహం చూసినవారంతా ఆశ్చర్యపోయారు. మిస్టర్ కూల్‌గా పేరున్న ధోని... పాండేను పరుష పదజాలంతో దూషించినట్లు కనిపించింది. వేగంగా త్రో విసరనందుకు ఉనాద్కట్‌పై పాండ్యా విసురును ప్రదర్శించగా, కోహ్లి సైతం కఠిన పదాలు ప్రయోగించాడు.

చహల్‌ను లక్ష్యంగా చేసుకున్నా

భారత పేసర్లు బాగా బౌలింగ్ చేశారు. దీంతో చహల్‌పై దృష్టిపెట్టా. దీనికోసం ప్రత్యేక ప్రణాళికేమీ వేసుకోలేదు. కెరీర్ ఆరంభంలో అమెచ్యూర్‌గా నాణ్యమైన లెగ్‌స్పిన్నర్లను ఎదుర్కొనడం ఇక్కడ పనికొచ్చింది. ఓవర్ ఓవర్‌కు లక్ష్యం పెట్టుకుని ఆడా. నా ఇన్నింగ్స్‌కు ముఖ్య కారణం కెప్టెన్ డుమిని. అతడు నాలో భయాన్ని పోగొట్టాడు. సహజంగా ఆడమని సూచించాడు. చినుకుల వర్షంతో మారిన వాతావరణం కూడా మేలు చేసింది. సొంత మైదానంలో దేశానికి ఆడుతూ జట్టును గెలిపించాలని చిన్నప్పుడు అనుకుంటాం. అదిప్పుడు నిజమైంది.

– దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మన్ క్లాసెన్

ఎన్ని వేల కోట్లకో?

భారత్‌లో అంతర్జాతీయ మ్యాచ్‌ల ప్రసార హక్కుల వేలం మార్చి 27న

ముంబై: ఆరు నెలల క్రితమే భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఐపీఎల్ ప్రత్యక్ష ప్రసార హక్కులను వేల కోట్లకు అమ్ముకుంది. ఇప్పుడు మరో వేలానికి, వేల కోట్ల ఆర్జనకు బోర్డు సిద్ధమైంది. క్రికెట్‌కు అమితాదరణ ఉన్న దేశానికి సంబంధించిన మ్యాచ్‌ల ప్రసార హక్కులను కట్టబెట్టేందుకు ఇటు బోర్డు, దక్కించుకునేందుకు అటు ప్రసారకర్తలు సిద్ధమయ్యారు. ఇందుకోసం వచ్చే నెల 27న 'ఈ–వేలం' ప్రక్రియను నిర్వహించనుంది. ఈ సారి దేశవాళీ, అంతర్జాతీయ మ్యాచ్‌లను కలిపి వేలాన్ని నిర్వహిస్తుంది. ప్రస్తుతం 'స్టార్' నెట్‌వర్క్‌తో ఉన్న ఒప్పందం గడువు వచ్చే నెల 31తో ముగియనుంది. 2012లో నిర్వహించిన అంతర్జాతీయ మ్యాచ్‌ల ప్రసార హక్కులను అప్పట్లో రూ. 3851 కోట్ల మొత్తానికి 'స్టార్' చేజిక్కించుకుంది. ఇప్పుడు ఐదేళ్ల కాలానికి అంటే ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు ప్రసార హక్కుల్ని కట్టబెట్టనుంది. ఆరు నెలల క్రితం ఐపీఎల్ మ్యాచ్‌ల ప్రసార హక్కులనూ రూ. 16, 347 కోట్లకు 'స్టార్' నెట్‌వర్కే దక్కించుకుంది. అంటే సుమారు మ్యాచ్‌కు రూ. 55 కోట్లు అన్నమాట. ఇక అంతర్జాతీయ మ్యాచ్ అంటే మరింత ఆసక్తి నెలకొంటుంది. దీంతో ఒక్కో మ్యాచ్‌కు 60 కోట్లపైమాటే ఉండొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆసక్తిగల ప్రసార సంస్థలు మార్చి 5వ తేదీలోపు రూ. 6.5 లక్షలు చెల్లించి టెండరు దరఖాస్తును పొందాలి. ఆ నెల 27వ తేదీలోపు టెండర్లు దాఖలు చేయాలి. అదేరోజు ఈ–వేలం ద్వారా ప్రసార హక్కులు కట్టబెడతారు. బీసీసీఐకి, సుప్రీంకోర్టు నియమించిన పాలక కమిటీ (సీఓఏ)కి మధ్య విభేధాలు మళ్లీ బహిర్గతమయ్యాయి. తమకు మాట మాత్రమైన చెప్పకుండానే సీఓఏ తీసుకుంటున్న కీలక నిర్ణయాలపై బీసీసీఐ పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పుజారాకు పుత్రికోత్సాహం

రాజ్‌కోట్: భారత క్రికెటర్ చతేశ్వర్ పుజారా తండ్రయ్యాడు. గురువారం అతని భార్య పూజ పాపకు జన్మనిచ్చింది. 2013లో ఈ జంటకు పెళ్లయింది. భారత టెస్టు జట్టులో రెగ్యులర్ సభ్యుడిగా ఉన్న పుజారా...ప్రస్తుతం విజయ్ హజారే వన్డే టోర్నీలో సౌరాష్ట్ర తరఫున ఆడుతున్నాడు.

'ఎఫ్ 1' కూడా వేరొకరి చేతుల్లోకి...

మాల్యా నుంచి 'ఫోర్స్ ఇండియా' దూరం!

న్యూఢిల్లీ: బ్యాంక్‌ల నుంచి తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించకుండా దేశం వదిలి పరారైన లిక్కర్ కింగ్ విజయ్ మాల్యాకు చెందిన 'ఫోర్స్ ఇండియా' ఎఫ్1 జట్టు త్వరలోనే వేరొకరి హస్తగతం కానుంది. ఫోర్స్ ఇండియాను బ్రిటన్‌కు చెందిన ఓ శీతల పానీయాల తయారీ సంస్థ కొనుగోలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు రూ.1,806 కోట్లకు ఒప్పందం కుదిరినట్లు సమాచారం. 'రిచ్ ఎనర్జీ' అనే బ్రిటిష్ శీతల పానీయాల సంస్థ దాదాపు 200 మిలియన్ల డాలర్లకు ఫోర్స్ ఇండియాను కొనుగోలు చేయడానికి ముందుకొచ్చింది. గతంలో ఐపీఎల్ టీమ్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరులో ఉన్న వాటాను కూడా తొలగించడంతో ఆ జట్టుతో ప్రస్తుతం ఆయనకు ఎలాంటి సంబంధాలు లేవు.

క్వార్టర్స్‌లో గురుసాయిదత్

స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్

బాసెల్ (స్విట్జర్లాండ్): స్విస్ ఓపెన్ గ్రేడ్–5 అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ ఆటగాడు గురుసాయిదత్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించగా, తెలుగమ్మాయి సాయి ఉత్తేజితకు ప్రిక్వార్టర్స్‌లో చుక్కెదురైంది. పురుషుల సింగిల్స్‌లో గురుసాయిదత్‌తో పాటు సమీర్ వర్మ కూడా క్వార్టర్స్ చేరాడు. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ఆర్‌ఎమ్‌వీ గురుసాయిదత్ 21–18, 21–14తో భారత్‌కే చెందిన సౌరభ్ వర్మను కంగుతినిపించగా, సౌరభ్ సోదరుడు రెండో సీడ్ సమీర్ 11–21, 21–18, 21–16తో యు ఇగరషి (జపాన్)పై గెలుపొందాడు. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో చుక్కా సాయి ఉత్తేజిత 8–21, 13–21తో మినత్సు మితాని (జపాన్) చేతిలో పరాజయం చవిచూసింది.

మరో వైపు వియన్నాలో జరుగుతున్న ఆస్ట్రియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో రెండో సీడ్ పారుపల్లి కశ్యప్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో అతను 21–14, 21–16తో హంగేరికి చెందిన జార్జ్‌లీ క్రాజ్‌పై విజయం సాధించాడు. అతనితో పాటు చిట్టబోయిన రాహుల్ యాదవ్, శుభాంకర్ డే ప్రిక్వార్టర్స్ చేరారు.


సెమీస్‌లో మేరీకోమ్

సోఫియా (బల్గేరియా): స్ట్రాండ్ జా స్మారక బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత బాక్సర్లు మేరీ కోమ్, సరితాదేవి సెమీస్ చేరుకోవడంతో కనీసం కాంస్య పతకాలు లభించనున్నాయి. 48కేజీల మహిళల క్వార్టర్స్‌లో మేరీకోమ్... రొమేనియాకు చెందిన నెమెసిస్ స్టెలుటా ద్యుటాపై విజయం సాధించింది. 60 కేజీల కేటగిరీలోకి యవెన్ (చైనా)పై సరితాదేవి గెలిచింది. మహిళల విభాగంలో భారత్‌కు మొత్తం 6 పతకాలు ఖాయమయ్యాయి.

ఇక ముంబై టి20 లీగ్

లీగ్ ప్రచారకర్తగా సచిన్ టెండూల్కర్

ముంబై: క్రికెట్ లీగ్‌ల జోరు కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే జాతీయంగా, అంతర్జాతీయంగా ఎన్నో లీగ్‌లు జరుగుతున్నాయి. తాజాగా ఇప్పుడు ప్రాంతీయ లీగ్‌ల వంతు వచ్చినట్లుంది. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో టి20 క్రికెట్ లీగ్‌లు మొదలైనట్లే... తాజాగా ఇప్పుడు మహారాష్ట్రలోనూ 'టి20 ముంబై లీగ్'కు రంగం సిద్ధమైంది. ముంబై క్రికెట్ సంఘం సౌజన్యంతో 'ప్రాబబిలిటీ స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్' ఆధ్వర్యంలో మొదలవనున్న ఈ లీగ్‌కు భారత బ్యాటింగ్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. వచ్చే నెల 11 నుంచి 21 వరకు వాంఖెడే స్టేడియంలో ఈ 'టి20 లీగ్' మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ సందర్భంగా జరిగిన ప్రచార కార్యక్రమంలో సచిన్ మాట్లాడుతూ 'ముంబైకి ఇలాంటి లీగ్‌ల అవసరం ఎంతో ఉంది. సుదీర్ఘ కాలంగా ముంబై క్రికెటర్లే పెద్ద సంఖ్యలో భారత క్రికెట్‌లో ప్రధాన పాత్ర పోషించారనేది వాస్తవం. ఈ స్థానిక లీగ్‌లో 'బ్రాండ్ అంబాసిడర్'గా నేనులో భాగమైనందుకు సంతోషంగా ఉంది. తమ సత్తా చాటేందుకు కుర్రాళ్లకు ఇది చక్కని వేదిక' అని అన్నారు. ముంబై గల్లీ కుర్రాళ్లు శివాజీ పార్క్, క్లబ్‌ల స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వేదికైన వాంఖెడేలో మెరిసేందుకు ఇది మంచి అవకాశమని సచిన్ అన్నారు.



డీఎస్పీగా హర్మన్‌ప్రీత్


(ఫైల్)

చండీగఢ్: భారత మహిళా టి20 జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ పంజాబ్ పోలీసు శాఖలో చేరేందుకు రంగం సిద్ధమైంది. వచ్చే నెల 1న ఆమె డిప్యూటీ సూపరిటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టనుంది. రైల్వే ఉద్యోగి అయిన ఆమె ఇదివరకే డీఎస్పీ కావాల్సింది. కానీ తమతో కనీస ఒప్పంద ప్రమాణం (ఐదేళ్ల బాండ్) గడువు పూర్తికాకపోవడంతో భారతీయ రైల్వే సంస్థ... ఆమె గతేడాదే రాజీనామా చేసినప్పటికీ రిలీవ్ చేయలేదు. దీంతో పంజాబ్ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ స్వయంగా రైల్వే మంత్రిత్వశాఖతో మాట్లాడి ఇంతకుముందు కుదుర్చుకున్న నియామక ఒప్పందాన్ని సడలించి రిలీవ్ చేయాలని కోరారు. దీనికి స్పందించిన రైల్వే శాఖ తాజాగా హర్మన్‌ప్రీత్‌ను రిలీవ్ చేయడంతో త్వరలోనే డీఎస్పీ కానుంది. ఈ సందర్భంగా పంజాబ్ సీఎం అమరీందర్ కేంద్ర రైల్వే మంత్రి పీయూష్ గోయెల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తమ రాష్ట్ర పోలీస్ శాఖలో చేరనున్న హర్మన్‌కు శుభాకాంక్షలు చెప్పారు. ప్రస్తుతం ఆమె దక్షిణాఫ్రికాతో జరుగుతున్న సిరీస్‌లో పాల్గొంటోంది.

ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా ఎన్ఎన్‌రెడ్డి



నరేందర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నేషనల్ కాడెట్ కారప్స్ నూతన డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా నూకల నరేందర్‌రెడ్డి (ఎన్ఎన్‌రెడ్డి) నియమితులయ్యారు. తెలంగాణ రాష్ట్రంలోని మహబూబాబాద్ జిల్లా కంబాలపల్లికి చెందిన నరేందర్‌రెడ్డి కోరుకొండ సైనిక్ స్కూల్లో చదువుకుని 1984లో రక్షణశాఖలో చేరారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో కీలక హోదాల్లో నూకల నరేందర్‌రెడ్డి పనిచేశారు. 1992–93 మధ్య దుండిగల్‌లో ఆయన హెలికాప్టర్ ట్రైనర్‌గా పనిచేశారు.

గురుకులాల్లో ప్రవేశాలకు ఏప్రిల్ 8న ఉమ్మడి పరీక్ష

మంత్రి నక్కా ఆనందబాబు వెల్లడి

సాక్షి, అమరావతి: సాంఘిక, గిరిజన, వెనుకబడిన తరగతుల సంక్షేమ, గురుకుల విద్యాలయాలకు సంబంధించి 5వ తరగతిలో ప్రవేశానికి ఇకపై ఉమ్మడిగా ఒకే ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు వెల్లడించారు. 2018–19 విద్యా సంవత్సరానికి ఏప్రిల్ 8వ తేదీన ఉ.11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ పరీక్ష నిర్వహిస్తామన్నారు. సచివాలయంలో గురువారం ఆయన ఉమ్మడి పరీక్షకు నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటివరకు సాంఘిక, గిరిజన, వెనుకబడిన తరగతుల సంక్షేమ, ఏపీ గురుకుల విద్యాలయాల్లో 5వ



తరగతి ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశాలకు వేర్వేరుగా ప్రవేశ పరీక్షలు నిర్వహించే వారని తెలిపారు. విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి ప్రవేశాలకు ఒకే పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. 4వ తరగతిలోని ఇంగ్లీష్, తెలుగు, గణితం, సైన్స్, సోషల్ పాఠ్యాంశాల నుంచి 10 ప్రశ్నల చొప్పున మల్టిపుల్ ఛాయిస్‌లో పరీక్ష ఉంటుందన్నారు. అర్హులైన అభ్యర్థులు మార్చి 20వ తేదీలోగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం రూపొందించిన www.apgpcet.apcfss.in వెబ్‌సైట్‌ను ఆనంద్‌బాబు ఆవిష్కరించారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.